ఈనాడు

హైదరాబాద్ 12-1-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 153

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 20+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

GH

ఈనాడు

హైదరాబాద్ 12-1-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 153

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 20+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా

జస్టిస్ రాధాకృష్ణన్

- సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం

2లో



సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా

ఇందు మల్హోత్రా!

- నేరుగా జడ్జి కానున్న తొలి మహిళా న్యాయవాది

2లో

ఊరికి పోయేదెలా?

నిరీక్షణ ప్రయాణానికీ దొరకని టికెట్లు

- రద్దీకి సరిపోని ప్రత్యేక రైళ్లు
- బస్సుల్లోనూ దాటేసిన వెయిటింగ్ లిస్ట్
- నేడు, రేపు భారీగా పెరగనున్న రద్దీ
- ప్రత్యామ్నాయాలపై ప్రయాణికుల దృష్టి
- ప్రైవేటు బస్సుల్లో అధిక ఛార్జీలు వసూలు

ఈనాడు, హైదరాబాద్: పండుగకు ఊరెళ్లే ప్రయాణికులతో రైళ్లు, బస్సులు కిటకిటలాడుతున్నాయి. దూరప్రాంత రెగ్యులర్ రైళ్లలో రెండు నెలల క్రితమే రిజర్వేషన్లు పూర్తవడంతో పాటు అదనపు ఛార్జీలతో నడిపే ప్రత్యేకరైళ్లలో సీట్లు నిండిపోయాయి. వీటిలో చాలారైళ్లలో నిరీక్షణ జాబితా(వెయిటింగ్ లిస్ట్) పరిమితి కూడా దాటిపోయింది. బెర్తు, సీటు దొరక్కపోయినా..నిల్చొనైనా వెళ్దామనుకున్నా టికెట్లు బుక్ చేసుకునే పరిస్థితి లేదు. దీంతో సంక్రాంతికి (మిగతా 2లో)



ప్రయాణికులు, బస్సులతో గురువారం రాత్రి కిటకిటలాడుతున్న హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్ కూడలి

అంపశయ్యపై.. యంత్ర విద్య

దేశవ్యాప్తంగా మూడొంతుల సీట్లూ భర్తీకాని ఇంజినీరింగ్ కళాశాలలు 30 శాతం

తెలంగాణలో 112... ఏపీలో 109 విద్యా సంస్థల్లో ఇదే పరిస్థితి

ఖాళీల సంఖ్యలో 4, 5 స్థానాల్లో తెలుగు రాష్ట్రాలు

వచ్చే రెండు సంవత్సరాల్లో మూత తప్పదా!

ఈనాడు - హైదరాబాద్



దేశవ్యాప్తంగా మూడో వంతు ఇంజినీరింగ్ కళాశాలలు వచ్చే కొద్ది సంవత్సరాల్లో మూసివేయక తప్పని పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. తాజా విద్యా సంవత్సరం సహా..2014-15 విద్యా సంవత్సరం నుంచి వాటిలో 30 శాతం సీట్లు కూడా భర్తీ కాని క్రమంలో వాటిపై మూసివేత కత్తి వేలాడుతున్నట్టేనని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. దేశవ్యాప్తంగా 3,325 ఇంజినీరింగ్ కళాశాలల్లో సుమారు 16.3 లక్షల వరకు సీట్లుండగా.. (మిగతా 2లో)

ఎందుకీ పరిస్థితి

- ఐటీ హవా కొనసాగిన 2008-10 ప్రాంతంలో దేశవ్యాప్తంగా అధిక కళాశాలలు ఏర్పాటయ్యాయి. విద్యార్థుల లభ్యతపై అంచనాలు లేకుండానే..విద్యా సంస్థలు ఏర్పాటుకాగా..ఏఐసీటీఈ సైతం దరఖాస్తు చేసిన వారందరికీ గుడ్డిగా అనుమతులు ఇచ్చింది. 2016-17 నాటికి తమిళనాడులో 526, మహారాష్ట్రలో 369, ఏపీలో 325 కళాశాలలు ఉన్నాయంటే పరిస్థితి అర్థంచేసుకోవచ్చు.
- నాణ్యత లేని కళాశాలల్లో చదివితే ప్రాంగణ నియామకాల్లో ఎంపిక కాలేమని అభిప్రాయం, ఉద్యోగాలు రావన్న నమ్మకంతో..విద్యార్థులంతా నాణ్యమైన విద్యా సంస్థల వైపే మొగ్గుచూపుతున్నారు. కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా ప్రైవేటు కళాశాలల్లో ప్రవేశాలు 2 లక్షలకు తగ్గగా...డీమ్డ్, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో చేరికలు 2.40 లక్షల మేర పెరగడమే దీనికి నిదర్శనం.

ఐపీఎస్‌పై సీఐడీ విచారణ

- భూవివాదం కేసులో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలపై దర్యాప్తు
- ఇతర పోలీసు సిబ్బంది పైనా ఆరా

ఈనాడు, హైదరాబాద్: భూముల లావాదేవీల విషయంలో నిందితులతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలకు సంబంధించి తెలంగాణ సీఐడీ ఉన్నతాధికారులు ఎస్పీస్థాయి అధికారితో పాటు సంబంధిత పోలీసులపై విచారణ చేపట్టారు. దీనిపై ప్రత్యేకంగా కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం భూముల వివాదంపై డీజీపీకి నివేదికను సమర్పించనున్నారు. ఓఐపీఎస్ అధికారిపై సీఐడీ విచారణ జరుపుతుండటం పోలీసుశాఖలో (మిగతా 2లో)



2లో

విశ్వ 'వంద'నం!

నేడు నింగిలోకి ఇస్రో 100వ ఉపగ్రహం

31 శాటిలైట్లతో పీఎస్ఎల్వీ కౌంట్‌డౌన్

మరిన్ని గ్రీన్‌కార్డులు

- ఏటా 45% పెంపుదల
- అమెరికా ప్రతినిధుల సభలో బిల్లు
- చట్టరూపం దాల్చాక భారతీయులకు లబ్ధి

వాషింగ్టన్: ప్రతిభ ఆధారిత వలసలను ప్రోత్సహించడం, గ్రీన్‌కార్డుల కేటాయింపును ఏటా 45% చొప్పున పెంచడం కోసం అమెరికా ప్రతినిధుల సభలో ఒక బిల్లును ప్రవేశపెట్టారు. ఇది చట్టరూపం దాలిస్తే భారతదేశానికి చెందిన సాంకేతిక నిపుణులు ఎక్కువగా లబ్ధి పొందే అవకాశాలున్నాయి. ఎక్కువమంది భారతీయ సాంకేతిక నిపుణులు హెచ్-1బి వీసాపై అమెరికాకు (మిగతా 2లో)



రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

పరిశ్రమలపై కరుణ చూపండి

- వాయిదాలు చెల్లించకపోతే కఠిన చర్యలొద్దు
- రుణాలలో మహిళలకు ప్రాధాన్యం
- నేతన్నలకు 'ముద్ర' రుణాలివ్వాలి
- తెలంగాణ చిన్న పరిశ్రమల రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో కేటీఆర్

ఈనాడు - హైదరాబాద్

పారిశ్రామిక రంగంపైనా బ్యాంకులు కరుణ చూపాలనీ, వాణిజ్యపరంగానే కాకుండా... కష్టాల్లో ఉన్న పారిశ్రామికవేత్తలను మానవతాకోణంలో ఆదుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖల మంత్రి కేటీఆర్ కోరారు. అప్పులను సకాలంలో చెల్లించకపోతే నేరుగా నిరర్థక ఆస్తులుగా ప్రకటించి, జప్తులకు వెళ్లకుండా... పారిశ్రామికవేత్తలకు ఈ పరిస్థితి ఎందుకొచ్చిందో తెలుసుకుని దానికి అనుగుణంగా వ్యవహరించాలన్నారు. పారిశ్రామికవేత్తల సమస్యల పరిష్కారానికి అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రతినెలా సదస్సులు నిర్వహించాలన్నారు. మూతపడ్డ సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల పునరుద్ధరణకు బ్యాంకులు ముందుకురావాలనీ... పరిశ్రమల సమస్యలు తెలుసుకొని, ప్రభుత్వపరంగా, బ్యాంకులపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశ్రామికవేత్తలకు పెద్దఎత్తున రుణ సాయం అందించాలని, ఇందులో మహిళలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. నేత కార్మికులకు పెట్టుబడుల నిమిత్తం ముద్ర రుణాలను అందించాలన్నారు. గురువారం కోఠిలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో ఆయన పరిశ్రమల రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో పాల్గొన్నారు.

కేటీఆర్ మాట్లాడుతూ- "సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలతో పురోగమిస్తోంది. ఖాయిలాపడ్డ పరిశ్రమల పునరుద్ధరణకు దేశంలోనే తొలిసారిగా పారిశ్రామిక చికిత్స కేంద్రాలు (హెల్త్ క్లినిక్)లు నెలకొల్పాం. వాటి సమస్యలను గుర్తించి, అన్నిరకాల సాయం అందించేందుకు నిర్ణయించాం. ఖాయిలా పరిశ్రమలకు అప్పులను పునరుద్ధరించి, తమ రుణాలను బ్యాంకులు వసూలు చేసుకోవాలి. తాము చేపట్టిన చికిత్స కేంద్రాలను బ్యాంకేతర ఆర్థిక సంస్థగా రిజర్వు బ్యాంకు గుర్తించింది. ఇందులో బ్యాంకులు పెట్టుబడులు పెట్టాలి.

పునరుద్ధరణకు సాయమందించాలి

పరిశ్రమల అభివృద్ధికి బ్యాంకులు సహకరిస్తున్నాయి. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు సకాలంలో రుణాలివ్వాలి. స్వయం (మిగతా 2లో)

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా

- పంచాయతీ పాలకవర్గానికి అధికారం

5లో

పోషకాహార లోపం..

పొడుగుకు శాపం



- పోషకాహారంపై అవగాహన కరవై.. వయసుకు తగిన ఎత్తు పెరగని చిన్నారులు
- ఇలాంటివారి శాతం అత్యధికంగా బిహార్‌లో..
- 18వ స్థానంలో ఏపీ.. 24వ స్థానంలో తెలంగాణ
- ఎన్ఐఎన్ అధ్యయనంలో వెల్లడి
- గర్భం నుంచే జాగ్రత్తలు అవసరమని సూచన

ఎత్తు పెరిగే విషయంలో అపోహలెన్నో ఉన్నా.. పోషకాహార లోపాన్ని అధిగమిస్తే, వయసుకు తగినట్లుగా పొడవు పెరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయంటున్నారు నిపుణులు. తల్లిలో హిమోగ్లోబిన్ లోపం వల్ల శిశువులు తక్కువ బరువుతో పడుతున్నారనీ, గర్భిణులు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందంటున్నారు. బిడ్డ గర్భంలో ఉండగానే పోషకాహార లోపం లేకుండా జాగ్రత్త పడాలని జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్) సూచించింది. ఐదేళ్ల లోపు పిల్లల ఎత్తుపై అధ్యయనం చేసిన ఎన్ఐఎన్ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పోషకాహార లోపంతో పొడవు పెరగని తీరును వివరించింది. కరవుతో పాటు పోషకాహారంపై అవగాహన లేకపోవడం (మిగతా 2లో)

ఇదీ సంగతి!





విశ్వ 'వంద'నం!

శ్రీహరికోట, న్యూస్‌టుడే: మరో మైలురాయి సాధించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సిద్ధమైంది. తన వందో ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసింది. వాతావరణం అనుకూలిస్తే శుక్రవారం ఉదయం 9.29 గంటలకు నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి పీఎస్ఎల్‌వీ-సి40 రాకెట్‌ను నింగిలోకి పంపనుంది. దీనిద్వారా 31 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టబోతోంది. వీటిలో భారత్‌కు చెందిన కార్టోశాట్-2ఇ, ఒక నానో శాటిలైట్, ఒక సూక్ష్మ ఉపగ్రహం ఉన్నాయి. వీటి ప్రయోగంతో భారత్‌కు చెందిన మొత్తం వంద ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరినట్లవుతుంది.

ఇవి కాక కెనడా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, దక్షిణ కొరియా, బ్రిటన్, అమెరికాకు చెందిన 28 ఉపగ్రహాలూ కక్ష్యలోకి వెళ్లనున్నాయి. వీటిలో 25 నానో, మూడు మైక్రో ఉపగ్రహాలు ఉన్నాయి. కార్టోశాట్-2ఇ బరువు 710 కిలోలు. మిగిలిన ఉపగ్రహాల బరువు 613 కిలోలు. పీఎస్ఎల్‌వీ శ్రేణిలో ఇది 42వ ప్రయోగం. ప్రయోగానికి ముందు జరిగే కౌంట్‌డౌన్ కార్యక్రమం గురువారం ఉదయం 5.29 గంటలకు ప్రారంభమైంది. ఇది 28 గంటలపాటు కొనసాగుతుంది. ఇస్రో అధిపతి కిరణ్‌కుమార్ శ్రీహరికోట చేరుకుని రాకెట్ ప్రయోగంపై శాస్త్రవేత్తలతో సమీక్షించారు. ఆగస్టు 31న పీఎస్ఎల్‌వీ వైఫల్యం తర్వాత తొలిసారిగా జరుగుతున్న ప్రయోగం ఇది.

ఆకాశ నేత్రం

భూమి మీద నిర్దిష్ట ప్రదేశానికి సంబంధించి హైరిజల్యూషన్ చిత్రాలను అందించడం కార్టోశాట్-2ఇ ఉపగ్రహ ప్రత్యేకత. కార్టోశాట్-2 శ్రేణిలో ఇది మూడో ఉపగ్రహం. ఇందులో పాన్‌క్రొమాటిక్, మల్టీ స్పెక్ట్రల్ కెమెరాలు ఉంటాయి. హై రిజల్యూషన్ డేటాను అందించడంలో వీటికి తిరుగులేదు. పట్టణ, గ్రామీణ ప్రణాళిక; తీర ప్రాంత వినియోగం, నియంత్రణ; రోడ్డు నెట్‌వర్క్ పర్యవేక్షణ, నీటి పంపిణీ, భూవినియోగంపై మ్యాప్‌ల తయారీ; భౌగోళిక, మానవ నిర్మిత అంశాల్లో మార్పు పరిశీలన వంటి అవసరాలకు ఇది ఉపయోగపడుతుంది.

15లోగా ఆస్తుల వివరాలివ్వండి

ఉద్యోగులకు ప్రభుత్వ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు తమ వార్షిక ఆస్తుల నివేదికలను ఈ నెల 15లోగా సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం గురువారం అంతర్గత ఉత్తర్వులు జారీ చేసింది. రూ. లక్ష దాటిన స్థిర, చరాస్తుల వివరాలను వెల్లడించాలని సూచించింది. సొంతానివైనా, సంపాదించిన, వారసత్వంగా వచ్చినా వాటి జాబితాను పొందుపరిచి ఇవ్వాలని పేర్కొంది. ఎవరైనా ఆస్తుల నివేదికలను ఇవ్వకపోతే రాష్ట్ర సివిల్ సర్వీస్ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపింది.

కార్తి చిదంబరానికి ఈడీ సమన్లు

చెన్నై, న్యూస్‌టుడే: ఐఎన్ఎక్స్ మీడియా సంస్థలో విదేశీ పెట్టుబడులకు అనుమతి ఇచ్చిన కేసులో జనవరి 16న హాజరు కావాలని కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తి చిదంబరానికి ఈడీ గురువారం సమన్లు పంపింది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఇందు మల్హోత్ర

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్ర, ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఎం జోసెఫ్ పేర్లను కేంద్రప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ కొలీజియం నిర్ణయం తీసుకొంది. ఇందులో ఇందు మల్హోత్ర నియామకం దేశ చరిత్రలో ప్రాధాన్యత సంతరించుకోనుంది. న్యాయవాదులను తొలుత హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించడం ఆనవాయితీగా ఆమె పేరును మాత్రం నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవికి సిఫార్సు చేయడం విశేషం. ఇలాంటి నియామకం దేశ చరిత్రలో ఇదే తొలిసారి కానుంది. మధ్యవర్తిత్వ వ్యవహారాల్లో (ఆర్బిట్రేషన్) నిపుణురాలైన ఇందు 2007లో సీనియర్ న్యాయవాది హోదాను పొందారు. ఇటువంటి హోదాను పొందిన రెండో మహిళగా నిలిచారు. అంతకుముందు మూడు దశాబ్దాల క్రితం జస్టిస్ లీలా సేథ్ ఆ హోదాను పొందిన తొలి మహిళ.

రాష్ట్రపతి పాలన చెల్లదన్న జస్టిస్ జోసెఫ్...



ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఎం జోసెఫ్ 2016లో ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన చెల్లదంటూ తీర్పునివ్వటం సంచలన విషయం. ఆ తీర్పు వెలువరించిన నెల తర్వాత హరీష్ రావత్ అధికారాన్ని తిరిగి చేపట్టారు. అనంతరం సుప్రీంకోర్టు కొలీజియం.. జస్టిస్ జోసెఫ్‌ను హైదరాబాద్‌లోని ఏపీ, తెలంగాణ ఉమ్మడి హైకోర్టుకు బదిలీచేయాలని సిఫార్సు చేయగా కేంద్ర ప్రభుత్వ అనుమతి లభించలేదు. అయితే, తాజాగా ఆయన పేరును కొలీజియం... సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవికి సిఫార్సు చేసింది.

అయిదు హైకోర్టులకు కొత్త సీజేలు

దేశంలోని అయిదు హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తుల పేర్లను కూడా కొలీజియం సిఫార్సు చేసింది. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి హైకోర్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.బి. రాధాకృష్ణను ప్రతిపాదించింది. దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రస్తుతం కోల్‌కతా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ జ్యోతిర్మయ్ భట్టాచార్యను బదిలీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం దిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ గీతా మిత్తల్ స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. పంజాబ్, హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సూర్యకాంత్‌ను హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేయనుంది. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిలాష కుమారికి మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు అప్పగించనుంది. ప్రస్తుతం కేరళ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఆంటోనీ డొమినిక్‌ను అదే కోర్టుకు పూర్తికాల ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగించాలని సిఫార్సు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ రంజన్‌గొగోయ్, మదన్ బి.లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌ల కొలీజియం వీరిపేర్లను సిఫార్సు చేసింది.

ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా

జస్టిస్ రాధాకృష్ణన్

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ తొట్టతిల్ బి.నాయర్ రాధాకృష్ణన్ నియమితులు కానున్నారు. ఆయన ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. ఉమ్మడి హైకోర్టు సీజేగా ఆయన నియామకానికి బుధవారం సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపాక ఆ వివరాలు రాష్ట్రపతికి చేరతాయి. వాటిని పరిశీలించి రాష్ట్రపతి నియామక ఉత్తర్వులుజారీచేస్తారు. 2016 ఆగస్టు నుంచి ఉమ్మడి హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే)గా జస్టిస్ రమేశ్ రంగనాథన్ బాధ్యతలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సీజేగా రాధాకృష్ణన్ వచ్చాక.. జస్టిస్ రమేశ్ రంగనాథన్ ఇక్కడే కొనసాగుతారని సమాచారం.

కేరళ జన్మస్థలం: కేరళకు చెందిన న్యాయవాదులు ఎన్.భాస్కరన్ నాయర్, పారుకుట్టి అమ్మ దంపతులకు జస్టిస్ రాధాకృష్ణన్ 1959 ఏప్రిల్ 29న జన్మించారు. కొల్లం, తిరువనంతపురంలలో పాఠశాల విద్య అభ్యసించారు. కేరళ వర్సిటీ నుంచి జంతుశాస్త్రంలో బీఎస్సీ పూర్తిచేశారు. కేజీఎఫ్ లా కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించి బెంగళూరు వర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా అందుకున్నారు. న్యాయవాదిగా తిరువనంతపురంలో ప్రాక్టీసు మొదలుపెట్టినా 1988లో ప్రాక్టీసును కేరళ హైకోర్టుకు మార్చారు. సివిల్, రాజ్యాంగం, అడ్మినిస్ట్రేటివ్ లా కేసుల్లో ఆయన పేరు గడించారు. బ్యాంకులు, వర్సిటీల తరఫున వాదనలు వినిపించారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ సెంట్రల్ అథార్టీలో సభ్యులుగా పనిచేశారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా 2004 అక్టోబరు 14న ప్రమాణం చేశారు. అక్కడే తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా 2016 మే 13న బాధ్యతలు చేపట్టారు. 2017లో పదోన్నతిపై ఛత్తీస్‌గఢ్ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.





సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్లేందుకుగాను గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు పోటెత్తిన ప్రయాణికులు ★ కట్టడి చేస్తున్న పోలీసులు

ఊరికి పోయేదెలా?

(మొదటి పేజీ తరువాయి)

సొంతూరుకు వెళ్లడమెలా అని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సికింద్రాబాద్‌తోపాటు కాచిగూడ, నాంపల్లి స్టేషన్లు సంక్రాంతికి ఊళ్లకు వెళ్లే తెలుగు రాష్ట్రాల ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. శుక్ర, శనివారం ప్రయాణికుల రద్దీ మరింత పెరగనుంది.

సంక్రాంతికి హైదరాబాద్ నుంచి పెద్దసంఖ్యలో తెలుగు రాష్ట్రాల ప్రజలు ఊళ్లకు వెళ్తుంటారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లేవారు ఎక్కువ. రెగ్యులర్ రైళ్లకు అదనంగా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని రైల్వేశాఖ చెబుతున్నా.రద్దీకి ఇవి ఏమాత్రం చాలడం లేదు. 12, 13తేదీల్లో సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే జన్మభూమి, విశాఖ, గరీబ్‌రథ్, ఎల్‌టీటీ, ఈస్ట్‌కోస్ట్ రైళ్లలో రిజర్వేషన్ రిగ్రెట్(వెయిటింగ్ లిస్ట్ దాటి)కు చేరుకుంది. హంసఫర్, విశాఖపట్నం ప్రత్యేకరైళ్లలోనూ ఇదే పరిస్థితి. 12న రాజమహేంద్రవరానికి 4 ప్రత్యేకరైళ్లు సహా 17, 13న ఒకటి ప్రత్యేకరైలు సహా 13 రైళ్లున్నా అన్నింట్లో నిరీక్షణ జాబితా దాటింది. కాకినాడకు వెళ్లే రెగ్యులర్, ప్రత్యేకరైళ్లలోనూ ఇదే పరిస్థితి. 11, 12 తేదీల్లో ముందస్తు రిజర్వేషన్ అవసరం లేని జనసాధారణ్ రైళ్లు రెండు నడపడం ఒక్కటే ఊరట. నెల్లూరు, గూడూరు వైపు వెళ్లే రైళ్లలోనూ నిరీక్షణ జాబితా వందల్లో ఉంది.

సగటున నాలుగైదే..: సికింద్రాబాద్ వైపు నుంచి విశాఖపట్నం, కాకినాడ, గూడూరువైపు బుధ, గురువారాల్లో వెళ్లిన..శుక్ర, శనివారాల్లో వెళ్లే ప్రత్యేకరైళ్ల సంఖ్య చూస్తే సగటున నాలుగైదే ఉన్నాయి. మిగిలిన రైళ్లు చాలావరకు పండగ ముగిశాక, తిరుగు ప్రయాణమూ ముగిసిన తర్వాత ఉన్నాయి. జోన్ పరిధిలో కర్ణాటక, మహారాష్ట్ర పరిధిలో తిప్పే రైళ్లను.. కేరళ, ఇతర రాష్ట్రాలకు పండగలతో సంబంధం లేకుండా నడిపే వీక్లీ ప్రత్యేకరైళ్లను ఈ జాబితాలో కలిపేసింది. మరోవైపు రిజర్వేషన్ బోగీల్లో నిరీక్షణ జాబితా టికెట్లు దొరికే పరిస్థితి లేకపోవడంతో మిగిలింది జనరల్ బోగీలే. సాధారణ రోజుల్లోనే సీటు దొరకని ఈ బోగీల్లో ఇప్పుడు మరింత ఇబ్బందిగా మారింది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఎప్పటిలాగే .అదనపు రైళ్లు నడపడం లేదని ప్రకటించింది.

ఆర్టీసీ బస్సుల్లోనూ రెగ్యులర్‌తో పాటు 50 శాతం అదనపుఛార్జీలతో నడిపే ప్రత్యేక బస్సుల్లోనూ 12, 13తేదీల్లో వెయిటింగ్‌లిస్ట్(ఒక్కో బస్సులో గరిష్ఠంగా ఐదు టికెట్లు) పరిమితి దాటింది అటు ఆర్టీసీలో, ఇటు రైళ్లలో టికెట్లు దొరక్క ప్రయాణికులు ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వారు ఛార్జీలు పెంచి ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారు.



గురువారం రాత్రి ఎల్బీ నగర్ కూడలిలో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ప్రైవేటు బస్సులపై చర్యలు తీసుకోండి: పండగ సమయాల్లో ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు బస్సులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఛైర్మన్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ గురువారం సీఎస్ ఎస్పీసింగ్, రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి సునిల్ శర్మలను కోరారు. ఆర్టీసీ కంటే రెట్టింపు ఛార్జీలను వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

మరిన్ని గ్రీన్‌కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చి, ఇక్కడే చట్టబద్ధ శాశ్వత నివాసులుగా ఉండేందుకు గ్రీన్‌కార్డు పొందుతుంటారు. చాలా మంది దీనికోసం దశాబ్దాల పాటు నిరీక్షిస్తారు. అనధికార అంచనా ప్రకారం దాదాపు 5 లక్షల మంది భారతీయులు ఈ కార్డుల కోసం నిరీక్షణలో ఉంటూ హెచ్-1బి వీసాలను ఏటా పొడిగించుకుంటూ వస్తున్నారు.

వీసాలు మాత్రం తగ్గిపోతాయి...

'అమెరికా భవిష్యత్తు పరిరక్షణ చట్టం' పేరుతో రూపొందించిన నూతన బిల్లు ఆమోదం పొందాక భిన్న రకాల వీసాలకు కాలం చెల్లుతుంది. ప్రస్తుతం ఏటా 10.50 లక్షల మందికి వీసాలు ఇస్తుండగా ఇకపై ఇది 2.60 లక్షలకు తగ్గుతుంది. గ్రీన్‌కార్డుల్ని మాత్రం ఏటా 1.20 లక్షల నుంచి 1.75 లక్షలకు పెంచుతారు. దీనివల్ల వీటికోసం నిరీక్షించాల్సిన వ్యవధి గణనీయంగా తగ్గిపోవచ్చని భావిస్తున్నారు. గొలుసుకట్టు వలసల్ని ఎత్తివేయడం వల్ల భారతీయ అమెరికన్లు తమ కుటుంబ సభ్యులను అమెరికాకు తీసుకురాలేని పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది. వీరి జీవిత భాగస్వాములు, మైనర్ పిల్లలకు తప్పిస్తే బంధువులకు గ్రీన్‌కార్డు అర్హత ఉండదు. అక్రమంగా దేశంలోకి వచ్చేవారిని నిలువరించడానికి చేపట్టిన ప్రయత్నాల వల్ల భారత్, చైనాల్లో సాంకేతికార్హత ఉన్నవారికి మాత్రం మంచి జరుగుతుందని విశ్లేషకుల అంచనా. పౌరుల తల్లిదండ్రులకు మాత్రం పునరుద్ధరణకు వీలున్న తాత్కాలిక వీసాలు మంజూరు చేస్తారు.

అంపశయ్యపై..యంత్ర విద్య

(మొదటి పేజీ తరువాయి)

అందులో ఏటా భర్తీ అవుతున్నది 8.5 లక్షలు మాత్రమేనని అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) తేల్చింది. 2017-18 విద్యా సంవత్సరానికిగానూ తెలంగాణలోని 112 కళాశాలల్లో 41,628 సీట్లు ఉండగా..2874, ఆంధ్రప్రదేశ్‌లో 109 కళాశాలల్లో 47,640 సీట్లకు గానూ 5687 మాత్రమే భర్తీ అయ్యాయి. ఈ గణాంకాల ఆధారంగా ఖాళీలు అత్యధికంగా ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ 4, ఏపీ 5వ స్థానాన్ని దక్కించుకున్నాయి. అయిదేళ్లు వరుసగా 30 శాతం కంటే సీట్లు భర్తీ కాకుంటే వాటిని మూసివేసే దిశగా చర్యలు తీసుకుంటామని ఏఐసీటీఈ ఇప్పటికే ప్రకటించింది. ఈ ప్రకారం దేశంలోని మూడో వంతు కళాశాలల భవిత అగమ్యగోచరమే.'ఇంజినీరింగ్‌లో సీట్లు భర్తీ కాకున్నా ఫార్మసీలో దాదాపు 80 శాతం నిండుతున్నాయి. దానివల్ల చాలా విద్యా సంస్థలు మనుగడ సాగించగలుగుతున్నాయి' అని అఖిల భారత సెల్ఫ్ ఫైనాన్స్ సాంకేతిక విద్యా సంస్థల సమాఖ్య ఉపాధ్యక్షుడు శ్రీనిభూపాలం చెప్పారు. సీట్లు భర్తీకాని చాలా కళాశాలలు ఇప్పటికే మూసివేతకు దరఖాస్తు చేసుకున్నాయని, బీటెక్ నాలుగేళ్ల కోర్సు అయినందున మరో మూడేళ్లలో అవి మూతపడతాయన్నారు.

దేశవ్యాప్తంగా సీట్లు భర్తీ కాని కళాశాలలు ఇలా..

సంవత్సరం	కళాశాలల సంఖ్య
2014-15	1178
2015-16	1171
2016-17	1267

మూడేళ్లలో 30 శాతం కంటే తక్కువ సీట్లు భర్తీ అయిన అత్యధిక కళాశాలలున్న రాష్ట్రాలు

రాష్ట్రం	మొత్తం కళాశాలలు			సీట్ల సంఖ్య			భర్తీ అయినవి		
	2014-15	15-16	16-17	2014-15	15-16	16-17	2014-15	15-16	16-17
తమిళనాడు	140	142	177	61994	59493	77509	10152	9050	12399
యూపీ	103	131	169	44325	56948	74538	6948	8870	10327
మహారాష్ట్ర	109	118	139	38160	40980	43338	5294	5750	6135
తెలంగాణ	183	150	112	92145	62454	41628	6434	4726	2874
ఏపీ	143	117	109	64560	50490	47640	8593	6662	5687

టీఆర్‌టీ దరఖాస్తు సవరణల గడువు పొడిగింపు

15 వరకు అవకాశమిచ్చిన టీఎస్‌పీఎస్సీ

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ) దరఖాస్తుల్లో దొర్లిన తప్పుల సవరణ, పూర్వజిల్లాల ప్రాతిపదికన ఆప్షన్లను మార్పు చేసేందుకు ఇచ్చిన గడువును టీఎస్‌పీఎస్సీ పొడిగించింది. ఈనెల 15 వరకు మార్పులు చేసుకోవచ్చని తెలిపింది. ఈనెల 7న దరఖాస్తు గడువు ముగిసిన తరువాత... అందులోని వ్యక్తిగత వివరాలు, అర్హతలు ఇతరత్రా తప్పులను సరిచేసుకునేందుకు టీఎస్‌పీఎస్సీ ఈనెల 9 నుంచి 11 వరకు అభ్యర్థులకు మార్పుల (ఎడిట్) అవకాశాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే మార్పులు చేయడంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. బుధ, గురువారాల్లో ప్రయత్నించిన అభ్యర్థులు.. విఫలమై కమిషన్ అధికారులు, సీజీజీ నిపుణులను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కొందరు అభ్యర్థులు విద్యాశాఖ అధికారులకు సమస్యను వివరించారు. కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువగా టీఆర్‌టీకి సంబంధించినవే ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు చెప్పాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని గడువు పొడిగించినట్లు టీఎస్‌పీఎస్సీ వర్గాలు వెల్లడించాయి.

ఐపీఎస్‌పై సీఐడీ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

చర్చనీయాంశంగా మారింది. దాదాపు 350 ఎకరాల భూముల రికార్డులు తారుమారు చేసి అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ జమాలుద్దీన్ అనే వ్యక్తి గత అక్టోబరులో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బండ్లగూడలోని ఈ భూముల విలువ రూ.కోట్లలో ఉంటుందని, నిందితులు వీటి యజమానుల సంతకాలు ఫోర్జరీ చేసి అమ్ముకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తులో పురోగతి లేదని, నిందితులతో పోలీసులు కుమ్మక్కయ్యారని ఆరోపించిన ఫిర్యాదుదారు దీనిపై విచారణ జరపాల్సిందిగా అప్పటి డీజీపీ అనురాగ్ శర్మను ఆశ్రయించారు. డీజీపీ ఆదేశాల మేరకు కేసు, దాని పూర్వాపరాలన్నీ సీఐడీకి బదిలీ చేశారు. దాంతో మొదటిసారి సీఐడీ ఉన్నతాధికారులు భూవివాదం కేసు దర్యాప్తు మొదలుపెట్టారు. ఇదంతా ఒక ఎత్తయితే హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఒక డీసీపీతో పాటు ఈ వివాదంతో సంబంధముందని భావిస్తున్న పోలీసులపైనా వారు విచారణ ప్రారంభించారు.నిందితులతో కుమ్మక్కయ్యారని, ఇందుకు ప్రతిఫలంగా లబ్ధి పొందారన్న ఆరోపణలపైనా ఆరా తీస్తున్నారు. వీరి మధ్య ఏవైనా లావాదేవీలు జరిగాయా అన్నకోణంలోనూ విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే వారి వాంగ్మూలం నమోదు చేయాలని భావిస్తున్నారు. ఈ విషయాన్ని సీఐడీ ఉన్నతాధికారులు ధ్రువీకరించారు. పోలీసులపై ఆరోపణలకు సంబంధించి విచారణ, భూవివాదాల కేసు దర్యాప్తు పూర్తి కాలేదని వెల్లడించారు. ఇందులో పోలీసుల ప్రమేయం ఉందని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు.

'బైసన్ పోలో' అప్పగింతపై నిర్ణయంలో జాప్యం!

ఈనాడు, హైదరాబాద్: కొత్త సచివాలయ నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వానికి సికింద్రాబాద్‌లోని బైసన్‌పోలో మైదానం అప్పగింతపై కేంద్ర ప్రభుత్వ తుది నిర్ణయంలో జాప్యం జరుగుతోంది. రాష్ట్రంలో మాదిరే పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక అవసరాల కోసం రక్షణశాఖ స్థలాలు కోరుతుండటంతో కేంద్రంలో కొంత స్తబ్ధత ఏర్పడినట్లు తెలిసింది. ప్రస్తుత సచివాలయంలో సరైన సౌకర్యాలు లేవంటూ రాష్ట్రప్రభుత్వం బైసన్‌పోలో మైదానం కావాలని కోరుతూ కేంద్ర రక్షణశాఖకు లేఖ రాసింది. దానిని తమకు అప్పగిస్తే ప్రత్యామ్నాయంగా మరోచోట స్థలం కేటాయిస్తామని పేర్కొంది. ముఖ్యమంత్రి కేసీఆర్ దిల్లీకి వెళ్లి ప్రధానిని, కేంద్ర మంత్రులను కలిసి ఈ స్థలం కోసం అభ్యర్థించారు. దీనిని పరిగణనలోకి తీసుకుని కేంద్రం సానుకూలతను వ్యక్తం చేసింది. స్థలం అప్పగింత, దానికి అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నత స్థాయి సమావేశాలు జరిగాయి. కేంద్రం ప్రతిపాదనలకు రాష్ట్రప్రభుత్వం అంగీకరించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి తాజాగా పశ్చిమబెంగాల్, మహారాష్ట్రల నుంచి తమకు రక్షణశాఖ స్థలాలు కావాలని అక్కడి ప్రభుత్వాల నుంచి లేఖలు వచ్చాయి. తమ రాష్ట్రాల్లో చేపట్టాల్సిన ప్రభుత్వ భవనాల కార్యాలయాల కోసం వందేసి ఎకరాల స్థలాలివ్వాలని వారు కోరారు. ఈ లేఖలు రక్షణశాఖలో చర్చనీయాంశమయ్యాయి. ముందుగా తెలంగాణకు స్థలం కేటాయిస్తే మిగిలిన రెండు రాష్ట్రాలకూ స్థలాలను ఇవ్వాల్సి వస్తుందని, ఇది సమస్యలకు దారి తీస్తుందనే వాదన రక్షణశాఖ వర్గాల్లో ఏర్పడినట్లు తెలిసింది. మరోవైపు బైసన్ పోలో స్థలం ఇవ్వవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కొందరు కేంద్ర రక్షణశాఖకు లేఖలు రాశారు. కొన్ని పార్టీల నేతలు సైతం వినతిపత్రాలు సమర్పించారు. వీటి గురించి కేంద్రం రాష్ట్రప్రభుత్వాన్ని వివరణ కోరినట్లు తెలిసింది. బైసన్ పోలో మైదానం అంశంపై కేంద్రం నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

గ్రహం అనుగ్రహం

12-1-2018 శుక్రవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం హేమంత ఋతువు; పుష్య మాసం; బహుళ పక్షం
ఏకాదశి: రా. 11-09 తదుపరి ద్వాదశి
విశాఖ నక్షత్రం: ఉ. 9-55 తదుపరి అనూరాధ
అమృత ఘడియలు: రా. 12-37 నుంచి 2-21 వరకు
వర్జ్యం: మ. 2-14 నుంచి 3-58 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-48 నుంచి 9-32 వరకు
తిరిగి మ. 12-29 నుంచి 1-13 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-39

పరిశ్రమలపై కరుణ చూపండి

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధికి ముందుకొస్తున్న మహిళలను ప్రోత్సహించాలి. వాయిదాలను చెల్లించకుంటే వాటిని మొండిబకాయిల ఖాతాలోకి పంపొద్దు. తిరిగి ఆదుకునేందుకు సాంకేతిక-ఆర్థిక సంభావ్యత అధ్యయనం ఆధారంగా కొంత సానుకూలంగా ఉండాలి. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలి. అవసరమైతే పరిశ్రమల చికిత్స కేంద్రాలు సాయం అందిస్తాయి.తక్కువ మొత్తాల్లో ఉన్న రుణాలను పునరుద్ధరించడం ద్వారా అనేక చిన్నపరిశ్రమలు తిరిగి తమ కార్యకలాపాలను ప్రారంభిస్తాయి. అలాంటి వాటికి బ్యాంకులు కచ్చితంగా సహకారం అందించాలి. ఆహారశుద్ధి, తోలు తదితర వృత్తి ఆధార పరిశ్రమలకు బ్యాంకులు భారీఎత్తున సాయం చేయాలి. ముద్ర, ప్రధానమంత్రి ఉపాధి హామీ పథకం కార్యక్రమాల్లోనూ వంద శాతం లక్ష్యాలను చేరుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి" అని సూచించారు.

పోషకాహారలోపం.. పొడుగుకు శాపం

(మొదటి పేజీ తరువాయి)

వయసుకు తగ్గ ఎత్తు పెరగకపోవడానికి ప్రధాన కారణమని ఎన్ఐఎన్ అధ్యయనంలో తేలింది. ఎన్ఐఎన్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇటీవల చేపట్టిన సామాజిక అధ్యయనంలోని తాజా గణాంకాలను విడుదల చేసింది. వయసుకు తగిన ఎత్తు పెరగని చిన్నారులు అత్యధికంగా 48.3 శాతం మంది బిహార్‌లో ఉన్నట్లు గుర్తించింది. ఆ తర్వాతి స్థానాల్లో ఉత్తర్‌ప్రదేశ్ (46.3), ఝార్ఖండ్(45.3), మేఘాలయ (43.8), మధ్యప్రదేశ్ (42)ఉన్నట్లు తేలింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్(31.4) 18వ స్థానంలో ఉండగా, తెలంగాణ(28.1) 24వ స్థానంలో ఉంది. వయసుకు తగిన ఎత్తులేని చిన్నారులు అత్యంత తక్కువగా 19.7 శాతమే ఉన్న కేరళ అన్ని రాష్ట్రాలకంటే మెరుగైన స్థితిలో ఉండగా, గోవా (20.1) రెండో స్థానంలో ఉంది.

పోషకాహారంపై జాగ్రత్తలివీ..

శిశువుల్లో పోషకాహారం లోపం నివారణకు పుట్టిన వెంటనే ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని ఎన్ఐఎన్ సూచించింది. బిడ్డ పుట్టిన తర్వాత ఆరు నెలల వరకూ తల్లి పాలు తప్ప మరేమీ పట్టకూడదని స్పష్టం చేసింది. దాదాపు 70 శాతం మంది పుట్టిన వెంటనే బిడ్డకు తేనె పీకలు, గ్లూకోజ్ నీళ్లు పట్టేసి శిశువుల జీవన సరళిని దెబ్బ తీస్తున్నారని పేర్కొంది. ఆరు నెలల తర్వాత తల్లి పాలతో పాటు.. అదనంగా పోషకాలు అందించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఏడాదిన్నర నుంచి రెండేళ్ల వరకూ తల్లి పాలు పట్టడంలో తప్పులేదనీ, చిన్నప్పట్నుంచే తాజా ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు తినాలనీ, క్రమేణా పిల్లల ఆహారాన్ని పెంచుతూ.. ఆటపాటలతో సాగేలా జాగ్రత్త పడాలని సూచించింది. పదేళ్ల వయసు తర్వాత పాలు, గుడ్లు, మాంసకృత్తులు అందేలా చూడాలనీ, యుక్తవయసు వచ్చే వరకూ అన్ని రకాల ఆహార పదార్థాలు అందుతున్నాయో లేదో చూడాల్సిన తల్లిదండ్రులపై ఉంటుందని పేర్కొంది. మాంసకృత్తులు, నాణ్యమైన ఆహారం, అంటువ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడితే వయసుకు తగ్గ ఎత్తు, బరువు సమకూరుతుందని ఎన్ఐఎన్ స్పష్టంచేసింది.



- ఈనాడు, హైదరాబాద్

ఇదీ పరిస్థితి..

తెలంగాణ

జిల్లా	వయసుకు తగినఎత్తులేని చిన్నారులశాతం
ఆదిలాబాద్	38.3
మహబూబ్‌నగర్	37.1
నిజామాబాద్	36.6
మెదక్	33.4
నల్గొండ	28.9
వరంగల్	26.6
ఖమ్మం	26.5
రంగారెడ్డి	26.2
కరీంనగర్	24.3
హైదరాబాద్	15.7

ఆంధ్రప్రదేశ్

జిల్లా	వయసుకు తగినఎత్తులేని చిన్నారులశాతం
కర్నూలు	44.1
అనంతపురం	40.3
విజయనగరం	36.8
కడప	36.3
చిత్తూరు	31.4
విశాఖపట్నం	30.1
నెల్లూరు	29.4
పశ్చిమగోదావరి	28.5
ప్రకాశం	28.2
శ్రీకాకుళం	28
తూర్పుగోదావరి	27.7
కృష్ణా	22.6
గుంటూరు	22.1

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	8.0	31.2
కరీంనగర్	13.0	31.0
రామగుండం	13.4	31.4
మెదక్	13.5	32.8
శ్రీకాకుళం	14.0	31.5
హన్మకొండ	14.5	32.0
నిజామాబాద్	15.0	28.0
హైదరాబాద్	15.3	32.2
సూర్యాపేట	17.0	30.0
మహబూబ్‌నగర్	18.5	34.0
తిరుపతి	21.8	31.5

రామప్ప ప్రాకారం పనులకు శ్రీకారం

- 'ఈనాడు' కథనం, హైకోర్టు చొరవతో రూ.1.15 కోట్లు కేటాయింపు
- ఆరుమాసాల్లో పూర్తి చేస్తామన్న కేంద్ర పురావస్తుశాఖ

వెంకటాపూర్, న్యూస్‌టుడే



ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీ సీతారాం నాయక్. చిత్రంలో రాష్ట్ర జలవనరుల సంఘం ఛైర్మన్ ప్రకాష్ తదితరులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రామప్ప ఆలయ అభివృద్ధికి కేంద్ర పురావస్తు శాఖ శ్రీకారం చుట్టింది. గతేడాది కురిసిన వర్షాలకు ఆగస్టు 19న ఆలయ ప్రహరీ కూలింది. గోడ నిర్మాణం కోసం పురావస్తు శాఖ చర్యలు తీసుకోకపోవడంతో సెప్టెంబరు 29న 'ఈనాడు' ప్రధాన పత్రికలో 'రామప్ప ఆలయంపై నిర్లక్ష్యమేల' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి హైకోర్టు స్పందించింది. తనంతట తానుగా(సుమోటో) ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించి.. ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కేంద్ర పురావస్తు శాఖను ఆదేశించింది. 'ఈనాడు' కథనం, హైకోర్టు చొరవతో ఆ శాఖ రూ. 1.15 కోట్లు కేటాయించింది. గురువారం 40 మీటర్ల ప్రాకారం(గోడ) నిర్మాణ పనులను మహబూబాబాద్ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, రాష్ట్ర జలవనరుల సంఘం ఛైర్మన్ వీరమల్ల ప్రకాశ్, కేంద్ర పురావస్తు శాఖ సూపరింటెండెంట్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాం నాయక్ మాట్లాడుతూ.. రామప్పలో అభివృద్ధి పనులు మొదలయ్యాయని, ప్రతి సమస్యనూ పరిష్కరించడానికి పురావస్తు శాఖ ముందుకొచ్చిందన్నారు. గోడ నిర్మాణంతో పాటు నంది విగ్రహంపై కప్పు ఏర్పాటు, కామేశ్వరాలయ నిర్మాణాన్ని కూడా చేపడుతుందన్నారు. రామప్ప ఆలయం నుంచి సరస్సు వరకు రెండు వరుసల రహదారి కోసం రూ. 3కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. చెరువు కట్టను ట్యాంకు బండ్ తరహాలో తీర్చిదిద్దుతామని, కట్టపై ప్రతాపరుద్రుడు, రేచర్ల రుద్రుడు, రుద్రమదేవి, రామప్ప విగ్రహాలను పెట్టేందుకు సన్నహాలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సరస్సు పక్కనే ఉన్న అటవీశాఖ భూమిలో ఆయుర్వేద ఉద్యాన వనం ఏర్పాటుకు నిధులు మంజూరవుతాయన్నారు. కేంద్ర పురావస్తుశాఖ సూపరింటెండెంట్ మిలాన్ కుమార్ చౌలే మాట్లాడుతూ 40మీటర్ల మేర కూలిన రామప్ప ఆలయ ప్రాకారాన్ని ఆరు మాసాల్లో తిరిగి నిర్మిస్తామన్నారు.

భారత్‌కు మాల్యా అప్పగింతపై త్వరలో నిర్ణయం

లండన్: డబ్బు అక్రమ తరలింపు, మోసం తదితర కేసుల్లో నిందితుడు, బ్రిటన్‌కు పరారైన వ్యాపారవేత్త విజయ్ మాల్యా(62)ను భారత్‌కు అప్పగించటంపై లండన్ కోర్టు త్వరలోనే నిర్ణయం తీసుకోనుంది. దీనికి సంబంధించిన విచారణ చివరి దశకు వచ్చింది. భారత ప్రభుత్వం సమర్పించిన ఆధారాలను పరిశీలిస్తున్న లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్స్ కోర్టు జడ్జి ఎమ్మా అర్బత్‌నాట్ వారం రోజుల్లో తన నిర్ణయాన్ని వెలువరించనున్నారు. ఇదే కేసు విచారణకు సంబంధించి విజయ్ మాల్యా గురువారం ఆ కోర్టుకు హాజరయ్యారు. భారత్ సమర్పించిన ఆధారాలు ఆమోదయోగ్యమేనని జడ్జి భావిస్తే మాల్యా అప్పగింతకు అనుకూలంగా నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ఒకవేళ మాల్యాను భారత్‌కు అప్పగిస్తే ఆయనను నిర్బంధించి ఉంచే ముంబయి కేంద్ర కారాగారంలోని 12వ బ్యారక్‌లో వసతుల పరిస్థితిని తెలియజేయాలని జడ్జి ఇప్పటికే ఆదేశించారు.

మేడారం జాతరకు ఘనంగా ఏర్పాట్లు

- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించాలి
- అధికారులకు సీఎస్ ఆదేశాలు



మేడారం జాతర ఏర్పాట్లపై సచివాలయంలో సమీక్షిస్తున్న సీఎస్ ఎస్పీ సింగ్. హాజరైన పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్, పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు

ఈనాడు, హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మేడారంలో ఈనెల 31 నుంచి వచ్చేనెల 3 వరకు జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ అధికారులను ఆదేశించారు. కుంభ మేళా తరహాలో జాతరకు అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు. గురువారం సచివాలయంలో ఆయన మేడారం జాతరపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ "జాతరకు కోటి మందికి పైగా భక్తులొస్తారు. దేశవిదేశాల నుంచి భక్తులు, పర్యాటకులు వచ్చేలా అంతర్జాతీయ ఛానళ్లు, బ్లాగులు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించాలి. విదేశీ పర్యాటకుల కోసం అత్యున్నత సదుపాయాలతో ప్రత్యేక నివాసాలను ఏర్పాటు చేయాలి. సాంస్కృతికశాఖలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసి జాతర పనులను పర్యవేక్షించాలి. అన్ని రాష్ట్రాల గిరిజన, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రులను, కార్యదర్శులను, గిరిజన ఎంపీలను ప్రత్యేకంగా ఆహ్వానించాలి. అత్యాధునిక మరుగుదొడ్లను నిర్మించాలి. భక్తులకు హెలికాప్టర్ సేవలను అందించాలి. భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలి" అన్నారు. పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, సాంస్కృతికశాఖ కార్యదర్శి వెంకటేశం, దేవాదాయ కమిషనర్ శివశంకర్, గిరిజన సంక్షేమ కమిషనర్ క్రిస్టినా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా పర్యాటకశాఖ తరపున ప్రత్యేక సంచికను విడుదల చేస్తున్నట్లు వెంకటేశం చెప్పారు. గతంలో వరంగల్ జిల్లా కలెక్టరుగా పనిచేసిన ప్రస్తుత భూపరిపాలన సంచాలకురాలు వాకాటి కరుణను మేడారం జాతర ప్రత్యేకాధికారిణిగా ప్రభుత్వం నియమించింది.



ఎంసెట్ కుంభకోణంలో మరిన్ని అరెస్టులు!

- పరారైనవారిపై సీఐడీ దృష్టి

ఈనాడు, హైదరాబాద్: సంచలనం సృష్టించిన ఎంసెట్ కుంభకోణంలో సీఐడీ అధికారులు చేపట్టిన దర్యాప్తు రోజుకో మలుపు తిరుగుతోంది. చాలా కాలం క్రితమే ఈ కేసులో అభియోగపత్రాలు దాఖలు చేయాలని భావించారు. ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో తొలుత జేఎన్టీయూకి నోటీసులు జారీ చేసిన సీఐడీ అధికారులు వారిచ్చిన సమాధానాలు పరిశీలిస్తూ.. మరో నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో తప్పించుకొని తిరుగుతున్న 19 మంది నిందితులను కూడా అరెస్టు చేయాలని భావిస్తున్నారు. ఒకసారి అభియోగపత్రాలు దాఖలు చేసిన తర్వాత అరెస్టులు, ఇతరత్రా దర్యాప్తు సాధ్యంకాదు కాబట్టి, ఇటువంటివన్నీ త్వరలోనే పూర్తిచేయాలని భావిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఎంసెట్-2 ప్రశ్నపత్రం బహిర్గతం వ్యవహారం 2016 జూన్‌లో వెలుగులోకి రాగా.. సుదీర్ఘ దర్యాప్తులో మొత్తం 67 మంది నిందితులను అరెస్టు చేశారు. సూత్రధారిగా ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి చెందిన ఎస్బీ సింగ్ అరెస్టు కావడంతో ఇక అభియోగపత్రాలు దాఖలు చేయవచ్చని భావించారు. ఈలోగా జేఎన్టీయూ ప్రశ్నపత్రం రూపొందించి పరీక్షలు నిర్వహించే ప్రక్రియలో ఏవైనా లోపాలు ఉన్నాయేమోననే అంశంపై సీఐడీ అధికారులు దృష్టి సారించారు. వర్సిటీకి ఓ ప్రశ్నావళి పంపించారు. ప్రశ్నపత్రం ముద్రించిన సంస్థ యాజమాన్యానికీ నోటీసులు జారీ చేశారు. ఈ రెండుచోట్ల నుంచీ వచ్చిన సమాధానాలను క్రోడీకరిస్తున్నారు. పకడ్బందీ చర్యల తర్వాతే అభియోగపత్రం దాఖలు చేయాలని భావిస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదిక: ఎంసెట్ ప్రశ్నపత్రం లీకేజీ నేపథ్యంలో భవిష్యత్తులో నిర్వహించబోయే పోటీ పరీక్షలు, ప్రవేశ పరీక్షల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి సీఐడీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. దీనిలో భాగంగానే ఎంసెట్ ప్రశ్నపత్రం లీకేజీలో చోటుచేసుకున్న విధానపరమైన లోపాలపై ప్రత్యేక దృష్టి సారించారు. జేఎన్టీయూ అధికారులు, నిపుణులతో మాట్లాడి.. ప్రశ్నపత్రం పరీక్షకు ముందే వెల్లడి కాకుండా తీసుకోవాల్సిన చర్యల వివరాలను నివేదికలో పొందుపరచనున్నారు.



విద్యార్థులు, అధ్యాపకుల హాజరుపై దృష్టి పెట్టండి

- ఉన్నత విద్యామండలి అధికారులతో గవర్నర్ నరసింహన్



విద్యామండలి కార్యక్రమాలను గవర్నర్‌కు వివరిస్తున్న పాపిరెడ్డి

ఈనాడు, హైదరాబాద్: కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు, అధ్యాపకుల హాజరుపై పర్యవేక్షణ పెంచాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులకు గవర్నర్ నరసింహన్ సూచించారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, ఉపాధ్యక్షులు లింబాద్రి, వి.వెంకట రమణ, కార్యదర్శి శ్రీనివాసరావు గురువారం ఉదయం గవర్నర్‌ను కలిశారు. తాము చేపడుతున్న కార్యక్రమాలను పాపిరెడ్డి గవర్నర్‌కు వివరించారు. అనంతరం నరసింహన్ మాట్లాడుతూ ప్రాథమికంగా తెలంగాణ విద్యాసంస్థలు జాతీయ స్థాయి, క్రమేణా అంతర్జాతీయస్థాయి విద్యాప్రమాణాలను అందుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులకు మంచి ప్రయోగశాలలు అందుబాటులో ఉంచితే వారు మార్కెట్ అవసరాలకు తగ్గట్లు ఆవిష్కరణలు చేస్తారని చెప్పారు. మొత్తం ఏడు పరీక్షలను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తుండటాన్ని గవర్నర్ ప్రశంసించినట్లు పాపిరెడ్డి తెలిపారు.

నాసిరకం కళాశాలలను మూసివేయండి!

తెలంగాణ రాష్ట్రంలో నిబంధనలు పాటించని.. నాణ్యమైన విద్యను అందించలేని కళాశాలలను మూసివేయాలని గవర్నర్ నరసింహన్ తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఇక విద్యాసంస్థల విస్తరణ అవసరం లేదని.. ఉన్నవి మెరుగైన విద్య అందించేలా దృష్టి సారించాలని సూచించినట్లు తెలిసింది. ఇప్పటికే డిగ్రీ కళాశాలల హేతుబద్ధీకరణపై దృష్టి సారించిన విద్యామండలి అధికారులు గవర్నర్ ఆదేశంతో నాసిరకం కళాశాలలపై మరింత కఠినంగా వ్యవహరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

రుసుములు చెల్లించాలని విద్యార్థులను అడగొద్దు

- వచ్చే ఏడాదికి పెంచకండి
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్ ఆదేశం
- కష్టమన్న ప్రైవేటు యాజమాన్యాలు

ఈనాడు, హైదరాబాద్: రుసుములు చెల్లించాలంటూ తరగతుల్లో విద్యార్థులను నిలబెట్టడం, అవమానకరంగా మాట్లాడటంవంటివి చేయవద్దని.. తల్లిదండ్రులను మాత్రమే సంప్రదించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. ఇటీవల ఆచార్య తిరుపతిరావు కమిటీ 10 శాతం వరకు రుసుములు పెంచుకోవచ్చని సిఫార్సు చేయడం.. తుది నిర్ణయం తీసుకునే వరకు వచ్చే ఏడాదికి కూడా ఈ సంవత్సరం రుసుములనే వసూలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రముఖ సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులతో గురువారం కిషన్ సమావేశం ఏర్పాటు చేశారు. లాటరీ విధానంలో ప్రవేశాలు జరపాలని, సమాచారం వెబ్‌సైట్లలో ఉంచాలని ఆదేశించారు. రుసుములు పెంచకపోతే కష్టమవుతుందని.. వేతనాలు ఇతర ఖర్చులూ భారమవుతాయని కొందరు ప్రతినిధులు అన్నట్లు తెలిసింది. లాటరీ విధానం అమలు చేస్తే తోడబుట్టినవారికి ఇబ్బంది అవుతుందని.. వారికి ఒకేచోట ప్రవేశాలు ఇవ్వకపోతే రెండు పాఠశాలలకు పంపించాలంటే నగరంలో కుదరదని చెప్పారు. అమల్లో ఇబ్బందులున్నా నిబంధనలు పాటించాల్సిందేనని అధికారులు చెప్పినట్లు తెలిసింది. తోడబుట్టినవారికి సీట్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యమివ్వాలని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్యకు కమిషనర్ ఇటీవల ప్రతిపాదనలు పంపగా.. ఒకవైపు లాటరీ విధానం పాటించాలంటూ.. మరో వైపు ప్రాధాన్యం ఇవ్వడం ఎలా సాధ్యమని ఆమె ప్రశ్నించి.. ప్రతిపాదనను పక్కనపెట్టినట్లు తెలిసింది.

ఏడాది పాటు గుట్కా, పాన్‌మసాలాపై నిషేధం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో గుట్కా, పాన్‌మసాలా, ఖైనీ, తదితర పొగాకు ఉత్పత్తులపై ఏడాది పాటు తెలంగాణ ఆహార పరిరక్షణ కమిషనర్ నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీటిని ఏ రూపంలోనైనా ఉత్పత్తికానీ, నిల్వ, పంపిణీ, రవాణా చేయడాన్ని నిషేధించారు. ఈ నిషేధం ఈనెల 10 నుంచి ఏడాది పాటు ఉంటుంది. నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానా, జైలుశిక్ష వంటి చర్యలు తీసుకుంటామని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.



ఈనాడు


ప్రయోజనాలే పరమావధి కావాలి

సార్వత్రిక ఎన్నికలకు ముందు చివరి పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పణ ఘట్టానికి మూడు వారాల వ్యవధి ఉండగా, సంస్కరణల దూకుడును కొనసాగించడానికే మోదీ ప్రభుత్వం ఓటేసింది. కీలక రంగాల్లో మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ)ను ఆకట్టుకునే నిర్ణయాలు ప్రకటించింది. నిర్మాణ రంగంలో, వైద్య పరికరాల ఉత్పత్తిలో, విదేశీ పెట్టుబడులు కలిగిన ఆడిటింగ్ సంస్థలకు సంబంధించిన విధాన క్రాకు చేపట్టిన కేంద్రం- కొన్ని భారీ మార్పులకూ తెరతీసింది. ఇప్పటిదాకా ఏక బ్రాండ్ రిటైల్ వ్యాపారంలో ప్రభుత్వ అనుమతులకు లోబడి 100శాతం ఎఫ్‌డీఐలకు అనుమతిస్తున్నారు. తాజా నిర్ణయానుసారం ఇకమీదట అంతర్జాతీయ ఏక బ్రాండ్ రిటైలింగ్‌సంస్థలు భారత్‌లో పాదం మోపడానికి పారిశ్రామిక విధాన ప్రోత్సాహక విభాగం (డీపీపీ) అనుమతులకోసం వేచిచూడనక్కర్లేదు! నిర్మాణ అభివృద్ధి రంగంలోనూ అదేతరహా వెసులుబాటు కల్పిస్తామంటున్న కేంద్రం- స్థిరాస్తి బ్రోకరేజి సంస్థల్లోనే తప్ప స్థిరాస్తి వ్యాపారంలో నూరుశాతం ఎఫ్‌డీఐలకు వీల్లేదంటోంది. దశాబ్దాలుగా ఎయిర్ ఇండియాకు కట్టబెడుతున్న ప్రత్యేక ప్రాధాన్యాన్ని తోసిరాజని, దాన్ని దేశంలోని తక్కిన విమానయాన సంస్థలతో సమానంగా పరిగణిస్తూ- 49శాతం మేర ప్రైవేటీకరణకు ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది! వాజ్‌పేయీ సర్కారు ఔషధ తయారీ, పర్యాటక, ఆతిథ్య తదితర రంగాల్లో గేట్లు తెరవడంతో దరిమిలా ఒకటిన్నర దశాబ్దాల్లో వచ్చిన వెలుపలి పెట్టుబడుల్లో మారిషస్ (34శాతం), సింగపూర్(15)లదే పెద్దవాటా. పరిధి విస్తరణే లక్ష్యంగా శ్రమిస్తున్న స్వీయ జమానాలో 2013తో పోలిస్తే 2016నాటికి ఎఫ్‌డీఐలు దాదాపు రెండింతలైనట్టు గతంలో లెక్కచెప్పిన ప్రధాని మోదీ- వాటిని మరింత వృద్ధిబాట పట్టించడమే ఏకైక ధ్యేయమంటున్నారు. ఆ క్రమంలో తీసుకుంటున్న విధాన నిర్ణయాలు జాతికి దీర్ఘకాలంలో మేలా కీడా అన్నది మదింపు వేయడంలో ఎక్కడా ఎటువంటి తప్పిదాలకు తావివ్వరాదు. ప్రజాప్రయోజనాల పరిరక్షణ కన్నా ప్రభుత్వానికి ఏదీ ఎక్కువ కాదు!

'జాతి ప్రతిష్ఠకు ప్రతీక'గా పార్లమెంటరీ స్థాయీసంఘం అభివర్ణించిన ఎయిర్ ఇండియా గతమెంతో ఘనమైనది. జేఆర్‌డీ టాటా మానస పుత్రికగా 1932లో ఆవిర్భవించిన టాటా ఎయిర్‌లైన్స్ 1946లో ఎయిర్ ఇండియాగా మారింది. స్వాతంత్ర్యం వచ్చిన ఆరేళ్లకు భారత ప్రభుత్వం దాన్ని జాతీయం చేసింది. 118 విమానాలతో దేశవిదేశాల్లో వందకు పైగా గమ్యస్థానాలకు సేవలందిస్తున్న బృహత్ వ్యవస్థ పీకలోతు నష్టాల ఊబిలో కూరుకుపోవడానికి మునుపటి యూపీఏ సర్కారు అసమర్థ నిర్వాకాలే పుణ్యం కట్టుకున్నాయి. 2012 నుంచి పదేళ్లపాటు అమలు కావాల్సిన ఆర్థిక ఉద్దీపన పథకం పూర్తయ్యేదాకా జాతీయ విమానయాన సంస్థలో వాటాల విక్రయించవద్దన్న స్థాయీసంఘం సిఫార్సులు మూన్నాళ్ల క్రితమే వెలుగు చూశాయి. నిరుటి వార్షిక బడ్జెట్ ముందునాడు వెలువడిన ఆర్థిక సర్వే- రోజుకు కనీసం మూడుకోట్ల రూపాయల నిర్వహణ నష్టంతో కుంగుతున్న ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించడమే ఉత్తమమని సూచించింది. ఆ సూచనను అందిపుచ్చుకొన్న కేంద్రమంత్రి వర్గ నిర్ణయానుసారం- విస్తారా, జెట్ ఎయిర్‌వేస్ తరహాలో ఎయిర్ ఇండియా స్వరూప స్వభావాలు రూపాంతరం చెందనున్నాయి. 49 శాతం మేర విక్రయించదలచిన వాటాను దక్కించుకోవడానికి ఇండిగో, ఖతర్ ఎయిర్‌వేస్ చేతులు కలుపుతాయని; ఎయిర్ ఇండియా తిరిగి టాటాల గూటికే చేరుకుంటుందని అంచనాలు ఇప్పటికే వెల్లువెత్తుతున్నాయి. ప్రైవేటీకరణ అనివార్యమైతే- విఖ్యాత సంస్థ సిబ్బంది ప్రయోజనాలు దెబ్బతినిపోకుండా ఆర్థిక, పౌర విమానయాన శాఖలు సంయుక్త వ్యూహాత్మక ప్రణాళిక సిద్ధం చేయాలని స్థాయీసంఘం హితవు పలికింది. ప్రయాణికులకు సంతృప్తికర సేవలందించగల స్థాయిని, స్తోమతను సంతరింపజేయడమే ఎయిర్ ఇండియా ప్రక్షాళన పరమావధి కావాలి!

సుమారు పుష్కరం క్రితం యూపీఏ తొలి దఫా పాలనలో చిల్లర వ్యాపార రంగాన నైక్, రీబక్, సోనీలాంటి ఏక వాణిజ్యచిహ్నాల విషయంలో ఒకేసారి 51 శాతం విదేశీ పెట్టుబడుల నిర్ణయాన్ని ఆకస్మికంగా వెల్లడించారు. ఆపై బహుళ బ్రాండ్ వర్తకంలోనూ ఎఫ్‌డీఐలను అనుమతించదలచామనడంపై దేశమంతటా గగ్గోలు పుట్టింది. చిల్లర వ్యాపార రంగాన దేశ, విదేశీ బడా సంస్థల ప్రవేశాన్ని ఏకమొత్తంగా నిషేధించాలన్న జోషీ సంఘం సిఫార్సుల్ని తుంగలో తొక్కిన యూపీఏ ప్రభుత్వం 2011 నవంబరులో శ్రమజీవులపై పిడుగుపాటు వంటి నిర్ణయం ప్రకటించింది. బహుళ బ్రాండ్ల చిల్లర వర్తకంలోకి 51 శాతం, ఏక చిహ్న వ్యాపారంలోకి 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు హుటాహుటిన పచ్చజెండా ఊపేసింది. విపక్ష హోదాలో ఆ కసరత్తుపై దుమ్మెత్తిపోసిన ఎన్డీయే 2016 జూన్‌లో ఏక బ్రాండ్ వాణిజ్య సంస్థలకు నిబంధనల సడలింపు అనుగ్రహించడం కలకలం రేపింది. దేశంలో విక్రయ కేంద్రాలు నెలకొల్పదలిస్తే స్థానికంగా 30శాతం మేర విడిభాగాలు సేకరించాలన్న నిబంధనను నాడు మూడేళ్లపాటు సడలించిన కేంద్రం, నేడా వ్యవధిని అయిదేళ్లకు విస్తరించడం విస్మయపరుస్తోంది. ఈ నిర్ణయాల పర్యవసానంగా 'భారత్‌లో తయారీ' స్ఫూర్తికి విఘాతం వాటిల్లుతుందని, స్థానికంగా ఉపాధి అవకాశాలకు తూట్లు పడతాయన్న భయాందోళనల్ని తేలిగ్గా కొట్టిపారేసే వీల్లేదు. దేశాన్ని ప్రగతిపథంలో పరుగులు తీయించడానికంటూ ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాలైనా సామాన్యుల బతుకుల్ని కదలబార్చకూడదు. రైతులు, చిన్న వర్తకులు, తయారీదారులు ఏ దశలోనూ నష్టపోకూడదు. కోట్లమందిని నిరుద్యోగం కోరల్లోకి నెట్టే దురాగతాన్ని జాతి సహించబోదని విపక్షంగా జనవాణిని ప్రతిధ్వనించిన ఎన్డీయే, ఇప్పుడు పాలకపక్షంగానూ అడుగడుగునా ఆ స్ఫూర్తికి పట్టం కట్టాలి. నిరుద్యోగం ప్రబలకుండా, 'భారత్‌లో తయారీ'కి మందభాగ్యం దాపురించకుండా అత్యావశ్యక దిద్దుబాటు చర్యలకు నిబద్ధతతో గొడుగు పట్టాలి!

వివేకవంతులై పదండి ముందుకు!




ముప్పవరపు వెంకయ్యనాయుడు
(భారత ఉపరాష్ట్రపతి)

'లే... మేలుకో... గమ్యం చేరేవరకు విశ్రమించకు' అన్న ఉపనిషత్ శ్లోకాన్ని స్వామి వివేకానందుడు దేశంలోని మూలమూలకు చేర్చారు. భారతీయ యువతకు స్ఫూర్తిమంతంగా ఆ మాటలను నినదించారు. భవ్యమైన భవిష్యత్తుకు వికసించే నవ్య భారతాన్ని నిర్మించే క్రమంలో దేశ యువజనులకు ఆ మాటలే మేలుబాటలు కావాలి. నేడు దేశ జనాభాలో 65శాతం యువశక్తితో కళకళలాడుతోంది. యువతలో నిబిడీకృతమైన అమేయ శక్తి సామర్థ్యాలను గుర్తించి, జాతి అభివృద్ధి పథంలో వాటిని దోహదకర్తలుగా వినియోగించడానికి ఇంతకుమించిన తరుణం లేదు. భారత స్థూల దేశీయోత్పత్తిలో సేవలరంగం గణనీయమైన వాటా ఆక్రమిస్తోంది. ప్రపంచ వేదికపై ఐటీ సేవలు అందించే విషయంలో దేశ వరసలో భారత్ ప్రముఖంగా పోటీ సంపాదించుకుంది. ఈ పురోభివృద్ధి బహుముఖ రంగాలకూ విస్తరించాల్సిన అవసరం ఉంది. మరో పదిసంవత్సరాలకు పైచిలుకు కాలంలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవిస్తున్నదని అంచనాలున్నాయి. తయారీ, వ్యవసాయ, ఇంధన, మౌలిక సౌకర్యాలను మరింత చురుగ్గా నవీకరించి, అభివృద్ధిపరిస్తే ఊహించినదానికన్నా ముందుగానే భారత అద్భుతమైన ఆర్థిక వ్యవస్థగా ఆవిష్కృతమవుతుంది.

'ఈ శతాబ్దం మీది. కానీ, 21వ శతాబ్దం మాత్రం పూర్తిగా భారత్‌దే'- అమెరికాకు చెందిన పాత్రికేయులతో విశ్వవిద్యాలయంలో సంభాషిస్తూ వివేకానందులవారు చేసిన వ్యాఖ్యలివి. జాతి భాగ్యోదయానికి వివేకానందుల విశ్వాసానికి ప్రతీకలు ఆ మాటలు. నిరాశావాదులకు నిరంతరం అనుమానాలు, అపనమ్మకాల్లో బతుకులీడ్చే బుద్ధిజీవులు కొందరికి- అడ్డంకులను అధిగమించి ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన ఆర్థికవ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఆవిర్భవించగలదా అన్న విషయంలో సందేహాలు ఉండవచ్చు. కొంతకాలంగా భారత ఆర్థిక వ్యవస్థలో వ్యక్తమవుతున్న వృద్ధి తీరుతెన్నులు ఆశావహ దృశ్యాన్నే ఆవిష్కరిస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ ఏ స్థాయిలో బలోపేతంగా ఉందన్న విషయాన్ని వెల్లడిస్తూ ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి, ఇతర ప్రపంచస్థాయి సంస్థల విశ్లేషణలు గమనించండి. దేశం సరైన అభివృద్ధి పథంలోనే ముందుకు సాగుతోందన్న సంకేతాలు కళ్లకు కడతాయి. ఆర్థిక వికాసం దిశగా ప్రస్థానంలోనూ అడ్డంకులను, గుర్తించి, వాటిని జాగ్రత్తగా తొలగించుకుంటూ ముందుకు వెళ్ళాల్సి ఉంది. శాంతియుత సహజీవనం, భిన్నవర్గాల మధ్య సుహృద్భావం, సమ్మిళిత అభివృద్ధి, అందరినీ సమానంగా గౌరవించే సమున్నత సంస్కృతికి భారత్ పురిటిగడ్డ. ఈ ఔన్నత్యాన్ని దెబ్బతీసే సంకుచిత భావజాలాలకు స్వస్తిచెప్పాలి.



భారత్ గ్రామాల్లో నివసిస్తోందన్నది జాతిపిత మహాత్మాగాంధీ మాట. జాతి అభివృద్ధి ప్రక్రియలో పల్లెపట్టులకూ సమధిక భాగస్వామ్యం లభించిన నాడే అసలు సిసలు పురోగతి సాధ్యమవుతుంది. అందుకోసం పునాదుల నుంచి పునర్వికాస సాధనకు కృషి చేయాలి. పల్లెలను అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దడంతోపాటు వాటిని స్వావలంబనకు సిసలైన చిరునామాగా రూపొందించాలి. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతుల ఆదాయాలను



నేడు జాతీయ యువజన దినోత్సవం

రెట్టింపు చేయాలి. అన్నదాతకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలి. రైతు సంక్షేమమే దేశ ఆహార భద్రతకు భరోసా! కాబట్టి అన్నదాతల బాగోగులకు అత్యంత కీలక ప్రాధాన్యం ఇవ్వాలి. అనవసరమైన వివాదాలు, చిన్నాచితకా అంశాలపైనే దృష్టి కేంద్రీకరించి దేశాభివృద్ధికి సంబంధించిన ముఖ్యమైన విషయాలను గాలికి వదిలేస్తున్న ధోరణి కొంతకాలంగా కనిపిస్తోంది. ఈ తీరు మారాలి. దేశంలో అత్యంత శక్తిమంతమైన ప్రసార మాధ్యమాలైన మీడియా, సినిమా నిబద్ధంగా ఆత్మ పరిశీలన చేసుకోవాల్సి ఉంది. సకారాత్మక అభివృద్ధికి ప్రోదిచేసే సమన్వయ సాధనాలు ఇప్పుడు దేశానికి చాలా అవసరం. సహేతుకంగా, నిష్పాక్షికంగా, ధైర్యంగా, భవిష్యత్తుపై ఆశలు రేకెత్తించే గళాలు ఇప్పుడు సమాజానికి అవసరం. భారత్ వంటి పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశంలో ప్రజా ప్రతినిధులపై ఎనలేని బాధ్యత ఉంటుంది. దేశ అభివృద్ధి తీరుతెన్నులను నిర్దేశించే కీలక బాధ్యతలను వారు నిర్వర్తించాలి. ప్రజాప్రతినిధుల వ్యవహార సరళి సమాజంలో మిగిలిన వర్గాలన్నింటికీ ఆదర్శప్రాయంగా ఉండాలి. ఈ నేపథ్యంలోనే వివేకానంద స్వామి ఉద్బోధలకు ఎనలేని ప్రాధాన్యం, సమకాలీనతలు ఉన్నాయి. ఆయన బోధన ప్రపంచానికే దారిదీపాలు.

అమెరికాలోని షికాగో నగరంలో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళన మహాసభ వేదికపై 125ఏళ్ల క్రితం స్వామీజీ ఇచ్చిన సందేశం ఇప్పటికీ అత్యంత విలువైనది, అత్యంత సమకాలీనమైనది. 'సహనం, విశ్వమానవ సౌభ్రాత్రం ప్రబోధించిన విశిష్టమైన మతంలో జన్మించినందుకు నేను గర్వపడుతున్నాను. పరమత సహనం మా లక్షణం. అన్ని మతాలనూ మేం గౌరవిస్తాం. మతాలన్నీ మనిషి వికాసాన్నే ప్రబోధిస్తున్నాయని మేం విశ్వసిస్తాం. మతం పేరిట జరిగిన పీడనల పాలబడి, సంఘర్షణల్లో చిక్కి సర్వం కోల్పోయి శరణార్థులుగా మారిన అనేక మతస్థులందరికీ భారత్ గొడుగునీడగా మారినందుకు నాకు ఎంతో గర్వంగా ఉంది' అని సర్వమత సమ్మేళన సభలో వివేకానందస్వామి చేసిన వ్యాఖ్యలు భారత దేశ గొప్పదనాన్ని ప్రపంచానికి చాటాయి. మతాలు, వర్గాల పాలబడి; మౌఢ్యం, పిడివాదం చేతచిక్కడంతో ప్రపంచంలో హింసోన్మాదం ప్రబలుతోందని; నాగరికతలు నాశనమవుతున్నాయని, దేశాలకు దేశాలే డస్సిపోయాయని తేల్చిన వివేకానందస్వామి- ఆ సంక్షోభాలే చెలరేగి ఉండకపోతే సమాజం మరెంతో అద్భుతంగా పురోగమించి ఉండేదని స్పష్టం చేశారు. మతాల మధ్య సమానత్వ సాధన అవశ్యకతను చాటిచెప్పారు. మరో మతాన్ని నాశనం చేయడం ద్వారానో లేదా దానిపై ఏదో రకంగా విజయం సాధించడం ద్వారానో మతాల మధ్య సమానత్వం సాధించగలమని ఎవరైనా భావిస్తే వారిది అసాధ్యమైన కోరిక, అత్యాశ అని ఆయన కరాఖండీగా తేల్చేశారు.

భిన్న మతాలు, విశ్వాసాలు కలిగిన దేశం మనది. మతాల మధ్య సహనం, సౌభ్రాతృత్వం వెల్లివిరియకపోతే శాంతియుత సహజీవనం సాధ్యం కాదు. ఈ విషయాన్ని స్పష్టం చేసేందుకే సర్వమత సమ్మేళన వేదికపైన స్వామి వివేకానందుడి వ్యాఖ్యలను ఉదాహరించాల్సి వచ్చింది. కొందరు మూర్ఖులు, పిడివాదులు తమకు నచ్చినదాన్నే నిజమని, తాము పాటించేదే సిసలైన సత్యమని మూఢంగా ప్రవర్తిస్తుంటారు. ఆ రకంగా ప్రవర్తించడం ద్వారా తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలన్నది వారి శుష్క ప్రయత్నం. మతమేదైనా కావచ్చు, ఈ తరహా ప్రవర్తన మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ సమంజసం కాదు. కులం, డబ్బు, వర్గం వంటి అడ్డుగోడలను దాటుకొని రాజకీయాలను సంస్కరించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజాప్రతినిధులను వారి గుణగణాలు, సమర్థత ఆధారంగా ఎంపిక చేసుకోవాలిగానీ- ఎన్నికల్లో ఓటు వేయడానికి సంకుచిత పరిధులు ప్రామాణికం కారాదు. 'కులం ఒకనాటి చారిత్రక పరిస్థితుల్లో అవసరంగా, ఉపయుక్తంగా అవసరపడి ఉండవచ్చు. మనం ఆ దశలన్నింటినీ దాటుకొని ముందుకు వచ్చాం...' అని వివేకానంద స్వామి చేసిన వ్యాఖ్యలు ఎన్నో ప్రశ్నలకు సమాధానం! హిందూ మతంలో ఇప్పటికీ కుల వ్యవస్థ కొనసాగాల్సిన అవసరాన్ని ఆయన గట్టిగా ప్రశ్నించారు.

'యువత సమగ్ర వికాసమే నా జీవిత లక్ష్యం. నేను రాజకీయ నాయకుడిని కాదు. సామాజిక సంస్కర్తనూ కాదు. కానీ, యువతను పరిపూర్ణ వ్యక్తిత్వంతో తీర్చిదిద్దడం నా బాధ్యతగా స్వీకరించాను. నైతిక ధృతి మనిషిని నడిపిస్తుంది. అది సక్రమంగా ఉంటే అన్నీ సవ్యపథంలోనే సాగుతాయి. ఉత్తమ జీవన విలువలకు, సమున్నత వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడేదిగా విద్యావ్యవస్థ ఉండాలి'- జాతి యువతను స్ఫూర్తిమంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని ఉద్బోధిస్తూ వివేకానంద స్వామి వెలువరించిన ఈ వ్యాఖ్యలు ఈ మట్టిపట్ల ఆయనకున్న ప్రేమాభిమానాలకు దర్పణం పడతాయి. ప్రపంచంలో మరే దేశానికీ లేని బలం యువశక్తి రూపంలో భారత్‌కు అందుబాటులో ఉంది. విజ్ఞానం, నైపుణ్యాలు, సహేతుక దృక్పథం కలిగిన యువతీ యువకులందరూ సామాజిక పునర్నిర్మాణ క్రతువులో చురుగ్గా పాలుపంచుకోవాలి. సార్వత్రిక అక్షరాస్యత, విశ్వమానవ విలువలను ప్రబోధించే నాణ్యమైన విద్య- జాతి పురోభివృద్ధికి పునాదిరాళ్లు. ఈ పునాదులను బలోపేతం చేయడం మనందరి



బాధ్యత. కులమత భేదాలతో సంబంధం లేని విశ్వజనీన మానవీయ విలువలను వివేకానంద స్వామి ఆకాంక్షించారు. మానవాళి పురోగతిలో ఆధ్యాత్మికత ప్రాముఖ్యాన్ని ఆయన బలంగా నొక్కి చెప్పారు. మానవసేవే మాధవ సేవ అని అని అన్నారాయన. పాశ్చాత్య ప్రపంచానికి యోగ, వేదాంతాలను పరిచయం చేయడంతోపాటు- వలస పాలన కాలంలో భారతీయుల్లో దేశభక్తి భావనలను రగిలించిన విశిష్ట లక్షణాల సమాహారమే వివేకానంద స్వామి. సర్వమత సమ్మేళన సభా వేదికమీదనుంచి ఆయన చేసిన ప్రసంగం విశ్వమానవ సౌభ్రాత్రానికి బాటలు పరచింది. ప్రాచ్య, పాశ్చాత్య సంస్కృతుల మధ్య వారధిగా మారిన వివేకానందులు మానవాళి నైతిక వికాసానికి అత్యంత ముఖ్యమైన ఆధ్మాత్మిక పునాదులను ఏర్పరచారు. దేశవ్యాప్తంగా వస్తుగత దృష్టి పెరుగుతోంది. పాశ్చాత్య భావనలు, జీవన విధానాల పట్ల వ్యామోహం విస్తరిస్తోంది. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వం, సంప్రదాయాలను దేశ యువజనులకు తేటపరచాలంటే వివేకానందుల బోధనలను, సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంది. ఆ మహానుభావుడిని స్ఫూర్తిగా స్వీకరించి భారతీయ యువత తమ జీవితాలకు మేలుబాటలు పరచుకోవాలి. వికాసానికి మోకాలడ్డుతూ విచ్ఛిన్న శక్తులు రెచ్చిపోతున్న ప్రస్తుత తరుణంలో వివేకానందుడి సిద్ధాంతాలకు సమకాలీనత మరింత పెరిగింది. అన్ని ధర్మాలనూ సమదృష్టితో చూడటమే భారతీయ ఆధ్యాత్మిక పునాది. ఆ సమున్నతాదర్శాన్ని యువత అందిపుచ్చుకోవాల్సి ఉంది.

కక్ష్యలోకి 'ఇస్రో' ఖ్యాతి

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో భారీ ప్రయోగానికి సిద్ధమైంది. పీఎస్ఎల్‌వీ-40 ద్వారా 31 ఉపగ్రహాలను అంతరిక్షంలో ప్రవేశపెట్టనుంది. 2018లో ఇదే మొదటి ప్రయోగం కావడంతో ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. గత ఏడాది ఫిబ్రవరిలో ఒకే రాకెట్‌తో 104 ఉపగ్రహాలను ఒకేసారి అంతరిక్షంలోకి తరలించిన ఘనత ఇస్రో సొంతం. ఆ ప్రయోగంతో రోదసిరంగంలో అగ్రగాములుగా ఉన్న అమెరికా, రష్యాల సరసన భారత్ చేరింది. 2013లో అమెరికా 29, 2014లో రష్యా 37 ఉపగ్రహాలను ఏకకాలంలో ప్రయోగించాయి. ఆ రికార్డులను భారత్ బద్దలు కొట్టడమే కాకుండా సమీపకాలంలో ఎవరూ అందుకోని రికార్డుకు చేరుకుంది. ఈ దఫా మొత్తం 31 ఉపగ్రహాలు ప్రయోగిస్తుండగా, వాటిలో 28 విదేశాలకు చెందినవి. ప్రధానంగా 'కార్టోశాట్-2' సిరీస్‌లోని కీలకమైన ఉపగ్రహం భారత్‌కు చెందినది. దీనితో పాటు మైక్రో, నానో (ఐఎన్ఎస్)లు మనదేశానివి. ఈ ప్రయోగంలో దేశీయ 100వ ఉపగ్రహం ఉండటం విశేషం.

బహుళ ప్రయోజనాలు

ఆగస్టులో పీఎస్ఎల్‌వీ-39 వైఫల్యాన్ని భారతీయ శాస్త్రవేత్తలు సవాలుగా తీసుకొని తాజా ప్రయోగానికి సిద్ధమయ్యారు. పీఎస్ఎల్‌వీ-39లో ఉష్ణకవచం తెరుచుకోకపోవడం వల్లనే ప్రయోగం విఫలమైనట్లు తెలుస్తోంది. అనంతరం దాదాపు నాలుగు నెలల పాటు ఎలాంటి ప్రయోగం నిర్వహించకుండా ఇస్రో పూర్తిస్థాయి అధ్యయనం నిర్వహించింది. వాస్తవానికి ఒక ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టాలంటే ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. భారత అంతరిక్ష ప్రయోగాలకు పీఎస్ఎల్‌వీ రాకెట్లను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. వీటి వైఫల్యత శాతం చాలా తక్కువగా ఉంటూ మన అంతరిక్ష పరిశోధన కార్యక్రమాలకు ఎంతగానో చేయూతనిస్తున్నాయి. రోదసిరంగంలో ఇస్రో అద్భుతమైన ఫలితాలు సాధిస్తోంది. ఖర్చు తక్కువ, విజయాల శాతం ఎక్కువగా ఉండటంతో పలు ప్రపంచదేశాలు మనదేశం నుంచి ఉపగ్రహాలను పంపించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. అగ్రరాజ్యం అమెరికాకు చెందిన నాసాకు అంతరిక్ష పరిశోధనల్లో విశిష్ట స్థానముంది. అయినప్పటికీ, ఆ దేశానికి చెందిన పలుసంస్థలు ఇస్రో ద్వారా ఉపగ్రహ సేవలు పొందేందుకు ముందుకు వస్తున్నాయి. గత ఏడాది ఒకే ప్రయోగం ద్వారా 104 ఉపగ్రహాలను పంపించగా, అందులో అమెరికాకు చెందినవి 96 ఉండటం భారత రోదసి రంగ విశిష్టతను తెలుపుతోంది. ఇప్పుడు పీఎస్ఎల్‌వీ-40 ద్వారా వివిధ అధ్యయనాలు, సేవలకు సంబంధించిన పలు ఉపగ్రహాలను ప్రయోగించనున్నారు. వాతావరణం, అంతర్జాల సేవలకు మాత్రమే మన దేశ ఉపగ్రహ సేవలు పరిమితం కావడం లేదు. సైనిక నిఘా ఉపగ్రహాలను సైతం అవలీలగా కక్ష్యలోనికి ప్రవేశపెట్టడంలో ఇస్రో ఖ్యాతి సంపాదించింది. తుపాన్లు, భారీ వర్షపాతం తదితర ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే పసిగట్టగల ఉపగ్రహ పరిజ్ఞానంతో తగుచర్యలు చేపట్టి ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించగలిగే సౌలభ్యం ఉపగ్రహాల ద్వారా కలుగుతోంది. ఈ ప్రయోగంలో ప్రధానమైన ఉపగ్రహం 'కార్టోశాట్' రిమోట్ సెన్సింగ్ సేవలు అందించనుంది.

పలు సేవల విస్తరణ

గతంలో ప్రయోగించిన ఈ శ్రేణి ఉపగ్రహాలు ఇప్పటికే గగనతలంలో భారత్‌కు నిఘానేత్రాలుగా తోడ్పడుతున్నాయి. ఇప్పటివరకు 'కార్టోశాట్' సిరీస్‌లో



నేడు వందో ఉపగ్రహ ప్రయోగం

ఆరు ఉపగ్రహాలను ప్రయోగించగా తాజాగా ఏడో ఉపగ్రహాన్ని పంపించనున్నారు. 710 కేజీల బరువు కలిగిన 'కార్టోశాట్'లో అత్యాధునికమైన కెమెరాలను అమర్చారు. అయిదేళ్లు పనిచేసే ఈ ఉపగ్రహంతో మన పొరుగుదేశాలపైనా నిత్యం నిఘావేసి ఉంచే సదుపాయం కలుగుతుంది. ఈ కెమెరాలు భూమిపై ఒక మీటర్ పరిధిని కూడా స్పష్టంగా చిత్రీకరించి త్వరితంగా ఉండే నియంత్రణ కేంద్రాలకు పంపగలవు. ఇప్పటికే అంతరిక్షంలో సేవలందిస్తున్న 'కార్టోశాట్' తరగతికి చెందిన ఉపగ్రహాలు పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులకు సంబంధించి కీలకమైన సమాచారాన్ని అందివ్వడం గమనార్హం. తాజా 'కార్టోశాట్'తో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి కచ్చితత్వంతో కూడిన రేఖాచిత్రాలను తయారుచేసే సౌలభ్యం లభిస్తుంది. మన దేశానికి మూడువైపులా సువిశాలమైన సముద్ర తీరం ఉంది. తీరప్రాంత భూముల సమర్థ వినియోగం, జలాల పంపిణీ, రహదారి నిర్వహణకు సంబంధించి సమగ్రమైన వ్యవస్థపై దృష్టి తదితర అంశాల్లోనూ వీటి సేవలను పొందవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దేశంలో చేపట్టిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి కచ్చితమైన సమాచారం అందుబాటులోకి రానుంది. దీంతో ఈ ప్రాజెక్టుల విషయంలో కీలకమైన నిర్ణయాలు తీసుకోవచ్చు. మనదేశానికి చెందిన మూడు ఉపగ్రహాలు సహా మొత్తం 31 ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ-40 కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది. ఇస్రో వాణిజ్య విభాగం యాంత్రిక్స్ సేవల వైపు మరిన్ని దేశాలు మొగ్గు చూపుతున్నాయి.

కత్తిమీద సాము

సైనిక నిఘా పరంగా 'కార్టోశాట్' సిరీస్‌లో ప్రయోగించిన ఉపగ్రహాలు విలువైన సేవలను అందిస్తున్నాయి. పాకిస్థాన్, చైనాలతో మనకు సుదీర్ఘ సరిహద్దులున్నాయి. పాక్ నుంచి నిరంతరం ఉగ్రవాదులు సరిహద్దు దాటి భారత్‌లోకి ప్రవేశించేందుకు యత్నిస్తుంటారు. సైనిక నిఘా ఉపగ్రహాలతో ఇలాంటి చర్యలను ముందుగానే నిలువరించే సామర్థ్యం మనకు లభిస్తుంది. 'కార్టోశాట్'కు అమర్చిన అత్యాధునిక కెమెరాలు మన సరిహద్దులపై నిరంతరం నిఘా ఉంచడంతో పాటు సునిశిత ప్రాంతాలను క్షుణ్నంగా చిత్రీకరించగలుగుతాయి. అంతరిక్షంలో దీనికి అవసరమైన విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు వీలుగా సౌరఫలకాలను అమర్చారు. రెండు లిథియం- లియాన్ బ్యాటరీలు కూడా ఉన్నాయి. భవిష్యత్తులో ప్రయోగించే పలు ఉపగ్రహాలకు మైక్రో శాటిలైట్ ఒక నమూనాలాంటిది. కేవలం 11 కేజీల బరువుండే నానో ఉపగ్రహం నానో తరగతిలో మూడోది. గత ఏడాది పీఎస్ఎల్‌వీ 37 ద్వారా మొదటి రెండింటిని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఒకే రాకెట్ ద్వారా పలు ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యల్లోకి ప్రవేశపెట్టడం కత్తిమీద సాము అనే చెప్పాలి. వివిధ కక్ష్యల్లోకి వీటిని చేర్చాల్సి ఉంటుంది. పీఎస్ఎల్‌వీ ప్రయోగంలో నాలుగోదశ కీలకమైనది. ఈ దశలో మొదట 'కార్టోశాట్'ను కక్ష్యలోకి ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. అత్యంత క్లిష్టమైన కార్యక్రమాలివి. 'ఇస్రో' నిరంతర పరిశోధనతో బహుళ ఉపగ్రహాలను విజయవంతంగా పూర్తిచేస్తోంది. ఇస్రోకు రానున్న మూడునెలలు అత్యంత కీలకం కానున్నాయి. అది వరసగా ప్రయోగాలను నిర్వహించనుంది. జీఎస్ఎల్వీ ప్రాజెక్టులు ఈ పరంపరలో ఉన్నాయి. వీటి ప్రయోగాలు సంక్లిష్టతతో కూడుకున్నవి. ఈ ప్రయోగం విజయవంతమైతే రోదసిలో 'ఇస్రో' కీర్తిపతాక మరింత ఎత్తున ఎగరడం ఖాయం!


– సుందరీ ఆల్‌ఫ్రెడ్

సహన గుణం

ఆదర్శ మార్గంలో నడిచేవారికి పలు ఆటంకాలు ఎదురవుతుంటాయి. వాటిని దాటి ముందుకు వెళ్లడం సహనశీలతతోనే సాధ్యమవుతుంది. మనిషికి వినమ్రత ఎంత అవసరమో దృఢ సంకల్పమూ అంతే ప్రధానం. సమాజం పట్ల అంతరంగంలో ప్రేమ, కర్తవ్యనిష్ఠ గలవారికి స్వ, పర భేదం ఉండదు. మహావీరుడు అరణ్యంలో తపస్సు చేసేటప్పుడు పలు అవాంతరాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పనిపాటా లేని కొందరు, చుట్టూ మూగి అపహాస్యం చేసినా ఆయన చలించేవాడు కాదు. పెద్దమనుషులు అక్కడికి వెళ్లి 'వాళ్లు అనాగరికులు. మేం ఎంత చెప్పినా వినకుండా మీ తపస్సుకు భంగం కలిగిస్తున్నారు. మీకోసం ప్రశాంతంగా ఉండేచోట భవనం నిర్మించి ఇస్తాం. అక్కడ మీ తపోదీక్షకు ఎటువంటి భంగం వాటిల్లదు' అన్నారు.

అప్పుడు మహావీరుడు 'బిడ్డలు తెలియని స్థితిలో తల్లిదండ్రులకు కొన్ని ఇబ్బందులు కలిగిస్తారు. అంతమాత్రాన వారు కోపగించి సంతానాన్ని దూరం చేసుకోరు. ఎంతో సహనంతో వ్యవహరిస్తారు. అలాగే నా తపస్సుకు తెలిసీ తెలియక భంగం కలిగిస్తున్నవాళ్లూ నాకు ఆత్మీయులే! మీరు కట్టిస్తామంటున్న భవనంలో ఎందరో అభాగ్యులకు ఆశ్రయం కల్పించవచ్చు. అలాంటిది, కేవలం నా సౌకర్యం కోసం మీరు ఇచ్చే భవనంలోనే ఉండాలంటే ఎలా' అంటూ వారి కోరికను నిరాకరిస్తాడు. ఇబ్బందికర పరిస్థితులు కల్పించిన వ్యక్తులు, విషయం తెలిసి పరుగున వెళ్లి, మహావీరుడి పాదాలపై పడి క్షమాపణ కోరారు!

యోగం, తపస్సు కారణంగా ఎవరికైనా కొన్ని సిద్ధులు లభించవచ్చు. అతడిలో సంస్కారం లోపిస్తే, ఆ శక్తులే లోకానికి హాని చేస్తాయి. దీనికి భస్మాసురుడి ఉదంతమే నిదర్శనం. సహనశీలత మూర్తీభవించిన



శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ఎంతో సమర్థులైనప్పటికీ ఎక్కడా ఎవరినీ అనవసరంగా తొందరపడి శిక్షించలేదు.

అంతర్యామి

వేదకాలంలో గురువులు తమ విద్యార్థులకు వారి 'సహనం' పైనే పరీక్ష పెట్టేవారు. సత్యకాముడు అనే గురువు వద్ద ఉపకోసలుడు విద్యాభ్యాసానికి చేరాడు. ఆయన మిగతా శిష్యులందరికీ చదువు చెప్పినా, ఉపకోసలుడి వైపు కన్నెత్తి చూడలేదు. సత్యకాముడి సతీమణి 'అతడు ఏం పాపం చేశాడని అనవసరంగా ఆశ్రమంలోనే ఉంచారు? మిగతా వాళ్లనందర్నీ చదువు పూర్తయిందని చెప్పి ఇళ్లకు పంపించారు. ఉపకోసలుడికి ఏ ఆజ్ఞా ఇవ్వలేదు!' అని భర్తను నిలదీసింది.

గురువు ఎక్కడున్నా, ఆయన యజ్ఞం సాగించే అగ్నులను ఉపకోసలుడే రక్షించాలి. ఆ బాధ్యతను గురువు అతడికే అప్పగించాడు. ఆయన తనను ఆదరించకపోయినా, ఆ శిష్యుడు అగ్ని ఆరకుండా చూసేవాడు. ఫలితంగా, అగ్నిదేవతలు సంతోషించి అతడికి బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించారు. బ్రహ్మజ్ఞానంతో వెలిగిపోతున్న శిష్యుణ్ని చూసి గురువు ఆశ్చర్యపడ్డాడు. 'నీకు బ్రహ్మజ్ఞానం ఎవరు బోధించారు' అని ప్రశ్నించాడు. 'గురుదేవా! నాకు అగ్నిదేవతలు నేర్పారు. గురువుల వద్ద నేర్చుకోవడమే సంప్రదాయం. మీరు చెబితేగాని నా విద్యాభ్యాసం పూర్తయినట్లు కాదు!' అని వినయంతో ప్రార్థించి, ఉపకోసలుడు సఫలుడయ్యాడు. సత్యకాముడు అతడి సహనాన్ని ప్రశంసించి, ఇతర ప్రధాన విద్యల్నీ నేర్పి పంపించాడు. విద్యార్థి దశలో నేర్చుకున్న సహనం, అలా ఎవరికైనా జీవితాంతం ఉపయోగపడుతుంది!

– డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు



శ్రీవారి సన్నిధిలో కుటుంబ సభ్యులతో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

మకర సంక్రాంతి నవ్యకాంతులు నింపాలి

- వెంకయ్యనాయుడు ఆకాంక్ష
- ఉపరాష్ట్రపతి హోదాలో తొలిసారి తిరుమల శ్రీవారి దర్శనం

తిరుమల, న్యూస్‌టుడే: ప్రపంచానికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా భారతదేశం విరాజిల్లుతోందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పారు. రానున్న మకర సంక్రాంతి తెలుగు ప్రజల జీవితాల్లో నూతన కాంతులు నింపాలని ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతి హోదాలో వెంకయ్యనాయుడు తొలిసారి కుటుంబసభ్యులతో కలిసి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ఎదుట విలేకరులతో మాట్లాడారు. ఉపరాష్ట్రపతిగా మరింత పట్టుదలతో కర్తవ్యాన్ని నిర్వహించేందుకు తమ ఇలవేల్పు శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సుల కోసం వచ్చినట్లు వివరించారు. రామరాజ్యంలా దేశం విలసిల్లాలని శ్రీవారిని వేడుకున్నట్లు తెలిపారు. భారతీయ జీవనంలో వారసత్వ సంస్కృతి, జ్ఞానం, యోగా, ఆధ్యాత్మికత ఉన్నాయని, అందుకే ప్రపంచమంతా దేశం వైపు చూస్తోందని చెప్పారు. 'హిందు' ఒక మతం కాదని, జీవన విధానమని చాటాలని రామానుజాచార్యులు, వివేకానందుడు వంటి మహనీయులు బోధించారని ఉదహరించారు. సమాజంలో కుల వివక్ష, అంటరానితనాన్ని రూపుమాపాలన్నారు. ప్రజలందరూ తమ విధులు సక్రమంగా నిర్వర్తిస్తే దేశం ముందుకెళుతుందన్నారు. యాత్రికుల కోసం తితిదే చేస్తున్న ఏర్పాట్లు బాగున్నాయని కితాబిచ్చారు. క్యూలైనులో దర్శనానికి తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ వెంకయ్యనాయుడు తొలుత శ్రీవారి పుష్కరిణికి చేరుకుని పవిత్ర జలాలను ప్రోక్షణం చేసుకున్నారు. అనంతరం శ్రీవరాహస్వామిని దర్శించుకున్నారు. మహద్వారం నుంచి శ్రీవారి ఆలయానికి రావాల్సిందిగా తితిదే ఉన్నతాధికారులు ఆహ్వానించగా.. సున్నితంగా తిరస్కరించారు. వాహనాల్లో వైకుంఠం-1కు చేరుకుని కుటుంబ సమేతంగా క్యూలైనులో ఆలయంలోకి వెళ్లారు. మహద్వారం వద్ద ఇస్తికఫాల్ స్వాగతం అందుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం పండితులు వేదాశీర్వచనం ఇచ్చారు. ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఏడాది పాటు మర్రి చెన్నారెడ్డి శతజయంతి ఉత్సవాలు: మాజీ గవర్నర్ కె.రోశయ్య

హైదరాబాద్, న్యూస్‌టుడే: దివంగత మాజీ ముఖ్యమంత్రి డా.మర్రి చెన్నారెడ్డి శత జయంతి ఉత్సవాలను ఏడాది పాటు ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవాల నిర్వాహణ కమిటీ ఛైర్మన్, మాజీ గవర్నర్ కె.రోశయ్య తెలిపారు. డా.మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ట్రస్ట్ కార్యదర్శి, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డితో కలిసి గురువారం ఆయనిక్కడ మాట్లాడారు. చెన్నారెడ్డి విశిష్ట రాజకీయ లక్షణాలను దేశం గుర్తించి తగు పదవులతో గౌరవించిందన్నారు. శతజయంతి ఉత్సవాలను ఆయన గౌరవానికి తగ్గట్టుగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు అనేక ప్రాంతాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ ఉత్సవాల్లో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ పాల్గొంటారన్నారు. చెన్నారెడ్డి 99వ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 13న ఏర్పాటు చేస్తున్న కార్యక్రమానికి పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రత్యేక అతిథిగా హాజరవుతున్నారన్నారు.

తవ్వుతూనే ఉన్నారు..

- కొనసాగుతున్న ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులు
- ఏడేళ్లలో పూర్తి చేయాలి.. పదేళ్లు దాటింది
- మరో మూడు నాలుగేళ్లకుగానీ పూర్తవడం కష్టం

ఈనాడు - హైదరాబాద్

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి గ్రావిటీ ద్వారా నీటిని మళ్లించి మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు అందించే కీలకమైన శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగ మార్గం పనులు ఒకడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్నట్లుగా తయారయ్యాయి. ఏడేళ్లలో పూర్తవ్వాల్సిన పనులు పదేళ్లు దాటినా కొనసాగుతున్నాయి. సొరంగం తవ్వేందుకు రెండు టన్నెల్ బోరింగ్ యంత్రాలు (టీబీఎంలు) వినియోగిస్తున్నారు. ఇందులో ఒకటి ఐదు నెలల కిందట మూలనపడింది. దీని మరమ్మతు పూర్తవగానే రెండో యంత్రానికి మరమ్మతులు చేయాలని ప్రాజెక్టు వర్గాలు చెబుతున్నాయి. సుమారు 13 కిలోమీటర్ల సొరంగ మార్గం ఇంకా తవ్వాల్సి ఉంది. రెండు యంత్రాలు పని చేస్తే నెలకు అర కిలోమీటరు దూరం పూర్తవుతుంది. కానీ రెండూ పనిచేసే వాతావరణం కనిపించకపోవడంతో పని ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గం పనికి రూ.1,925 కోట్లతో 2005 ఆగస్టులో ఒప్పందం జరిగింది. ప్రధాన సొరంగ మార్గం 43.931 కి.మీ, రెండో సొరంగ మార్గం ఏడు కిలోమీటర్లు తవ్వాలి. ఒప్పందం ప్రకారం 2010 నాటికి పనులు పూర్తవ్వాలి. రెండో సొరంగ మార్గం తవ్వకం నాలుగేళ్ల క్రితమే పూర్తయింది. పెండింగ్‌లో ఉన్నది ప్రధాన సొరంగం పనే. శ్రీశైలం నుంచి నీటిని మళ్లించడం, రెండో సొరంగ మార్గంలోకి వదలడం వరకు 43.93 కి.మీ దూరం సొరంగం మార్గం తవ్వాలి. ఈ పని పూర్తయితే శ్రీశైలం నుంచి గ్రావిటీ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది.

ఆరంభంలోనే జాప్యం

అనుమతులు, టీబీఎంలు రావడంలో జాప్యం తదితర కారణాలతో ఆరంభంలోనే ఆలస్యమైంది. 2009లో కృష్ణా నదికి వచ్చిన భారీ వరదతో యంత్రాలకు నష్టం వాటిల్లింది. మరమ్మతులకు అప్పటి ప్రభుత్వం ప్రత్యేక అడ్వాన్సు కింద రూ.100 కోట్లు ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం వచ్చేనాటికి రూ.1,245.16 కోట్ల ఖర్చుతో 23.078 కి.మీ తవ్వారు. తర్వాత గుత్తేదారు సమస్యను పరిష్కరించి పనులు వేగవంతం చేయడానికి ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజాప్రతినిధులతో మంత్రి హరీశ్‌రావు రెండుసార్లు చర్చించారు. గుత్తేదారు కోరినట్లు పెరిగిన ధరలు చెల్లించడం, అన్ని ప్రాజెక్టులకు అమలు చేసినట్లు జీఓ-146 ప్రకారం అదనంగా చెల్లించడానికి నిర్ణయించారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక కూడా మరో రూ.100 కోట్లు ప్రత్యేక అడ్వాన్సు ఇచ్చింది. ఈ మూడున్నరేళ్లలో మరో 7.413 కి.మీ.దూరం సొరంగం తవ్వారు. ఇంకా 13.09 కి.మీ దూరం పని జరగాలి. 2005లో ఒప్పందం జరగడం, ధరలు పెరగడంతో గత మార్చిలో రూ.3152.72 కోట్లకు సవరించిన పరిపాలనా అనుమతి ప్రభుత్వం ఇచ్చింది. అయితే సెప్టెంబరులో శ్రీశైలం వైపు నుంచి సొరంగం తవ్వే యంత్రం చెడిపోయింది. అమెరికా నుంచి నిపుణులు రావడానికి, బేరింగ్‌లు మార్చే పనికి ఎక్కువ సమయం పట్టింది. సుమారు ఐదు నెలలు పని ఆగిపోయింది. మరమ్మతు ఈ నెలలో పూర్తవుతుందని, ఇది పని చేయించడం మొదలుపెట్టగానే బయటివైపు నుంచి పని చేస్తున్న బోరింగ్ యంత్రానికి మరమ్మతు చేయాల్సి ఉంటుందని నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. బయటి వైపు నుంచి తవ్వకంలో గట్టి రాయి ఉండి జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటే సొరంగం తవ్వకం, లైనింగ్ పనులన్నీ పూర్తి చేసి నీటిని మళ్లించడానికి మూడు, నాలుగేళ్ల పట్టే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం

ఒప్పందం	2005 ఆగస్టులో
పని విలువ	రూ.1,925 కోట్లు
సవరించిన అంచనా	రూ.3152.72 కోట్లు
లక్ష్యం	శ్రీశైలం నుంచి నీటిని మళ్లించి గ్రావిటీ ద్వారా 3 లక్షల ఎకరాలకు సరఫరా చేయడం
ప్రధాన సొరంగమార్గం	43.931 కి.మీ.
ఇప్పటివరకు తవ్వింది	30 కి.మీ.
రెండో సొరంగమార్గం	7 కి.మీ (మొత్తం పూర్తయింది)
ప్రస్తుత పరిస్థితి	ప్రధాన సొరంగమార్గం మరో 13 కి.మీ. తవ్వాలి.

రెండు టీబీఎంలు నిరంతరాయంగా తవ్వితే ఇంకో 26 నెలలు పడుతుంది.



టన్నెల్ బోరింగ్ యంత్రానికి మరమ్మతులు చేస్తున్న నిపుణులు

'కాళేశ్వరం'తో రాష్ట్రం సస్యశ్యామలం

- ప్రపంచంలోనే వేగవంతంగా నిర్మితమవుతున్న ప్రాజెక్టు
- రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి హరీశ్‌రావు

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి: రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని, కోటి ఎకరాలకు సాగు నీటిని అందించాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని భారీనీటి పారుదల, మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, సభాపతి మధుసూదనాచారితో కలిసి ఆయన పర్యటించారు. రేగొండలో ఎస్సారెస్పీ డీబీఎం 38 కాలువ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. స్థానికంగా మార్కెటింగ్ శాఖ గోదాంను ప్రారంభించారు. గణపురంలో రూ. 2 కోట్లతో నిర్మించిన వంతెనను, రూ. 3 కోట్లతో 5 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదామును ప్రారంభించారు. అనంతరం దేవాదుల ప్యాకేజీ పనులను పరిశీలించారు. రేగొండలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. 50 ఏళ్లుగా ఏ ప్రభుత్వం చేయని పనులను తమ సర్కారు చేస్తోందన్నారు. ఇందుకు నిదర్శనం కాళేశ్వరం ప్రాజెక్టు పనులేనన్నారు. ఇటీవల కేంద్ర జల సంఘం ప్రాజెక్టును పర్యటించి ప్రపంచంలోనే అత్యంత వేగవంతంగా సిద్ధమవుతున్న ప్రాజెక్టు ఇదేనని కితాబిచ్చినట్లు పేర్కొన్నారు. 5 నుంచి పదేళ్ల కాలంలో చేయాల్సిన పనిని 20 నెలల్లో చేస్తుండటం గర్వకారణమన్నారు. కాళేశ్వరం ద్వారా రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందన్నారు. 70 ఏళ్లలో గత ప్రభుత్వాలు 4 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాములు నిర్మిస్తే కేవలం ఏడాదిలో రూ. 1030 కోట్లతో తెలంగాణ ప్రభుత్వం 18 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాములు నిర్మించిందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక అసహనంతో కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వరంగల్ జడ్పీఛైర్‌పర్సన్ పద్మ, ఎమ్మెల్సీ బోడకుంట వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు అరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ పసునూరి దయాకర్ తదితరులు పాల్గొన్నారు. గురువారం సాయంత్రం మంత్రి హరీశ్‌రావు, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, స్పీకర్ మధుసూదనాచారి కలిసి ములుగుమండలం బండారుపల్లి గ్రామ శివారులోని దేవాదుల సొరంగం పనులను పరిశీలించారు.



రేగొండలో ఎస్సారెస్పీ కాలువ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, స్పీకర్ మధుసూదనాచారి తదితరులు

రెండో పంటకూ సాగునీరందిస్తాం: ఈటల

దుగ్గొండి, న్యూస్‌టుడే: మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టులను నిర్మించడంతో పాటు ఎస్సారెస్పీ కాలువలను ఆధునికీకరించి వచ్చే సీజన్ నుంచి కచ్చితంగా రెండో పంటకు సాగునీరందిస్తామని రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలంలోని లక్ష్మీపురంలో పల్లెప్రగతి బాట సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం దాకా గోదావరి మీద ప్రాజెక్టులు నిర్మించి అన్ని గ్రామాలకు సాగునీరిచ్చేలా ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. దేవాదుల ఎత్తిపోతల నుంచి జనగామ, చేర్యాల ప్రాంతాలకు వచ్చే ఏడాది వంద శాతం సాగు నీరు అందజేస్తామన్నారు. మన జలాలు మనకేనని ఉద్యమ సమయంలో పాడుకున్న పాటలు నిజం కాబోతున్నాయని ఆయన వివరించారు. అన్ని కులాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించే కార్యక్రమాన్ని త్వరలో చేపట్టబోతున్నామన్నారు.

విద్యుత్‌పై చర్చకు ఆ నలుగురే రావాలి

- కాంగ్రెస్ నేతలు ఉత్తమ్, జానా, షబ్బీర్, జీవన్‌లకు సవాల్
- రేవంత్ లాంటి వారికి అర్హత లేదు
- తెరాస నేతలు బాల్క సుమన్, పల్లా, భానుప్రసాద్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ రంగంపై టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేతలు జానారెడ్డి, ఉపనేత జీవన్‌రెడ్డి, మండలిపక్ష నేత షబ్బీర్‌అలీలే రావాలని తెరాస ఎంపీ బాల్క సుమన్, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌లు సవాల్ చేశారు. రేవంత్ లాంటి వారికి తమస్థాయి లేదని వారితో తాము మాట్లాడబోమని చెప్పారు. గురువారం తెరాస శాసనసభాపక్ష కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. "కాంగ్రెస్ నేతలు ముందుగా మాట్లాడి ఎవరు చర్చకు వస్తారో నిర్ణయించుకోవాలి. వారికి ఐక్యత లేదు. రేవంత్‌రెడ్డి నాటకాలు వేస్తుంటే చూస్తూ ఆనందపడుతున్నారు. ఇప్పుడు కోమటిరెడ్డి తెరమీదకి వచ్చారు" అని బాల్కసుమన్ అన్నారు. విద్యుత్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణకు అన్యాయం జరిగినా పట్టించుకోకుండా అధికారాన్ని అనుభవించిన ఆపార్టీ నేతలు ఇప్పుడు విద్యుత్ రంగం అభివృద్ధిపై విమర్శలు చేస్తున్నారని పల్లా పేర్కొన్నారు. విద్యుత్‌పై కాంగ్రెస్‌వారు తోచింది మాట్లాడుతూ నవ్వుల పాలవుతున్నారని భానుప్రసాద్ ధ్వజమెత్తారు.

అధికార పార్టీ తోక ముడిచింది: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: విద్యుత్తు రంగంలో అక్రమాలపై బహిరంగ చర్చకు సవాల్ విసిరిన అధికార పార్టీ తోక ముడిచిందని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 'అక్రమాలు నిరూపించకపోతే రేవంత్‌రెడ్డి అబిడ్స్ చౌరస్తాలో ముక్కు నేలకు రాయాలి' అని తెరాస ఎంపీ బాల్క సుమన్ చేసిన సవాల్‌ను రేవంత్‌రెడ్డి స్వీకరించిన విషయం తెలిసిందే. శుక్రవారం వస్తామని వేదిక ఎక్కడో చెప్పాలని కోరారు. కాగా రేవంత్‌రెడ్డిపై తమకు విశ్వాసం లేదని టీపీసీసీ అధ్యక్షుడు గానీ, సీఎల్పీ నేతలు గానీ చర్చకు వస్తే బహిరంగ చర్చకు సిద్ధమని గురువారం బాల్క సుమన్, ఆ పార్టీ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు చెప్పడంతో రేవంత్‌రెడ్డి ప్రతిస్పందించారు. అక్రమాలు జరిగినందునే బండారం బయట పడుతుందని అధికార పార్టీ నేతలు వెనక్కి తగ్గారన్నారు. విద్యుత్తు కొనుగోళ్లలో జరిగిన అక్రమాలను శుక్రవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశం పెట్టి ఆధారాలతో సహా బయటపెడ్తామని రేవంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

'విద్యుత్తు'లో అక్రమాలు నిరూపించకుంటే రాజీనామా: కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: గత మూడున్నరేళ్లలో తెలంగాణలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్లు, ఒప్పందాలలో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ శాసనసభాపక్ష ఉపనేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌గానీ జెన్కో సీఎండీ ప్రభాకర్‌రావు గానీ బహిరంగ చర్చకు వస్తే అక్రమాలు నిరూపిస్తానని.. లేకుంటే తక్షణమే శాసన సభాపతికి రాజీనామా సమర్పించి ఇంటికి వెళ్తానన్నారు. గురువారం ఆయన శాసనసభ మీడియాహాలులో విలేకరులతో మాట్లాడుతూ.. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్తు ప్లాంట్లతోపాటు సోలార్ విద్యుత్తు ఒప్పందాల్లోనూ రూ.వేల కోట్లు అక్రమాలు జరిగాయన్నారు. ఒప్పందం చేసుకున్న సోలార్ విద్యుత్తు కంపెనీలు ఇప్పటి వరకు విద్యుత్తు ఉత్పత్తి చేయకున్నా...వాటిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే ఉత్పత్తి మొదలుపెట్టని సోలార్ పవర్ కంపెనీల ఒప్పందాలు రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలవాలని డిమాండ్ చేశారు. సాగుకు నిరంతర విద్యుత్తు ఇస్తున్నామని ప్రచారం చేసుకోవడానికి దేశ వ్యాప్తంగా ప్రకటనలకు రూ.105 కోట్లు ఖర్చు చేశారని వెంకటరెడ్డి విమర్శించారు.

ఓట్ల తొలగింపుపై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ నేతలు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (ఇంఛార్జ్) అనూప్‌సింగ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రులు సబితారెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, ప్రసాద్‌కుమార్ తదితరులు గురువారం సచివాలయంలో ఆయన్ను కలిశారు. అనంతరం సబితారెడ్డి మీడియాతో మాట్లాడుతూ...ఓటరు జాబితా తప్పుల తడకగా ఉందన్నారు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఓట్ల తొలగింపుపై న్యాయ పోరాటం చేస్తామని శశిధర్‌రెడ్డి చెప్పారు. తన కుటుంబ సభ్యుల ఓట్లు కూడా తొలగించారని మాజీ ఎమ్మెల్యే డి.సుధీర్‌రెడ్డి తెలిపారు.

రుణమాఫీ వడ్డీ చెల్లించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

- 17న కలెక్టర్లకు వినతిపత్రాల సమర్పణ
- ఊరూరికీ ఆర్మూర్ తీర్మానం
- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: రుణమాఫీ వడ్డీని ప్రభుత్వమే చెల్లించాలని సర్కారుపై ఒత్తిడి తెస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా త్వరలోనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో శాసనసభాపతిని కలుస్తామని, ఊరూరికీ ఆర్మూర్ తీర్మానాన్ని(డిక్లరేషన్) తీసుకుపోతామని చెప్పారు. టీపీసీసీ కిసాన్‌సెల్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి అధ్యక్షతన గురువారం గాంధీభవన్‌లో జరిగిన సమావేశానికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, చిన్నారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, కిసాన్‌సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ...రుణమాఫీ వడ్డీకి సంబంధించిన సమాచారాన్ని అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వానికి అందచేసినా ఇంత వరకు స్పందించలేదన్నారు. ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లో కలెక్టర్లను కలిసి రైతాంగ సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. సాధ్యమైనంత త్వరలో కిసాన్‌సెల్ మండల కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్మూర్ తీర్మానానికి మంచి స్పందన వస్తోందని, అన్నదాతలను చైతన్యం చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా రైతు సదస్సులు నిర్వహిస్తామని ఉత్తమ్ చెప్పారు. ఈ నెల 13న ఆర్మూర్ తీర్మానంపై పత్రికా సమావేశాలు ఏర్పాటు చేయాలని జిల్లా కిసాన్‌సెల్ కమిటీలను ఆదేశించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రెండోసారి కొనసాగింపు ఉత్తర్వులు అందుకున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని రాష్ట్ర నాయకులు దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.



ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సన్మాన కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు

ఎస్టీల మధ్య వర్గపోరును పరిష్కరించాలి: రవీంద్రనాయక్

మేడారం జాతర వరకు ఎస్టీల మధ్య నెలకొన్న వర్గపోరును పరిష్కరించకపోతే దిల్లీకి వెళ్లి రాష్ట్రపతి, ప్రధానికి ఫిర్యాదుచేస్తామని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ రవీంద్రనాయక్ తెలిపారు. టీపీసీసీ అధికార ప్రతినిధులు చరణ్ కౌశిక్, ఫయీంలతో కలిసి గురువారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడారు. ఎస్టీల మధ్య వర్గపోరును పరిష్కరించమని ఇప్పటికే గవర్నర్, డీజీపీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వివాదానికి కారణమైన ఉట్నూరు ఐటీడీఏ అధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయాలి: ఆర్.కృష్ణయ్య

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: టీఎస్‌ఆర్టీసీలో వేల సంఖ్యలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీచేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండు చేశారు. గురువారం ఆయనిక్కడ టీఎస్‌ఆర్టీసీ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతూ..ఆర్టీసీలో పని చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల సిబ్బందిని వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వేతన స్కేలును అమలు చేయాలన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు ప్రత్యేక రిస్క్ అలవెన్స్ చెల్లించాలని కోరారు. రైల్వే తరహాలో ప్రయాణికుడు టికెట్ తీసుకోకుంటే టీటీ అతనిపైనే జరిమానా వేసే విధానాన్ని ఆర్టీసీలోనూ అమలు చేయాలన్నారు. కండక్టర్లను బలిపశువును చేయొద్దని కోరారు. సంస్థ నష్టాలను ప్రభుత్వమే భరించాలన్నారు. అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుని సంస్థను పరిరక్షించాలని కోరారు. ఆర్టీసీలో విశ్రాంత పద్ధతిలో పని చేస్తున్నవారిని తొలగించాలని, కొత్తవారికి అవకాశాలను కల్పించాలని అన్నారు.

పోలీసు సిబ్బంది పరస్పర బదిలీ

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో పని చేస్తూ తెలంగాణ స్థానికత కలిగిన.. తెలంగాణలో పనిచేస్తూ ఏపీ స్థానికత కలిగిన 168 మంది ఎస్సై, ఏఎస్సై, కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్లు పరస్పర అవగాహన కింద అంతరాష్ట్ర బదిలీ అయ్యారు. ఈ మేరకు తెలంగాణ హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో పని చేస్తూ ఏపీ స్థానికత కలిగిన కొందరు పోలీసులు తెలంగాణ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని ఏపీ పోలీసు శాఖకు తెలియజేశారు. అదే సమయంలో ఏపీలో పనిచేస్తూ తెలంగాణ స్థానికత కలిగిన 90 మంది పోలీసులు పరస్పర అవగాహన కింద బదిలీకి సమ్మతి తెలియజేశారు. నిబంధనలు, అర్హతల ప్రకారం 84 మందికి తెలంగాణ నుంచి ఏపీకి.. మరో 84 మంది ఏపీ నుంచి తెలంగాణకు పరస్పర బదిలీ కింద అర్హులయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వం దళిత వ్యతిరేకిగా వ్యవహరిస్తోంది: సండ్ర వెంకట వీరయ్య

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రభుత్వం పూర్తి దళిత వ్యతిరేకిగా వ్యవహరిస్తోందని తెదేపా శాసనసభ్యుడు సండ్రవెంకట వీరయ్య ఆరోపించారు. చంచల్‌గూడ జైల్లో ఉన్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను గురువారం ములాఖత్‌లో కలిసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం మౌనదీక్ష చేస్తున్న మంద కృష్ణపై పెట్టిన కేసులకు సంబంధించి బెయిల్ ఇవ్వడానికి అనుగుణంగా సెక్షన్లు ఉన్నా అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడం సరికాదన్నారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా కేసీఆర్‌పై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టినా అరెస్టు చేయలేదన్నారు. చట్టం దళితులకు ఒకటి.. సంపన్నులకు మరొకటి ఉంటుందా అనే విషయంపై డీజీపీ సమాధానం చెప్పాలన్నారు. ఓయూలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సందర్భంగా పరామర్శకు వెళ్లిన తెలుగుదేశం రాష్ట్ర నాయకుడు ఒంటేరు ప్రతాపరెడ్డిపై 5 నాన్‌బెయిలబుల్ కేసులను పెట్టి అరెస్టు చేయడం కక్ష సాధింపు చర్య అన్నారు. మందకృష్ణ మాదిగ, ఒంటేరు ప్రతాపరెడ్డిపై పెట్టిన కేసులను ఎత్తివేసి బేషరతుగా విడుదల చేయాలన్నారు.

పల్లె పరిశుభ్రంగా..

- రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా
- పంచాయతీ పాలకవర్గానికి అధికారం
- కొత్త పంచాయతీరాజ్ చట్టంలో మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదనలు
- నాలుగో రోజు మంత్రివర్గ ఉపసంఘం సమావేశం

ఈనాడు - హైదరాబాద్

ఇంట్లోని నీటిని వీధుల్లోకి వదిలినా, రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు జరిపినా వడ్డింపు.. రోడ్లపై చెత్త వేస్తే జరిమానా తప్పదు. ఈ అధికారం సర్పంచుల నేతృత్వంలోని పాలకవర్గానికి ఉంటుంది. కొత్త పంచాయతీరాజ్ చట్టానికి ప్రతిపాదనలివి.. అవినీతి, నిబంధనల ఉల్లంఘన, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపే సర్పంచులపై కలెక్టర్లు తీసుకునే క్రమశిక్షణ చర్యలపై అప్పిలేట్ అథారిటీగా ట్రైబ్యునల్ ఏర్పాటుకు కూడా ప్రతిపాదించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన నాలుగోరోజు మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. ఇందులో జూపల్లితో పాటు మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, సీఎం కార్యాలయ ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, అదనపు కార్యదర్శి స్మితాసబర్వాల్, అదనపు అడ్వకేట్ జనరల్ రామచందర్‌రావు, పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు వికాస్‌రాజ్, నీతూ ప్రసాద్, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త చట్టంలో పొందుపరచాల్సిన అంశాలపై చర్చించారు.

- ప్రస్తుతం సర్పంచులపై కలెక్టర్లు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటే దానిపై అప్పీలు అథారిటీగా ప్రభుత్వం తరఫున పంచాయతీరాజ్ శాఖ మంత్రి వ్యవహరిస్తున్నారు. దీనివల్ల అప్పీళ్ల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక ట్రైబ్యునల్ అవసరమని ఉపసంఘం అభిప్రాయపడింది.
- గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం కోసం.. ప్రజలకు సైతం జవాబుదారితనాన్ని కల్పించడంతో పాటు నిబంధనలు అతిక్రమించడం, స్థలాలను ఆక్రమించడం వంటి చర్యలకు అడ్డుకట్ట వేయడానికి వీలుగా జరిమానా విధానాన్ని తేవాలని ఉపసంఘం భావించింది. జరిమానా పరిధిలో 22 అంశాలను చేర్చారు. అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు అయ్యే ఖర్చును కారకుల నుంచే వసూలు చేయాలి.
- పంచాయతీల్లో ఆడిటింగు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 9 నెలల వరకు సమయం తీసుకుంటున్నారు. ఇకపై కాలపరిమితిని తగ్గించాలని ఉపసంఘం నిర్ణయించింది.

ఉపసంఘానికి వినతులు

- ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలుంటే పంచాయతీ ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటిస్తూ 1995లో ప్రవేశపెట్టిన నిబంధనను ఎత్తివేయాలని గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ గాంధీనాయక్ ఉపసంఘం ఛైర్మన్ జూపల్లికి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలకు లేని నిబంధన స్థానిక సంస్థల్లోని వారికి వర్తింపజేయడం సరికాదని పేర్కొన్నారు.
- జిల్లా పరిషత్, మండల పరిషత్ ఛైర్మన్లు, సభ్యులు, సర్పంచులు, వార్డు సభ్యులు, కోఆప్టెడ్ సభ్యుల పదవుల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తెలంగాణ దివ్యాంగుల ఐకాస నేతలు ఎం.శ్రీనివాసులు తదితరులు వినతిపత్రం అందజేశారు.

భాజపాను వీడనున్న నాగం!

వచ్చే ఎన్నికలే చివరివని వెల్లడి

నాగర్‌కర్నూలు, న్యూస్‌టుడే - ఈనాడు, హైదరాబాద్: పార్టీ మారుతున్నట్లు తనపై వస్తున్న ఊహాగానాలకు భాజపా నేత నాగం జనార్దన్‌రెడ్డి స్పందించారు. ప్రస్తుతానికి భాజపాలోనే కొనసాగుతున్నా..ఉగాది తర్వాత ఓ నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. గురువారం ఆయన నాగర్‌కర్నూల్‌లో విలేకర్లతో మాట్లాడుతూ..తెలంగాణలో భాజపాకు ఎదుగుదల లేదనే అభిప్రాయంతో కార్యకర్తలు నిరుత్సాహంగా ఉన్నారన్నారు. కొందరు కార్యకర్తలు, నాయకులు తన దగ్గర ఇదే అభిప్రాయం వ్యక్తంచేశారని, ఉగాది తర్వాత నిర్ణయం తీసుకుందామని, అంతవరకు ఆగాలని చెప్పానన్నారు. వచ్చే ఎన్నికలే తనకు చివరి ఎన్నికలని, తర్వాత పోటీ చేయబోనని స్పష్టంచేశారు. మరోవైపు తెలంగాణ రాజకీయ ఐకాస కొంతకాలం క్రితం నాగంను సంప్రదించినట్లు చర్చ జరుగుతోంది. ఐకాస రాజకీయ పార్టీగా మారే విషయంలో స్పష్టత రాకపోవడంతో ఆయన ఇతర పార్టీలవైపు చూస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్, తెరాసల్లో ఏపార్టీలోకి వెళతారన్నది ఆసక్తికరంగా మారింది. నాగం కొంతకాలంగా ప్రాజెక్టుల్లో అవినీతి జరుగుతుందంటూ, అధికారపార్టీకి వ్యతిరేకంగా ఆరోపణలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్‌లోకి వెళ్లే అవకాశాలున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయంపై నాగంతో 'ఈనాడు' మాట్లాడగా..నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలతో మాట్లాడి నిర్ణయం వెల్లడిస్తానని చెప్పారు. ఏ పార్టీతోనూ సంప్రదింపులు జరపలేదన్నారు.

ఆధార్‌ను ఎక్కడెక్కడ ఉపయోగించామో ఇలా తెలుసుకోవచ్చు...

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలన్నా, బ్యాంకు రుణాలు తీసుకోవాలన్నా ఆధార్ నంబరు తప్పనిసరైంది. ఫోన్ నంబరు మొదలు పాన్, బ్యాంకు ఖాతా వరకు... అన్నింటికీ ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని కేంద్రం సూచించింది. ఆయా పనుల నిమిత్తం ఇప్పటివరకు మనం ఎక్కడెక్కడ ఆధార్ కార్డును ఇచ్చామో తెలియదు. వేటికి అనుసంధానం చేశామో గుర్తుండకపోవచ్చు. అయితే, వాటి వివరాలను ఆన్‌లైన్‌లో తెలుసుకునే సదుపాయం కల్పించింది... యునీక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఉడాయ్)! అంతర్జాలంలో ఉడాయ్ వెబ్‌సైట్‌ను తెరిచి, ఆధార్ సర్వీసెస్ విభాగంలో 'ఆధార్ అథంటికేషన్ హిస్టరీ' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. దీంతో మరోపేజీ తెరుచుకుంటుంది. అందులో 12 అంకెల ఆధార్ సంఖ్యను నమోదుచేస్తే, రిజిస్టర్ మొబైల్ ఫోన్ నంబరుకు వన్‌టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దానిని నమోదుచేస్తే... ఇప్పటివరకు ఎక్కడెక్కడ ఆధార్ సంఖ్యను ఉపయోగించామో తెలుసుకోవచ్చు.


అజారుద్దీన్‌కు హెచ్‌సీఏ సభ్యత్వం లేదు

ఆ సంఘం అధ్యక్షుడు జి.వివేకానంద

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ బాధ్యులపై ఆరోపణలు చేస్తున్న మాజీ క్రికెటర్ అజారుద్దీన్ హెచ్‌సీఏ సభ్యుడే కాదని ఆ సంఘం అధ్యక్షుడు జి.వివేకానంద పేర్కొన్నారు. గురువారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. హెచ్‌సీఏ నూతన కమిటీ నియామకమైనప్పటి నుంచి అజారుద్దీన్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ఆయన మీద ఉన్న అవినీతి ఆరోపణలపై క్లీన్ చిట్ ఇచ్చినట్లు బీసీసీఐ నుంచి తమకు ఎలాంటి నివేదికా అందలేదన్నారు. వారికి ఏదైనా సమస్య ఉంటే కోర్టుకు వెళ్లవచ్చని సూచించారు. అజారుద్దీన్ పాత గుర్తింపు కార్డుతో సమావేశాల్లోకి వస్తున్నారని తెలిపారు. ఆయన తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువ క్రికెటర్లను ఏ మేర ప్రోత్సహించాడో ప్రజలకు వివరించాలన్నారు. వి.హన్మంతరావు, అజారుద్దీన్ రాజకీయ కుట్రతో సమావేశాలకు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఘన చరిత్ర ఉన్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌ను భ్రష్టు పట్టించారని, పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. రాజకీయంగా కాకుండా వ్యక్తిగతంగా క్రికెట్ అభివృద్ధికి ముందుకొస్తే కలిసికట్టుగా పనిచేద్దామని సూచించారు.

ప్రధానితో నేడు చంద్రబాబు భేటీ

- పోలవరం, రాజధాని సహా కీలక అంశాలపై చర్చ
- నియోజకవర్గాలను పెంచాలని గట్టిగా కోరనున్న ఏపీ ముఖ్యమంత్రి



ఈనాడు అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు రూ.58వేల కోట్లతో సమర్పించిన పూర్తి స్థాయి అంచనాల్ని ఆమోదించడం, రాజధాని అమరావతి నిర్మాణం కోసం వచ్చే కేంద్ర బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించడం, రాష్ట్రంలో శాసనసభ నియోజకవర్గాల సంఖ్యను 175 నుంచి 225కి పెంచడంతోపాటు రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన అన్ని హామీలను వెంటనే నెరవేర్చాల్సిందిగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరనున్నారు. ప్రధానితో ఆయన శుక్రవారం ఉదయం 10.40కు దిల్లీలో సమావేశమవుతున్నారు. దాదాపు ఏడాది తర్వాత వీరిద్దరి మధ్య ముఖాముఖి సమావేశం జరుగుతోంది. చంద్రబాబు గురువారం రాత్రి 9.20కు విజయవాడ నుంచి బయల్దేరి దిల్లీ వెళ్లారు. రాష్ట్ర విభజన వల్ల ఆంధ్రప్రదేశ్ చాలా నష్టపోయిందని, రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, విభజన చట్టంలో ఇచ్చిన హామీల్లో జాప్యం జరగడం వల్ల రాష్ట్రం మరింత సమస్యల వలయంలో చిక్కుకుంటోందని ఇటీవల తెదేపా ఎంపీలు ప్రధాని దృష్టికి తెచ్చారు. వెంటనే నెరవేర్చాల్సిన హామీలతో ప్రధానికి ఒక వినతి పత్రం సమర్పించారు. వాటిపై సానుకూలంగా స్పందించిన ప్రధాని తాను త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమవుతానని ఎంపీలకు తెలిపారు. రాష్ట్రానికి ఈఏపీ ప్రాజెక్టులు, రెవెన్యూ లోటు భర్తీ వంటి అంశాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి ఇటీవలే కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి ఒక లేఖ రాశారు. ఆ నేపథ్యంలో శుక్రవారం జరుగుతున్న సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధానికి ఎంపీలు ఇచ్చిన విజ్ఞాపనపత్రంలో పేర్కొన్న అంశాలు, జైట్లీకి రాసిన లేఖలోని అంశాలను ముఖ్యమంత్రి ప్రధాని దృష్టికి తీసుకెళ్లనున్నారు. రాష్ట్రంలో శాసనసభ నియోజకవర్గాల పెంపునకు అవసరమైన ప్రక్రియను ప్రారంభించి, వెంటనే పూర్తయ్యేలా చూడాలని ప్రధానిని సీఎం గట్టిగా కోరనున్నట్లు సమాచారం. పోలవరం, రాజధాని నిర్మాణాలకు కేంద్ర సహకారంపైనా ప్రస్తావించనున్నారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పరిధి, విధి విధానాలు ఖరారు చేసి, నోటిఫికేషన్ జారీ చేసే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ప్రధానికి ఆయన విన్నవించనున్నారు. విశాఖలో రైల్వే జోను తదితర అంశాలు ప్రస్తావనకు రానున్నాయి.

దిల్లీ నుంచి పుణెకు... ప్రధానితో సమావేశం ముగిశాక ముఖ్యమంత్రి దిల్లీ నుంచి పుణె వెళతారు. కేంద్ర విద్యుత్, జల పరిశోధన కేంద్రం రూపొందించిన పోలవరం ప్రాజెక్టు త్రీడీ నమూనాను పరిశీలిస్తారు. అక్కడ స్పిల్‌వే గుండా నీటిని ప్రవహింపజేసి ఆ ప్రభావం ఎలా ఉంటుందో ముఖ్యమంత్రికి చూపించనున్నారు.



ప్రమాదంలో కాలిపోతున్న వాహనం. అంతరచిత్రంలో కంటెయినర్‌లోని కారు

కార్ల కంటెయినర్ కాలిపోయింది

అద్దంకి, న్యూస్‌టుడే: చెన్నై నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌కు హుందాయ్ కార్లతో వెళుతున్న కంటెయినర్ ప్రకాశం జిల్లా అద్దంకి-శింగరకొండ రహదారిలో గురువారం కాలిపోయింది. కంటెయినర్ డ్రైవర్ సమీర్ వాహనాన్ని స్థానికంగా ఉన్న ఓ దాబా వద్ద నిలిపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న 11కేవీ విద్యుత్తు తీగలను ఆయన గమనించకపోవడంతో అవి లారీని తాకాయి. అనంతరం మంటలు చెలరేగి కంటెయినర్ క్యాబిన్ పూర్తిగా కాలిపోయింది. వాహనం నుంచి దూకి సమీర్ ప్రాణాలు కాపాడుకున్నారు. పోలీసులు విద్యుత్తు సరఫరాను నిలిపివేయించి మంటలను అదుపు చేశారు. సకాలంలో స్పందించడంతో కంటెయినర్‌లోని ఆరు కార్లకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

ఉగ్రవాదం నిరోధంపై పాక్‌తో కొనసాగనున్న చర్చలు

విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వెల్లడి

దిల్లీ: ఉగ్రవాదం సమస్యపై పాకిస్థాన్‌తో చర్చలు కొనసాగుతాయని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ అంశంపై భారత్ జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్, పాక్ జాతీయ భద్రత సలహాదారు రిటైర్డు లెఫ్టినెంట్ జనరల్ నసీర్ ఖాన్ జన్‌జువాలు గత నెలలో వియత్నాంలో సమావేశమయ్యారని చెప్పారు. సీమాంతర ఉగ్రవాదం నిరోధంపై కార్యనిర్వహణ స్థాయి చర్చలు జరిగినట్టు తెలిపారు. దీనిపై డీజీఎంఓ, బీఎస్ఎఫ్-పాక్ రేంజర్ల స్థాయిలో చర్చలు కొనసాగుతాయని చెప్పారు. మిగిలిన అంశాలపై చర్చలు జరిగే అవకాశాలు లేవని అన్నారు. ఉగ్రవాదం, చర్చలు పక్కపక్కనే కొనసాగబోవని తెలిపారు. కుల్‌భూషణ్ జాదవ్ వ్యవహారం ప్రస్తావనకు వచ్చిందా అని ప్రశ్నించగా, ఇలాంటి సమావేశాలు చాలా ముందుగా నిర్ణయమవుతాయని, తక్షణ సమస్యలపై చర్చలకు అవకాశం ఉండదని చెప్పారు.

28 నుంచి పల్స్‌పోలియో

- రాష్ట్ర వ్యాప్తంగా 41.57 లక్షల మంది చిన్నారులే లక్ష్యం
- వైద్యారోగ్యశాఖ సన్నాహాలు

ఈనాడు- హైదరాబాద్: గత కొన్నేళ్లుగా దేశంలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాకపోయినా.. పొరుగునున్న పాకిస్థాన్ వంటి దేశాల్లో కేసులు నమోదవుతుండడంతో ఈ ఏడు కూడా ఈ నెల 28 నుంచి 31 వరకు, మార్చి 11 నుంచి 14 వరకూ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. తెలంగాణలోనూ ఇవే తేదీల్లో పోలియో పోరుబాట కొనసాగించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సన్నాహాలు చేస్తోంది. గురువారం ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ వాకాటి కరుణ అన్ని జిల్లాల వైద్యారోగ్య అధికారులతో వాక్‌దృశ్య సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.

రాష్ట్రంలో కార్యాచరణ ఇలా..

- రాష్ట్రంలోని 41,57,210 మంది..0-5 ఏళ్ల పిల్లలందరికీ 27,270 కేంద్రాల ద్వారా చుక్కల మందువేస్తారు.
- వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు సహా 1,09,080 మంది సేవలు వినియోగించుకుంటారు.
- నిర్దేశించిన తేదీలలో వేసుకోని వారిని గుర్తించి 29, 30, 31 తేదీల్లో ఇంటింటికీ తిరిగి చుక్కలు ఇస్తారు.
- టీకాపై అపోహతో నిరాకరించే వారికి అవగాహన కల్పించడానికి ప్రత్యేక చర్యలు చేపడతారు.
- మహిళా శిశు సంక్షేమం, పంచాయతీ, విద్య, ఎస్సీ ఎస్టీ, మైనారిటీ సంక్షేమం, పురపాలక, జీహెచ్ఎంసీ తదితర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సహకారాన్నీ తీసుకుంటారు.
- స్థానిక ప్రజాప్రతినిధులనూ భాగస్వాములను చేస్తారు.

దావోస్ సదస్సుకు లోకేష్

ఈనాడు-అమరావతి: దావోస్‌లో జరిగే ప్రపంచఆర్థిక సదస్సుకు ఏపీ మంత్రి నారా లోకేష్ హాజరవుతున్నారు. ఏపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే 'టెక్నాలజీస్ ఫర్ టుమారో' సదస్సులో పాల్గొంటారు. అనంతరం ఫిన్‌టెక్ సంస్థలతో జూరిచ్‌లో సమావేశం అవుతారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నగరానికి 'పచ్చని' నగ!

- రూ.260 కోట్లతో పట్టణ అటవీ ఉద్యానవనాల అభివృద్ధి
- 64 ప్రాంతాల్లో మొక్కల పెంపకమే లక్ష్యం
- ప్రతిపాదనలకు కమిటీ ఆమోదం

ఈనాడు-హైదరాబాద్: పెరుగుతున్న కాలుష్య ఉద్గారాల ప్రభావాన్ని తగ్గించేందుకు హైదరాబాద్‌లో అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) వరకు పచ్చదనాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం అవుతోంది. ఇందులో భాగంగా దాదాపు 45 వేల ఎకరాల్లో విస్తరించిన 64 అటవీ ప్రాంతాలను పట్టణ పార్కులుగా అభివృద్ధి చేయనున్నారు. దీనికోసం దాదాపు రూ.260 కోట్లతో ప్రతిపాదనలు రూపొందగా.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ గురువారం సమావేశమై దీనికి ఆమోదం తెలిపింది. పెద్దఎత్తున మొక్కలు పెంచడం ద్వారా హైదరాబాద్ నగర వాతావరణంలో సానుకూల మార్పులు తీసుకురావాలన్నది ప్రాజెక్టు లక్ష్యం. దీనికి ఔటర్ రింగురోడ్డు అవతల 10 కి.మీ వరకు పరిధిని నిర్ణయించారు. గ్రీన్ క్లైమాట్ ఫండ్ (జీసీఎఫ్) నుంచి గ్రాంటు రూపంలో ఈ నిధులను పొందేందుకుగానూ కేంద్ర ప్రభుతానికి ప్రతిపాదనలు పంపనున్నారు. ఒకవేళ అక్కణ్నుంచి నిధులు రానిపక్షంలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, అటవీశాఖల ద్వారా నిధులు సమకూర్చుకోవాలని నిర్ణయించారు. 'ఇప్పటికే 21 అటవీ ఉద్యానవనాలను హైదరాబాద్ చుట్టుపక్కల అభివృద్ధి చేస్తున్నామని, కొత్తవి వీటికి అదనమని' సీఎస్ ఎస్పీసింగ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణలో వాతావరణ మార్పులపై ఈపీటీఆర్ఐ రూపొందించిన వెబ్‌సైట్‌నూ సమావేశానంతరం ఆయన ప్రారంభించారు. సమావేశంలో అటవీశాఖ ముఖ్యకార్యదర్శి రజత్ కుమార్, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ కళ్యాణ్ చక్రవర్తి, అటవీశాఖ ప్రధాన సంరక్షణ అధికారి ప్రశాంత్‌కుమార్‌ఝా పాల్గొన్నారు.

30 నుంచి టీసీసీ పరీక్షలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: టెక్నికల్ సర్టిఫికెట్(టీసీసీ) పరీక్షలు ఈనెల 30 నుంచి ఫిబ్రవరి2వరకు నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ పరీక్షల విభాగం తెలిపింది. హైయర్‌గ్రేడ్, లోయర్‌గ్రేడ్ డ్రాయింగ్ పరీక్షలు ఇదే సమయంలో జరగనున్నాయి. టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలు ఈనెల 30 నుంచి 3 రోజులపాటు జరగనున్నాయి.

డీఎడ్ పరీక్షలు: ఫిబ్రవరి 16 నుంచి 22 వరకూ డీఎడ్ పరీక్షలను నిర్వహిస్తామని వెల్లడించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష జరగనుంది. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను www.bse.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పోలీసుల అదుపులో 'కమలామిల్' అగ్నిప్రమాద కేసు నిందితులు

ముంబయి, న్యూస్‌టుడే: ముంబయిలోని లోయర్ పరేల్‌లో కమలామిల్ కాంపౌండ్‌లో జరిగిన అగ్నిప్రమాదం కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టుచేశారు. వన్-అభవ్ పబ్ యజమాని క్రిపేష్, ఆయన సోదరుడు జగర్ సంఘవీనితో పాటు అభిజిత్ మన్కర్‌లను బుధవారం రాత్రి అరెస్టు చేసినట్లు అదనపు కమిషనర్ ఎస్ జయకుమార్ పాఠక్ తెలిపారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న అందెశ్రీ, చెరుకు సుధాకర్, జయధీర్ తిరుమల్‌రావు తదితరులు

తెలంగాణలో పోరాడే స్వభావం చెక్కుచెదరలేదు: అందెశ్రీ

సోమాజిగూడ, న్యూస్‌టుడే: తెలంగాణ బిడ్డల్లో కలబడే, నిలబడే రక్తం చెక్కు చెదరలేదని, నైజాంనే ఎదిరించారని..ప్రభుత్వం కూడా అప్రమత్తంగా ఉండాలని కవి, సినీ గేయ రచయిత అందెశ్రీ పేర్కొన్నారు. తెలంగాణ ఇంటి పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఏర్పాటు చేస్తున్న 'తెలంగాణ సాంస్కృతిక సైన్యం' విభాగ గోడపత్రికను గురువారం హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అందెశ్రీ మాట్లాడుతూ..ఇప్పుడు కేసీఆర్ తెలుగువారంతా ఒకటే అంటున్నారు.. మరి రెండు రాష్ట్రాలు ఎందుకు.. కలిపేద్దామన్నారు. ప్రొ.జయధీర్ తిరుమల్‌రావు మాట్లాడుతూ సాంస్కృతిక సైన్యం అశేష ప్రజల్ని ఆకట్టుకుని చైతన్యం తీసుకురాగలదన్నారు. తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షులు డా.చెరుకు సుధాకర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీలను గద్దెనెక్కించేందుకే ఇంటి పార్టీ సిద్ధపడిందని, అందులో భాగంగానే ఈ నెల 21న తెలంగాణ సాంస్కృతిక సైన్యం ఆవిర్భావం కానుందని తెలిపారు. సమావేశంలో సాంస్కృతిక సైన్యం ప్రతినిధి గుండమల్ల శ్రీనివాస్, ఆ పార్టీ ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దమ్మాడ వెంకటేష్, కవి, రచయిత విష్ణు పాల్గొన్నారు.

సీజీజీ సేవలపై 'మండలి' విముఖత

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ఆన్‌లైన్‌లో సీట్ల భర్తీని చేపట్టే ప్రక్రియలో సాంకేతిక సహకారాన్ని అందిస్తున్న సుపరిపాలన కేంద్రానికి (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌కు) ఈ సారి బాధ్యలను అప్పగించే విషయమై రాష్ట్ర ఉన్నత విద్యామండలి విముఖత వ్యక్తం చేస్తోంది. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ - తెలంగాణ (దోస్త్) పేరిట డిగ్రీ ప్రవేశాలను గత రెండేళ్లుగా ఆన్‌లైన్ విధానంలో చేస్తున్నారు. అందుకు ఐటీ శాఖ పరిధిలోని సీజీజీ నుంచి సాంకేతిక సహకారం తీసుకుంటున్నారు. గత ఏడాది విద్యార్థులకు సీట్లు కేటాయించిన తర్వాత.. పొరపాటు జరిగిందని సీజీజీ మరో జాబితా విడుదల చేసింది. అది వేలాది విద్యార్థులను గందరగోళంలో పడేసింది. టీఎస్‌పీఎస్‌సీ నిర్వహించిన గ్రూప్-1 ఉద్యోగ ఫలితాల్లోనూ ర్యాంకులు తారుమారై అభ్యర్థులు గగ్గోలు పెట్టారు. సీజీజీలో తగినంత మానవ వనరులు లేకపోవడం.. నిపుణులైన సీనియర్ల కొరత తదితర సమస్యలు ఎన్నో ఉన్నాయని ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ఇప్పటికే 'మండలి' ప్రతినిధులు ఈ అంశాన్ని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య దృష్టికి కూడా తీసుకెళ్లారు. త్వరలో ఐటీ శాఖతో సమావేశం ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకుందామని ఆమె చెప్పినట్లు తెలిసింది.

రెండేళ్లు కాదు.. ఆరునెలల్లోనే పూర్తిచేయాలి

- ఎత్తిపోతల నిర్మాణ సమయం కుదించిన ఐడీసీ
- రూ.120 కోట్లతో 33 కొత్త పథకాలు

ఈనాడు, హైదరాబాద్: చిన్నతరహా ఎత్తిపోతల నిర్మాణాలకు ఏళ్ల తరబడి అనుమతులు కొనసాగించే నిర్ణయాలకు నీటిపారుదల అభివృద్ధి సంస్థ(ఐడీసీ) ముగింపు పలికింది. ఇప్పటి వరకు సంస్థ పరిధిలో నిర్మాణాలకు కనీస గడువు రెండేళ్లుగా ఉంది. పైగా దీనిని అవసరాన్ని బట్టి పొడిగిస్తూ వస్తున్నారు. ఇప్పుడు నిర్మాణంలో ఉన్న పథకాలన్నీ ఇలా గడువు పొడిగించినవే. ఈ నేపథ్యంలో ఇకపై చేపట్టబోయే పథకాలను ఆరు నెలల కాలంలో పూర్తిచేసేలా టెండర్‌లో నిబంధనలను సవరించనున్నారు. ఈ మేరకు ఐడీసీ నిర్ణయం తీసుకుంది. భారీ ఎత్తిపోతలైన భక్తరామదాసు, తుమ్మిళ్ల పథకాలను అనతికాలంలోనే పూర్తిచేస్తుండటాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. మరోవైపు రూ.120 కోట్లతో 33 ఎత్తిపోతల పథకాలను నిర్మించేందుకు నిర్ణయించారు. ఎస్సారెస్పీ ముంపులో నష్టపోయిన రైతుల భూములకు సాగునీటిని అందించేందుకు ప్రణాళిక రచించారు. దీనిలో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గంలో పత్తేపూర్, కమతం, చిక్లి, మచ్చర్ల, సుబ్రియార్, మిర్దాపల్లి ఎత్తిపోతలను నిర్మించనున్నారు. వీటితో పాటు కరీంనగర్ జిల్లా ధర్మపురి మండలంలో స్తంభంపల్లి, వెల్గటూరు, దమ్మన్నపేట, ఆంథోల్ నియోజకవర్గంలో తాలేలమ్మ, కమలాపూర్ మండలం మరిపెల్లిగూడెం, నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలో కొడిచర్ల ఎత్తిపోతలను నిర్మించేందుకు నిర్ణయించారు.

వానాకాలం నాటికి రెండు లక్షల ఎకరాలకు నీళ్లు: ఈ ఏడాది వానాకాలం సీజన్ నాటికి చిన్నతరహా ఎత్తిపోతల పథకాల కింద రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వనున్నట్లు ఐడీసీ ఛైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం నిర్వహించిన బోర్డు సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత యాసంగి కాలానికి 38 వేల ఎకరాలకు నీళ్లు ఇస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న పథకాలన్నింటినీ దారికి తెచ్చామన్నారు. లీకేజీల నివారణకు పథకాలన్నింటిలోనూ ఎంఎస్ పైపులు వాడుతున్నామని, కొత్తపథకాల్లోనూ వాటినే వినియోగించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్, ఐడీసీ ఎండీ సురేష్‌కుమార్, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

నీటి విమానాలపై మూడు నెలల్లోగా విధివిధానాలు వెలువరిస్తామని కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. రానున్న రెండేళ్లలో పదివేల నీటి విమానాలు నడపాలని ప్రతిపాదించినట్టు తెలిపారు.

సంఘ్ పరివార్ శక్తుల విద్వేష రాజకీయాలపైనే చర్చ

- విప్లవ రచయితల సంఘం ప్రకటన
- 13, 14 తేదీల్లో పాలమూరులో మహాసభలు

మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయ పాలనా సిద్ధాంతాలను బలవంతంగా ప్రజలపై రుద్దుతున్నాయని విప్లవ రచయితల సంఘం(విరసం) రాష్ట్ర కార్యదర్శి వరలక్ష్మి విమర్శించారు. గురువారం మహబూబ్‌నగర్ టీఎన్జీవో భవనంలో వరలక్ష్మి మాట్లాడుతూ..ప్రజల పక్షాన మాట్లాడుతున్న రచయితలు, మేధావులపై దాడులకు దిగుతున్నారని వాపోయారు. సంఘ్ పరివార్ శక్తుల దాడులను ఆపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా రాజకీయాలు కొనసాగుతున్నాయని ప్రభుత్వాల తీరును దుయ్యబట్టారు. 13, 14 తేదీల్లో పాలమూరులో నిర్వహించే విరసం మహాసభల్లో సంఘ్ పరివార్ శక్తుల విద్వేష రాజకీయాలపై, బ్రాహ్మణీయ హిందూ ఫాసిజంపై చర్చించనున్నట్లు తెలిపారు. 33 ఏళ్ల తర్వాత పాలమూరులో విరసం మహాసభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో ప్రజా సంఘాలు, మేధావులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అట్టడుగు వర్గాల కోసం విరసం ప్రజాగొంతుకై నిలుస్తుందన్నారు. ప్రొ.కాశీం మాట్లాడుతూ..రాష్ట్రప్రభుత్వం తెలుగు మహాసభల్లో బ్రాహ్మణీయ సాహిత్యాన్ని ప్రచారం చేసిందని విమర్శించారు. మహాసభల ఆహ్వాన కమిటీ ఉపాధ్యక్షుడు రాజేంద్రబాబు మాట్లాడుతూ..విరసం సభలు హిందూవులకు, బ్రాహ్మణులకు వ్యతిరేకం కాదని, బ్రాహ్మణీయ భావజాలానికి మాత్రమే వ్యతిరేకమన్నారు.



పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు సమీపంలో చుట్టూ తెరలు కట్టి కోళ్ల పెంపకం. అంతర చిత్రంలో వాటి రక్షణ కోసం బుట్టలు

పందెం.. భారీగా సన్నాహకం

కోడిపందేలు నిర్వహించరాదని, వాటిని అడ్డుకునే విషయంలో అధికారుల చిత్తశుద్ధిని పరిశీలిస్తామని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ పందేల మాటున జూదాలు, గుండాట, మద్యం విక్రయాల వంటివాటిని నిర్వహించరాదని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఏటా ఇలా జరగడం.. ఆఖరులో ఏదో ఒక ఆదేశం అందిందంటూ పందేలు నిర్వహించడం మామూలే. ఈ అంచనాతో ఇప్పటికే పందేళ్లరాయుళ్లు సిద్ధమయ్యారు. ముందునుంచే కోళ్లను పెంచడం వాటికి ఏ లోటూ లేకుండా చూసుకోవడం ఇక్కడో పెద్ద వ్యాపకం. ఏలూరు సమీపంలోని పామాయిల్, కోకోతోటల్లో ఇలా కోళ్లను పెద్ద సంఖ్యలో పెంచుతున్నారు. చుట్టూ దోమతెరలు కట్టి వాటికి రక్షణ కల్పిస్తూ, శిక్షణ ఇస్తున్నారు.

– ఈనాడు, ఏలూరు

'నాలా' బిల్లుకు ఆమోదం

- ఏపీ ప్రభుత్వ వివరణతో గవర్నరు సంతృప్తి
- అనుమతించిన నరసింహన్

ఈనాడు అమరావతి: ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ 'నాలా' చట్ట సవరణ బిల్లుకు గవర్నరు నరసింహన్ ఆమోద ముద్ర పడింది. ఆయన లేవనెత్తిన సందేహాలకు గురువారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. దీంతో సంతృప్తి చెందిన ఆయన ఆమోదం తెలిపారు. వ్యవసాయ భూములను ఇతర అవసరాలకు మళ్లించేందుకు అవసరమైన అనుమతుల మంజూరును సరళతరం చేసేలా ఇచ్చిన అత్యవసరాదేశాలపైనా (ఆర్డినెన్స్), చట్ట సవరణ బిల్లుపైనా గవర్నరు పలు సందేహాలను వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ అంశంలో గవర్నరుపై భాజపా ఎంపీ, ఎమ్మెల్యేలు సైతం విమర్శలు చేశారు. దీంతో ఇది రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో నాలా అనుమతుల విషయంలో క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టడం, నియంత్రణ యంత్రాంగం, అక్రమ మార్పులు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలకు కార్యనిర్వాహక ఉత్తర్వుల్లో స్పష్టత ఇస్తామని గవర్నరుకు ప్రభుత్వం తెలియజేసినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ వివరణతో బిల్లుకు గవర్నరు ఆమోదం తెలిపారు.

31న వరసిద్ధుని ఆలయం మూసివేత

కాణిపాకం, న్యూస్‌టుడే: కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఈ నెల 31వ తేదీన మూసివేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ ఈవో పెనుమాక పూర్ణచంద్రరావు గురువారం ఓ ప్రకటనలో వివరించారు. అనంతరం ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం 3 గంటలకు ఆలయాన్ని తెరవనున్నారు. మహా సంప్రోక్షణ తర్వాత వేకువజామున 4.30 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించనున్నట్లు పేర్కొన్నారు.

పర్యాటకానికి సంబంధించిన మీ అనుభవాలు, సందేహాలు పంపించండి
మా చిరునామా:
విహారి
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
హైదరాబాద్ - 501 512
mail id ■ vihari@eenadu.in

స్కూబా @ మన వైజాగ్

నిన్నమొన్నటి వరకు ఆ దారిన పడవలు నడిచేవి కావు! వెళ్లినా భారంగా కదిలేవి. కడలి తరంగాలూ ఉవ్వెత్తున పోటెత్తేవి. భయంతో ఆ ప్రాంతం గురించి కథలు కథలుగా చెప్పుకొనేవారు కొందరు! ఇప్పుడవన్నీ కాకమ్మ కథలని తేలిపోయాయి. అలల జడి వెనుక ఏ మాయలూ లేవని తెలిసిపోయింది. దీంతో పాటు.. ఆ చల్లని సముద్ర గర్భంలో దాగిన ఓ అద్భుతం వెలుగు చూసింది. దాదాపు శతాబ్దం కిందట అక్కడ మునిగిన ఓ భారీ నౌక ఆనవాళ్లు బయటపడ్డాయి. వీటిని బయటపెట్టిన ఘనత మన విశాఖ స్కూబాడైవర్స్‌కు దక్కుతుంది.



స్కూబాడైవింగ్ కడలి లోపలి అందాలు కళ్లముందుంచే అద్భుత విన్యాసం. గోవా తీరంలో, అండమాన్ అంచుల్లో, పుదుచ్చెరి బీచ్‌లో బాగా డిమాండ్ ఉన్న సాహసక్రీడ. ఈ అడ్వెంచర్ ఆటకు ఇప్పుడు వైజాగ్ అడ్డాగా మారుతోంది. కొన్నేళ్లుగా స్కూబాడైవింగ్ పర్యాటకులకు అందుబాటులో ఉంది. నడి సంద్రంలోకి వెళ్లి.. డైవింగ్ సూటూ, బూటూ వేసుకొని.. ఆక్సిజన్ సిలిండర్ తగిలించుకొని.. నీటిలోకి దూకేయడం కాదు స్కూబా డైవింగ్ అంటే! సముద్రంలో తేలుతూ.. మన ముందు నుంచి వెళ్తున్న జలచరాలను కళ్లారా చూడటం, సాగరంలో ప్రకృతి పొదిగిన అందాలను మనసారా వీక్షించడం. గోవా నుంచి పుదుచ్చెరి దాకా ఎక్కడ స్కూబాడైవింగ్ చేసినా ఇలాంటి అనుభూతే కలుగుతుంది. విశాఖలో అంతకుమించిన ఆనందం సొంతమవుతుంది. దేశంలో ఎక్కడా లేని విధంగా సముద్ర గర్భంలో.. ఎప్పుడో మునిగిన నౌక బయటపడటమే ఇందుకు కారణం. భీమునిపట్నం బీచ్‌కు దగ్గర్లో సముద్రం లోపల ఈ నౌకను కనుగొన్నారు. మునిగిపోయిన నౌక విడిభాగాలు 500 మీటర్ల వరకూ చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని వైజాగ్ స్కూబాడైవర్స్ గుర్తించారు. అంతేకాదు నౌక ఆనవాళ్లు ఏడు మీటర్ల లోతులోనే ఉండటం మరో విశేషం.

విశాఖ అనుకూలం

విశాఖపట్నంలో స్కూబాడైవింగ్‌కు ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోంది. ఇక్కడ సముద్రంలో విజన్ చాలా పారదర్శకంగా ఉంటుంది. 30 మీటర్ల వరకూ బాగా కనిపిస్తుంది. దీంతో జలచరాల కదలికలను స్పష్టంగా గమనించవచ్చు. దీనికి తోడు సముద్రంలో కొత్తగా బయటపడిన నౌకను చూసేందుకు స్కూబాడైవర్స్‌తో పాటు పర్యాటక ప్రియులూ విశాఖకు తరలివస్తారంటున్నారు 'లైవ్ ఇన్ అడ్వెంచర్స్' సంస్థ డైరెక్టర్ బలరామ్ నాయుడు. మన దేశంలో సముద్రంలో మునిగిపోయిన నౌక అవశేషాలు గుర్తించడం ఇదే మొదటిసారని ఆయన తెలిపారు. ఏపీ టూరిజం సౌజన్యంతో ఇక్కడ స్కూబా డైవింగ్ నిర్వహిస్తున్నామన్నారు. భీమునిపట్నం నుంచి సుమారు 30 నిమిషాల పాటు బోటులో ప్రయాణిస్తే నౌక మునిగిపోయిన ప్రాంతానికి చేరుకోవచ్చు. రానున్న రోజుల్లో స్కూబాడైవింగ్‌కు విశాఖ కేంద్రంగా మారుతుందనడంలో సందేహం లేదు.

ఈత రావాల్సిన పనిలేదు

వైజాగ్‌లో స్కూబాడైవింగ్‌కు ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోంది. ఏటా అక్టోబర్ నుంచి మార్చి వరకు స్కూబాడైవింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. ఈత రాని వాళ్లు కూడా స్కూబాడైవింగ్ చేయవచ్చు. అన్ని జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే డైవింగ్‌కు తీసుకెళ్తాం. గత సీజన్‌లో దాదాపు 200 మంది, ఈ సీజన్‌లో వంద మందికిపైగా పర్యాటకులు సముద్రంలోకి వెళ్లారు. ప్రస్తుతానికి స్కూబాడైవింగ్ కోసం ఒక్కొక్కరికి రూ.5,000 ఛార్జ్ చేస్తున్నాం. ముందుగా స్విమ్మింగ్‌పూల్‌లో స్కూబాడైవింగ్ తర్ఫీదునిచ్చిన తరువాతే సముద్రంలోనికి తీసుకెళ్తాం. మా సహాయకులు వారికి అండగా ఉంటారు. ఈతరాని వాళ్లను ఏడు మీటర్ల లోతువరకు తీసుకెళ్తాం. దాదాపు 45 నిమిషాలు సముద్రంలో గడపవచ్చు. జలచరాల కదలికలను, ఆటలను చూడవచ్చు. పర్యాటకులకు సముద్రంలో ఫొటోలు, వీడియోలు కూడా తీసి ఇస్తున్నాం. స్కూబాడైవింగ్‌లో అనుభవం ఉన్న వారిని 40 మీటర్ల లోతు వరకూ తీసుకెళ్తాం.

– కేశవ్‌రామ్ నార్ల, స్కూబాడైవింగ్ నిపుణుడు



కోనసీమ వెళ్తున్నారా

మూడు రోజులూ మధురానుభూతులే!

సంక్రాంతి పేరు చెబితే ఠక్కున గుర్తొచ్చేది గోదారి జిల్లాలే... అక్కడి సంబరాల తీరే వేరు. సరే.. గోదారోళ్లు ఎటూ.. సొంతూళ్లకు బ్యాగ్ సర్దుతారనుకోండి.. మరి.. మిగతావాళ్ల మాటేమిటి... ఆ జిల్లాల్లో బంధుగణం లేని వాళ్లు ఏం చేయాలి?

ఈసారి భోగి ఆదివారం.. మకర సంక్రాంతి సోమవారం వచ్చాయి. అంటే వరుసగా రెండు రోజులు సెలవులు. ఇక కనుమ రోజు.. ప్రభుత్వోద్యోగులకు ఎటూ ఆప్షన్ హాలీడే అవకాశం ఉండనే ఉంటుంది. మిగతా వాళ్లు ఆ ఒక్కరోజు సెలవు పెట్టుకుంటే.. సంక్రాంతిని మధురానుభూతిగా మిగిల్చేసుకోవచ్చు.

కోనసీమలో పండుగ వాతావరణాన్ని ఆస్వాదించాలంటే ప్రధానంగా రాజమండ్రి, రావులపాలెం, అమలాపురం, రాజోలు కేంద్రాలను ఎంచుకోవచ్చు. ఈ నాలుగు ప్రాంతాల్లోనూ లాడ్జీలు అందుబాటులో ఉంటాయి. పాలకొల్లు-రాజోలు మధ్య ఉండే దిండి రిసార్ట్స్ విడిదికి బావుంటుంది. హైదరాబాద్‌లో రాత్రి బయల్దేరితే ఈ నాలుగు ప్రాంతాల్లో దేన్నికైనా సరే తెల్లారేసరికల్లా చేరుకోవచ్చు.



1 రోజు లాడ్జీలో దిగాక కాలకృత్యాలు, స్నానపానాదులు ముగించుకుని అక్కడే ఓ ట్యాక్సీ మాట్లాడేసుకోండి. ద్రాక్షారామం (పంచారామాల్లో ఒకటి), ర్యాలీ (జగన్మోహినీ కేశవస్వామి), అయినవిల్లి (సిద్ధి వినాయకస్వామి), మురమళ్ల (శ్రీ భద్రకాళీ సమేత శ్రీవీరేశ్వర స్వామి) అప్పనపల్లి (బాలబాలాజీ) క్షేత్రాల సందర్శన పెట్టుకోండి. దారిలోని గ్రామాల్లో ఇంటింటా ముగ్గులు, పట్టు పరికిణీలతో సందడి చేసే యువతులు, కొత్త డ్రెస్సులతో షికార్లు చేసే కుర్రాళ్లు... రోడ్లన్నీ ఎక్కడ చూసినా సందడి సందడిగానే కనిపిస్తాయి. మీరు ఏ ఇంటికి వెళ్లినా.. 'ఆయ్..! రండి..' అంటూ ప్రేమగా పలకరించే ఆప్యాయతే కనిపిస్తుంది. మిమ్మల్ని మీరు పరిచయం చేసుకోండి.. సంక్రాంతి సంబరాలు చూడటానికి వచ్చామని చెప్పండి చాలు.. ఇక వాళ్ల మర్యాద చూడండి...

2 రోజు మకర సంక్రాంతి.. పిండివంటలతో ఊర్లన్నీ ఘుమాయించేస్తూ ఉంటాయి. చుట్టాలతో ఇళ్లన్నీ కళకళలాడుతూ ఉంటాయి. మీరు ఎక్కడ బస చేసినా.. ఉదయాన్నే అయిదింటికల్లా బయటపడండి.. మంచు కురిసేవేళలో.. పచ్చటి పొలాలతో కూడిన కోనసీమను పలకరించడమే కాదు.. నిక్కరు-నోట్లో చుట్టతో నడుచుకుంటూ, సైకిళ్లపై వెళ్తూ సగటు గోదారోడు మిమ్మల్ని పలకరిస్తాడు. చూడటానికి భలే ఉంటాయి ఆ దృశ్యాలు. ఏమాత్రం సంకోచించకుండా.. పల్లెటూళ్లలో పాక హోటళ్లల్లో అడుగుపెట్టండి.. వాటికి బోర్డులు కూడా ఉండవు.. కాసేపు భేషజాలు పక్కనపెట్టేయండి... కొబ్బరి చట్నీ, సెనగ చట్నీ, నెయ్యి-కారప్పొడిలతో ప్లేటులో పెట్టిచ్చే వేడివేడి ఇడ్లీలను లాగించేయండి. మీ ప్రయాణంలో అంబాజీపేట ఎటూ తగులుతుంది. అక్కడ ఆగండోసారి.. పొట్టిక్కలకు ప్రసిద్ధి చెందిందీ ప్రాంతం. పనస ఆకుల్లో వండిపెట్టే ఈ పదార్థాన్ని ఇడ్లీ పిండితోనే తయారుచేసేటప్పటికీ దీని రుచే వేరు. అంబాజీపేటకు పక్కనే 4 కిలోమీటర్ల దూరంలో (రాజోలు వెళ్లే దారిలో) లంకల గన్నవరం అనే ఓ చిన్న పల్లెటూరు ఉంటుంది. ఆంధ్రుల అన్నపూర్ణగా పేరొంది, బ్రిటిష్ వారి గౌరవాన్ని పొందిన డొక్కా సీతమ్మగారి ఇంటిని కూడా చూసి వస్తే అదో తృప్తి. పొద్దున్నే మొదలెట్టే మీ ప్రయాణంలో కోనసీమలోని అంతర్వేది (లక్ష్మీ నరసింహస్వామి), పంచారామ క్షేత్రాలైన పాలకొల్లు, భీమవరం చుట్టి వచ్చేయండి. పాలకొల్లులో ఆగినప్పుడు లీలామహల్ సందులో ఇప్పటితరానికి పరిచయం లేని కుంపట్లపై మూకుడు పెట్టి, దాంట్లో మినప పిండి వేసి పైన మూతపెట్టి దానిపై బొగ్గుల నిప్పులు వేసి దోరదోరగా కాల్చిపెట్టే మినప రొట్టెలను వదిలిపెట్టకండేం...

3 రోజు ఇక మూడో రోజున సరాసరి రాజోలు వచ్చేయండి. గోదారి గట్టు ఎక్కేయండి. అక్కడి నుంచి గోదారి-కొబ్బరి తోటల దృశ్యాలను తిలకించండి. గోదారి ఆవలిగట్టుకు వెళ్లి లంకతోటల్లో విహరించండి. ప్రభల తీర్థాలకు వెళ్లినప్పుడు వస్తూ వస్తూ బెల్లం జీళ్లు, ఖర్జూరపు పళ్లు కొనుక్కుని రావడం మర్చిపోకండేం.

అన్నీ తిరిగొచ్చి.. హాయిగా రాత్రి మీ స్వస్థలానికి బయల్దేరండి. సంక్రాంతి సంబరాలను తలచుకుంటూ... మధురానుభూతుల్ని నెమరేసుకుంటూ..

–బెహరా శ్రీనివాసరావు

మరిన్ని వివరాలు www.eenadu.net లో

వసంతానికి వచ్చిపోండి

మల్లెలు విరిసే వేళ..
వెన్నెల కురిసే వేళ..
అక్కడ ఆనందం వెల్లివిరుస్తుంది.
అందరూ రంగులు చల్లుకుంటారు.
పాటలు పాడేస్తారు.
ఆటలు ఆడేస్తారు.
శిశిరంలోనే వసంతానికి ఆహ్వానం పలుకుతారు.
వసంత పంచమి నాడు ఉత్తరప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం బృందావనంలో కనిపించే దృశ్యాలివి. దేశ విదేశాల నుంచి వచ్చిన పర్యాటకులు హోళీకి నలభై రోజుల ముందుగానే రంగులతో, సంబరాలతో బృందావనమది అందరిదీ అనేలా చేస్తారు. జనవరి 22న వసంత పంచమికి బృందావనం ముస్తాబవుతోంది. రాధాకృష్ణుల వసంతోత్సవానికి మనల్నీ వచ్చిపొమ్మని పిలుస్తోంది!



ఒక బృందావనం అది కోలాహలం

బాలకృష్ణుడి చిలిపి చేష్టలు.. గోపాల కృష్ణుడి మాయలు.. రాధాకృష్ణుడి లీలలు.. వీటన్నిటికీ చిరునామా బృందావనం. కన్నయ్య చల్లని చూపు కోసం ఏటా లక్షల మంది భక్తులు బృందావనానికీ, ఆ చెంతనే ఉన్న మధురాపురికీ వస్తూ ఉంటారు. రాధామాధవుల గాథలు తెలుసుకొని మురిసిపోతారు. బృందావనిలో సంచరిస్తూ.. మానసికంగా గోపకిశోరుని మురళీగానాన్ని ఆస్వాదిస్తూ ఉంటారు. భక్తజనులకు ఆధ్యాత్మిక క్షేత్రమిది. పర్యాటక ప్రియులకు ఆహ్లాద కేంద్రం. మునిజనులకు.. తపోభూమి! బృందావనంలోని యమునా తటిపై నల్లనయ్యకై ఎదురుచూసే సాధువులు కనిపిస్తారు. రాధాదేవిని మాయాశక్తిగా ఆరాధించే యోగులూ దర్శనమిస్తారు. ఎవరి ఎదురు చూపులు వారివి. మాఘ శుద్ధ పంచమి వచ్చిందంటే మాత్రం.. అందరి చూపులూ వసంతోత్సవంపై పడతాయి. వసంత పంచమి రోజు బృందావనం, మధురానగరి చుట్టు పక్కల ప్రాంతాలన్నీ పసుపు రంగులో తడిసి ముద్దయిపోతాయి. బృందావన వీధుల్లో అడుగడుగునా దర్శనమిచ్చే ఆలయాలన్నీ పసుపు పూల తోరణాలతో ముస్తాబై దర్శనమిస్తాయి.

పచ్చందనమే..



కృష్ణుడు జన్మించిన జన్మాష్టమి, రాధాదేవి జన్మించిన రాధాష్టమి, హోళి పండగలు బృందావనంతో పాటు మధుర, గోకులం, నందగావ్‌లో వైభవంగా జరుగుతాయి. ఈ పండగలకు ఏమాత్రం తీసిపోని విధంగా వసంతోత్సవం చేసుకుంటారు అక్కడి జనాలు. వీరి ఉత్సాహంలో పాలుపంచుకోవడానికి దేశవిదేశాల నుంచి భక్తులు, పర్యాటకులు తరలివస్తారు. వసంత పంచమి నాటికి బృందావన వనాల్లో చెట్లు ఆకులన్నీ రాలి.. నిగనిగలాడే పూలతో నిండుగా దర్శనమిస్తాయి. పసుపు రంగు పూలతో స్వర్ణకాంతులీనుతుంటాయి. ఫాల్గుణ మాసంలో వచ్చే హోళీని, ఆపై వచ్చే వసంత రుతువును స్వాగతిస్తూ.. వసంతోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. చేమంతులు, బంతులతో ఊరంతా అలంకరిస్తారు. ఆవాల చేనులోని పచ్చగా విరబూసిన పూలను తెచ్చి ఆకాశం నుంచి వర్షిస్తున్నాయా అన్నట్టు చల్లుకుంటారు. పసుపు, చందనం కలిపిన నీటిని ఒకరిపై ఒకరు కుమ్మరిస్తుంటారు. భక్తులందరూ పసుపు పచ్చటి వస్త్రాలను మాత్రమే ధరిస్తారు. ఆలయాల్లోని విగ్రహాలకు పసుపు పట్టు పుట్టాలనే చుడతారు. పసుపు రంగులో ఉండే రవా కేసరిని ప్రసాదంగా అందజేస్తారు. ఒక్కముక్కలో చెప్పాలంటే వసంత పంచమి రోజు బృందావనం మొత్తం పసుపు వర్ణంలో మెరిసిపోతుంది. ఈనాటి నుంచి నలభై రోజుల పాటు (హోళీ వరకు) వసంతోత్సవాలు నిర్వహిస్తారు. హోళీ సంబరాన్ని ఇంతకు పదింతలు ఉత్సాహంగా చేసుకుంటారు. నాలుగు రోజుల పాటు బృందావనం వీధులన్నీ రకరకాల రంగుల్లో దర్శనమిస్తాయి.

అడుగడుగున గుడి..

బృందావనం-మధురలో అడుగడుగునా గుళ్లు, గోపురాలు కనిపిస్తాయి. దాదాపూ అన్నీ కృష్ణ మందిరాలే! అందులో కొన్ని రాధామాధవులు ఇద్దరూ కొలువుదీరిన ఆలయాలున్నాయి. రాధాకృష్ణుల ప్రేమను చాటే ప్రేమ మందిరం, భగవద్గీత గొప్పదనాన్ని చాటే గీతామందిర్, ద్వారకాదీశ్ ఆలయం, వనవిహారి మందిర్, నిధివన్ ఆలయం, శ్రీకృష్ణబలరామ్ ఆలయం (ఇస్కాన్), గోపీనాథ్ ఆలయం, శ్రీరాధావల్లభ ఆలయం, రాధారమణ మందిరం ఇలా ఎన్నో ఉన్నాయి. ఇవే కాకుండా గోశాలలు, ప్రార్థనా మందిరాలు, సేవాసదన్‌లు, వృద్ధాశ్రమాలు ఇలా ఎన్నో కనిపిస్తాయి. ఈ ఆలయాల నిర్మాణశైలి, వాటి వెనుకున్న కథలు పర్యాటకులకు క్షణం తీరిక లేకుండా చేస్తాయి. ఎందుకాలస్యం ఈ వసంతపంచమికి బృందావనానికి వెళ్లిపోదాం. ఇప్పుడు కుదరకపోతే.. రానున్న హోళీకైనా వెళ్లే ప్రయత్నం చేద్దాం.




ఎలా వెళ్లాలి

బృందావనానికి దగ్గరగా ఉన్న రైల్వే స్టేషన్ మధుర జంక్షన్. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి దిల్లీ వెళ్లే రైళ్లన్నీ మధుర జంక్షన్ మీదుగానే వెళ్తాయి. మధుర నుంచి బృందావనానికి 15 కిలోమీటర్లు. బృందావనం, మధుర, చుట్టుపక్కల ప్రాంతాలను తిప్పి చూపించడానికి ట్యాక్సీలు, మినీ బస్సులు అందుబాటులో ఉంటాయి. మధుర నుంచి ఆగ్రా దాదాపు 60 కి.మీ.ఎంచక్కా తాజ్‌మహల్ కూడా చూడొచ్చు. మధురలో బస ఏర్పాట్లు బాగుంటాయి.

రాత్రిపూట ప్రవేశం లేదు

బృందావనం అనగానే అందరూ అడిగేది నిధి వనం గురించే. గోపికలు శ్రీకృష్ణుడితో అచ్చికలాడిన ప్రదేశం నిధివనం. నేటికీ ప్రతి రాత్రీ గోపికలు నల్లనయ్యతో నాట్యమాడుతారని చెబుతుంటారు. అందుకే సూర్యాస్తమయం తర్వాత నిధివనంలోకి ఎవరినీ అనుమతించరు. తెల్లారేసరికి గోపికలు చెట్లుగా మారిపోతారని అంటారు. ఈ వనంలోని చెట్ల కొమ్మలు పైకి పెరగకుండా.. వయ్యారాలు ఒలకబోస్తూ వంకర్లు తిరిగి.. కిందికి పెరగడం విశేషం. గోపికలతో ఆడి అలసిన కృష్ణుడు అదే వనంలోని రంగ్ మహల్‌లో రాధమ్మ ఒడిలో పడుకొని బడలిక తీర్చుకుంటాడని కొందరి నమ్మకం.



బ్రజ్ పరిక్రమ

బృందావనం-మధుర జంట పుణ్యక్షేత్రాలు. వీటికి పరిసరాల్లో గోకులం, నంద్‌గావ్, గోవర్ధనం, బర్సానా, రాధాకుండ్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. గోపాల కృష్ణుడి బాల్యం, యౌవనం ఈ ప్రాంతాల్లోనే గడిచింది. రేపల్లె వాసులను ఆశ్చర్యంలో ముంచెత్తిన ఎన్నో ఘట్టాలకు నేటికీ ఎన్నో ఆనవాళ్లు కనిపిస్తాయక్కడ. మధురలో కృష్ణ జన్మస్థానం, కాళీయుడి పడగలపై నాట్యమాడిన సందర్భాన్ని తెలిపే కాళీయ ఘాట్, చిన్నికృష్ణుడు చిటికెన వేలిపై ఎత్తిన గోవర్ధన గిరి, రాధాకృష్ణులు ఆంతరంగిక ప్రదేశం రాధా కుండ్-శ్యామ్ కుండ్, కంసుడిని సంహరించిన తర్వాత కృష్ణుడు సేదతీరిన ప్రదేశం ఇలా భాగవత కథల్లో భాగమైన ఎన్నో నెలవులు బృందావనం చుట్టుపక్కల ప్రాంతాల్లో కనిపిస్తాయి. కిట్టయ్య లీలల్ని తలుచుకుంటూ భక్తులు గోవర్ధనగిరి చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటారు. అంతేకాదు కృష్ణుడి బాల్యంతో ముడిపడిన బృందావనం పరిసర ప్రాంతాలన్నీ ప్రదక్షిణగా తిరుగుతుంటారు. దీనినే బ్రజ్ పరిక్రమ అంటారు.

గుహనో అది మహలో!

లోకల్ టూర్

బెలుం గుహలు... ప్రకృతి ప్రసాదించిన అద్భుతాల నిధి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యం సంతరించుకున్న ఈ గుహలు కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని బెలుం గ్రామ సమీపంలో వెలిశాయి. సాధారణంగా గుహలు అనగానే ఏ కొండల్లోనో, కోనల్లోనో ఉంటాయి. బెలూం గుహలు మైదాన ప్రాంతంలో భూమిలోపల ఏర్పడటం విశేషం. భూ ఉపరితలానికి దాదాపు ముప్పయ్ మీటర్ల లోతులో ఉన్న ఈ గుహలు పది కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. రాతియుగం నాటికే ఇవి ఏర్పడ్డాయని నిపుణుల అభిప్రాయం. 1884లో హెచ్.బి.ఫూటే అనే ఆంగ్లేయుడు వీటిని తొలిసారిగా గుర్తించారు. అనేక పరిశోధనల తర్వాత 2002 నుంచి గుహల్లోకి పర్యాటకులను అనుమతిస్తున్నారు.

గుహలో బండరాళ్లతో సహజసిద్ధంగా ఏర్పడిన ఆకృతులు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. వాటి ఆకృతులను బట్టి వేయిపడగలు, కోటిలింగాలు, మయామందిరం ఇలా వింత వింత పేర్లతో పిలుస్తుంటారు. గుహలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. ఆ దీప కాంతుల్లో సొరంగాలు సహజసిద్ధంగా ఏర్పడిన మహళ్లను తలపిస్తాయి. భూగర్భంలో పర్యాటకులకు ఇబ్బంది కలగకుండా గాలి అందేలా బ్లోయర్లను ఏర్పాటు చేశారు. ఏటా దాదాపు రెండు లక్షల మంది బెలుం గుహలను సందర్శిస్తుంటారు.

ఇలా వెళ్లాలి: బెలుం గుహలు.. కర్నూలు నుంచి బనగానపల్లి మీదుగా 110 కిలోమీటర్లు, అనంతపురం నుంచి తాడిపత్రి మీదుగా 90 కిలోమీటర్లు, కడప నుంచి జమ్మలమడుగు మీదుగా 85 కిలోమీటర్లు దూరంలో ఉన్నాయి. ఆయా ప్రాంతాల నుంచి బస్సులు, ట్యాక్సీల్లో వెళ్లొచ్చు.

సమీపంలో: యాగంటి (ఉమామహేశ్వర ఆలయం), మహానంది (శివాలయం), అహోబిలం (నరసింహస్వామి ఆలయం), గండికోటతో పాటు బనగానపల్లిలో బ్రహ్మంగారు తిరగాడిన ప్రాంతాలు సందర్శించవచ్చు.

– రమణయ్య, న్యూస్‌టుడే, కొలిమిగుండ్ల



అంతా ప్లాన్ ప్రకారమే

దిక్సూచి



ప్లాన్ లేకుండా.. పనులు చక్కబెట్టుకోవడం కష్టమే! ప్రయాణాల విషయంలో అయితే మరీనూ! అన్నీ ముందస్తుగా ప్లాన్ చేసుకోవాల్సిందే! 'పరిచయం లేని ప్రాంతాల్లో ప్రణాళికల పాచికలు ఏం పారతాయంటారా?'. అయితే అన్‌ప్లాన్డ్.ఇన్ (unpland.in) క్లిక్ చేయండి. మీ ప్రయాణం సాఫీగా సాగించే బాధ్యత వాళ్లదే! 'ట్రిప్ కేటగిరి, ఎందరు, ఎన్ని రోజులు, ఎక్కడెక్కడికి వెళ్లాలనుకుంటున్నారు, ఎంత బడ్జెట్‌లో..' ఇలాంటి వివరాలు అందిస్తే చాలు! కాగల కార్యం అన్‌ప్లాన్డ్ నిర్వాహకులే తీరుస్తారు. ప్రయాణానికి నాలుగు రోజుల ముందే.. అన్ని వివరాలూ తెలియజేస్తారు. స్థానిక పర్యాటక కేంద్రాల నుంచి అంతర్జాతీయ పర్యటనల వరకు 'అన్‌ప్లాన్డ్' ప్లాన్ చేస్తోంది. కోరుకున్న ధరలో.. అందుబాటులో ఉన్న పర్యాటక కేంద్రాలను ఏ కష్టమూ లేకుండా చూపిస్తుంది.

ఈనాడు సినిమా

ఆ పాట అదిరిపోతుందంతే!



అల్లు అర్జున్ అంటే.. స్టైలిష్ స్టార్. అంతేనా దక్షిణాదిలోనే అత్యుత్తమ డ్యాన్సర్లలో ఒకడు. ప్రతి పాటలోనూ వైవిధ్యభరితమైన స్టెప్పులతో అలరించడానికి ప్రయత్నిస్తుంటాడు. తన కొత్త సినిమా 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'లోనూ డ్యాన్సుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాడు. ఈ చిత్రం కోసం బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్ శేఖర్ ఓ సరికొత్త ట్యూను కంపోజ్ చేశారట. ఆ పాటని అమెరికా, పారిస్‌లలో తెరకెక్కించాలని చిత్రబృందం భావిస్తోంది. అందుకోసం అంతర్జాతీయ కొరియోగ్రాఫర్లను రంగంలోకి దింపాలని చూస్తోంది. ఆ పాటలో బన్నీ వేసే స్టెప్పులు కలకాలం గుర్తుండిపోయేలా.. సినిమా మొత్తానికి ఈ పాట ప్రధాన ఆకర్షణగా నిలిచేలా ప్లాన్ చేస్తున్నారు. ఇటీవల రామోజీ ఫిలింసిటీలో కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కుటుంబ నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. ఈ చిత్రానికి వక్కంతం వంశీ దర్శకుడు. లగడపాటి శ్రీధర్ నిర్మాత.

గీతోపదేశం

అందరి కోసం ఒక్కడు నిలచి
ఒక్కని కోసం అందరు కలసి
సహకారమే మన వైఖరి ఐతే
ఉపకారమే మన ఊపిరి ఐతే
పేద గొప్ప భేదం పోయి అందరూ
నీది నాదని వాదం మాని ఉందురు

గీతం: ఉందిలే మంచి కాలం ముందు ముందునా...
చిత్రం: రాముడు భీముడు
రచన: శ్రీశ్రీ
- పంపినవారు: సరికొండ శ్రీనివాసరాజు, వనస్థలిపురం

నయనతార వీరాభిమానిని!

"కథానాయకుడు ఎవరన్నది ఆలోచించను. నాకు పాత్ర నచ్చితే సినిమా చేసేస్తా" అంటోంది నటాషా దోషి. నందమూరి బాలకృష్ణ 'జైసింహా'తో ఆమె తెలుగు చిత్రసీమకు కథానాయికగా పరిచయమవుతోంది. శుక్రవారం 'జై సింహా' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో నటాషా విలేకరులతో మాట్లాడింది.




✪ "నందమూరి బాలకృష్ణ, కె.ఎస్.రవికుమార్.. ఇద్దరూ దిగ్గజాలే. వీళ్లతో పనిచేసే అవకాశం తొలి తెలుగు చిత్రంతోనే దక్కింది. ఇంతకంటే ఓ శుభారంభం ఎవరు కోరుకుంటారు? ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాననే అనుకుంటున్నా. 'జై సింహా'లో నా పేరు దానియా. అమెరికా నుంచి వస్తాను. మోడ్రన్‌గా ఉంటాను. నా పాత్ర తీరుతెన్నులు కథకు కీలకం. ఓ విధంగా 'జై సింహా' కథని మలుపు తిప్పే పాత్ర నాది. 'అమ్మకుట్టి' పాటలో బాలకృష్ణతో కలసి డ్యాన్స్ చేయడం మర్చిపోలేని అనుభూతి. బాలయ్య డ్యాన్సులకు ప్రసిద్ధి. ఆయన డ్యాన్సులు చూడ్డానికే ప్రేక్షకులు థియేటర్‌కి వస్తారు. అలాంటిది ఆయన పక్కన నృత్యం చేసే అవకాశం రావడం నా అదృష్టం. సంప్రదాయ నృత్యం నేర్చుకున్నాను కాబట్టి సులభంగానే స్టెప్పులేశా"

✪ "నయనతారకు వీరాభిమానిని. మలయాళ 'బాడీగార్డ్'లో ఆమె నటన బాగా నచ్చింది. నా అభిమాన నటితో కలసి ప్రయాణం చేయడం కలలో కూడా ఊహించని సంఘటన. నేను పుట్టి పెరిగింది మొత్తం ముంబైలోనే. చిన్నప్పుడు కొన్ని హిందీ ధారావాహికలలో నటించాను. కథానాయికగా రెండు మలయాళ చిత్రాలు చేశాను. 'జై సింహా'లోని నా పాత్ర కోసం ముందు వంద మంది అమ్మాయిల్ని పరిశీలించారట. చివరికి ఆ అదృష్టం నాకు దక్కింది"

✪ "వైద్య వృత్తిలో స్థిరపడాలన్నది నా ఆశ. సినిమాలంటే ప్రేమ. ఈ రెండింటిలో ఏది కావాలంటే చెప్పలేను. అందుకే ముందు చదువు పూర్తి చేశా. ఇప్పుడు సినిమాలపై దృష్టి పెట్టాను. ప్రస్తుతం ఓ బెంగాలీ చిత్రంలో నటిస్తున్నా. కథానాయిక ప్రాధాన్యం ఉన్న చిత్రమిది. 'జై సింహా' తరవాత తెలుగులో మరిన్ని మంచి అవకాశాలొస్తాయన్న నమ్మకం ఉంది"

చూడు.. ఇదిగో జోడీ!



రవితేజ, రాశీ ఖన్నా

రవితేజ కథానాయకుడిగా నటించిన చిత్రం 'టచ్ చేసి చూడు'. రాశీ ఖన్నా, సీరత్ కపూర్ కథానాయికలు. విక్రమ్ సిరికొండ దర్శకత్వం వహిస్తున్నారు. నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే 'పుష్ప...' అంటూ సాగే పాటకి సంబంధించిన టీజర్‌ని విడుదల చేయబోతున్నారు. రవితేజ శైలి మాస్ అంశాలతో తెరకెక్కిన చిత్రమిది. ప్రముఖ రచయిత వక్కంతం వంశీ కథని అందించగా, పలు చిత్రాలకి రచయితగా పనిచేసిన విక్రమ్ సిరికొండ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇటీవలే టీజర్‌ని విడుదల చేశారు. అందులో రవితేజ స్టైల్, యాక్షన్ సన్నివేశాలు ఆకట్టుకొనేలా ఉన్నాయి. రవితేజ, రాశీ ఖన్నా జోడీ మరోసారి ప్రేక్షకుల్ని అలరిస్తుందని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: జామ్ 8, కథ: వక్కంతం వంశీ, కథనం: దీపక్‌రాజ్, మాటలు: శ్రీనివాస్ రెడ్డి, కళ: రమణ, కూర్పు: గౌతంరాజు, ఛాయాగ్రహణం: ఛోటా కె.నాయుడు.

పంచ్ డైలాగ్

మబ్బుల్ని చూసి సూర్యుడు దాక్కుంటే... ఈ లోకం చీకటైపోతుంది!
చిత్రం: శివయ్య
- పంపినవారు: కాకరపర్తి సుబ్రహ్మణ్యం, తెనాలి

అంతలోనే వింతలు




పూజా రామచంద్రన్

నందు కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో'. సౌమ్య వేణుగోపాల్, పూజా రామచంద్రన్ కథానాయికలు. వరప్రసాద్ వరికూటి దర్శకుడు. ఎస్.శ్రీకాంత్ రెడ్డి, ఇప్పిలి రామమోహనరావు నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ హైదరాబాద్‌లో థియేట్రికల్ ట్రైలర్‌ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "వరప్రసాద్ దర్శకుడిగా మారి సినిమా చేస్తున్నాడని తెలిసినప్పుడు చాలా సంతోషించా. తను నా శిష్యుడే. అగ్ర కథానాయకులతో సినిమాలు తీసే స్థాయికి ఎదగాలని కోరుకొంటున్నా" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "ఉత్కంఠభరితమైన కథ, కథనాలతో తెరకెక్కిన ఓ విభిన్నమైన చిత్రమిది. ఫిబ్రవరిలో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. నరసింహా, కృష్ణతేజ, త్రిశూల్, గగన్ విహారి, రమేష్, భార్గవ్, కిషోర్ దాస్, సత్తన్న తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఎస్.మురళీమోహన్ రెడ్డి, సంగీతం: యాజమాన్య.

ఒక్క రాత్రిలో వందేళ్ల జీవితసారం

గతేడాది 'రంగూన్', 'షెఫ్' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు సైఫ్ అలీఖాన్. రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో ప్రముఖ దర్శకుడు విశాల్ భరద్వాజ్ భారీస్థాయిలో తెరకెక్కించిన 'రంగూన్' అంచనాలందుకోలేకపోయింది. హాలీవుడ్ చిత్రానికి రీమేక్‌గా వచ్చిన 'షెఫ్' కూడా నిరాశపర్చింది. ఆ పరాజయాలను మర్చిపోయి ఈ ఏడాదిని ఓ బ్లాక్ కామెడీ చిత్రంతో ప్రారంభించబోతున్నాడు సైఫ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'కాలకాండి'. ఇషా తల్వార్, తెలుగమ్మాయి శోభిత ధూలిపాళ ప్రధాన పాత్రల్లో నటించారు. అక్షత్ వర్మ దీనికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది.

కథేంటి: జీవితంలో పుట్టుక, చావు, కర్మలను విషాదంతో కూడిన వినోదంతో చూపించేలా ఈ చిత్రం తెరకెక్కినట్లు తెలుస్తోంది. 'కాలకాండి' అంటే మరాఠీలో గందరగోళ పరిస్థితులు ఏర్పడటం. జీవితంలో ఒక్క సిగరెట్ కూడా తాగని కథానాయకుడికి క్యాన్సర్ వచ్చినట్లు తెలుస్తుంది. చనిపోయేలోపు నచ్చిన రీతిలో జీవితాన్ని ఎంజాయ్ చేయాలనుకుంటాడు. ఓ రాత్రి థ్రిల్ కోసం కార్‌లో లాంగ్ డ్రైవ్‌కు వెళ్తాడు. ఆ గమ్యంలో అతనికి విచిత్రమైన పరిస్థితులు ఎదురవుతాయి. ఆ ఒక్క రాత్రిలోనే వందేళ్ల జీవితసారం బోధపడుతుంది. అదేంటన్నది 'కాలకాండి'లో చూడాలి. ప్రచార చిత్రాల్లో తల మీద పిలక జుట్టులతో ఉన్న సైఫ్ గెటప్ ఆకట్టుకుంటోంది.




ఎప్పుడూ చూడని జంట... మురిపిస్తుందంట

హిట్ పెయిర్ అంటే ప్రేక్షకులకు ఇష్టమే. ఫ్రెష్ పెయిర్ అంటే మరీ మురిసిపోతారు. ఎందుకంటే ప్రేక్షకులు కోరుకొనేది కొత్తదనమే. షారుఖ్‌ఖాన్ సరసన కాజోల్ బాగుంటుంది కానీ ఓ కొత్త అమ్మాయి అయితే ఆ కిక్ వేరేలా ఉంటుంది. ఐశ్వర్యరాయ్ సల్మాన్ జంట అదిరిపోయేలా ఉంటుంది. అదే ఐష్ పక్కన యువ హీరో సందడి చేస్తే ఆ మజాయే వేరు. అందుకే కొత్త జంట వెండితెరపై కనిపిస్తే సినిమాకే ఓ ఆకర్షణ వచ్చేస్తుంది. ఈ ఏడాది అలాంటి కొత్త జంటలు బాలీవుడ్ తెరపై సందడి చేయబోతున్నాయి.





'ప్యాడ్‌మ్యాన్' జోడీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'ప్యాడ్‌మ్యాన్'గా అలరించబోతున్నాడు అక్షయ్‌కుమార్. ఇందులో ఆయన భార్యగా నటిస్తోంది రాధికా ఆప్టే. ఈ జంట కలిసి నటించడం ఇదే తొలిసారి. ట్రైలర్ చూస్తుంటే భావోద్వేగాలు నిండిన సన్నివేశాలు ఈ జంట మధ్య ఉన్నాయని తెలుస్తోంది. బుల్లితెరపై పాపులర్ అయిన మౌనీరాయ్ కూడా అక్షయ్‌కుమార్‌తో కలిసి 'గోల్డ్'లో నటిస్తోంది.



'బాహుబలి'తో సగం స్నేహితురాలు

'బాహుబలి'తో దేశం మొత్తం పాపులర్ అయిపోయాడు ప్రభాస్. దాంతో ఆయన తర్వాత చిత్రం 'సాహో'ను హిందీలోనూ తెరకెక్కిస్తున్నారు. ఇందులో అన్ని భాషలకు సరిపోయేలా ఉండే నాయిక అయితే బాగుంటుందని చిత్రబృందం భావించింది. అందుకే యువతరంలో పాపులర్ అయిన 'హాఫ్ గర్ల్‌ఫ్రెండ్' భామ శ్రద్ధాకపూర్‌ను ప్రభాస్‌కు జోడీగా ఎంపికచేశారు.



సుల్తాన్ సుందరి-దుల్హనియా సుందరుడు

గత ఏడాది 'బద్రినాథ్ కీ దుల్హనియా', 'జుద్వా 2' చిత్రాలతో మంచి విజయాలు అందుకొని జోరు మీదున్నాడు వరుణ్‌ధావన్. వివాహబంధాన్ని ఆస్వాదిస్తోంది 'సుల్తాన్' భామ అనుష్కశర్మ. ఈ ఇద్దరూ కలిసి నటిస్తున్న చిత్రం 'సూయి ధాగా'. 'మేడ్ ఇన్ ఇండియా' కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకురానుంది.



కరీనా కొత్తగా: తల్లయ్యాకానూ తన అందం ఏమీ తగ్గలేదు అంటోంది కరీనాకపూర్. ఈ మధ్య బికినీతో ఓ ఫొటో షూట్ చేసింది. జీరో సైజ్ అందాలతో మతిపోగెట్టేసింది. ఈ భామ 'వీరేదె వెడ్డింగ్'లో యువ హీరో సుమిత్ వ్యాస్‌తో నటిస్తోంది.



పద్మావతికి భర్తగా

దీపికా పదుకొణె, షాహిద్ కపూర్ పదేళ్లుగా చిత్ర పరిశ్రమలో స్టార్‌లుగా కొనసాగుతున్నారు. ఇప్పటి వరకూ ఈ ఇద్దరూ కలిసి నటించలేదు. ఇప్పుడు 'పద్మావత్'లో దీపికాకు భర్తగా నటిస్తున్నాడు షాహిద్ కపూర్. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం పలు అడ్డంకులు దాటుకొని ఈనెల్లో ప్రేక్షకుల ముందుకురానుంది.



వారసురాళ్లు వచ్చేశారు

● సైఫ్ అలీఖాన్, అమృతా సింగ్‌ల కూతురు సారా అలీఖాన్ బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'కేదార్‌నాథ్'. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ కథానాయకుడు. 2012లో వచ్చిన ఉత్తరాఖండ్ వరదల నేపథ్యంలో సాగే కథ ఇది. ఈ ఏడాది చివర్లో ఈ చిత్రం విడుదలకానుంది.



● శ్రీదేవి బోనికపూర్‌ల ముద్దుల తనయ జాహ్నవీ కపూర్ వెండితెరకు పరిచయమవుతున్న చిత్రం 'ధడక్'. ఇందులో జాహ్నవీకి జోడీగా ఇషాన్ కత్తర్ నటిస్తున్నాడు. 'సైరట్'కు హిందీ రీమేక్‌గా వస్తున్న ఈ చిత్రం జులై6న విడుదలవుతోంది.








మరోసారి కుర్రహీరోతో

'యే దిల్ హై ముష్కిల్'లో రణ్‌బీర్‌కి ప్రియురాలిగా నటించి ఆకట్టుకొంది ఐశ్వర్యరాయ్. మరో పక్క కాస్త హాట్‌గా కూడా కనిపించింది. ఇప్పుడు మరోసారి తనకంటే చిన్నవాడైన రాజ్‌కుమార్ రావ్‌తో కలిసి 'ఫ్యానీ ఖాన్'లో నటిస్తోంది. అనిల్ కపూర్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి అతుల్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు.



కశ్మీరీ అమ్మాయి-పాకిస్థానీ అబ్బాయి

స్టార్ హీరోలతో పాటు యువతరం కథానాయకులతోనూ నటిస్తోంది ఆలియాభట్. తాజాగా యువ హీరో విక్కీ కౌశల్‌తో వెండితెరపై సందడి చేయనుంది. మేఘనా గుల్జార్ దర్శకత్వంలో ఆమె నటిస్తున్న చిత్రం 'రాజీ'. 1971 ఇండో పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇందులో కశ్మీరీ యువతిగా ఆలియా, పాకిస్థానీ కుర్రాడిగా విక్కీ కనిపించనున్నారు.



ఇప్పుడు వెండితెరపై రొమాన్స్

నిజ జీవితంలో చెట్టపట్టాలేసుకొని తిరుగుతున్న జంట టైగర్ ష్రాఫ్- దిశా పటానీ. గతంలో ఓసారి ఓ పాటలో ఆడిపాడిన ఈ జంట ఇప్పుడు 'భాఘీ 2'లో నటిస్తున్నారు. ఏప్రిల్ 27న ఈ చిత్రం విడుదల కానుంది.

ఫ్యాషన్ ఫ్యాషన్

పండగ కళ.. తెద్దామిలా..

ఎప్పుడూ ఎంబ్రాయిడరీ, ఫ్యాన్సీ లెహెంగాలేనా... ఈసారి మంగళగిరి, ఇకత్‌లతో చేసిన సంప్రదాయ వస్త్ర శ్రేణి ప్రయత్నించి చూడండి. ముదురు రంగుల మేళవింపుతో తయారు చేసిన ఈ లెహెంగా చోళీలు పండగరోజు మిమ్మల్ని ప్రత్యేకంగా కనిపించేలా చేస్తాయి.

బ్లాక్ ప్రింటుతో ముస్తాబైన పసుపు రంగు లెహెంగా, బ్లవుజు..దానికి జతగా ఎరుపు రంగు దుపట్టా.. మిమ్మల్ని ప్రత్యేకంగా నిలిచేలా చేస్తుంది.



ముదురు ఆకుపచ్చ రంగు ఇకత్ లెహెంగా, మంగళగిరి ఎరుపు రంగు ఎంబ్రాయిడరీ బ్లవుజు.. జతగా రెండురంగుల దుపట్టా... మెరిపించడం ఖాయం.







మంగళగిరి కాటన్ సిల్క్ లెహెంగా, బ్లవుజులు... జతగా పైతాని ప్రింటు చేసిన కాటన్ సిల్క్ దుపట్టాలు... అదనంగా జరీ అంచు... సంప్రదాయ కళను మరింత పెంచుతుంది.

- ఫొటోలు: దండా శ్రీనివాసరావు

అర్థం చేసుకుంటే ఆనందమే!



భార్యాభర్తల మధ్య సమస్యలకు ప్రధాన కారణం చిన్నచిన్న మనస్పర్థలే. వాటిని గుర్తించి సరిదిద్దుకుంటే పరిష్కారం దొరుకుతుంది. జీవితం ఆనందకరంగా మారుతుంది. అదెలాగో చూద్దామా.

- భాగస్వామితో ఏదయినా సమస్య ఉంటే దాని తలచుకుని మనసులో కుంగిపోకుండా ఒకసారి మాట్లాడి చూడండి. ఒకేసారి సమస్యను చర్చించాలంటే కాస్త ఇబ్బందికరంగానే అనిపించొచ్చు. అలాంటప్పుడు మీ మధ్య జరిగిన గొడవల గురించి కాకుండా మధుర జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకోండి. ఆ తరువాత విషయాన్ని చర్చించాలి.
- మీరు చేయాలనుకున్న పనికి మీ భాగస్వామి అడ్డు చెప్పి ఉండొచ్చు. లేదంటే మీరు ఇష్టంగా అడిగిన వస్తువేదైనా కొనివ్వకపోవచ్చు. అలాంటి సందర్భాల్లోనే మీరొంటో వారికి అర్థమయ్యేది. కాస్త ఓపికగా ఆలోచించండి. అది మీమీద గౌరవం పెరిగేలా చేస్తుంది. అంతేకానీ అదేపనిగా చిరాకు పడకండి.
- మీ పక్కవారు ఆనందంగా ఉంటున్నారని వారితో పోల్చుకుంటూ బాధపడొద్దు. అలా ఉండాలంటే ఏం చేయాలో ఆలోచించండి. కొన్ని సందర్భాల్లో సర్దుకుంటే మీరూ సంతోషంగా ఉండొచ్చు.
- బయటికి వెళ్లాలనుకున్నప్పుడు మీ భాగస్వామికి మరో పనేదైనా ఉండి వీలుపడకపోతే అది వారికి ఎంత ముఖ్యమో ఆలోచించండి. మీకు మరీ వెళ్లాలని ఉంటే స్నేహితులతో కలసి వెళ్లే అవకాశముందేమో ప్రయత్నించండి.
- స్నేహితులముందు, కుటుంబసభ్యుల ముందు హేళన చేస్తూ మాట్లాడొద్దు. అది కొంతవరకూ ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రతి విషయంలో అతని నిర్ణయాన్ని గౌరవించండి, ఒక వేళ మీకు నచ్చకపోతే సున్నితంగా చెప్పండి. అంతేకానీ చికాకుపడితే సమస్యకు పరిష్కారం దొరకదు.

పుట్టుమచ్చలు విపరీతంగా వస్తున్నాయి

డియర్ వసుంధర



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

? నా వయసు 17. ఇంటర్ చదువుతున్నా. తెల్లగా ఉంటా. నా ముఖం మీద చాలా పుట్టుమచ్చలు ఉంటాయి. కాస్త ఇబ్బందిగా ఉన్నాయి. ఇది ఏదైనా ప్రమాదానికి సంకేతమా! వీటిని తీయించుకోవచ్చా?

- మంజుల, బోధన్.

✔ పుట్టుమచ్చలు ప్రతి ఒక్కరిలో సహజమే. పుట్టిన వెంటనే గుర్తింపు కోసం పుట్టుమచ్చల్ని వెతుక్కోవాల్సి వస్తుంది. వీటిల్లో కొన్ని వయసుని బట్టి పెరిగితే మరికొన్ని ఎదిగే కొద్దీ వస్తాయి. కొందరిలో ఇవి వంద వరకూ ఉంటాయి. మరికొందరిలో అంతకంటే ఎక్కువ కూడా కనిపించొచ్చు. తెల్లగా ఉండేవారిలో ఎక్కువ పుట్టుమచ్చలు కనిపించే అవకాశం ఉంటుంది. ఈ పుట్టుమచ్చల్లో రకాలూ ఉన్నాయి. వాటిల్లో మొదటిది కంజినేటల్ మోల్స్. ప్రతి వందమందిలో ఒకరికి ఈ తరహా పుట్టుమచ్చ కనిపిస్తుంది. కొందరిలో రెండు కూడా ఉండొచ్చు. ఇది వివిధ పరిమాణాల్లోనూ ఉండొచ్చు. ఈ తరహా పుట్టుమచ్చ ఉన్నవారిలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువే. ఇక మరోరకం ఎటిపికల్ మోల్. ఇది వేర్వేరు రంగుల్లో ఒక ఆకృతి లేకుండా ఉంటుంది. ఇవి వంశపారంపర్యంగా వస్తాయి. నిజానికి కంజినెంటల్ మోల్ కంటే ఈ రకం పుట్టుమచ్చలున్నవాళ్లకి క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇక మరోరకం అక్వైర్డ్ మోల్స్. పుట్టిన తరవాత పెరుగుతాయి. ఇలాంటివి వందలో యాభై శాతం మందికి వస్తాయి. వీటివల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉండదు. కానీ వీటిల్లో ఏదైనా రంగు మారినా, అసమతుల్యంగా మారినా డాక్టర్‌ని సంప్రదించాల్సిన అవసరం ఉంది. మీకున్న సమస్య ఇదే. అయితే పుట్టుమచ్చలు పెరగకుండా ఉండాలంటే ముందు నుంచీ జాగ్రత్త తీసుకోవాలి. యూఏవీ, యూఏబీ - ఎస్‌పీఎఫ్ 30 ఉన్న సన్‌స్క్రీన్‌ని రాసుకోవాలి. లేదంటే ఎండ ప్రభావానికి మెలనోసైట్స్ పెరిగి పుట్టుమచ్చల్లో మార్పులు వచ్చే అవకాశం ఉంది. ఇక ఈతా, మంచు వాటితో పుట్టుమచ్చలు పెద్దగా కావడం, మరిన్ని పెరగడం వంటి సమస్యలు ఎదురుకావచ్చు. ఇంట్లో సొంతంగా తీసే ప్రయత్నం చేస్తారు. ఇది ప్రమాదకరం. సమస్య ఉంటే... వైద్యులు సర్జికల్‌గా, రేడియో ఫ్రీక్వెన్సీ ద్వారా తీసేస్తారు. ఉబ్బెత్తుగా ఉండే పుట్టుమచ్చలపై వెంట్రుకలు తీయడానికి లేజర్ ఉపయోగించొచ్చు. వీటిని నిరోధించడానికి ఎలాంటి క్రీములూ, మాత్రలూ పనిచేయవు.

బంగారం-వెండి




IIన ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	30,640	30,570	30,460	30,460
ఆర్నమెంట్	28,630	28,550	28,300	28,300
వెండి (కిలో)	39,780	39,790	40,200	40,200
	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	30,420	30,350	30,300	30,220
ఆర్నమెంట్	28,240	28,130	28,330	28,260
వెండి (కిలో)	39,900	39,600	39,300	39,200
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	30,260	30,260	-------	-------
ఆర్నమెంట్	28,140	28,140	2,833	2,826
వెండి (కిలో)	39,900	39,900	41.80	41.80

కొవ్వు తగ్గించే బఠాణీ

ఈ కాలంలో పచ్చి బఠాణీలు ఎక్కువగా దొరుకుతాయి. వీటిలో ఉండే పోషకాలు ఆరోగ్యానికి చేసే మేలు అంతాఇంతా కాదు. అందుకే వీటిని మీ వంటకాల్లో ఎక్కువగా చేర్చుకోండి.



- వీటిలో కొవ్వు శాతం తక్కువగా ఉంటుంది. అలాగే వీటి నుంచి లభించే కెలొరీలు కూడా తక్కువే. అందుకే బరువు తగ్గాలనుకునేవారు వీటిని పుష్కలంగా తినొచ్చు.
- వృద్ధాప్య ఛాయలు తగ్గించే యాంటీఆక్సిడెంట్లు వీటిలో ఉంటాయి. ఇవి మీ చర్మానికి సహజ మెరుపు తీసుకొస్తాయి.
- బఠాణీల్లో పీచుశాతం ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది.
- కంటిచూపును మెరుగుపరచడంలో వీటిలో ఉండే విటమిన్-ఎ సహాయపడుతుంది.
- కాలిన గాయాలేమైనా ఉంటే మంట తగ్గడానికి వీటి గుజ్జును రాసి చూడండి. సత్వర ఉపశమనం ఉంటుంది.

నజరానా

మిగిలిపోయిన బ్రెడ్ ముక్కల్ని ఫ్రిజ్‌లో పెడుతోంటే... అల్యుమినియం ఫాయిల్‌లో చుట్టాలి. అప్పుడే అవి పాడిబారకుండా తాజాగా ఉంటాయి.


రంగవల్లిక

మూడువైపులా ముగ్గు వేసి ఒకవైపు మాత్రం వదిలేయడం మర్చిపోవద్దు.



15 చుక్కలు, 7 వరుసలు, 7 వచ్చేవరకు (చిత్రంలో చూపిన విధంగా అటూఇటూ ఒక్కో చుక్క అన్ని వైపులా వదిలేయాలి)

కట్టమూరి వ్యూహశ్రీ, గుంటూరు



19 చుక్కలు 3 వరుసలు పెట్టి అటూఇటూ 2 చుక్కలు వదిలి ఆపై మరో చుక్క వదిలి పెట్టుకోవాలి(చిత్రంలో చూపిన విధంగా)



గోకవరపు సుహాసిని, మచిలీపట్నం

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
హైదరాబాద్. - 501 512.
email: vasundhara@eenadu.net

ప్రకృతిపై ప్రేమతో...

ఆమెకు వ్యాపారం చేయడమంటే ఇష్టం. అంతే ఉత్సాహంగా అందులోకి దిగితే బోలెడు సమస్యలు వచ్చి పడ్డాయి. అయినా ఆమె ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. ఈసారి కాస్త వైవిధ్యంగా, సృజనాత్మకంగా ఆలోచించింది. పర్యావరణ ప్రేమికురాలిగా మారి జ్యూట్‌తో వ్యాపారం మొదలుపెట్టింది. ఆవిడే హైదరాబాద్‌కి చెందిన లక్ష్మీ సౌమ్య.



మేం మొదట మల్కాజ్‌గిరిలో ఉండేవాళ్లం. పెళ్లాయ్యాక మావారి సాయంతో ఒక బొతిక్ ప్రారంభించా. కొత్తల్లో బాగానే ఉన్నా... వ్యాపార మెలకువలు తెలియకపోవడంతో నష్టం వచ్చింది. ఆర్థికంగా దాన్నుంచి కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. ఆ తరువాత మేం ప్రగతినగర్‌కి మారాం. ఇక్కడికొచ్చాక ఇంకేదయినా వ్యాపారం చేయాలని అనిపించింది. మావారికి చెబితే మరోసారి ఆలోచించుకోమన్నారు. మేం ఉంటున్న ప్రాంతం పచ్చదనానికి చిరునామాలా కనిపిస్తుంది. దీనికి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు కూడా వచ్చింది. ఇక్కడ ప్లాస్టిక్ సంచులను దాదాపు వాడరు. అది చూశాక నాకు పేపరు బ్యాగులను తయారుచేయాలనే ఆలోచన వచ్చింది. అయితే కాగితం సంచులు ఎక్కువ కాలం మన్నవు. వాటిలో కాస్త ఎక్కువ బరువున్న వస్తువులను తీసుకువెళ్లలేం. చివరకు జ్యూట్ బ్యాగుల్ని తయారుచేస్తే ఎలా ఉంటుందని అనిపించింది. దానికోసం ఎలీప్‌లో శిక్షణ తీసుకున్నా. శిక్షణ ఇప్పించడమే కాకుండా మొదట్లో యంత్రాలను ఇచ్చి వెన్ను తట్టారు.

భయంగానే మొదలు పెట్టా....

ఒక మహిళ సహాయంతో, ఒకే యంత్రంతో యాభై వేల రూపాయల పెట్టుబడితో 'సాయి కార్తికేయ జ్యూట్ ప్రొడక్ట్స్'ను రెండున్నరేళ్ల కిందట ప్రారంభించా. బ్యాగుల్ని తయారుచేసి పెయింటింగ్ చేత్తోనే వేసేదాన్ని. వ్యాపారం ప్రారంభించడం ఒకెత్తు అయితే దాన్ని కొనసాగించడం మరొకెత్తు. పెట్టిన చిన్న మొత్తం కాస్తా అయిపోయింది. బ్యాంకుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. ఆ సమయంలో మావారే మరికొంత మొత్తాన్ని తెలిసిన వారి దగ్గర చేబదులుగా తీసుకుని నా వ్యాపారం కుంటుపడకుండా ఆదుకున్నారు. మెల్లమెల్లగా వ్యాపారం ఊపందుకోవడంతో మరి కొంతమందిని నియమించుకున్నా. ప్రస్తుతం నా వద్ద ఇరవై మంది పనిచేస్తున్నారు.

పౌచ్‌ల నుంచి స్ట్రాలర్స్ వరకు...

వినియోగదారుడికి అందుబాటు ధరలో నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. బ్యాగుల తయారీకి కావాల్సిన ముడి సరకును కోల్‌కతా, చెన్నై నుంచి తెప్పించుకుంటా. రంగులూ, ఇతర సామగ్రి ఇక్కడ మన హైదరాబాద్‌లోనే దొరుకుతుంది. క్రమంగా వినియోగదారులు పెరిగారు. మొదట్లో 18 లక్షల రూపాయల టర్నోవర్ ఉండేది. ఇప్పుడది 85 లక్షలకు చేరింది. ఈ సంవత్సరం కోటి రూపాయలకు చేరుకోవాలనుకుంటున్నా. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లే కాదు తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. మా దగ్గర అన్ని రకాల బ్యాగులు లభిస్తాయి. చిన్న పిల్లలు పెన్సిళ్లు పెట్టుకునే పౌచ్‌లూ, ట్రేలూ, కాలేజీ బ్యాగులూ, స్లింగ్స్, టోటే బ్యాగులూ, హ్యాండ్ బ్యాగులూ, సూట్‌కేసులూ, ఫైల్ ఫోల్డర్లు, ఎగ్జిక్యూటివ్, ల్యాప్‌టాప్ బ్యాగులూ, స్ట్రాలర్స్....ఇలా అన్ని రకాలూ ఉంటాయి. ధర కూడా రూ.20 నుంచి రూ.3500 వరకూ ఉంటుంది. స్కూళ్లూ, కాలేజీలూ, బ్యాంకులూ, ఇతర సంస్థలకు మా ఉత్పత్తుల్ని అందిస్తున్నాం. కేవలం మా దగ్గర ఉన్న ఉత్పత్తులే కాదు.. వాళ్లు కోరిన డిజైనులో కూడా తయారుచేసి ఇస్తాం. లోటస్ ఇంటర్నేషనల్ స్కూల్, కెనడీ, ప్రతిభా విద్యాసంస్థలకూ స్కూల్ బ్యాగులు, ప్రమోషనల్స్ బ్యాగ్‌లు అందించాం. అలాగే నేషనల్ స్మాల్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్, నేషనల్ జ్యూట్ బోర్డులు నిర్వహించే ప్రతి ఎగ్జిబిషన్‌లో మా స్టాళ్లు తప్పనిసరిగా ఉంటాయి. ప్రింటు, డిజైను, డిజిటల్ ప్రింటింగ్, ఎంబ్రాయిడరీ.. ఇలా వినియోగదారుల అవసరాలకు తగినట్లుగా వాటిని రూపొందిస్తాం. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ (టీఐఎస్‌ఎస్), మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ సంయుక్తంగా భారతదేశం మొత్తంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాగంగా బెస్ట్ స్టార్టప్ ఉమన్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా తెలంగాణ నుంచి ఇద్దరు ఎన్నికయ్యారు అందులో నేనూ ఉన్నా. పర్యావరణానికి మేలు చేసే దిశలో జ్యూట్ బ్యాగులు తయారు చేస్తున్నందుకు కిందటేడాది మేలో టాటా సంస్థ నుంచి జాతీయ అవార్డు లభించింది. ఏపీ సీఎం చంద్రబాబు మా ఉత్పత్తుల్ని మెచ్చుకున్నారు. టెక్స్‌టైల్ ఎక్స్‌పో, ఆంధ్రాబ్యాంకు, సీసీఎంబీ, జేఎన్‌టీయూ, ఉమెన్ పార్లమెంట్ సదస్సుకూ మా బ్యాగులను సరఫరా చేశాం. భవిష్యత్తులో మరింతగా వ్యాపారాన్ని వృద్ధి చేసి నాలాంటి ఎందరికో ఉపాధి కల్పించాలనుకుంటున్నా. అలాగే తక్కువ పెట్టుబడితో చిరు వ్యాపారాలు చేయాలనుకునే మధ్యతరగతి మహిళలకు మా సంస్థ ద్వారా సహాయం చేయాలనుకుంటున్నాం.

ఈనాడు
హైదరాబాద్, శుక్రవారం
జనవరి 12, 2018

రయ్ రయ్

మా చిరునామా: రయ్ రయ్..
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
హైదరాబాద్ - 501512

autopage@eenadu.in

బ్యాటరీతో సూపర్ పోటీకి

లక్షల్లో ధర.. భారీ సీసీ.. ఆకట్టుకునే ప్రత్యేకతలు.. సూపర్‌బైక్ అనగానే మదిలో మెదిలేవివే. ఈ ఫీచర్లతోపాటు కేవలం విద్యుత్తుతోనే నడిచే 'ఎంఫ్లక్స్ వన్' అనే సూపర్‌బైక్ రాబోతోంది. ఆ సంగతులేంటంటే.

- ఎంఫ్లక్స్ వన్ భారత్‌లో విద్యుత్తుతో నడిచే మొదటి సూపర్‌బైక్. 2018 దిల్లీ ఆటో ఎక్స్‌పోలో కనువిందు చేయబోతోంది.
- 22మందితో కూడిన ఇంజినీర్ల బృందం రూపకర్తలు. 9.7కిలోవాట్ల విద్యుత్తు బ్యాటరీ 80బీహెచ్‌పీని ఉత్పత్తి చేస్తూ బండిని సూపర్‌గా పరుగులు పెట్టిస్తుంది.
- హై-ఎండ్ కార్లు, బైక్‌లకు ఉపయోగించే 'బ్రెంబో' బ్రాండ్ బ్రేకుల్ని వాడారు.
- రేసింగ్ బైక్‌లకు వాడే ఓహ్లిన్స్ సస్పెన్షన్ సిస్టమ్ అదనపు హంగు.
- రెండు చక్రాలకూ ఏబీఎస్ (యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్) ఉంది.
- స్మార్ట్‌ఫోన్‌తో సైతం అనుసంధానించగలిగే కన్సోల్ తెర.
- మూడు సెకన్లలో వంద కిమీల వేగం అందుకుంటుంది.



- ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఏకధాటిగా 200కిమీల దూరం ప్రయాణిస్తుంది. ధర సుమారు ఐదున్నర లక్షలు.

ఓల్డ్ ఈజ్ గోల్డ్... ఆటోమొబైల్ రంగానికి అతికే మాట... రోజుకో కొత్త మోడల్ మార్కెట్‌ని ముంచెత్తుతున్నా... కోరిన ఫీచర్లతో ధరలు అందుబాటులో ఉన్నా... జనం సెకండ్‌హ్యాండ్ కార్లకు రైట్ రైట్ అంటున్నారు... కొత్త వాహనాలకు దీటుగా ప్రి-ఓన్డ్ కార్ల వ్యాపారాన్నీ పరుగులు పెట్టిస్తున్నారు... అంతగా వాళ్లను ఆకట్టుకుంటున్న సంగతులేంటి? టాప్‌గేర్‌లో నడుస్తున్న సెకండ్‌హ్యాండ్ కార్ల వ్యాపారం జోరుకు కారణాలేంటి? ఆ విషయాలేంటో కనిపెడుతూనే.. ఈ ట్రెండ్‌పై ఓ కన్నేద్దాం రండి.



పాత కారు.. కొత్త జోరు

ఎవరైనా కారుకి ఓనరయ్యారంటే నిన్నమొన్నటిదాకా వాళ్లు డబ్బున్నవాళ్ల కిందే లెక్క. ఇప్పుడు వేతనజీవులూ, మధ్యతరగతి మారాజులూ, కుటుంబ అవసరాలు పెరిగిపోతున్నాయని భావిస్తున్నవారూ స్టీరింగ్‌ని గిరగిరా తిప్పేస్తున్నారు. కారు ఓ అవసరంగా భావించడం.. పెద్దపెద్ద ఆటోమొబైల్ కంపెనీలు అవకాశాలతో ఊరించడం.. అందుబాటులో రుణాలు.. అన్నింటికీ మించి సెకండ్‌హ్యాండ్ కార్ల మార్కెట్ విస్తరించడంతో కారు కొనడం మహా తేలికైపోతోంది. అందుకే మరి 2016లో ఏకంగా 36లక్షల సెకండ్‌హ్యాండ్ వాహనాలు అమ్ముడయ్యాయి. 2020 నాటికి డెబ్బైలక్షలకు చేరుతాయని అంచనా.

ఎందుకు కొంటున్నారంటే..

డ్రైవింగ్ నేర్చుకోవడానికి	7%
వ్యక్తిగత అవసరాల కోసం	35%
ఇంట్లో రెండో కారు	20%
వాల్యూ ఫర్ మనీ	29%
ఇతర కారణాలు	9%

- మొదటిసారి సెకండ్‌హ్యాండ్ కారు కొనుగోలు చేస్తున్నవారు - 55%
- ఇంతకుముందే కారు ఉన్న కుటుంబం - 41%
- ఉన్న కారు అమ్మేసి వేరేది కొంటున్నవారు - 4%
- పురుషులు - 80%
- మహిళలు - 20%

(ఆధారం: క్రిసిల్)

ఎందుకు కొంటున్నారంటే..

పాత కారు కొనడం గతంలో పెద్ద ప్రహసనం. వాహనం గురించి వాకబు చేయడం.. 'కార్ ఫర్ సేల్'ని కనిపెట్టేయడం.. ధర బేరమాడటం.. ఎన్ని కష్టాలో! ఇప్పుడంత సీన్ అవసరం లేదు. బ్రాండ్, మోడల్, ధర, తిరిగిన కిలోమీటర్లు, ఫీచర్లు... అంతర్జాలంలో అన్నీ సెట్ చేసేసి ఒక్క క్లిక్ కొడితే చాలు. ఊరూవాడతో సహా ఎక్కడెన్ని అమ్మకానికి ఉన్నాయో క్షణాల్లో కంప్యూటర్ తెరపై ప్రత్యక్షం అవుతాయి. ఇలాంటి వివరాలు అందించడానికి, ఆన్‌లైన్‌లోనే బేరసారాలాడ్డానికి ఓఎల్ఎక్స్, కార్ ట్రేడ్, కార్ వాలా.. అంటూ బోలెడు సైట్లు. కాస్త తీరిక చేసుకొని కాలు బయటపెడితే 'మీ పాత కారు మేం కొంటాం.. మీకు నచ్చే కారు అమ్ముతాం' అనే డీలర్‌షిప్‌లు వందల్లో ఉన్నాయ్. చిన్నాచితకాతోపాటు లెక్కేసుకుంటే ఇలాంటివి దేశవ్యాప్తంగా పందొమ్మిదివేలు ఉన్నాయ్ అంటోంది ఇండియన్ బ్లూ బుక్ సర్వే. చెన్నైలో మహాలింగం, ముంబయిలో షమన్.. బాగా పేరున్నవాటిలో కొన్ని. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వాహనాల్ని తీర్చిదిద్ది, ఏవైనా మరమ్మతులుంటే సరిచేయించి సర్టిఫైడ్ కార్లంటూ గ్యారెంటీలు కూడా ఇచ్చేస్తున్నాయి. మరోవైపు రుణాలిచ్చేందుకు బ్యాంకులు, ఇతర సంస్థలు ఉండనే ఉన్నాయి. ఇన్ని సౌలభ్యాలు ఒకవైపు.. రాన్రాను మధ్యతరగతి వర్గం విస్తరించడంతో ప్రి-ఓన్డ్ వ్యాపారం జోరందుకుంటోంది.

కొనేముందు..

ఎన్ని అనుకూల అంశాలున్నా పాత కారు కొనడంలో కొన్ని ఇబ్బందులూ ఉన్నాయి. అందుకే కారు కొనేముందు ఈ జాగ్రత్తలు తప్పనిసరి.

- కారు కొనడం ఒకెత్తు. దాన్ని మెయింటెయిన్ చేయడం మరో ఎత్తు. మరమ్మతులు, బీమా, ఇతర పన్నులు.. తర్వాత ఖర్చులు చాలానే ఉంటాయి. ఇవన్నీ భరించగలిగే స్తోమత ఉన్నపుడే కారు కొనే ఆలోచన చేయండి.
- కారు కొనేముందు కొంచెం పరిశోధన చేసి తీరాల్సిందే. ఏ మోడల్ కార్లు ఏ ధరలో దొరుకుతున్నాయో నాలుగైదు వెబ్‌సైట్లలో వెతకాలి. సన్నిహితుల, మెకానిక్‌ల అభిప్రాయం తీసుకోవాలి.
- వాహనం కొనేముందు కచ్చితంగా చేయాల్సింది టెస్ట్ డ్రైవింగ్. ఇంజిన్ పనితీరు, ఏవైనా అసాధారణ శబ్దాలు వస్తున్నాయా? స్టీరింగ్ వణకడం, మైలేజీ, టైర్ల పరిస్థితి.. టెస్ట్ డ్రైవ్‌కి వెళ్తేనే ఇవన్నీ తెలుస్తాయి.
- కారు లోపల, బయట ప్రతి విభాగాన్నీ క్షుణ్నంగా పరిశీలించాల్సిందే. గీతలు పడటం, డ్యామేజీ, హెడ్‌లైట్ల పనితీరు.. అన్నీ గమనించాలి.
- దొంగిలించినవి, లీజుకు తీసుకున్నవి సెకండ్‌హ్యాండ్‌లో అమ్మే ప్రమాదం ఉంది. సీరియల్ నెంబర్, రిజిస్ట్రేషన్, ఇతర పత్రాలు తప్పకుండా పరిశీలించాలి.
- చివరిదశలో మొహమాటం లేకుండా ధర విషయమై బేరమాడాలి. ఒప్పందం కుదిరితే ఆ వివరాలు రాతపూర్వకంగా ఉండాలి.
- స్టీరింగ్ మన చేతికి అందగానే చేయాల్సింది యజమాని పేరు బదలాయింపు. భవిష్యత్తులో ప్రమాద బీమా, ఇతర చిక్కులు లేకుండా ఉండాలంటే ఇది వెంటనే అమలు జరగాలి.
- కారు కొన్ననాటి నుంచి సమయానికి సర్వీసింగ్ చేయించారా? లేదా? అన్నది పరిశీలించాలి. చాలా సంస్థలు ఆ వివరాలన్నీ యాప్ రూపంలో పొందు పరుస్తున్నాయి.
- రిజిస్ట్రేషన్ నెంబరు, ఇంజిన్, ఛాసిస్ నెంబర్ల ఆధారంగా పాతకారుకు సంబంధించి ఏవైనా పెండింగ్ చలానాలు, కేసులు ఉన్నాయో, లేదో కనుక్కోవచ్చు.



బరిలో దిగ్గజాలు

అసలే లక్షల కోట్ల వ్యాపారం. సహజంగానే ఈ అవకాశం అందిపుచ్చుకోవడానికి మారుతిసుజుకీ, మహీంద్రా, హ్యుందాయ్, నిస్సాన్‌లాంటి టాప్ కంపెనీలు రంగంలోకి దిగాయి. మార్కెట్ లీడర్ మారుతిసుజుకీ పదిహేనేళ్ల కిందటే 'మారుతి సుజుకీ ట్రూ వ్యాల్యూ' పేరుతో ప్రత్యేకంగా పాత కార్ల అమ్మకాల ఔట్‌లెట్లు తెరిచింది. మహీంద్రా 'ఫస్ట్ ఛాయిస్ వీల్స్', హ్యుందాయ్ 'హెచ్-ప్రామిస్' అంటూ పోటీలోకొచ్చాయి. ఈమధ్యే నిస్సాన్ సైతం 'నిస్సాన్ ఇంటలిజెంట్ ఛాయిస్' పేరుతో రంగంలోకి దిగింది. ఇతర డీలర్‌షిప్‌లకు భిన్నంగా.. వినియోగదార్లను ఆకట్టుకునేలా రకరకాల ఆఫర్లు ప్రకటించడం.. రుణ వ్యవహారాలు వాళ్లే పర్యవేక్షించడం.. పాత కారు కొన్నా గ్యారెంటీ ఇవ్వడం.. ఉచిత సర్వీసింగ్‌లు అంటూ వినియోగదార్లకు కొత్త కారు కొన్న అనుభూతిని పంచుతున్నాయి. దిగ్గజాల రాకతో ఈ వ్యాపారం వ్యవస్థీకృత రంగంగా మారిపోతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సెకండ్‌హ్యాండ్ కార్ల డీలర్‌షిప్‌లు పందొమ్మిదివేలు ఉంటే ఆటోమొబైల్ కంపెనీల వ్యవస్థీకృత ఔట్‌లెట్ల సంఖ్య 1500 దాటింది. సియామ్ లెక్కల ప్రకారం పదేళ్ల కిందట కారు సగటు వినియోగం తొమ్మిదేళ్లు. ఇప్పుడది ఆరున్నరేళ్లకు పడిపోయింది. 2021నాటి ప్రతి కారును మూడున్నరేళ్లకు మించి వాడరనే అంచనాలున్నాయి. కాస్త డబ్బున్నవాళ్లు కొత్త పంచకళ్యాణి బాట పడుతుంటే కారుకు యజమాని కావాలనునేవారు సెకండ్‌హ్యాండ్‌కి రైట్‌రైట్ చెబుతున్నారు.

గాల్లో తేలినట్టుండే..

అధ్వానమైన రోడ్లని చూస్తే ఎవరికైనా 'ఫిదా'లో వరుణ్‌తేజ్‌లా 'డామ్న్ రోడ్స్' అని తిట్టేయాలనిపిస్తుంది. అంతేగానీ సాయిపల్లవిలా 'మా రోడ్లు మా ఇష్టం' అని సర్దుకుపోయి ప్రయాణం చేయలేరుగా. అలా చేస్తే వెన్నెముక, ఇతర సమస్యలొస్తాయి. ఇదిగో.. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేలా 'ఫ్లోట్ ఎయిర్ సస్పెన్షన్ సీటు' రూపొందించారు ముగ్గురు యువకులు. దీన్ని వాహనాల్లో అమర్చుకుంటే ఎలాంటి కదుపులు లేకుండా హాయిగా గాల్లో తేలిపోతున్నట్టే ఉంటుంది అంటున్నారు.






విశ్వనాథ్, సంతోష్, మాధవ్.. తెలుగు కుర్రాళ్లు. సూరత్ ఎన్ఐటీ ఇంజినీరింగ్ పట్టభద్రులు. చదువైపోగానే కొంతకాలం బహుళజాతి సంస్థల్లో కొలువు చేశారు. జేబు నిండుతున్నా నాలుగ్గోడలకే పరిమితం అవుతున్నామనే అసంతృప్తి వేధించేది. ఇలా కాదనుకొని ఏదైనా సొంత కంపెనీ ప్రారంభించాలనుకున్నారు. అదేసమయంలో జనం ఎదుర్కొనే ఓ సమస్యకూ పరిష్కారం చూపించాలని భావించారు. అలా ముగ్గురి దృష్టి దేశంలో చాలాచోట్ల దారుణంగా ఉండే సగటు రహదారులపై పడింది. గతుకుల రోడ్లపై గంటలకొద్దీ చేసే ప్రయాణంలోని ప్రయాస వీళ్లకి తెలుసు. ఈ సమస్యకు చెక్ పెట్టే అంకురసంస్థ ప్రారంభించాలనే నిర్ణయానికొచ్చారు. ఆలోచన ముందు కాగితాల్లోకి చేరి, ఆపై కార్యాచరణగా మారింది. మూడేళ్ల కష్టంతో ఫ్లోట్ ఎయిర్ సస్పెన్షన్ సీటుని ఆవిష్కరించి పేటెంట్ కూడా దక్కించుకున్నారు. వీరి ప్రయత్నానికి అహ్మదాబాద్‌లోని ఎన్‌డీబీఐ (నేషనల్ డిజైన్ బిజినెస్ ఇంక్యుబేటర్) నుంచి సాయం కూడా అందింది.

ఈ సీటు ఓ ఎయిర్ బెడ్. వేర్వేరు గాలి బుడిపెలతో నిండి ఉంటుంది. దీనిపై ఎవరైనా కూర్చోగానే బుడిపెల్లో తక్కువశాతంలో ఉన్న గాలి ఒక దాంట్లో నుంచి మరో దాంట్లోకి సర్దుకుంటుంది. కుదుపుల్లో కదలికల ఆధారంగా ఒకదాంట్లోని నుంచి మరో దాంట్లోకి గాలి సర్దుకుంటూ పిక్కలు, పిరుదులు, వెన్నెముకపై ఒత్తిడి పడకుండా చేస్తుంది. దీంతో దీనిపై కూర్చొని వాహనం నడిపేవారికి గాలిలో తేలుతున్న ఫీలింగ్ కలుగుతుంది. రెండు ఆకారాల్లో తీర్చిదిద్దిన వీటిని సులువుగా బైక్, కారు సీట్లకు అమర్చుకోవచ్చు. అందుబాటులో ఉన్న 'ఎయిర్ హాక్' టెక్నాలజీ సాయంతో మనదేశంలోని రోడ్లు, వాహనాలకు సరిపోయేలా మార్పులు చేసి ఈ సీటు రూపొందించారు. ఈ డిజైన్ 2015లో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నుంచి ఉత్తమ ఆవిష్కరణగా ఎంపికైంది. టీఐఈ-ఏసియా, సీఐఐ ఎంపిక చేసిన టాప్-5 ఆవిష్కరణల్లో ఒకటిగా నిలిచింది. పూర్తి వివరాలు, ఆర్డర్ కోసం https://goo.gl/Tzz15T

'లోగో'ట్టు



నింగి.. నేల.. నీరు!

భారత్‌లో ఖరీదైన కారు అనగానే బెంజ్ గుర్తొస్తుంది. గోట్లైబ్ డైమ్లర్, విల్హెమ్ మేబాక్ అనే జర్మన్లు ఈ కంపెనీ ప్రారంభించారు. మేబాక్ పెద్ద కూతురు పేరు మెర్సిడెస్. 1926లో బెంజ్ అండ్ సీ అనే మరో ఆటోమొబైల్ కంపెనీతో జట్టు కట్టాక మెర్సిడెస్-బెంజ్ అనే కొత్త కంపెనీ పురుడుపోసుకుంది. తమ కంపెనీ నేల, నీరు, ఆకాశం.. మూడింట్లో ఆధిపత్యం చలాయించాలనే ఉద్దేశంతో త్రీపాయింటెడ్ స్టార్‌ని లోగోగా రూపొందించారు. అప్పట్నుంచీ ఏ మార్పులూ లేకుండా అలాగే కొనసాగిస్తున్నారు.

మెకానిక్ గురూ!

బ్యాటరీ మార్చాలా? రీఛార్జ్ చాలా?

- నా బైక్ ఈమధ్య సరిగా సెల్ఫ్‌స్టార్ట్ కావడం లేదు. లైట్ల వెలుతురు కూడా తక్కువగా వస్తోంది. కొందరు స్నేహితులు బ్యాటరీని రీఛార్జ్ చేయమంటున్నారు. మెకానిక్ దగ్గరికి వెళ్తే బ్యాటరీ మార్చేయాలంటున్నాడు. ఏది కరెక్ట్? సలహా ఇవ్వండి. **- శ్రీనివాస్, అద్దంకి**

మీ బైక్ కొని మూడేళ్లు దాటితే బ్యాటరీ మార్చేస్తేనే మంచిది. లేదంటే బ్యాటరీ షాప్‌నకు వెళ్లి బ్యాటరీ సెల్స్ ఓసారి చెక్ చేయించండి.



అవి బలహీనంగా ఉంటే బ్యాటరీ మార్చడం తప్ప మరో మార్గం లేదు. ఫర్వాలేదనుకుంటే ఛార్జింగ్ చేసినా సరిపోతుంది.

- నా హోండా సిటీ కారుకు 175-65-ఆర్14 టైర్లున్నాయి. దీంతో గ్రౌండ్ క్లియరెన్స్ తక్కువగా ఉంది. దీన్ని పెంచడానికి 175-75-ఆర్14 టైర్లకి మారవచ్చా? **- జగదీశ్ బల్ల, ఈమెయిల్**

కారు గ్రౌండ్‌క్లియర్స్ పెంచడానికి టైర్ల సైజు పెంచాలనే ఆలోచన అస్సలు మంచిది కాదు. మెకానిక్, నిపుణుల సలహా లేకుండా ఇలాంటి భారీ మార్పులు చేయడం ప్రమాదకరం. టైర్ల పరిమాణంలో ఉండే 'ఆర్' రేడియస్‌ను సూచిస్తుంది. ప్రస్తుతం మీ కారుకు ఉన్న, మార్చాలనుకుంటున్నవి రెండూ రేడియస్ 14. అయితే టైరు పరిమాణం పెంచుతున్నామంటే అర్థం వీల్ ఆర్క్, సస్పెన్షన్, ముందు యాక్సిల్/డ్రైవ్ షాఫ్ట్‌ల మధ్య దూరం తగ్గిస్తున్నామని. ఇలా చేసినపుడు కారు వంపులు తిరిగేచోట టైరు వీల్ ఆర్క్, డ్రైవ్‌షాఫ్ట్, సస్పెన్షన్‌ని ఒరుసుకుంటుంది. దీంతో విపరీతమైన వేడి ఉత్పత్తై.. టైర్ కట్ అయ్యే లేదా పేలిపోయే అవకాశం ఉంది. ఫలానా వాహనానికి ఫలానా టైరే వాడాలని కచ్చితమైన నిబంధనలు ఉంటాయి. ప్రమాదాన్ని కోరి తెచ్చుకోకుండా ఉండాలంటే ఎలాంటి మార్పులకు వెళ్లకుండా ఉంటేనే మంచిది.

- సాయిభరత్ బొప్పరాజు, మోటోఫిక్స్

వాహన సురక్ష

ఊహించని ప్రమాదం.. అందుతుంది పరిహారం



కాంప్రహెన్సివ్ పాలసీ అంటే...

అనుకోని పరిస్థితుల్లో వాహనానికి ఏదైనా ప్రమాదం జరిగితే పూర్తి నష్టపరిహారం పొందే ఉద్దేశంతో చేయించుకునేదే కాంప్రహెన్సివ్ (సమగ్ర) బీమా. ఈ పాలసీనే 'బీ పాలసీ' అని కూడా అంటారు. దీనికి చెల్లించే ప్రీమియం వాహనం యజమాని చెప్పే విలువను బట్టి ఉంటుంది. యజమాని నిర్ణయించే విలువ కాబట్టి దీన్ని insured declared value (IDV) అంటారు. బీ పాలసీ థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌కి అదనంగా, వాహనానికి జరిగే నష్టాన్ని కూడా బీమా కంపెనీ భరిస్తుంది. బీమా చెల్లించేటప్పుడు వాహనం వయసు, ఇతర తరుగుదల తీసివేసి.. నష్టపోయిన విలువను లెక్కించి ఇస్తారు. అలా కాకుండా ఎలాంటి తరుగుదల లేకుండా మొత్తం పరిహారం దక్కాలంటే NIL depreciation policy తీసుకోవాలి. ఐదేళ్లలోపు కొత్త వాహనాలకే ఈ అవకాశం ఉంటుంది.

సహజంగా ఏ బీమా సౌకర్యం అయినా వాహన యజమాని చెల్లించే ప్రీమియంపైనే ఆధారపడి ఉంటుంది. ప్రైవేటు కార్లు, మోటార్ సైకిళ్లపై ప్రయాణించేవారికి ప్రత్యేకంగా బీమా కట్టే సౌకర్యం లేదు. అందుకే కారు యజమానికి, మోటార్‌సైకిల్ యజమానికి కొంత అధిక ప్రీమియం తీసుకొని వ్యక్తిగత ప్రమాద బీమా కింద కొంతమొత్తాన్ని చెల్లిస్తారు. అదికూడా వాహన యజమాని వాహనాన్ని నడుపుతున్నప్పుడు ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే వర్తిస్తుంది. ప్రైవేటు వాహనంలో ప్రయాణించేవారు, మోటార్‌సైకిల్ వెనక కూర్చొని ప్రయాణించేవారు ఏదైనా ప్రమాదంలో గాయపడినా, చనిపోయినా ఆ వాహనానికి బీ పాలసీ ఉన్నట్లైతే పాలసీ నిబంధనలకు లోబడి వారికి పరిహారం దక్కుతుంది. ఈ సడలింపు కూడా ఐఆర్‌డీఏ వారి ఆదేశానుసారం అమల్లోకి వచ్చింది. సరకు రవాణా వాహనాలు, ప్రజా రవాణా వాహనాలు బీ పాలసీ కలిగి ఉన్నా వాటిలో ప్రయాణించేవారికి ప్రీమియం చెల్లించటం వలన మాత్రమే పాలసీ నిబంధనలకు లోబడి పరిహారం చెల్లిస్తారు.

- నరేశ్ భైరపనేని

అమృతం దక్కని కూనలు

- **67.5 శాతం శిశువులకు అందని తొలిపాలు**
- **అవగాహన లోపమే అసలు కారణం**
- **ఇంకా ఇంటి వద్దే జరుగుతున్న ప్రసవాలు**
- **ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌లలో అధికం**
- **శిశు కేంద్రాలపై యునిసెఫ్ తాజా నివేదిక**

ఈనాడు- హైదరాబాద్

తెలంగాణలో ఇప్పటికీ చాలామంది బిడ్డలకు పుట్టిన వెంటనే తల్లి స్తన్యం దక్కడంలేదు.. అత్యధిక శాతంమంది నవజాత శిశువులు అమృతతుల్యమైన తల్లి పాలను కోల్పోతున్నారు. 67.5 శాతంమంది శిశువులు తొలిగంట తల్లి పాలకు నోచుకోవడంలేదు. కేవలం 23.2 శాతంమంది పిల్లలకు మాత్రమే తల్లి తొలిగంటలో పాలు పడుతుండగా.. 9.2 శాతంమంది అసలు తల్లిపాలకే నోచుకోవడంలేదు. గతేడాది రాష్ట్రంలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రాల్లో (ఎస్ఎన్‌సీయూ) చికిత్స పొందిన శిశువుల సమాచారాన్ని 'యునిసెఫ్' తాజాగా విడుదల చేసింది. ఈ నివేదికను తెలంగాణ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్‌కు అందజేసింది. అందులోని వివరాలివి..

ప్రసవమైన తొలి గంటలో తల్లి పాలలో శిశువుకు రోగ నిరోధక శక్తిని పెంపొందించే పోషకాలు అధికంగా ఉంటాయి. కాని అవగాహన లోపం కారణంగా చాలా మంది తల్లులు తమ పిల్లలకు ఈ పాలను అందించడంలేదు. గతేడాది నవజాతశిశు సంరక్షణ కేంద్రాల్లో చికిత్స పొందిన మొత్తం 29,902 మంది శిశువుల్లో 22.9 శాతంమంది కామెర్ల కారణంగానే చేరారు. తల్లులు పాలు ఇవ్వకపోవడానికి ఇదీ ఒక కారణమే. నిజానికి కామెర్లతో బాధపడుతున్న శిశువుకు తల్లిపాలు పట్టడం వల్ల వచ్చే ఇబ్బందులేవీ ఉండవని నిపుణులు చెబుతున్నారు. అయితే తొలిపాలు అంత శ్రేయస్కరం కాదనే అపోహతో ఎక్కువమంది తల్లులు వాటిని శిశువులకు ఇవ్వడంలేదు. ఈ తరహా అపోహలను తొలగించడానికి ఆసుపత్రుల్లో అవసరమైన చర్యలు చేపట్టడంలేదని ప్రస్తుత నివేదికను చూస్తే స్పష్టమవుతోంది.

అక్కరకురాని అత్యవసర వాహనాలు

- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో, ఇంటి వద్ద.. ఎక్కడ కాన్పు జరిగినా నవజాత శిశువుకు మెరుగైన వైద్యం అవసరమైతే సమీపంలోని ఎస్ఎన్‌సీయూల్లో చికిత్స ఇప్పించాలి. కాని ఇదెక్కడా అమలుకావడంలేదు. అత్యవసర చికిత్స అవసరమైన సందర్భాల్లో 82.6 శాతంమంది శిశువులను వారి తల్లిదండ్రులు సొంతఖర్చుతో ప్రైవేటు వాహనాల్లోనే తరలించినట్లు తేలింది.
- అత్యవసర సేవల్లో ఉపయోగపడే 108 వాహనాలు నవజాత శిశువుల తరలింపులో అక్కరకు రావడంలేదని ఈ నివేదిక స్పష్టంచేస్తోంది.
- ఏజెన్సీ ప్రాంతాల్లో తల్లీబిడ్డలను ఇంటి నుంచి ఆసుపత్రికి, ఆసుపత్రి నుంచి ఇంటికి తరలించడానికి ప్రభుత్వం 'అమ్మఒడి' పేరిట వాహన సౌకర్యాన్ని ప్రారంభించినా.. అవి కూడా సమయానికి ఉపయోగపడడం లేదని తెలుస్తోంది.
- అమ్మఒడి కోసం అన్ని ప్రాంతాలకూ కొత్తగా 200 వాహనాలను కొన్నా.. ఇప్పటికీ అవి ప్రారంభంకాలేదు. దీంతో చాలామంది సొంత ఖర్చుతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తుండడంతో వారిపై ఆర్థిక భారం పడుతోందని నివేదిక చెబుతోంది.
- ఎస్ఎన్‌సీయూల్లో చికిత్స పొందిన మొత్తం శిశువుల్లో 22,297 మంది (77 శాతం) మంది క్షేమంగా చికిత్స పొంది ఇంటికెళ్లగా.. 2,545 (8.8 శాతం) మంది శిశువులను మెరుగైన చికిత్స కోసం మరో ఆసుపత్రికి పంపించారు.



- 6.2 శాతం మంది చికిత్స మధ్యలోనే వెళ్లిపోగా, 8 శాతంమంది శిశువులు మృతిచెందారు.
- నవజాత శిశు సంరక్షణ కేంద్రాల్లో జాతీయస్థాయిలో 12 శాతంమంది మృతిచెందగా.. దక్షిణాది రాష్ట్రాల కంటే తెలంగాణలో ఎస్ఎన్‌సీయూల్లో శిశువుల మృతి శాతం తక్కువని నివేదిక వెల్లడించింది.

వైద్యసేవలు మెరుగవ్వాలి

- 1,800 గ్రాముల కంటే తక్కువ బరువుతో ఎస్ఎన్‌సీయూల్లో చికిత్స పొందినవారిలో 53.9 శాతం మంది క్షేమంగా ఇంటికెళ్లగా.. 25.3 శాతంమంది మృతిచెందారు. ఈ విషయంలో వైద్యసేవల్లో మెరుగుదల, శిక్షణ అవసరమని నివేదిక సూచించింది.
- మొత్తం చికిత్స పొందినవారిలో బాలురు 55.94 శాతం కాగా, బాలికలు 44.05 శాతం.
- ఇంకా రాష్ట్రంలో ఇంటి వద్దనే ప్రసవాలు జరుగుతున్నాయి. అత్యవసర చికిత్స అవసరమైన నవజాత శిశువుల్లో దాదాపు 260 మంది ఇంటివద్దే జన్మించినట్లు వెల్లడైంది.
- చికిత్స అవసరం లేనివారిలో ఇంటి వద్దే జన్మించిన వారు దాదాపు 10-12 శాతానికి పైనే ఉంటారని అంచనా. అత్యధికంగా మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇంటి వద్ద ప్రసవాలు జరుగుతున్నాయి.

అంబేడ్కర్ ప్రపంచ నాయకుడు

- **కేంద్ర సామాజిక న్యాయశాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే**



ఉస్మానియా యూనివర్సిటీ(హైదరాబాద్), న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ నాయకుడని కేంద్ర సామాజిక న్యాయశాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. భారత రాజ్యాంగాన్ని అంగీకరించని వారు దేశంలో ఉండాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఓయూ పీజీ న్యాయ కళాశాల ఆధ్వర్యంలో 'డా.బీఆర్ అంబేడ్కర్-రాజ్యాంగవాదం' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అథవాలే మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అంబేడ్కర్ భావజాలంతో పనిచేయడంతోనే రిపబ్లికన్ పార్టీ తమకు మద్దతిస్తోందని చెప్పారు. అంబేడ్కర్ బ్రాహ్మణ కుటుంబాలను ఏనాడూ వ్యతిరేకించలేదని, కేవలం బ్రాహ్మిణిజాన్ని వ్యతిరేకించారని, అందుకే శాంతియుతంగా బుద్ధిజం స్వీకరించారన్నారు. సదస్సు కన్వీనర్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. 1953 జనవరి 12న డా.బీఆర్ అంబేడ్కర్‌కు ఓయూ గౌరవ డాక్టరేట్ ఇచ్చిందని తెలుపుతూ తక్షణమే ఓయూలో అంబేడ్కర్ పరిశోధక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.జి.బాలకృష్ణన్, ఎంపీ దత్తాత్రేయ, ఓయూ ఉపకులపతి ప్రొ.రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నియంత్రణ చట్టం రద్దుచేయం

ఈనాడు, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ వేధింపుల నియంత్రణ చట్టాన్ని రద్దు చేసే ఆలోచన లేదని కేంద్ర సహాయ మంత్రి అథవాలే తెలిపారు. ఇందులో సవరణలు చేయాలని ప్రతిపాదనలు వస్తే పరిశీలిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. 'ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు' బిల్లుతోపాటు త్వరలోనే ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగహోదా కల్పించేందుకు బిల్లును తీసుకువస్తున్నామని మంత్రి తెలిపారు.

అద్వితీయంగా ముందుకెళ్లాలి

- **పంజాగుట్ట పోలీసులకు గవర్నర్ అభినందనలు**
- **తొలి మూడు స్థానాలూ రాష్ట్రంలోని ఠాణాలకే రావాలని ఆకాంక్ష**

ఈనాడు- హైదరాబాద్, పంజాగుట్ట- న్యూస్‌టుడే: ప్రజలు, ఫిర్యాదుదారులకు ఉత్తమ సేవలందిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఠాణాల్లో రెండో ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా పంజాగుట్టను నిలిపినందుకు ఆ స్టేషన్ అధికారులను గవర్నర్ నరసింహన్ అభినందించారు. మరింత నాణ్యమైన సేవలందించి ఈ ఖ్యాతిని నిలబెట్టుకోవాలన్నారు. గురువారం సాయంత్రం గవర్నర్ తన సతీమణి విమలా నరసింహన్‌తో కలిసి పంజాగుట్ట ఠాణాను సందర్శించారు. డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు ఆయనకు స్వాగతం పలికారు. దాదాపు గంటన్నరపాటు స్టేషన్‌లో ప్రతి విభాగాన్ని గవర్నర్ పరిశీలించారు. పోలీసులు నిర్విరామంగా, ప్రజలకు మిత్రులుగా పనిచేయడం వల్లే పంజాగుట్ట ఠాణాకు ఈ ఘనత దక్కిందని అభినందించారు. తన వెంట తెచ్చిన లడ్డూలను సిబ్బందికి పంచారు. వచ్చే ఏడాది తెలంగాణలోని ఠాణాలే తొలి మూడు స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. ప్రజామిత్ర పోలీసింగ్, నేరాల నియంత్రణతో హైదరాబాద్ సురక్షిత నగరంగా మారిందని డీజీపీ మహేందర్‌రెడ్డి చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రమంతా పోలీస్‌స్టేషన్లను ఇదే విధంగా మార్చే ప్రక్రియను ప్రారంభించామన్నారు. అదనపు సీపీ మురళీకృష్ణ, డీసీపీ వెంకటేశ్వరరావు, అదనపు డీసీపీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ రవీందర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు మిఠాయిలు పంచుతున్న గవర్నర్





రామచంద్రం, కల్యాణి (పాత చిత్రాలు)

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

మద్దూరు, ములుగు, న్యూస్‌టుడే: అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం సలాఖపూర్‌కు చెందిన ఏడాకుల రామచంద్రం(58) తనకున్న మూడెకరాలతోపాటు పదెకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేశాడు. సాగు పెట్టుబడులతో పాటు కుమార్తె వివాహానికి రూ.10లక్షల మేరకు అప్పులయ్యాయి. పంట దిగుబడులు రాకపోవడంతో తీవ్ర మనస్తాపంతో గురువారం పురుగులమందు తాగాడు. చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలం దేవగిరిపట్నానికి చెందిన బాదవత్ కల్యాణి(50) మూడేళ్లుగా భర్త స్వామి సహకారంతో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తుంది. పెట్టుబడి కోసం సుమారు రూ.8లక్షల మేర అప్పులయ్యాయి. దిగుబడులు సరిగా రాకపోవడంతో..మనస్తాపంతో బుధవారం పురుగులమందు తాగింది. ములుగు సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది.

భార్యను చంపిన భర్తకు యావజ్జీవ శిక్ష ఖరారు

ఉమ్మడి హైకోర్టు తీర్పు

ఈనాడు, హైదరాబాద్: తాగిన మైకంలో రోకలితో కొట్టి భార్యను చంపిన భర్తకు కింది కోర్టు విధించిన యావజ్జీవ జైలు శిక్షను ఉమ్మడి హైకోర్టు ఖరారుచేస్తూ ఇటీవల తీర్పు వెలువరించింది. హుజూరాబాద్‌కు చెందిన ఇ.శ్రీనివాస్.. 2010 అక్టోబరు 13న భార్య సరితను హత్యచేయగా, 2012 మేలో కరీంనగర్ జిల్లా కోర్టు అతనికి యావజ్జీవ శిక్షను విధించింది. దీనిని ఖరారుచేస్తూ జస్టిస్ రామలింగేశ్వరరావు, జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావులతో కూడిన హైకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించింది. 11 ఏళ్ల క్రితం సరితను ప్రేమ వివాహం చేసుకున్న శ్రీనివాస్... ఆ తర్వాత అదనపు కట్నం కోసం ఆమెను వేధించాడు. ఒకరోజు రాత్రి తాగివచ్చి భార్యతో ఘర్షణ పడి, రోకలితో కొట్టి చంపాడు. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హుజూరాబాద్ పోలీసులు దర్యాప్తు చేశారు. నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. కరీంనగర్ కోర్టు... శ్రీనివాస్‌కు యావజ్జీవ శిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. దీనిపై శ్రీనివాస్ హైకోర్టులో అప్పీలు దాఖలు చేశాడు. కింది కోర్టు సాక్ష్యాలను తీసుకున్న విధానంపై నిందితుని తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రత్యక్ష సాక్షిగా ఉన్న నిందితుని కుమార్తె వయసు తొమ్మిది ఏళ్లని, అదీ సంఘటన జరిగిన ఏడాది తర్వాత సాక్ష్యం తీసుకున్నారన్నారు. ఈ వాదనతో హైకోర్టు విభేదించింది. నిందితుడు నేరం అంగీకరించినప్పటికీ, కింది కోర్టు విచక్షణాధికారంతో విచారణను ప్రారంభించిందని పేర్కొంది. పిల్లల సాక్ష్యాన్ని యథాతథంగా తీసుకోవచ్చని, ఇందుకు చట్టం అనుమతిస్తుందని తెలిపింది.

రూ.కోట్ల విలువైన మాదకద్రవ్యం స్వాధీనం

- **కంకోల్ టోల్ ప్లాజా వద్ద పట్టుకున్న డీఆర్ఐ అధికారులు**
- **స్మగ్లర్లు చెన్నైకి చెందినవారుగా సమాచారం**

మునిపల్లి, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా మీదుగా హైదరాబాద్‌కు మెథక్లాన్ అనే ప్రమాదకర మాదకద్రవ్యాన్ని తీసుకెళుతున్న ముఠాను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు గురువారం సాయంత్రం పట్టుకున్నారు. చెన్నైకి చెందిన ముగ్గురు తమ కారులో మెథక్లాన్ మాదకద్రవ్యాన్ని తీసుకెళుతుండగా మునిపల్లి మండలం కంకోల్ వద్ద 65వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద అధికారులు స్మగ్లర్లను పట్టుకున్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని టోల్‌ప్లాజా కార్యాలయంలోకి తీసుకెళ్లి అరగంటకు పైగా విచారించి పలు వివరాలు రాబట్టినట్లు తెలిసింది. అనంతరం వారిని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మాదకద్రవ్యం విలువ రూ.కోట్లల్లో ఉంటుందని సమాచారం. ముందస్తుగా సమాచారం అందుకున్న రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు అత్యంత రహస్యంగా ఈ ప్రక్రియను పూర్తిచేశారు. స్మగ్లర్ల కారును అనుసరించి టోల్‌ప్లాజా వద్దకు రాగానే వారిని పట్టుకున్నారు. ఈ వ్యవహారమై తమకు అధికారిక సమాచారం లేదని జిల్లా పోలీసు, అబ్కారీ శాఖల అధికారులు పేర్కొన్నారు. జిల్లాలోని పటాన్‌చెరు ప్రాంతంలో ఔషధ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. గతంలోనూ ఇక్కడ మాదకద్రవ్యాలను తయారుచేసే ముఠాలను పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా చెన్నైకి చెందిన ముఠా పట్టుబడటం గమనార్హం. వీరు ఎవరికి సరఫరా చేసేందుకు దీనిని తరలిస్తున్నారనే విషయం తేలాల్సి ఉంది.



టోల్‌ప్లాజా వద్ద కారులో నుంచి మాదకద్రవ్యం పొట్లాలను తీస్తున్న ఇంటెలిజెన్స్ అధికారులు

రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక

- **28 పార్టీలతో బహుజన వామపక్ష కూటమి ఏర్పాటు**
- **25న ఆవిర్భావ సభ**
- **బీఎల్ఎఫ్ కన్వీనర్‌గా తమ్మినేని!**

ఈనాడు- హైదరాబాద్, న్యూస్‌టుడే - బాగ్‌లింగంపల్లి: తెలంగాణలో మరో కొత్త రాజకీయ వేదిక ఆవిర్భవించింది. ప్రస్తుత రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా 'బహుజన వామపక్ష కూటమి' (బీఎల్ఎఫ్) నూతనంగా ఏర్పడింది. ఎంసీపీఐ, ఆర్ఎస్‌పీ, ఫార్వర్డ్‌బ్లాక్, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ, బహుజన ఫ్రంట్, ఎంబీటీ, మహాజన సమాజం తదితర 28 పార్టీలు, ప్రజాసంఘాలతో కూడిన బీఎల్ఎఫ్ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 119 స్థానాల్లోనూ బరిలోకి దిగనుంది. ఈ నెల 25న భారీగా ఆవిర్భావ సభను హైదరాబాద్‌లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, అంబేడ్కర్ మనుమడు ప్రకాష్ అంబేడ్కర్, పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. అన్ని నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు హాజరయ్యేలా ప్రణాళిక రూపొందించారు. సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కూటమి పనిచేస్తుందని ముసాయిదాలో పేర్కొన్నారు. ఈ కూటమికి రాష్ట్ర కన్వీనర్‌గా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఛైర్మన్‌గా సూర్యప్రకాశరావు ఉండాలని బీఎల్ఎఫ్ గురువారం నాటి సమావేశంలో అభిప్రాయపడింది. అయితే ఈ నెల 25న హైదరాబాద్‌లో జరగనున్న సభలో బీఎల్ఎఫ్ నూతన కమిటీని ఎన్నుకోవాలని నిర్ణయించారు. బహుజన వామపక్ష కూటమి కన్వీనర్‌గా ఎన్నికైన తమ్మినేని విలేకర్లతో మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం కల్పించడమే తమ లక్ష్యమన్నారు. సీపీఐ, న్యూడెమోక్రసీ, ఇతర వామపక్ష పార్టీలను కూడా కూటమి లోకిఆహ్వానిస్తున్నామన్నారు. సమావేశంలో కంచ ఐలయ్య, గద్దర్, కాకి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం. చిత్రంలో ఆచార్య కంచ ఐలయ్య, ప్రజాగాయకుడు గద్దర్

సీపీఐ మరో వేదిక: ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి ఆవిర్భావ దిశగా ఏర్పాట్లు సాగుతుండగా.. మరోవైపు మరో కొత్త వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఐ గురువారం ప్రకటన విడుదల చేసింది. ఎన్‌డీఏ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విస్తృత స్థాయిలో లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష పార్టీలతో వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తెలిపారు. విజయవాడలో జరిగిన సీపీఐ జాతీయ సమితి సమావేశాల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఊపిరితిత్తుల్లో ఇనుప మేకు

తొలగించిన 'ఎంజీఎం' వైద్యులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: మతి స్థిమితం లేని వ్యక్తి ఊపిరితిత్తుల్లో ఉన్న ఇనుప మేకును వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స చేసి తొలగించారు. వరంగల్ భద్రకాళి రోడ్‌లో నివసించే సారంగపాణి(55)కి కొన్నేళ్లుగా మతి స్థిమితం లేదు. కొద్ది రోజులుగా దగ్గు, జ్వరంతో బాధపడుతున్న ఆయన్ని కుటుంబ సభ్యులు సోమవారం ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన ఊపిరితిత్తుల మధ్యలో ఇనుప మేకు ఉండటాన్ని వైద్యులు ఛాతీ ఎక్స్‌రే ద్వారా గుర్తించారు. చెవి ముక్కు గొంతు (ఈఎన్‌టీ) విభాగం వైద్యుల పర్యవేక్షణలో బుధవారం శస్త్రచికిత్స చేసి దాన్ని తొలగించారు. శస్త్రచికిత్సను విజయవంతం చేసిన వైద్య బృందాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్, ఆర్ఎంవో మల్లేశ్వర్, ఈఎన్‌టీ విభాగాధిపతి సత్యనారాయణ అభినందించారు.



శస్త్రచికిత్స చేసి బయటకు తీసిన మేకు ఇదే

టీవీ నటుడికి టోకరా

ఏడేళ్లకు నిందితుడిని పట్టుకున్న సీసీఎస్ పోలీసులు

ఈనాడు, హైదరాబాద్: విశాఖపట్నంలో స్థలం కొనిస్తానని టీవీ నటుణ్ని నమ్మించి రూ.15 లక్షలు స్వాహా చేసిన నిందితుడు గణేష్‌ను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వేర్వేరు ప్రాంతాలకు వెళ్లి అజ్ఞాతంలో ఉన్న నిందితుణ్ని ఏడేళ్ల తర్వాత పట్టుకున్నామని డీసీపీ(నేర పరిశోధన) అవినాశ్ మహంతి తెలిపారు. చిలకలూరి పేటలో నివాసముంటున్న గణేష్ ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. కృష్ణా నగర్‌లో ఉంటూ సినిమా, టీవీ నటులతో పరిచయం పెంచుకున్నాడు. టీవీ నటుడు రామచంద్రారెడ్డిని కలిసి స్థలం కొనిస్తానంటూ 15 లక్షలు తీసుకొని మాయమయ్యాడు.

అగ్నిపర్వతాన్ని అధిరోహించిన హైదరాబాదీ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఇండోనేషియాలోని బాలీ ద్వీపంలో ఉన్న 'గునుంగ్ అగుంగ్' అగ్నిపర్వతాన్ని హైదరాబాద్‌కు చెందిన పెద్దినేని సాయితేజ(25) అధిరోహించారు. సముద్ర మట్టానికి తొమ్మిది వేల అడుగుల ఎత్తులో ఉన్న ఈ అగ్నిపర్వత్వాన్ని ఈనెల 10న అధిరోహించారని సాయితేజ తండ్రి నాగేశ్వర్‌రావు 'ఈనాడు'కు తెలిపారు. సుమారు 48 గంటల సమయంలోనే అధిరోహించినట్లు వివరించారు. ఎలాంటి సహాయకులు, శిక్షకుల సహకారం లేకుండానే పర్వతారోహణ చేశారని తెలిపారు. గతేడాది మేలో ఇండోనేషియాలోని దుకోణో అగ్నిపర్వతాన్ని సాయితేజ అధిరోహించి..తొలిసారి ఆ పర్వతాన్ని అధిరోహించిన భారతీయుడిగా నిలిచాడన్నారు.



సాయితేజ

వరంగల్ కార్పొరేషన్ ఉప ఎన్నికలో తెరాస విజయం

కాశీబుగ్గ(వరంగల్), న్యూస్‌టుడే: వరంగల్ మహా నగర పాలక సంస్థ 44వ డివిజన్ ఉప ఎన్నికలో తెరాస అభ్యర్థి అనిశెట్టి సరిత విజయం సాధించారు. కొద్దినెలల క్రితం కార్పొరేటర్ అనిశెట్టి మురళి హత్యకు గురవటంతో ఉపఎన్నిక అనివార్యమైంది. తెరాస తరపున మురళి భార్య సరితకు పార్టీ టికెట్ కేటాయించారు. ఈనెల 9న పోలింగ్ జరగ్గా గురువారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. భాజపా అభ్యర్థి కొలను సంతోశ్‌రెడ్డిపై సరిత 835 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 9641 ఓట్లకుగాను 5242 పోలయ్యాయి. తెరాసకు 3016 ఓట్లు రాగా, భాజపా అభ్యర్థికి 2181 ఓట్లు వచ్చాయి. నోటాకు 45 ఓట్లు పడ్డాయి. నగర మేయర్ నన్నపునేని నరేందర్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, కుడా ఛైర్మన్ మర్రి యాదవరెడ్డి సరితను అభినందించారు. తెరాస శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.



అనిశెట్టి సరిత

ఉద్యోగ అవకాశాలు



రిలయన్స్ జియో కనెక్షన్లు 15.20 కోట్లు

దిల్లీ: రిలయన్స్ జియో కనెక్షన్లు 15.21 కోట్లకు చేరాయి. ఈ సంస్థకు గత అక్టోబరులో 73.4 లక్షల కొత్త కనెక్షన్లు జత చేరగా, నవంబరులో మరో 61 లక్షలు పెరిగాయని టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నవంబరులో భారతీ ఎయిర్‌టెల్ కనెక్షన్లు 43 లక్షల మేర పెరిగి, మొత్తం 28.95 కోట్లకు చేరాయి. ఈ నెలలో ఎయిర్‌టెల్ కంటే జియో కనెక్షన్ల పెరుగుదల 50 శాతం అధికంగా ఉన్నట్లయింది. టెలికాం చందాదార్ల విపణిలో ఎయిర్‌టెల్ వాటా 24.91 శాతం కాగా, రిలయన్స్ జియో 13.08 శాతానికి చేరింది. అక్టోబరు ఆఖరుకు జియో వాటా 12.39 శాతంగా ఉంది.



ఎయిర్‌టెల్ ఆధార్ పరిశీలనకు మార్చి 31 వరకు అనుమతి

దిల్లీ: తమ మొబైల్ చందాదార్ల పునఃపరిశీలనకు వేలిముద్ర ధ్రువీకరణను వినియోగించుకునేందుకు ఇచ్చిన తాత్కాలిక అనుమతిని ఎయిర్‌టెల్‌కు మార్చి 31 వరకు ఆధార్ జారీ సంస్థ యూఐడీఏఐ పొడిగించింది. ఇంతకుముందు ఈ గడువు జనవరి 10 వరకు ఉంది. ఎయిర్‌టెల్ చందాదార్ల అనుమతి లేకుండా, వారి పేరిట ఎయిర్‌టెల్ పేమెంట్స్‌బ్యాంక్‌లో ప్రారంభించిన ఖాతాల్లో జమైన గ్యాస్ సబ్సిడీ మొత్తం రూ.138 కోట్లను తిరిగి, సంబంధితులు సూచించిన బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ చేసే షరతుపై ఈ అంగీకారాన్ని అప్పట్లో తెలిపింది. అయితే ఎయిర్‌టెల్ పేమెంట్స్‌బ్యాంక్ ఇ కేవైసీ లైసెన్స్ మాత్రం తుది విచారణ ముగిసేవరకు సస్పెన్షన్‌లోనే ఉంటుందని యూఐడీఏఐ స్పష్టం చేసింది.



ఫలితాలు వెల్లడిస్తున్న టీసీఎస్ సీఈవో రాజేశ్ గోపీనాథన్

టీసీఎస్ లాభం రూ.6,531 కోట్లు

- స్వల్పంగా పెరిగిన ఆదాయం
- బీఎఫ్ఎస్ఐ విభాగాల్లో స్తబ్ధత
- 700% డివిడెండు

ముంబయి: అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అంచనాలకు తగ్గట్లు రాణించింది. రూ.6,531 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. జులై- సెప్టెంబరుతో (రూ.6,446 కోట్లు) పోలిస్తే లాభం 1.3 శాతం పెరగగా.. 2016 అక్టోబరు- డిసెంబరు లాభాన్ని (రూ.6,778 కోట్లు) పరిగణనలోకి తీసుకుంటే 3.6 శాతం తగ్గింది. తక్కువ పన్ను చెల్లింపులు, ఉద్యోగుల వ్యయాలు తగ్గడం, ఇతర ఆదాయం పెరగడం లాంటివి మెరుగైన పనితీరుకు తోడ్పడ్డాయి. అయితే కంపెనీకి అతిపెద్ద ఆదాయ విభాగమైన బీఎఫ్ఎస్ఐలో స్తబ్దత లాభాన్ని పరిమితం చేసింది. వార్షిక ప్రాతిపాదికన మొత్తం కార్యకలాపాల ఆదాయం 3.9 శాతం పెరిగి రూ.29,735 కోట్ల నుంచి రూ.30,904 కోట్లకు పెరిగింది. డాలరు రూపేణా ఆదాయం 1 శాతం అధికమై 478.7 కోట్ల డాలర్లుగా నమోదైంది. స్థిర కరెన్సీ రూపేణా ఆదాయంలో 1.3 శాతం వృద్ధి ఉంది. పెద్ద మొత్తంలో కాంట్రాక్టులు దక్కడం, డిజిటల్ ఆదాయంలో వృద్ధి ఇందుకు దోహదం చేశాయి. 'డిసెంబరులో ఆకర్షణీయ పనితీరుతో 2017కు వీడ్కోలు పలికాం. గతంలో నెమ్మదించిన విభాగాలు పుంజుకున్నాయి. సమస్యలు తగ్గాయి. ముందుందు బలమైన వృద్ధిని సాధించే స్థితిలో మేం ఉన్నామ'ని టీసీఎస్ సీఈఓ, ఎండీ రాజేశ్ గోపీనాథన్ వెల్లడించారు.

డిజిటల్ విభాగంలో రూ.5 కోట్ల డాలర్ల కాంట్రాక్టు

సమీక్ష త్రైమాసికంలో డిజిటల్ విభాగంలో మొట్టమొదటిసారి 5 కోట్ల డాలర్ల విలువైన ఒప్పందాన్ని టీసీఎస్ కుదుర్చుకుంది. కొత్త ఒప్పందాలు పెరుగుతుండటం, డిజిటల్ విస్తరిస్తుండటం, రిటైల్‌లో గిరాకీ పుంజుకోవడం, టీసీఎస్‌కు ఉన్న పరిశ్రమ విభాగాల్లో చాలా వరకు రాణించడం వల్ల బలహీన త్రైమాసికంలోనూ మెరుగైన ఫలితాలను నమోదు చేయగలిగామని టీసీఎస్ సీఓఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.గణపతి సుబ్రమణియన్ తెలిపారు. కంపెనీ మొత్తం ఆదాయంలో 22.1 శాతం వాటా ఉన్న డిజిటల్ విభాగ ఆదాయం 40 శాతం పెరిగింది. సమీక్ష త్రైమాసికంలో స్థూలంగా 12,534 నియామకాలు చేపట్టింది. దీంతో మొత్తం ఉద్యోగులు సంఖ్య 3,90,880 మందికి చేరింది. త్రైమాసిక ప్రాతిపదికన వలసల రేటు 0.2 శాతానికి పరిమితమైంది. రూ.1 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.7 (700 శాతం) డివిడెండును కంపెనీ ప్రకటించింది.

బీఎస్ఈలో షేరు 0.67 శాతం నష్టంతో రూ. 2,788.40 వద్ద ముగిసింది. (ఫలితాలు ట్రేడింగ్ అనంతరం వెలువడ్డాయి)

సేవలన్నింటికీ కాంపోజిషన్ వర్తింపు వద్దు

ప్రతిపాదనకు కమిటీ వ్యతిరేకత

దిల్లీ: జీఎస్టీలోని కాంపోజిషన్ విధానంలో సేవలన్నింటినీ చేర్చాలన్న (రెస్టారెంటు సేవలు మినహా) ప్రతిపాదనను న్యాయ సమీక్ష కమిటీ వ్యతిరేకించింది. 10 మంది సభ్యులతో ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు ఉన్నారు. సంబంధిత వర్గాలు చెబుతున్నదాని ప్రకారం.. పన్ను వర్తించే టర్నోవరులో 10 శాతం లేదా రూ.5 లక్షలు, ఏదీ ఎక్కువైతే ఆ మొత్తానికి కాంపోజిషన్ డీలరు అందించే సేవలను పరిమితం చేయాలని కమిటీ సూచించింది. కాంపోజిషన్ డీలరు సరఫరా చేసే సేవలు 18 శాతం మించకుండా ప్రత్యేక కాంపోజిషన్ పన్ను రేటు ఉండాలని సిఫారసు చేసింది. సలహా కమిటీ సూచనల మేరకు న్యాయ సమీక్షా కమిటీ పై సిఫారసులను చేసింది. సేవలన్నింటికీ కాంపోజిషన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరిన పరిశ్రమ, వాణిజ్య సంఘాల తరపు ప్రతినిధులు ఈ సలహా కమిటీలో ఉన్నారు. రూ. కోటిన్నర లోపు టర్నోవరు ఉన్న తయారీదార్లు, రెస్టారెంటు యజమాన్లు, ట్రేడర్లు కాంపోజిషన్ విధానాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

15 నుంచి స్మార్ట్ సామగ్రి అనుమతించం: జెట్ ఎయిర్‌వేస్

ముంబయి: తమ విమానాల్లో స్మార్ట్ సామగ్రిని ఈనెల 15 నుంచి అనుమతించబోమని జెట్ ఎయిర్‌వేస్ తెలిపింది. అంతర్జాతీయ విమాన రవాణా సంఘం ఆదేశాలకు అనుగుణంగా, బ్యాటరీని విడదీయడానికి అనువుగా లేని పరికరాలను నిషేధించినట్లు వెల్లడించింది. ఇంటెగ్రేటెడ్ లిథియం బ్యాటరీలతో కూడిన పరికరాలు, మోటార్లు, పవర్‌బ్యాంక్‌లు, జీపీఎస్, జీఎస్ఎం, బ్లూటూత్, ఆర్ఎఫ్ఐడీ లేదా వైఫై సాంకేతిక పరికరాలను అనుమతించరు. బ్యాటరీని విడదీసేందుకు వీలుగా ఉంటేనే, లిథియం బ్యాటరీలతో ఉన్న బ్యాగ్‌లను అంగీకరిస్తారు. అయితే ఇందువల్ల ప్రయాణికులు మొబైల్ ఫోన్ తీసుకెళ్లేందుకు అంతరాయం ఏమీ ఉండదు. విమానాశ్రయాల్లో చెక్‌ఇన్‌కు ముందే, ప్రయాణికులు ఆయా స్మార్ట్ పరికరాల నుంచి బ్యాటరీలను తొలగించాలి. బ్యాటరీలను క్యాబిన్ సామగ్రిలో మాత్రమే అనుమతిస్తారు.

ప్రాంగణగణాలు తగ్గాయ్

ఒకప్పుడు 100 శాతం ప్లేస్‌మెంట్ హామీ అంటూ చాలా వరకు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు, మేనేజ్‌మెంట్ కళాశాలలు హోరెత్తించేవి. అలా అన్నట్లుగానే నియామకాలు కూడా జరిగేవి. కంపెనీలు భారీ ఎత్తున ప్రాంగణ నియామకాలు చేపట్టేవి. అయితే ఇపుడా ధోరణి తగ్గిందన్నది విజ్డమ్ జాబ్స్ సర్వేలో తేలిన తాజా సత్యం.

- నియామకాల్లో వెనకబాటు
- రెండు, మూడో శ్రేణి సంస్థల్లో మరీ తక్కువ
- 73% మందికి భావ వ్యక్తీకరణ నైపుణ్యాల్లేవ్
- చిన్న నగరాల్లో ఉద్యోగార్హతలున్నది 14 శాతం మందికే
- ఐఐటీల్లోనూ తగ్గుతున్న ప్రాంగణ ఉద్యోగాలు

విజ్డమ్ జాబ్స్ సర్వే

ఐఐటీలు, ఐఐఎమ్‌లకు బెంగ లేదు

ఐఐటీలు, ఐఐఎమ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు మాత్రం తమ విద్యార్థులకు భారీ ప్యాకేజీలు పొందడంలో ఎప్పటిలాగే దూసుకెళుతున్నాయి. చిక్కంతా ప్రైవేటు కళాశాలలతోనే. తమ విద్యార్థులను కంపెనీల్లో చేర్పించడానికి జాబ్ ఫెయిర్స్, ఇతరత్రా మార్గాలను అన్వేషిస్తున్నాయి. ఈ విషయంలో మొదటి శ్రేణి(టైర్-1) సంస్థలు విజయవంతమవుతున్నాయి. ఇంకా చెప్పాలంటే గతంలో పోలిస్తే ఎక్కువ ప్రాంగణ నియామకాలనే ఆకర్షిస్తున్నాయి. సగటున 75 శాతం విద్యార్థుల భవితకు ఢోకా లేకుండా చేసుకుంటున్నాయి. అయితే రెండో, మూడో శ్రేణి సంస్థల్లోనే ఈ నియామకాలు మరీ 38 శాతానికి పరిమితం అయ్యాయి.

ఇదీ పరిస్థితి..

గత రెండేళ్లలో రెండో, మూడో శ్రేణి సంస్థల్లో ప్రాంగణ ఉద్యోగార్థుల(ఆన్ క్యాంపస్ ఫ్రెషర్) నియామకాలు దాదాపు 21 శాతం మేర తగ్గాయి. ఈ కళాశాలలను సందర్శించే కంపెనీల సంఖ్య కూడా 30 శాతం మేర తగ్గింది. ఐటీ సేవల్లో 23%; ప్రధాన ఇంజినీరింగ్ రంగంలో 26% చొప్పున నియామకాలు తగ్గాయి. ఐటీ రంగం, అంకురాల నుంచి ప్రతిష్ఠాత్మకేతర కళాశాలల నుంచి ఉద్యోగార్థులను నియమించుకోవడం బాగా తగ్గడం ఇందుకు నేపథ్యం. సాధారణంగానే నియామకాల ధోరణి తగ్గుముఖం పట్టడంతో కంపెనీలు రెండో, మూడో శ్రేణి సంస్థల వైపు వెళ్లకుండా.. ప్రధాన కళాశాలలతోనే సరిపెట్టుకుంటున్నాయి. బ్రాండ్ లేకపోవడంతో ఆయా కంపెనీలకు ఆకర్షించడంలో కళాశాలలు విఫలమవుతున్నాయి.

ప్రత్యేక నైపుణ్యాలు లేకే..

కంపెనీలు ప్రత్యేక నైపుణ్యాలను ఆశిస్తున్నాయి. వినూత్నతకు, కొత్త తరం సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నాయి. దీంతో ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి భారీగా నియామకాలను చేసుకోవడానికి బదులు ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి కొద్ది మందినే భారీ ప్యాకేజీలు ఇచ్చి తెచ్చుకుంటున్నాయి. చాలా వరకు కంపెనీలు కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, డాటా సైన్స్, రోబోటిక్స్, ఆగుమెంటెడ్-వర్చువల్ రియాల్టీలలో ప్రవేశం ఉన్న విద్యార్థులకు 35-40 శాతం ఎక్కువ ప్యాకేజీని ఇవ్వడానికి కూడా సిద్ధపడుతున్నాయి. ప్రతిష్ఠాత్మకేతర సంస్థల్లో విద్యార్థులకు నైపుణ్యాలను జొప్పించడంలో వెనకబాటు వల్ల కూడా కంపెనీలు అటు వైపు వెళ్లడానికి జంకుతున్నాయి.



- ప్రాథమిక అంశాలైన భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్, విశ్లేషణా సామర్థ్యాలు లేకపోవడంతో పాటు.. ప్రధాన అంశాలను లోతుగా అర్థం చేసుకోలేకపోవడం, ప్రధాన సబ్జెక్టులతో పాటు.. ఇతర సబ్జెక్టులపై అవగాహన లేకపోవడం వంటివి ప్రాంగణ నియామకాలను ప్రభావితం చేస్తున్నాయి.
- పరిశ్రమ అంచనాల ప్రకారం.. దాదాపు 73 శాతం మంది విద్యార్థులకు కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేవు. 58 శాతం మందిలో విశ్లేషణ, పరిమాణాత్మక నైపుణ్యాలు తక్కువగా ఉన్నాయి. దీంతో ప్రతిష్ఠాత్మకేతర సంస్థల నుంచి విద్యార్థులను నియమించుకోవడానికి కంపెనీలు జంకుతున్నాయి.

పెద్ద నగరాల్లోనూ 'విషయం' లేదు

మొదటి శ్రేణి నగరాల్లో కూడా ఇంజినీరింగ్ ఉత్తీర్ణులైన వారిలో కేవలం 19 శాతం మందికి మాత్రమే ఉద్యోగార్హతలున్నాయి. ఇక చిన్న నగరాల విషయానికొస్తే ఇది 14 శాతానికే పరిమితమవుతోంది. ఐఐటీల్లో కూడా 66 శాతం మంది(2016-17) మాత్రమే ప్రాంగణ నియామకాల్లో సత్తా చాటుతున్నాయి. అంతక్రితం రెండేళ్లలో ఐఐటీల నుంచి నేరుగా కంపెనీల్లోకి వెళ్లిన వారి శాతం వరుసగా 79%, 78 శాతంగా ఉంది.

మార్పునకు అనుగణంగా సిలబస్, అధ్యాపకులు లేకే

సిలబస్, టీచింగ్ విధానాలపై సంస్థలకు అవగాహన ఉండడం లేదు. సాంకేతికత, సైన్స్ విషయాల్లో బయట జరుగుతున్న మార్పులకు అనుగుణంగా సిలబస్‌ను మార్చుకోవడం లేదు. విద్యార్థులకు ఏం చెబుతున్నారు.. పరిశ్రమకు ఏం కావాలి అన్న దాని మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించుకోవడానికి చాలా వరకు ప్రతిష్ఠాత్మకేతర సంస్థలు విఫలమవుతున్నాయి. కొత్త తరం నైపుణ్యాలు, అంశాలను బోధించే అర్హత గల సిబ్బంది కొరత కూడా ఒక కారణం. పరిశ్రమకు సమాన స్థాయిలో వేతనాలు ఇవ్వకపోవడంతో చాలా మంది సిబ్బంది వలసల బాట పడుతూ ఉంటారు. దేశంలోని 60 శాతం ప్రైవేటు సంస్థల్లో అర్హత గల అధ్యాపకులు కొరత కొనసాగుతూనే ఉంటుంది. దీంతో విద్యార్థులు కళాశాలల నుంచి ఉత్తీర్ణులై బయటకు వచ్చిన తర్వాత కోర్సులు చేసి తమ నైపుణ్యాలను పెంచుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

– ఈనాడు, హైదరాబాద్

జైట్లీపై 'కార్పొరేట్' ఒత్తిడి

- పన్ను రేటుపై మాట నిలబెట్టుకోవాలి
- కంపెనీల ఆశాభావం

దిల్లీ: మూడేళ్ల కిందట ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీపై కార్పొరేట్ వర్గాలు ఒత్తిడి తీసుకువచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కార్పొరేట్ పన్నును నాలుగేళ్లలో 25 శాతానికి తీసుకువస్తామని జైట్లీ ఇచ్చిన హామీపై ఈ సారి గట్టి పట్టుపట్టే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే కార్పొరేట్ పన్ను కోత విషయంలో అమెరికా వడివడిగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా పోటీనివ్వడం కోసం భారత్ కూడా పన్ను రేటును తగ్గించాలని నిపుణులు అంటున్నారు. నాలుగేళ్లలో కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి జైట్లీ తగ్గిస్తారా లేదా అని పరిశ్రమ అనుమానిస్తోంది. అయితే రాబోయే బడ్జెట్లో కనీసం 28 శాతానికి పరిమితం చేసే అంశాన్ని పరిశీలించాలని వారు కోరుకుంటున్నారు. ద్రవ్యలోటు నేపథ్యంలో కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గిస్తారని అంచనాలు లేనప్పటికీ.. కనీసం 28 శాతానికైనా తగ్గించాలని ఫిక్కీ ప్రెసిడెంట్ రాశేష్ షా పేర్కొన్నారు.

పన్ను రిఫండ్‌లు రూ.2,000 కోట్లు రావాలి

వాహన ఎగుమతులపై ప్రభావం: సియామ్

దిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రిఫండ్‌లు నిలిచిపోవడం ప్యాసింజర్ వాహన ఎగుమతులపై ప్రభావం చూపిందని భారత వాహన తయారీదార్ల సంఘం (సియామ్) తెలిపింది. జీఎస్టీ అమలైనప్పటి నుంచి వాహన తయారీదార్లకు దాదాపు రూ.2,000 కోట్ల వరకు పన్ను రిఫండ్‌లు రావాల్సి ఉందని పేర్కొంది. సియామ్ గణాంకాల ప్రకారం 2017లో దేశీయ ప్యాసింజర్ వాహన ఎగుమతులు స్వల్పంగా 0.1 శాతమే పెరిగి 7,38,894 వాహనాలుగా నమోదయ్యాయి. దేశంలో అమ్మకాల కంటే వాహన ఎగుమతులు ఎక్కువగా ఉండే కంపెనీలపై పన్ను రిఫండ్‌ల ప్రభావం ఎక్కువగా ఉందని సేన్ తెలిపారు. దేశీయంగా ఎక్కువ అమ్మకాలుండే కంపెనీలు మూలధనానికి లోటు రాకుండా ఇంకా చూసుకోగలుగుతున్నాయని పేర్కొన్నారు. జీఎస్టీ విధానం ప్రకారం తయారీదార్లు పన్ను చెల్లింపులు చేశాక.. ఆ మొత్తాన్ని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో తిరిగి పొందొచ్చు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలయన్ స్లీట్



ధర రూ.2.13 లక్షలు

దిల్లీ: సాహసయాత్రల కోసం రూపొందించిన హిమాలయాన్ మోడల్‌లో కొత్త వెర్షన్ 'స్లీట్'ను రాయల్ ఎన్‌ఫీల్డ్ గురువారం విపణిలోకి ప్రవేశపెట్టింది. దీని ప్రారంభ ధర రూ. 2,12,666 (ఆన్-రోడ్ చెన్నై)గా ఉంది. మొదటి 500 బైకులు ముందే అమర్చిన ఎక్స్‌ప్లోరర్ కిట్‌తో లభిస్తాయని కంపెనీ వెల్లడించింది. ఇవి ప్రత్యేకంగా జనవరి 12- 30 మధ్య ఆన్‌లైన్‌లో లభిస్తాయని వివరించింది. ఆసక్తి కలిగిన కొనుగోలుదార్లు కంపెనీ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని, 30 నుంచి అమ్మకాలు ప్రారంభిస్తామని ఎన్‌ఫీల్డ్ తెలిపింది. ముందుగా బుక్ చేసుకున్న వారికి ముందుగా బైకులు అందజేస్తామని చెప్పింది. 'అన్ని రకాల భూభాగాలకు అనువుగా కొత్త హిమాలయన్ స్లీట్‌ను రూపొందించాం, దేశంలో సాహస పర్యాటకులకు ఇది కొత్త అనుభూతి అందజేస్తుంది' అని రాయల్ ఎన్‌ఫీల్డ్ అధ్యక్షుడు రుద్రతేజ్ సింగ్ పేర్కొన్నారు.


స్మార్ట్రాన్ నుంచి బడ్జెట్ స్మార్ట్‌ఫోన్



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన స్మార్ట్రాన్ కంపెనీ బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ 'టీఫోన్ పి'ని విడుదల చేసింది. దీని ధర రూ.7,999. జనవరి 17 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో ఈ ఫోన్ లభ్యమవుతుందని కంపెనీ తెలిపింది. 5,000 ఎంఏహెచ్ బ్యాటరీ ఒక సారి ఛార్జీ చేస్తే.. రెండు రోజుల పాటు ఫోన్ పని చేయగలదని కంపెనీ తెలిపింది. 5.2 హెచ్‌డీ డిస్‌ప్లే, క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 435 ఆక్టా కోర్ చిప్‌సెట్ ప్రాసెసర్, 3జీబీ ర్యామ్‌తో ఈ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేశారు. 32 జీబీ ఇన్‌బిల్ట్ స్టోరేజీ సామర్థ్యం ఉందని, మరో 128 జీబీ స్టోరేజీని పెంచుకోవచ్చని స్మార్ట్రాన్ పేర్కొంది.

హోండా సిటీలో ప్రత్యేక ఎడిషన్లు

- అమేజ్, డబ్ల్యూఆర్-వీలో కూడా



దిల్లీ: సిటీ, అమేజ్, డబ్ల్యూఆర్-వీ మోడళ్లలో ప్రత్యేక ఎడిషన్లను హోండా కార్స్ ఇండియా తీసుకొచ్చింది. హోండా సిటీ 20వ వార్షిక పెట్రోల్ ఆటోమేటిక్ ఎడిషన్ ధర రూ. 13,74,532 కాగా.. మ్యాన్‌వల్ ట్రాన్స్‌మిషన్‌తో డీజిల్ ట్రిమ్ ఎడిషన్ రూ.13,82,382 ధరకు లభ్యమవుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. అదే విధంగా హోండా అమేజ్ ప్రైడ్ ఎడిషన్ పెట్రోలు ఇంజిన్, డీజిల్ ట్రిమ్ రకాల ధరలు వరుసగా రూ.6,29,900; రూ.7,83,486. అలాగే డబ్ల్యూఆర్-వీ ఎడ్జ్ ఎడిషన్ పెట్రోలు వేరియంట్ రూ.8,01,017 ధరకు లభ్యం కానుంది. అదే మ్యాన్‌వల్ ట్రాన్స్‌మిషన్‌తో కూడిన డీజిల్ ఎడిషన్ ధర రూ.9,04,683. పైవన్నీ దిల్లీ ఎక్స్‌షోరూం ధరలే. 'సిటీ, అమేజ్, డబ్ల్యూఆర్- మోడళ్లలో ప్రత్యేక ఎడిషన్లకు కొనుగోలుదార్ల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్న నమ్మకం ఉంద'ని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, విక్రయాలు) జ్ఞానేశ్వర్ సేన్ తెలిపారు.

ఆహ్లాదకర షాపింగ్ అందుబాటులోకి!

ఏకబ్రాండ్ రిటైల్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) నూరుశాతం అనుమతించడం వల్ల కలిగే ప్రయోజనాలేంటి.. ధరలేమైనా తగ్గుతాయా అంటే అది ఉండకపోవచ్చు. అయితే అంతర్జాతీయంగా విక్రయాలు సాగించే దిగ్గజ సంస్థలు మన దేశంలోనూ సొంత విక్రయశాలలు ప్రారంభించడం వల్ల, కొనుగోలుదార్లకు మెరుగైన అనుభవం లభిస్తుంది. కచ్చిత ధరల్లో, అసలైన ఉత్పత్తులు, విడిభాగాలు లభ్యం అవుతాయి. అతిపెద్ద రిటైల్ విపణి కనుక, అభివృద్ధి చెందిన దేశాలతో పాటే ఇక్కడా అధునాతన ఉత్పత్తులు విడుదలయ్యే వీలుంది.

- సొంత విక్రయశాలల ఏర్పాటుకు అవకాశం
- ధరల్లో మార్పులేమీ ఉండవు
- కొంగొత్త వినియోగ అనుభవం లభిస్తుంది

ఈనాడు వాణిజ్య విభాగం

ఇప్పటికే ఏకబ్రాండ్ రిటైల్‌లో 49 శాతం ఎఫ్‌డీఐకి అనుమతి ఉంది. ఇందుకనుగుణంగా యాపిల్, నైకి, వుడ్‌ల్యాండ్, అడిడాస్, పూమా, లాంగినెస్, రోలెక్స్, రాడో, మోచీ వంటి అంతర్జాతీయ బ్రాండ్లకు విక్రయశాలలు దేశీయంగా ఉన్నాయి. అయితే ఇవన్నీ ఇక్కడి వారి భాగస్వామ్యంలో, ఫ్రాంచైజీ పద్ధతిలో ఏర్పాటైనవి. ఇవే బ్రాండ్ల ఉత్పత్తులు బహుళబ్రాండ్ రిటైల్ విక్రయశాలల్లో కూడా లభిస్తున్నాయి. కేంద్రప్రభుత్వం తాజా నిర్ణయం వల్ల, ఇలాంటి బ్రాండ్లన్నీ సొంతగా విక్రయశాలలు ఏర్పాటు చేస్తాయి.

మొబైల్ రంగం కీలకం: సెల్‌ఫోన్ల వార్షిక విక్రయాలు రూ. లక్షన్నర కోట్ల మేర జరుగుతున్న క్రమంలో, ఈ రంగంపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ముఖ్యంగా అమెరికా సాంకేతిక దిగ్గజమైన యాపిల్ సంస్థ, దేశీయంగా అసెంబ్లింగ్ ప్లాంట్‌ను థర్డ్‌పార్టీ ఆధ్వర్యంలో నెలకొల్పి, అమ్మకాలు పెంచుకునే క్రమంలో ఉంది. చైనా 'యాపిల్'గా ప్రఖ్యాతి గాంచిన ఎంఐ సంస్థ, దేశీయంగా కూడా పాగా వేసింది. చైనాకే చెందిన వివో, ఓపో సంస్థలు కూడా స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల్లో దూసుకెళ్తున్నాయి. ఈ సంస్థలన్నీ ఆన్‌లైన్ పోర్టళ్లతో పాటు బహుళబ్రాండ్ రిటైల్ ద్వారా అమ్మకాలు సాగించాయి. యాపిల్ సంస్థ మెట్రో నగరాల్లో అతి తక్కువ సంఖ్యలో తమ బ్రాండ్ విక్రయశాలలను ఫ్రాంచైజీ ఆధ్వర్యంలో నెలకొల్పింది. అనంతరం ఎంఐ, వివో, ఓపో కూడా పెద్ద నగరాల్లో ఇదే పద్ధతిలో సొంత బ్రాండ్ విక్రయశాలలనూ ఏర్పాటు చేస్తున్నాయి. కొత్తగా ఫర్నీచర్ సంస్థ ఐకియా కూడా హైదరాబాద్ నుంచే కార్యకలాపాలు ప్రారంభించబోతోంది.

ఏక బ్రాండ్ రిటైల్‌లో 100% ఎఫ్‌డీఐ - విశ్లేషణ

అంతర్జాతీయ షాపింగ్ అనుభవం

వాణిజ్య సముదాయాలు (షాపింగ్‌మాల్స్), భారీ వ్యాపారశాలలు రాకముందు, చిన్నపాటి దుకాణంలో పలు కంపెనీల ఉత్పత్తులు విక్రయించేవారు. దుకాణదారు చెప్పిన అంశాల ఆధారంగానే కొనుగోళ్లు జరిగేవి. ఒక వస్తువును కొనడానికి వెళ్తే, తప్పనిసరిగా తీసుకోవాలనే ధోరణి దుకాణదారుల్లో ఉండేది. వస్తువును సక్రమంగా పరిశీలించే వీలుండేదే కాదు. విదేశీ ప్రయాణాలు అధికమయ్యాక, అక్కడి షాపింగ్ అనుభవాన్ని దేశీయంగా కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ క్రమంలోనే కొన్ని అగ్రశ్రేణి విక్రయశాలల్లో ఆయా ఉత్పత్తులను క్షుణ్నంగా పరిశీలించుకుని, వాటిలోని సదుపాయాలు ఎలా వినియోగించుకోవాలో తెలుసుకుని, సంతృప్తి చెందాకే కొనుగోలు చేసుకునే వీలు కలుగుతోంది. ఇది వినియోగదారు హక్కుగా భావించే పరిస్థితి వచ్చింది. తాజా పరిణామంతో ఇప్పటికే ఉన్న బహుళజాతి సంస్థలకు తోడు మరిన్ని దిగ్గజ సంస్థలు దేశీయంగా విక్రయశాలలు ప్రారంభించే వీలుంది. అయితే పోటీ పేరిట దేశీయ వాణిజ్య సంస్థలు పూర్తిగా నష్టపోయే పరిస్థితి కల్పించి, ఆనక విదేశీ సంస్థలు గుత్తాధిపత్యం చెలాయించకుండా చూడాలి.



వినియోగదారులకు ప్రయోజనాలివీ..

- ఆయా దిగ్గజ సంస్థల ఉత్పత్తుల మోడళ్లన్నీ ఒకే చోట పరిశీలించుకుని, కొనుగోలు చేసుకోవచ్చు.
- కంపెనీలు ప్రకటించిన ధరకే కచ్చితమైన వారంటీతో లభిస్తుంది. అసలైన విడిభాగాలు, వాస్తవ ధరలకే లభిస్తాయి. ఇప్పుడు విడిభాగాలు, వాటికి సేవాఛార్జీలు ఇష్టం వచ్చినట్లు వసూలు చేస్తున్నారు.
- ఆహ్లాద భరిత వాతావరణంలో, అధునాతన సాంకేతికతతో తీర్చిదిద్దే విక్రయశాలలు మెరుగైన కొనుగోలు/వినియోగ అనుభవాన్ని అందిస్తాయి. స్థానిక విక్రయశాలలు కూడా, తమవైన ఆకర్షణలకు తెరతీయవచ్చు.

సెన్సెక్స్ ▲ 70	34503	
నిఫ్టీ ▲ 19	10651	
రూపాయి 63.66 ▼	(ఒక అమెరికా డాలరుకు)	06 పైసలు
బంగారం 29,745 ▼	(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత)	రూ.లలో 65
వెండి 38,595 ▼	ముంబయిలో కిలో	రూ.లలో 290
ముడి చమురు 69.77 ▲	(బ్రెంట్ ధర డాలర్లలో)	



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	25,518	+148
నాస్‌డాక్	7,202	+49
నిక్కీ 225 (జపాన్)	23,710	−78
హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	31,120	+47
షాంఘై(చైనా)	3,426	+04
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,763	+15
డాక్స్ (జర్మనీ)	13,203	−78

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	57.96	67.21
పౌండ్ స్టెర్లింగ్	78.29	90.79
యూరో	69.33	80.40
జపనీస్ యెన్/100	51.92	60.22
ఆస్ట్రేలియా డాలరు	45.59	52.75
సింగపూర్ డాలరు	43.48	51.52
థాయ్ బాత్/100	180.80	216.24
బహ్రెయిన్ దినార్	156.96	179.88
కువైట్ దినార్	174.63	217.39
ఒమన్ రియాల్	153.71	175.86
సౌదీ రియాల్	15.41	18.27
యూఏఈ దిర్హమ్	15.77	18.44
మలేషియా రింగిట్	14.23	17.50



గురువారం నిఫ్టీ కదలికలు



రాణించిన హిందుస్థాన్ మీడియా

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో హిందుస్థాన్ మీడియా వెంచర్స్ ఏకీకృత ప్రాతిపదికన రూ.52.15 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.43.82 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 19 శాతం అధికం. ఇక మొత్తం ఆదాయం రూ.251.81 కోట్ల నుంచి స్వల్పంగా తగ్గి రూ.251.51 కోట్లకు చేరింది. ఇక మొత్తం వ్యయాలు సైతం రూ.198.24 కోట్ల నుంచి 9.47 శాతం తగ్గి రూ.179.45 కోట్లకు చేరాయి. ప్రకటనల ఆదాయం పుంజుకోవడంతో మొత్తంగా ఆదాయం మంచి వృద్ధి సాధించిందని కంపెనీ ఛైర్‌పర్సన్ శోభనా భర్తియా పేర్కొన్నారు. పండగల సీజన్ ముందే రావడం ఇందుకు కలిసొచ్చిందని తెలిపారు.

బీఎస్ఈలో షేరు 0.95 శాతం పెరిగి రూ.265.70 వద్ద ముగిసింది.

ఇండస్‌ఇండ్‌కు వడ్డీ ఆదాయం అండ

- లాభంలో 25 శాతం వృద్ధి
- ఆదాయం రూ.5,474 కోట్లు



ముంబయి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ నికర లాభం 24.72 శాతం పెరిగి రూ.936.25 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ రూ.750.64 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అధిక నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) ఇందుకు దన్నుగా నిలిచిందని బ్యాంక్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.4,716.13 కోట్ల నుంచి 16.05 శాతం వృద్ధితో రూ.5,473.54 కోట్లకు పెరిగింది. మొత్తం అడ్వాన్సుల్లో స్థూల నిరర్థక ఆస్తులు 0.94 శాతం నుంచి 1.16 శాతానికి పెరిగాయి. నికర నిరర్థక ఆస్తులు కూడా 0.39 శాతం నుంచి 0.46 శాతానికి చేరాయి. నికర వడ్డీ ఆదాయం 25 శాతం పెరిగి రూ.1,894.81 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిను 3.99 శాతం నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో 4 శాతంగా ఉంది. డిపాజిట్లు సైతం 23 శాతం మేర వృద్ధి చెందాయి. ఫీజు ఆదాయం 22 శాతం వృద్ధితో రూ.1,076.51 కోట్లకు చేరింది. ట్రెజరీ ఆదాయం మాత్రం 17 శాతం క్షీణించి రూ.110 కోట్లకు పరిమితమైంది.

'బ్యాంక్ మెరుగైన పనితీరును కొనసాగించింది. ప్రణాళిక ప్రకారం లాభం, ఆదాయం వృద్ధి చెందాయి. రుణ పుస్తకాన్ని సైతం స్థిరంగా కొనసాగించాం' అని ఇండస్‌ఇండ్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ రమేశ్ సోబ్తి పేర్కొన్నారు. కాలవధి రుణాలకు గిరాకీ గణనీయంగా పెరిగిందని, కార్పొరేట్ రంగం పుంజుకుంటోందని చెప్పడానికి ఇది సంకేతమని అన్నారు. వాహన రుణాలు 20 శాతం పెరగ్గా, వాహనేతర రుణాలు 40 శాతం వృద్ధి చెందాయని వివరించారు. ఆర్‌బీఐ ప్రకటించిన ఎగవేతవేతదారుల జాబితాలో బ్యాంక్‌కు చెందిన 8 ఖాతాలు ఉన్నాయని, అయినా వాటి ప్రభావం పెద్దగా పడలేదని తెలిపారు. భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్‌తో విలీనానికి కాంపిటీషన్ కమిషన్ ఆమోదం లభించిందని, సెబీ, ఎన్‌సీఎల్‌టీల అనుమతి కోరామని సోబ్తి చెప్పుకొచ్చారు.

బీఎస్ఈలో షేరు 2.08 శాతం కోల్పోయి రూ.1,698.60 వద్ద ముగిసింది.

తగ్గిన బజాజ్ కార్ప్ లాభం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) మూడో త్రైమాసికంలో ఎఫ్ఎమ్‌సీజీ సంస్థ బజాజ్ కార్ప్ స్టాండలోన్ ప్రాతిపదికన రూ.55.16 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.57.79 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 4.5 శాతం తక్కువ. అధిక వ్యయాలు ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. ఇక మొత్తం ఆదాయం రూ.200.65 కోట్ల నుంచి 5.92 శాతం వృద్ధితో రూ.212.53 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.127.18 కోట్ల నుంచి రూ.142.38 కోట్లకు చేరాయి. రూ.1 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.12 మధ్యంతర డివిడెండును కంపెనీ ప్రకటించింది.

బీఎస్ఈలో షేరు 2.71 శాతం లాభంతో రూ.509.15 వద్ద ముగిసింది.

శ్రీ సిమెంట్ లాభంలో 42% వృద్ధి

దిల్లీ: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో శ్రీ సిమెంట్ స్టాండలోన్ ప్రాతిపదికన రూ.333.33 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.235.43 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 41.58 శాతం అధికం కావడం విశేషం. ఇక మొత్తం ఆదాయం రూ.2,226.79 కోట్ల నుంచి 7.03 శాతం వృద్ధితో రూ.2,383.53 కోట్లకు చేరింది.

బీఎస్ఈలో షేరు 0.19 శాతం లాభంతో రూ.19,511.95 వద్ద ముగిసింది.

నిధుల వేటలో పతంజలి


- విదేశీ వెంచర్ ఫండ్లతో చర్చలు

PATANJALI®
Prakriti ka Aashirwad

దిల్లీ: బాబా రామ్‌దేవ్ ప్రచారం నిర్వహిస్తోన్న పతంజలి ఆయుర్వేద్ నిధుల అన్వేషణ పనిలో నిమగ్నమైంది. ఆహార శుద్ధి, తయారీ విభాగాల ప్రాజెక్టులకు పెట్టుబడుల సమీకరణ కోసం వివిధ విదేశీ వెంచర్ ఫండ్ సంస్థలతో చర్చలు జరుపుతోంది. 'యూబీఎస్, ఐడీఎఫ్‌సీల ద్వారా ప్రపంచంలోని దిగ్గజ ఈక్విటీ ఫండ్ సంస్థలతో మేం చర్చలు జరిపాం. గత రెండు నెలలుగా డజనుకుగా పైగా వెంచర్ కేపిటలిస్టులతో సమావేశాలు నిర్వహించామ'ని పతంజలి అధికార ప్రతినిధి ఎస్.కె.టిజారావాలా పీటీఐ వార్తా సంస్థకు తెలిపారు. ఈ సమావేశాల్లో పతంజలి మేనేజింగ్ డైరెక్టరు ఆచార్య బాలకృష్ణ కూడా పాల్గొన్నారని ఆయన చెప్పారు. ఫ్రాన్స్‌కు చెందిన ఎల్‌వీఎంహెచ్‌తో చర్చలు జరిపినట్లు వచ్చిన వార్తలపై స్పందిస్తూ.. చర్చలు జరిపింది వాస్తవమేనని ధ్రువీకరించారు. అయితే పెట్టుబడులను పొందే విషయంలో తమ సొంత నిబంధనలకు అనుగుణంగానే నడుచుకుంటామని స్పష్టం చేశారు. 'మా షరతులు చాలా సరళమైనవి. పతంజలిలో ఎవరికీ మేం వాటా ఇవ్వం. మాకు రుణం రూపేణానే నిధులు కావాలి. అది కూడా బ్యాంకు కంటే తక్కువ వడ్డీ రేటుకే ఇవ్వాల'ని ఆయన చెప్పారు. అలాగే భారత కరెన్సీలో మంజూరు రుణాన్ని రుణాన్ని తీసుకుంటామని కూడా చెప్పారు. 'స్వదేశీ, దేశీవాళీ ఉత్పత్తులకే ప్రాధాన్యమివ్వాలన్న మా ఆదర్శాన్ని, మాకున్న ప్రత్యేక గుర్తింపును ఎప్పుడూ వదులుకోమ'ని టిజారావాలా తెలిపారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో పతంజలి టర్నోవరు రూ.10,500 కోట్ల మైలురాయిని అధిగమించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ విలువను రెట్టింపు చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఎఫ్ఎమ్‌సీజీ విభాగంతో పాటు విద్య, ఆరోగ్య సంరక్షణ విభాగాలకు కూడా తన కార్యకలాపాలను విస్తరించింది.

సత్యం కంప్యూటర్స్ కేసులో
మేమేదీ కావాలని చేయలేదు

- సెబీ ఆదేశాలపై స్టే లభిస్తుంది
- ప్రైస్ వాటర్‌హౌస్



దిల్లీ: సత్యం కేసు విషయంలో తమ సంస్థలేవీ కావాలని తప్పు చేయలేదని ప్రైస్ వాటర్‌హౌస్ పేర్కొంది. సెబీ ఆదేశాలపై స్టే లభిస్తుందని గురువారమిక్కడ విశ్వాసం వ్యక్తం చేసింది. సత్యం కేసులో పాఠాలు నేర్చుకున్నామని.. గత తొమ్మిదేళ్లలో అత్యున్నత ఆడిట్ ప్రమాణాలను పాటించడం కోసం భారీగా పెట్టుబడులు పెట్టామని చెప్పుకొచ్చింది. సత్యం కుంభకోణంలో ప్రైస్ వాటర్‌హౌస్‌ను దోషిగా నిర్ధరించిన సెబీ రెండేళ్లపాటు ఆ సంస్థపై నిషేధం విధించింది. ఆ వ్యవధిలో ఏ నమోదిత కంపెనీకీ ఆడిట్ ధ్రువపత్రాలను జారీ చేయడానికి ఆ ఆడిట్ సంస్థకు అధికారం ఉండదు. 'పీడబ్ల్యూ సంస్థలు కావాలని ఏ తప్పూ చేయలేదు. సత్యం కేసులోనూ మేం తప్పు చేసినట్లు ఎటువంటి సాక్ష్యాలు లేవు. తాజాగా వెలువడ్డ సెబీ ఆదేశాలు సైతం బోంబే హై కోర్టు ఆదేశాలకు అనుగుణంగా లేవని మా అభిప్రాయం. అందుకే ఆ ఆదేశాలపై స్టే లభిస్తుందని ధీమాతో ఉన్నామ'ని ప్రైస్ వాటర్‌హౌస్ ఒక ప్రకటనలో పేర్కొంది.

కొత్త ఆడిటర్ కోసం కంపెనీల వెతుకులాట

ప్రైస్‌వాటర్‌హౌస్‌తో పాటు ఇతరత్రా అనుబంధ సంస్థలపైనా సెబీ రెండేళ్ల పాటు నిషేధం విధించిన నేపథ్యంలో ఇప్పటిదాకా ఆ సంస్థలు ఆడిటింగ్ సేవలు అందించిన కంపెనీలు కొత్త ఆడిటర్ వేటలో పడ్డాయి. ప్రస్తుతం పీడబ్ల్యూ నెట్‌వర్క్‌లో 11 కంపెనీలు, 3000 మంది ఉద్యోగులు భారత్‌లో ఉన్నాయి. ఈ కంపెనీలు దాదాపు 75 నమోదిత సంస్థలకు సేవలు అందిస్తున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంపై ప్రభావం ఉండకపోవచ్చన్న అంచనాలు ఉన్నప్పటికీ కొత్త ఆడిటర్ కోసం ఈ కంపెనీలు వేట మొదలుపెట్టాయని తెలుస్తోంది. తక్షణం ఆయా కంపెనీలపై ఎంత ప్రభావం ఉంటుందో చెప్పలేమని ఒక సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ పేర్కొన్నారు.

ఐటీ, స్థిరాస్తి షేర్ల దన్ను

కొత్త గరిష్ఠాలకు సూచీలు • ఫలితాలపై మదుపర్ల ఆశలు

కంపెనీల త్రైమాసిక ఫలితాలపై సానుకూల అంచనాలతో సూచీలు కొత్త గరిష్ఠాలకు చేరాయి. ముఖ్యంగా ఐటీ, స్థిరాస్తి షేర్లకు కొనుగోళ్లు వెల్లువెత్తాయి. ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా వంటి బ్లూచిప్ కంపెనీల ఆర్థిక ఫలితాలు మెరుగ్గా ఉండొచ్చన్న అంచనాలు ఇందుకు కలిసొచ్చాయి. అయితే సీపీఐ ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదల కానున్న నేపథ్యంలో కొంత ఆచితూచి వ్యవహరించారు. అంతర్జాతీయ మార్కెట్లను చూస్తే.. జపాన్ నిక్కీ, హాంకాంగ్ హాంగ్‌సెంగ్‌లు డీలాపడ్డాయి. షాంఘై కాంపోజిట్ స్వల్పంగా పెరిగింది. ఐరోపా సూచీలు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

నష్టాల నుంచి పుంజుకుని..

సెన్సెక్స్ ఉదయం 34,471.48 పాయింట్ల వద్ద మెరుగ్గానే ప్రారంభమైంది. వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. 34,400.61 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. అనంతరం కొనుగోళ్ల మద్దతుతో బలంగా పుంజుకున్న సెన్సెక్స్.. ఇంట్రాడేలో 34,565.88 పాయింట్ల వద్ద జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 70.42 పాయింట్లు పెరిగి 34,503.49 వద్ద ముగిసింది. సెన్సెక్స్ గత అత్యధిక ముగింపు 34,443.19 పాయింట్లను అధిగమించింది. ఇక నిఫ్టీ సైతం 10,664.60 దగ్గర జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 19 పాయింట్ల లాభంతో 10,651.20 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,612.36- 10,664.60 పాయింట్ల మధ్య కదలాడింది. నిఫ్టీకి సైతం ఇది రికార్డు ముగింపు కావడం విశేషం.

సమీక్ష

సెన్సెక్స్ 30 షేర్లలో 16 లాభాలతో ముగిశాయి. ఇన్ఫోసిస్ 2.28%, భారతీ ఎయిర్‌టెల్ 1.66%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.61%, ఏషియన్ పెయింట్స్ 0.97%, హిందుస్థాన్ యునిలీవర్ 0.91%, హెచ్‌డీఎఫ్‌సీ 0.90%, ఎం అండ్ ఎం 0.88%, యెస్ బ్యాంక్ 0.84%లు రాణించిన వాటిలో ఉన్నాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ (2.08%), విప్రో (1.53%), ఐసీఐసీఐ బ్యాంక్ (0.82%), యాక్సిస్ బ్యాంక్ (0.76%), హీరో మోటోకార్ప్ (0.70%), టీసీఎస్ (0.67%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీ సూచీల్లో.. స్థిరాస్తి సూచీ 2% మెరిసింది. ఐటీ 0.89%, టెక్ 0.79% చొప్పున రాణించాయి. మన్నికైన వినిమయ వస్తువులు, చమురు- గ్యాస్, యంత్ర పరికరాలు, మౌలిక, పీఎస్‌యూ షేర్లు ప్రతికూలంగా ముగిశాయి.

నేటి మార్కెట్

నేడు సూచీలు స్వల్ప శ్రేణిలో కదలాడొచ్చు. టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి ఐటీ దిగ్గజ కంపెనీల ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. అక్టోబరు- డిసెంబరు త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో షేరు ఆధారిత కదలికలు చోటుచేసుకోవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గురువారం మార్కెట్లు ముగిసిన అనంతరం టీసీఎస్ ఫలితాలు విడుదల కాగా.. నేడు ఇన్ఫోసిస్ ఫలితాలు వెలువడనున్నాయి. నేడు నిఫ్టీకి 10690- 10724 పాయింట్ల వద్ద నిరోధం, 10564- 10599 పాయింట్ల దగ్గర మద్దతు లభించొచ్చని సాంకేతిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల మద్దతు లభిస్తే.. నిఫ్టీ 10,700 పాయింట్ల మైలురాయిని అధిగమించొచ్చని భావిస్తున్నారు. ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఆస్తుల నాణ్యత తగ్గడంతో ప్రైవేట్ రంగ బ్యాంక్ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. ఇక ఫలితాలు ప్రకటించనున్న నేపథ్యంలో కర్ణాటక బ్యాంక్ షేరు వెలుగులోకి రావొచ్చు.

డొల్ల కంపెనీల్లో సీఏల పాత్ర..?

- ప్రతినెలా నివేదిక ఇవ్వండి
- ఐసీఏఐకు ప్రభుత్వ ఆదేశం


దిల్లీ: డొల్ల (షెల్) కంపెనీలపై కఠిన చర్యలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నిషేధిత డొల్ల కంపెనీలతో లావాదేవీలు నిర్వహించిన చార్టర్డ్ అకౌంటెంట్ల (సీఏ)పై ఏవిధమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుందీ వివరిస్తూ, ప్రతినెలా నివేదిక పంపాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ)ను ఆదేశించింది. డొల్ల కంపెనీలను అడ్డంపెట్టుకుని నల్లధనం చెలామణి చేయడంలో సీఏల నిర్వహించిన పాత్రపై, దీనిపై నియమించిన టాస్క్‌ఫోర్స్ చర్చించిందని ఒక అధికారి తెలిపారు. తప్పు చేసిన సీఏలపై ఐసీఏఐ చర్యలు తీసుకుంటున్న చర్యలు అతి స్వల్పంగా ఉన్నాయని టాస్క్‌ఫోర్స్ భావించిందన్నారు. నిషేధిత డొల్ల కంపెనీల్లో ఆడిట్ నిర్వహించి, ధ్రువీకరించిన సీఏలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. వారిపై సత్వరం చర్యలు తీసుకోవాలని ఐసీఏఐకు స్పష్టం చేసింది.

ఇన్ఫోసిస్



రూ.1055.25 వద్ద ప్రారంభమై రూ.1055.25– 1083.40 మధ్య కదలాడి క్రితం ముగింపు రూ.1052.25తో పోలిస్తే రూ.23.55 (2.24%) లాభంతో రూ.1075.80 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 83,87,735.

ఇండస్‌ఇండ్ బ్యాంక్



రూ.1740 వద్ద మొదలై రూ.1685– 1752 మధ్య చలించి క్రితం ముగింపు రూ.1734.10తో పోలిస్తే రూ.33.80 (1.95%) నష్టంతో రూ.1700.30 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 41,45,613 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

యునైటెడ్ బ్రూవరీస్	1198.75	కిరి ఇండస్ట్రీస్	671.70
సీఈఎస్‌సీ	1190.00	రామ్‌కో సిస్టమ్స్	572.40
ఇన్ఫోసిస్	1083.40	వక్రంజీ	451.00
ఎస్కార్ట్స్	816.55		
బాలాజీ అమైన్స్	782.00		
ఎన్ఐఐటీ టెక్నాలజీస్	735.00		

52 వారాల కనిష్ఠం (రూ.లలో)


న్యూలాండ్ లేబొరేటరీస్	829.20
సీక్వెంట్ సైంటిఫిక్	95.50

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
11/01	4,978	5,601	−624	3,636	2,866	770
10/01	3,797	4,369	−572	3,943	3,343	600
09/01	4,872	5,176	−304	4,018	3,495	523
08/01	5,637	4,944	693	3,710	3,916	−206
05/01	5,812	5,230	581	3,985	3,742	243

11వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) — కోడిగుడ్లు

(100కు రూపాయలలో)



హైదరాబాద్	402	వరంగల్	404
చిల్లరగా (ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	404
బెంగళూరు	405	చెన్నై	405
12న		చిత్తూరు	398
విజయవాడ/గోదావరి	404	నమక్కల్	395

ఎన్ఎస్ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 425.50 (423.45) 4415343
AMBUJA CEMEN 271.75 (276.10) 2869698
ASIAN PAINTS 1188.95 (1177.40) 475476
AUROBIND PHA 674.55 (672.70) 1449478
AXIS BANK LT 558.75 (562.80) 2825941
BAJAJ AUTO L 3193.40 (3207.40) 324132
BAJAJ FINANC 1780.35 (1802.20) 818471
BHARTI AIRTE 514.75 (506.40) 5322546
BHARTI INFRA 367.75 (370.80) 2373477
BOSCH LTD 19954.70 (19811.15) 12507
BPCL 492.40 (494.30) 2958652
CIPLA 612.35 (619.75) 1092457
COAL INDIA L 308.10 (308.30) 4703627
DR. REDDYS 2425.35 (2425.80) 185159
EICHER MOTOR 28444.70 (28097.50) 60091
GAIL 495.50 (496.10) 1226993
HCL TECH 916.90 (915.85) 2121723
HDFC 1741.35 (1726.45) 1680803
HDFC BANK 1872.55 (1864.20) 1014774
HERO MOTOCOR 3705.65 (3736.90) 366135
HINDALCO IND 267.75 (268.80) 6502699
HINDUSTAN UN 1378.65 (1365.80) 629248
HPCL 420.95 (424.55) 2164121
ICICI BANK 309.50 (312.00) 8366718
INDIABULLS H 1228.65 (1204.20) 2768740
INDIAN OIL 388.90 (389.55) 1315655
INDUSINDBANK 1700.30 (1734.10) 4145613
INFOSYS LTD 1075.80 (1052.25) 8387735
ITC 269.80 (269.40) 11287447
KOTAK MAHIND 1017.65 (1002.25) 2077832
LARSEN & TOU 1323.55 (1323.75) 1232290
LUPIN 929.20 (925.80) 915764
M&M 766.65 (759.85) 2291617
MARUTI SUZIK 9339.80 (9375.85) 369158
NTPC LTD 173.50 (173.95) 5536143
ONGC 197.90 (197.90) 5701402
POWER GRID C 197.85 (199.85) 6921938
RELIANCE IND 937.75 (942.35) 3588727
SBI 302.20 (301.10) 12299087
SUN PHARMA 587.95 (585.10) 5930449
TATA CONSULT 2790.50 (2806.60) 1260524
TATA MOTORS 434.75 (433.30) 4565005
TATA STEEL L 770.95 (772.85) 1934937
TECH MAHINDR 551.70 (542.10) 3485390
ULTRATECH 4406.10 (4403.20) 111608
UPL LIMITED 786.20 (778.85) 697993
VEDANTA LIMI 333.90 (334.80) 4128265
WIPRO 321.10 (326.70) 2116462
YES BANK LTD 343.15 (339.80) 8266266
ZEE ENTERTAI 580.00 (580.50) 3333739

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1399.60 (1415.40) 32089
ACC 1802.10 (1816.55) 138505
ASHOK LEYLAN 127.05 (127.95) 10204509
AVENUE SUPER 1245.50 (1249.30) 489609
BAJAJ FINSER 5146.40 (5199.55) 71160
BANK OFBAROD 163.30 (162.50) 6879490
BEL 179.00 (179.95) 3953533
BHEL 103.50 (103.80) 5568670
BRITANNIA 4721.55 (4674.75) 111728
CADILA HEALT 444.90 (443.70) 622725
COLGATE PALM 1125.05 (1118.25) 296202
CONTAINER 1426.10 (1476.30) 451066
CUMMINS INDI 936.70 (925.40) 342355
DABUR INDIA 359.90 (357.80) 557697
DLF LIMITED 270.50 (269.35) 6530547
EMAMI LIMITE 1303.75 (1336.40) 200937
GLAXOSMI CON 6416.40 (6521.20) 4055
GLAXOSMI PHA 2480.30 (2470.05) 13513
GLENMARK PHA 627.00 (617.25) 1913396
GODREJ CONSU 985.00 (978.45) 282344
HAVELLS INDI 548.80 (549.70) 550622
HINDUSTAN ZI 319.70 (319.50) 710197
ICICI PRU LI 406.65 (410.00) 649438
IDEA CELLULR 107.15 (107.35) 13072303
INTERGLOBE A 1235.65 (1239.15) 256722
JSW STEEL LT 282.55 (282.80) 1757575
LIC HOUS.FIN 568.80 (575.20) 2789635
MARICO LIMIT 316.30 (321.65) 1244144
MCDOWELL 3827.65 (3830.40) 336035
MOTHERSON 385.70 (378.65) 1746408
MRF 72311.95 (72481.50) 4998
NHPC LTD 32.25 (32.45) 6438509
NMDC LTD 155.35 (155.30) 17196115
OIL INDIA 383.15 (383.85) 394647
ORACLE FIN S 4147.40 (4097.30) 47840
P&G HYG&HEAL 9292.90 (9297.75) 4184
PETRONET LNG 249.45 (251.00) 1739263
PIDILITE IND 899.55 (911.75) 434606
PIRAMAL ENTE 2860.10 (2857.35) 97632
PNB 172.75 (170.65) 8683986
POWER FIN CO 127.85 (124.80) 5302788
RURAL ELEC C 162.35 (162.35) 3743499
SAIL 98.50 (98.45) 7042701
SHREE CEMENT 19536.10 (19501.80) 33089
SHRIRAM TRAN 1504.90 (1521.10) 658278
SIEMENS 1294.60 (1299.75) 150993
SUN TV LTD 1043.60 (1022.15) 663460
TATA POWER 99.55 (98.25) 7143254
TITAN IND 906.90 (917.60) 1597329
TORRENT PHAR 1381.85 (1401.25) 63742

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 268.10 (251.45) 28788250
ADANI ENTERP 201.70 (198.80) 5579135
ADANI POWER 46.10 (46.30) 10693105
ALL BANK 72.75 (72.80) 1053125
AMARA RAJA 862.90 (854.45) 582744
ANANT RAJIND 80.80 (82.25) 2884477
ANDHRA BANK 57.75 (57.40) 1466410
APOLLO HOSPI 1172.40 (1172.15) 243414
APOLLO TYRES 279.05 (278.05) 1633890
APTECH 372.00 (368.00) 474495
BAJAJ ELECT. 550.25 (547.05) 334551
BAJAJ HIND 17.45 (17.15) 4049207
BAJAJ HOLDIN 2837.20 (2880.35) 14997
BALAJI TELE 162.35 (165.00) 515504
BALLARPUR IN 18.00 (17.95) 3078656
BALRAMPUR CH 141.35 (142.05) 1020759
BANK OF MAHA 22.45 (22.75) 784039
BANK OFINDIA 166.05 (165.00) 2389660
BATA INDIA 749.70 (753.95) 727725
BGR ENERGY S 148.75 (139.50) 2477940
BHARAT FORGE 727.45 (726.55) 807052
BHUSHAN STEE 71.30 (72.00) 1746047
BIOCON LTD 546.25 (541.85) 754266
BOMBAY DYE 284.35 (287.55) 1890973
CANARA BANK 355.50 (354.65) 1152985
CEAT LIMITED 1969.65 (1962.80) 327077
CENTRAL BANK 74.70 (74.70) 290268
CHAMBAL FERT 154.50 (154.45) 2141254
CHENNAI PETR 440.00 (438.30) 637452
CITY UNIBANK 174.95 (175.25) 209880
CORPO BANK 40.10 (40.60) 391029
COX & KINGS 264.85 (264.70) 114352
D B REALTY L 82.20 (83.70) 1231260
DELTA CORP L 317.80 (300.55) 4963531
DENA BANK 26.50 (26.35) 2255750
DHANALAKBANK 31.00 (31.30) 458514
DIVIS LAB 1101.55 (1079.30) 459962
EDELWEISS CA 283.25 (283.45) 830083
EID PARRY 373.20 (377.05) 83912
EIH 185.40 (181.10) 390934
ESSAR SHIPPI 30.90 (30.50) 1212321
ESTER INDUST 70.85 (66.95) 1223399
EXIDE INDUST 223.80 (223.40) 910509
FEDERAL BANK 114.00 (113.15) 5646154
FINOLEX CABL 725.10 (711.75) 27159
G E SHIP LTD 454.75 (465.85) 489896
GAMMON INFRA 3.65 (3.75) 11722771
GATI LIMITED 137.35 (137.10) 664458
GAYATRI PROJ 212.40 (218.15) 436566
GITANJALIGEM 79.30 (80.15) 2554262
GMR INFRASTR 21.75 (22.30) 58798350
GODREJ IND 641.80 (617.15) 1729176
GRASIM IND 1244.00 (1235.50) 752526
GUJ ALK&CHEM 853.70 (868.20) 100210
GUJ NRE COKE 1.45 (1.50) 3389929
HCL INFOSYS 61.35 (62.60) 3589571
HEXA TECH 361.00 (362.40) 890101
HIMACHAL FUT 35.05 (35.20) 20812076
HINDU MOTORS 12.60 (10.50) 11250150
HOUSING DEV 64.60 (64.80) 21132552
IDBI 61.95 (62.00) 2026304
IDFC 65.55 (63.95) 27979336
IFCI 32.25 (30.45) 46849100
IL&FS TRANS 93.15 (89.25) 1889411
INDBULLS REL 255.65 (247.10) 18766103
INDIA CEM 192.05 (193.00) 4656152
INDIAN BANK 370.90 (373.45) 609380
INDO RAMA SY 51.00 (46.90) 987301
INDRAPRASTHA 322.25 (325.75) 2354009
INGERSOLL-R 872.50 (879.25) 22828
IOB 23.35 (23.55) 653775
IPCA LAB 572.35 (579.60) 59478
IRB INFRA DE 247.75 (247.40) 772525
J&K BANK 79.20 (80.70) 287672
JAI CORP 214.10 (203.00) 12050103
JAIN IRRIGAT 139.40 (133.65) 20243873
JAYPEE INFRA 22.70 (23.60) 3347748
JET AIRWAYS 838.70 (843.50) 2321018
JINDAL SAW 168.80 (161.35) 6797733
JINDAL STEEL 267.35 (262.40) 31832706
JK LAKSHMI C 449.40 (446.50) 42701
JK PAPER LIM 161.65 (163.75) 721355
JM FINANCIAL 166.40 (163.20) 1301755
JP ASSOCIATS 23.50 (24.05) 31926971
JSW ENERGY L 95.30 (91.70) 20329053
JUBILANT FOO 1923.40 (1920.50) 397754
JUBILANT ORG 809.45 (776.90) 1779474
JYOTHY LABS 369.40 (374.80) 148935
JYOTI STRUC 14.80 (14.10) 4004526
KARNATA BANK 162.65 (161.20) 2849544

ఘనం (+)

నిఫ్టీ	11న	మార్పు %
INFOSYS	1075.80	2.24
INDIABULLS HSG	1228.65	2.03
TECH MAHINDRA	551.70	1.77
BHARTI AIRTEL	514.75	1.65
KOTAK MAHI BANK	1017.65	1.54
EICHER MOTORS	28444.70	1.24
YES BANK	343.15	0.99

గ్రహణం (-)

నిఫ్టీ	11న	మార్పు %
INDUSIND BANK	1700.30	-1.95
WIPRO	321.10	-1.71
AMBUJA CEMENTS	271.75	-1.58
BAJAJ FINANCE	1780.35	-1.21
CIPLA	612.35	-1.19
POWER GRID CORP	197.85	-1.00
HPCL	420.95	-0.85

KEC INTL LTD 377.35 (380.80) 209338
KOLTE PATIL 376.40 (377.65) 298967
KPIT CUMMINS 208.20 (206.25) 4332188
L&TFIN.HOLD 181.70 (181.30) 3296323
LAK VIL BANK 143.35 (143.40) 419143
M & M FINANC 480.95 (476.30) 1109436
M & M FINANC 480.95 (476.30) 1109436
MANAPPURAM G 122.35 (119.85) 4898470
MMTC LIMITED 68.45 (68.25) 1666718
MOSER-BEAR 6.75 (7.00) 2207356
MPHASIS LTD 716.20 (710.00) 415257
MRPL 133.65 (133.40) 1130834
MTNL 28.05 (27.45) 3584485
NAGARJUNA OI 5.20 (5.35) 896241
NCC LIMITED 136.70 (137.90) 3557070
NETWORK18 FI 60.35 (59.10) 1658469
NEULAND LAB 831.90 (834.30) 54108
NIIT LTD 115.10 (114.60) 2331352
NIIT TECHNOL 717.65 (719.15) 1015367
OMAXE LTD 229.40 (229.95) 692230
ONMOBILE GLO 63.20 (59.85) 1841320
ORIENTALBANK 122.40 (123.00) 1322056
PARSVNATH DE 29.15 (28.95) 100771
PATEL ENGG 83.70 (81.10) 1290530
PFIZER 2013.50 (2047.30) 40125
POLARIS SOFT 391.00 (389.65) 103854
POWERTRADING 120.65 (119.85) 1047401
PRAJ IND 128.45 (119.35) 8507332
PRISM CEMENT 135.25 (135.65) 4981700
PUNJ LLOYD 26.95 (27.60) 4885787
PUNJAB & SIN 49.75 (49.60) 72671
PURAVANKARA 165.30 (168.10) 402033
PVP VENTURES 8.40 (7.70) 1133218
PVR LIMITED 1460.75 (1469.00) 107845
RADICO KHAIT 317.85 (311.30) 1299979
RAJESH EXPOR 818.30 (827.15) 397750
RALLIS INDIA 269.80 (267.10) 1382865
RAMCO IND 290.25 (288.95) 136382
RAMCO SYS 549.80 (549.85) 196187
RAMKY INFRA 229.65 (237.60) 107666
RAYMOND 1113.90 (1114.00) 344575
RELIANCE CAP 593.50 (599.10) 3089073
RELIANCE COM 32.80 (33.20) 79351931
RELIANCE INF 564.00 (564.30) 1867830
RELIANCE POW 55.80 (56.15) 15148534
ROLTA INDIA 75.90 (75.50) 2430622
SAGAR CEMENT 1091.85 (1094.75) 23271
SAREGAMA 828.90 (829.25) 119703
SHANTHI GEAR 172.20 (167.35) 876064
SHIPPNG CORP 96.40 (97.55) 2300042
SHREE RENUKA 16.55 (16.75) 2213033
SINTEX IND 27.50 (27.05) 8934151
SOBHA DEVELO 605.35 (604.40) 464871
SOUTHINDBANK 32.70 (32.35) 11836339
SRS LIMITED 1.75 (1.70) 4420701
STERLITE TEC 358.40 (361.55) 4115075
SUN PHARMA 509.65 (503.05) 346580
SUND FASTNER 571.55 (576.40) 209147
SUZLON ENERG 16.45 (16.40) 39261305
SYND. BANK 77.40 (77.65) 2484272
TATA CHEM 771.00 (762.95) 1727245
TATA COFFEE 169.15 (168.85) 1127350
TATA COMMUN 675.05 (673.45) 325500
TATA GLOBAL 313.30 (314.10) 3481728
TATA METALIK 911.90 (946.20) 434346
TATA MOT DVR 254.10 (254.00) 1015748
THE INDIAN H 143.55 (143.15) 1146326
TORRENT POWE 291.80 (293.65) 1217681
TRIVENI ENGG 77.70 (77.65) 257277
TTK PRESTIGE 8016.70 (8110.30) 2665
TV TODAY NET 460.85 (449.90) 284562
TV18 BROADCA 61.90 (62.10) 3968792
TVS MOTOR 755.35 (767.45) 698032
UCO BANK 31.70 (31.80) 917468
UNION BANK 138.80 (141.75) 7313383
UNITECH 9.80 (9.80) 35100236
UNITED BANK 18.35 (18.50) 434603
UNITED BREWE 1178.10 (1130.40) 738631
USHA MARTIN 25.45 (24.60) 1324215
VADILAL INDU 967.20 (971.30) 14468
VENKYS 2731.65 (2475.50) 543047
V-GUARD IND 236.20 (238.90) 865780
VIJAYA BANK 66.95 (66.95) 1283896
VIP 368.95 (368.70) 368218
VOLTAS 625.85 (629.30) 1177579
ZEE LEARN LI 45.55 (45.85) 2163392
ZUARI GLOBAL 244.95 (248.10) 116482
ZYDUS WELLNE 1133.10 (1091.75) 29811

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 11.08 (10.43) 149199
ALPHAGEO 1007.25 (1007.80) 11733
AMAR RAJA BA 860.70 (853.75) 36777
ANDHRA BANK 57.65 (57.45) 120371
ANDHRA CEMEN 15.13 (14.99) 102544
ANDHRA PAPER 406.75 (384.45) 180807
ANDHRA PETRO 65.95 (65.20) 77365
ASTRA MICROW 118.35 (118.20) 114482
AUROBINDO PH 674.95 (672.60) 149791
AVON ORG 20.26 (19.30) 134330
BALAJI AMIN 730.95 (709) 75441
BARTRONICS 16.13 (15.37) 40567
BHAGYA NAG 49.30 (49.85) 14744
BRILLIANT SE 16.34 (15.57) 6565557
CONT COFFEE 302.85 (304.80) 13298
COROMAN FERT 571.15 (570.65) 11965
CYBERMATE 4.05 (3.86) 323910
DIVI'S LAB 1098.70 (1080.60) 117323
DR REDDY 2429.75 (2422.80) 12598
GATI CORPN 137.15 (137.10) 137056
GAYATRI PROJ 209.50 (217.70) 538915
GMR INFRASTR 21.75 (22.25) 4036700
GOLDST INFRA 227.25 (227.70) 42127
GOLDSTONE EN 17.05 (16.25) 70792
GRANULES (I) 146.80 (140.60) 855937
GSS AMERICA 35.15 (35.95) 49452
GVK POWER 24.40 (23.25) 2348562
HBL NIFE POW 72.35 (72.45) 197098
HYD INDUS 1714.05 (1699.50) 13603
ILFS ENGINEE 53.10 (53.50) 14046
INNAREDY COM 5.97 (5.69) 149906
IVRCL INFRAS 6.15 (5.86) 575071
JEEVAN SCIEN 61.70 (59.70) 14782
KALLAM SPG 25.10 (25.10) 54674
KAVERI SEED 527.15 (526.85) 46976
KCP LTD 154.55 (154.20) 48663
KERNEX MICRO 52.05 (49.60) 34053
LANCO INDUS 435.90 (441.50) 39506
LANCO INFRAT 2.04 (1.95) 32896099
LAURUS LABS 550.55 (543.50) 15046
LOKESH MACH 77.15 (77.35) 43102
MADHUCON PRO 38.35 (39.05) 109423
MEGA SOFT 16.63 (16.02) 39241
MIC ELECTRON 9.37 (9.26) 103940
MSR INDIA LT 36.35 (37.10) 313211
NAGARJAGRICH 62.80 (61.50) 87403
NATCO PHARMA 1022.05 (990.90) 31470
NAVA BH VENT 172.90 (172.15) 107078
NCC 136.75 (138.10) 193086
NEHA INTER 9.86 (9.93) 47295
NETTLINX 94.45 (89.75) 58641
NIHAR INFO 14.90 (14.26) 954
OIL COUNTRY 63.70 (62.40) 86720
PANKAJ POLY 20.50 (20.90) 18652
PENNER IND 71.40 (71.70) 127770
PIONEER DIST 222.90 (219.20) 14888
PITTI LAMIN 101.05 (100.25) 41768
PRAJAY ENGS 18.72 (19.70) 72473
PRISM CEMENT 135.70 (136.35) 1874976
PRUDENTL PHA 5.80 (5.93) 292803
RAIN INDUSTR 448.50 (449.85) 370769
RAJ PACKAGIN 40.75 (39.15) 16304
SATVAH. ISPA 35.20 (36.20) 67709
SOUTH BIO TE 5.32 (4.44) 672794
SPHERE GLOBA 47.30 (46.70) 15174
SREE RAYAL A 85.15 (86.40) 698421
STEEL EXCHAN 41.10 (41.70) 67591
SUJANA METAL 1.82 (1.76) 105900
SUJANA TOWER 5.30 (5.48) 16316
SUJANA UNIVE 1.11 (1.06) 36251
SURANA TELE 6.48 (6.70) 19693
SURYALATA SP 183 (167.65) 83884
SUVEN PHARMA 213.15 (212.20) 79671
TAJ GVK HOTE 184.10 (182.65) 40239
TANLA 44.25 (43.95) 454991
TRANS BIOTEK 2.40 (2.38) 40162
TRENDY KNIT 0.25 (0.24) 186098
VICEROY HOTE 20.25 (20.40) 90367
VIJAY TEXTIL 52.90 (48.10) 193238
VIMTA LABS 171.60 (170.10) 11355
VISAKA IND 754.50 (753.90) 23180
VISTA PHARMA 47.60 (48.50) 48286
VIVIMED LABS 107.50 (106.05) 137432
XL TELENE 4.35 (4.16) 28898
YBRANT DIGIT 9.28 (8.44) 4554232
ZENOTECH LAB 51.35 (49) 43325
ZENTECH 147.30 (150.10) 33572



ప్రపంచంలోని ఏడు ఖండాల్లోని ఏడు అత్యున్నత పర్వత శిఖరాలను అధిరోహించిన భారతీయ వాయుసేనకు చెందిన పర్వతారోహకులు. . జాతీయ జెండాతో ఫొటోకు ఫోజు ఇచ్చిన దృశ్యం

భాజపా సీనియర్ నేతలతో ప్రధాని భేటీ

తన అధికారిక నివాసంలో విందు

దిల్లీ, ఈనాడు: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం రాత్రి తన అధికారిక నివాసంలో భాజపా సీనియర్ నేతలకు విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజానుకూల విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు. ముఖ్యంగా నిరుపేద మహిళలకు అందజేస్తున్న గ్యాస్ కనెక్షన్ల గురించి తెలియజేయాలని ప్రత్యేకంగా కోరారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌కు నేతల సూచనలు తీసుకున్నారు. 2019 సాధారణ ఎన్నికలకు ఎలా సన్నద్ధమవుతున్నారని పార్టీ రాష్ట్రాల ఇన్‌ఛార్జులను అడిగి తెలుసుకున్నారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్ణాటక, రాజస్థాన్ తదితర 8 రాష్ట్రాల్లోని రాజకీయ పరిస్థితులపైనా చర్చించారు. సమావేశం మూడు గంటలకు పైగా కొనసాగింది. భాజపా అధ్యక్షుడు అమిత్ షాతో పాటు కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల పార్టీ ఇన్‌ఛార్జులు హాజరయ్యారు.

గోప్యత పేరుతో డిజిటల్ ఆవిష్కరణలను చంపొద్దు

దిల్లీ: వ్యక్తిగత గోప్యత పేరుతో డిజిటల్ రంగంలో జరిగే నూతన ఆవిష్కరణలను చంపేయొద్దని కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ హితవు పలికారు. గురువారం ఇక్కడ జరిగిన అంతర్జాతీయ వాణిజ్య సదస్సులో ఆయన ప్రసంగిస్తూ లైసెన్స్‌రాజ్ కారణంగా 1980, 90 ప్రాంతాల్లో వచ్చిన పారిశ్రామిక విప్లవాలను దేశం అందుకోలేకపోయిందని, డిజిటల్ విప్లవం విషయంలో అలా జరగకూడదని చెప్పారు. 'ప్రయాణించడం మీ వ్యక్తిగత వ్యవహారం. అదే విమానాల్లో వెళ్తే మీ వివరాలన్నీ నమోదవుతాయి. ఏమి తినాలన్నది మీ ఇష్టం. హోటల్‌లో మీరు భోజనం చేస్తే బిల్లు రూపంలో ఆ వివరాలన్నీ తెలుస్తాయి. అందువల్ల వ్యక్తిగత గోప్యతపై హడావిడి చేయాల్సిన పనిలేదు. బ్యాంకుఖాతాలు, వైద్య వ్యవహారాల్లో గోప్యత ఉండాల్సిందే'నని అన్నారు.

ఆధార్‌పై తప్పుడు ప్రచారం దురదృష్టకరం: నిలేకని

బెంగళూరు, న్యూస్‌టుడే: ఆధార్‌పై తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఇది దురదృష్టకరమని యూఐడీఏఐ మాజీ అధ్యక్షుడు నందన్ నిలేకని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ సమాచారం లీకవుతోందని వదంతులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. గురువారం బెంగళూరులో కొన్ని వార్తా సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. "పలు భద్రత అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆధార్‌కార్డుకు రూపం ఇచ్చాం. ఈ నెంబరుతో వివిధ పథకాలు, బ్యాంకు ఖాతాల అనుసంధానం విజయవంతం కావటంతో గిట్టక కొందరు తప్పుడు ప్రచారానికి తెరలేపారు. దేశంలో ఇప్పటికే 119 కోట్ల మంది ప్రజలు ఆధార్ సంఖ్యను పొందారు' అని నిలేకని వ్యాఖ్యానించారు.

ఆన్‌లైన్‌లో హిందూ గ్రంథాలు

ఖరగ్‌పూర్: హిందువుల పవిత్ర గ్రంథాలపై కాన్పూర్ ఐ.ఐ.టి. ఆన్‌లైన్ సేవల్ని ప్రారంభించింది. రాత రూపంలోనూ, ఆడియో ద్వారానూ దేశంలో ఇలాంటి సేవల్ని అందుబాటులోకి తెచ్చిన మొట్టమొదటి ఇంజినీరింగ్ కళాశాలగా నిలిచిపోయింది. www.gitasupersite.iitk.ac.in అనే అధికారిక పోర్టల్‌లో భగవద్గీత, రామచరిత మానస్, బ్రహ్మసూత్రాలు, నారద భక్తి సూత్రంవంటి 9 గ్రంథాలను ఇప్పటివరకు అందుబాటులోకి తెచ్చారు. వీటితో పాటు సుందరకాండ, బాలకాండలకు సంస్కృత భాష్యాలనూ చేర్చారు.

ఉత్తీర్ణత మార్కులను తగ్గించిన సీఐఎస్‌సీఈ

కోల్‌కతా: పదో తరగతి(ఐసీఎస్‌ఈ), 12వ తరగతి(ఐఎస్‌సీ) బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేందుకు విద్యార్థులు సాధించాల్సిన కనీస మార్కులను 'ది కౌన్సిల్ ఫర్ ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్(సీఐఎస్‌సీఈ)' తగ్గించింది. ఉత్తీర్ణత మార్కులను ఐసీఎస్‌ఈ విద్యార్థులకు 35 శాతం నుంచి 33 శాతానికి, ఐఎస్‌సీ విద్యార్థులకు 40 శాతం నుంచి 35 శాతానికి తగ్గించినట్లు వెల్లడించింది. తాజా మార్పులు ఈ విద్యాసంవత్సరం నుంచే అమల్లోకి వస్తాయని తెలిపింది.

ఐసీజేపై పెరుగుతున్న నమ్మకం: జస్టిస్ దల్వీర్


హేగ్: అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే) పని రోజురోజుకూ పెరగడం.. ఈ కోర్టుపై సభ్య దేశాల్లో పెరుగుతున్న నమ్మకానికి ఇది నిదర్శనమని జస్టిస్ దల్వీర్ భండారీ పేర్కొన్నారు. ఐసీజేలో న్యాయమూర్తి పదవికి ఆయన తిరిగి ఎన్నికైన నేపథ్యంలో నెదర్లాండ్స్‌లో భారత రాయబారి వేణు రాజమోని ఒక విందు ఇచ్చారు. ఈ సందర్భంగా భండారీ మాట్లాడుతూ. . తన ఎన్నికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రూ.3500 కోట్ల బినామీ ఆస్తులు జప్తు

దిల్లీ: కొత్తగా అమల్లోకి వచ్చిన 'బినామీ ఆస్తుల లావాదేవీల నిషేధ చట్టం' కింద ఆదాయపుపన్ను శాఖ కొరడా ఝుళిపించింది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో గురువారం సోదాలు నిర్వహించి భారీగా ఫ్లాట్లు, దుకాణాలు, ఆభరణాలు, వాహనాలను జప్తు చేసుకొంది. వీటి విలువ రూ.3500 కోట్లకు పైమాటే. స్థిరచరాస్తుల్లో వేటినైనా తొలుత తాత్కాలికంగా జప్తు చేసుకుని, ఆ తర్వాత పూర్తిస్థాయి స్వాధీనానికి నూతన చట్టం వీలు కల్పిస్తుంది. అసలైన లబ్ధిదారుడు, బినామీ, వారిద్దరికి మధ్య దళారీగా ఉన్న వ్యక్తి... ఈ ముగ్గురికీ ఏడేళ్ల వరకు కారాగార శిక్ష, ఆస్తి విలువలో 25% జరిమానా విధించేందుకు అవకాశముంది. ఇంతవరకు 900 కేసుల్లో ఆస్తుల్ని జప్తు చేసుకున్నట్లు ఐ.టి.శాఖ తెలిపింది. దాడుల్ని ముమ్మరం చేస్తామని ప్రకటించింది.

భిన్నంగా ఉండాలనే ఆలస్యం: కమల్‌హాసన్

ఈనాడు డిజిటల్, చెన్నై: భయం, సందేహాల కారణంగా తన రాజకీయ ప్రవేశాన్ని ఆలస్యం చేయడంలేదని విశ్వనటుడు కమల్‌హాసన్ పేర్కొన్నారు. సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ఉండాలనే ఆలోచనతోనే జాప్యం జరుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటి రాజకీయాలతో యువకులు నలిగిపోతున్నారని, అందుకే దానికి భిన్నంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ప్రజలను మోసం చేయాలనుకునేవారు ఏదొకటి చెప్పి నమ్మించి కాలం వెళ్లదీస్తారని, తానలా చేయాలనుకోవడం లేదన్నారు. 2017 నుంచే తాను రాజకీయ అంశాలను ప్రస్తావిస్తున్నానని, ప్రజలు వాటిని వినోదంగా చూడలేదన్నారు. గత ఏడాది నవంబరు 7న తన పుట్టిన రోజు సందర్భంగా కమల్‌హాసన్ మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. అది పూర్తి స్థాయిలో జనవరి నుంచి అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు.



చక్రాల కుర్చీకే పరిమితమైనప్పటికీ నిరాశ చెందక హాంకాంగ్‌లోని లయన్‌రాక్ పర్వతాలను అధిరోహించడానికి ప్రయత్నిస్తున్న లాయి-చి-వై

హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సదస్సు


- ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు ప్రపంచ ఐటీ కాంగ్రెస్
- 30 దేశాల నుంచి ప్రతినిధుల రాక

ఈనాడు – హైదరాబాద్

అంతర్జాతీయ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సు ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్‌కు గుర్తింపు తీసుకువచ్చిందని, ఇప్పుడు మరో అంతర్జాతీయ సదస్సుకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వబోతోందని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు చెప్పారు. ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు ప్రపంచ ఐటీ కాంగ్రెస్ (డబ్ల్యూసీఐటీ) హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్వహించడం సంతోషం కలిగిస్తోందని మంత్రి చెప్పారు. సదస్సు నిర్వహణపై చర్చించడానికి నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్), వరల్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ అలయన్స్ (డబ్ల్యూఐటీఎస్ఏ), తెలంగాణ ప్రభుత్వ ఐటీ శాఖ ప్రతినిధులు గురువారం ఇక్కడ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. 'ప్రపంచంలో ఐటీ రంగంలో వస్తున్న మార్పులపై ఈ రంగంలోని నిష్ణాతులు, పరిశ్రమ, ప్రభుత్వ ప్రతినిధులు సదస్సుకు హాజరై అవగాహన కల్పిస్తారు. 30 దేశాలకు చెందిన 500 మంది ప్రతినిధులు సహా మొత్తం 2,500 మంది హాజరుకానున్నారు. సదస్సును ప్రారంభించడానికి ప్రధానమంత్రి మోదీని ఆహ్వానించనున్నారు. ఈ సదస్సు నిర్వహణకు నాస్కామ్, తెలంగాణ ప్రభుత్వం కలిసి పని చేస్తున్నాయి. నాస్కామ్ ఇండియా లీడర్‌షిప్ ఫోరమ్ (ఎన్ఐఎల్ఎఫ్) సదస్సును కూడా హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. పాతికేళ్లుగా ముంబయిలో మాత్రమే నిర్వహిస్తున్న ఈ సదస్సును తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ఈ రెండు సదస్సులు ఒకేసారి హెచ్ఐసీసీలో జరుగుతాయి. అతిథులకు రామోజీ ఫిలింసిటీ, చార్మినార్ తదితర దర్శనీయ ప్రదేశాలతో పాటు హైదరాబాద్ అతిథ్యాన్ని రుచి చూపిస్తాం. సదస్సులో తెలంగాణ ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలను ప్రకటిస్తుంది' అని కేటీఆర్ చెప్పారు. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఐటీ రంగంలో భవిష్యత్తులో పనితీరు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై 22 సెషన్లు జరుగుతాయని నాస్కామ్ ప్రెసిడెంట్ ఆర్.చంద్రశేఖర్ తెలిపారు. హనీవెల్ ఛైర్మన్, సీఈఓ డేవ్ కోట్ తదితర ఐటీ రంగ ప్రముఖులు సదస్సులో ప్రసంగిస్తారన్నారు. సౌదీ అరేబియా నుంచి పౌరసత్వం పొందిన తొలి రోబో 'సోఫియా' కూడా హాజరవుతుందన్నారు. 60 ఇన్నోవేట్ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయని తెలిపారు. డబ్ల్యూఐటీఎస్ఏ సెక్రటరీ జనరల్ జేమ్స్ హెచ్ పోయిశాంట్, ఛైర్మన్ యున్నే చూ మాట్లాడారు.



ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సు నిర్వహణపై గురువారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్, నాస్కామ్ ఇండియా ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తదితరులు



సదస్సు లోగో

ఏఐపై తెలంగాణలో సీఓఈ

సమాచార సాంకేతిక పరిజ్ఞాన రంగంలో కృత్రిమ మేధ కీలకంగా మారుతున్నా.. నిపుణుల లభ్యత సవాలుగా ఉందని నాస్కామ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తెలిపారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా వంటి సాంకేతిక పరిజ్ఞానాల్లో నైపుణ్యాల కొరతను అధిగమించడానికి 'స్కిల్స్ ఆఫ్ ఫ్యూచర్' పేరిట కృషి చేస్తున్నామన్నారు. బెంగళూరులో మాదిరిగానే హైదరాబాద్‌లోనూ ఏఐ, డేటా సైన్సెస్ విభాగంలో ఎక్సలెన్స్ కేంద్రం (సీఓఈ) ఏర్పాటుకు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామన్నారు. జీఎస్టీ, పన్నుపరంగా ఐటీ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించాలని బడ్జెట్ ప్రతిపాదనల్లో ప్రభుత్వాన్ని కోరామన్నారు.

కేటీఆర్‌తో బ్రిటన్ ఉప హైకమిషనర్ భేటీ

బ్రిటిష్ ఉప హైకమిషనర్ అండ్రూ ఫ్లెమింగు గురువారం రాష్ట్ర పరిశ్రమలు ఐటీ శాఖల మంత్రి కేటీఆర్‌తో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. బ్రిటన్‌లోని పారిశ్రామికవేత్తలు తెలంగాణలోని ఆరోగ్య, జీవశాస్త్రాల రంగాల్లో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నట్లు, వచ్చే నెలలో పారిశ్రామిక బృందాలు తెలంగాణను సందర్శిస్తాయని చెప్పారు. దీనిపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. బ్రిటన్ సంస్థల పెట్టుబడులను తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు.

తెలంగాణ చేనేత దుస్తులతో కరోలినా మారిన్

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి తెలంగాణ చేనేత దుస్తులు ధరించారు. తన చిత్రాలను ఆమె ట్విట్టర్‌లో పెట్టారు. డిజైనర్ దివ్యారెడ్డి తనకు చక్కటి చేనేత దుస్తులను ఇచ్చారని కరోలినా ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కరోలినా చిత్రాన్ని చూసిన మంత్రి కేటీఆర్ ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతూ రీట్వీట్ చేశారు. తమ చేనేతకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చారని పేర్కొన్నారు.



భారత్‌తో పనిచేయడం బాగుంటుంది: ట్రంప్

వాషింగ్టన్: భారత్‌లాంటి దేశాలతో కలిసి పనిచేయడం చాలా బాగుంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్‌తో పాటు చైనా, రష్యాలతో కూడా పనిచేయడం మంచిదేనని అన్నారు. రష్యాతో సంబంధాలు మెరుగుపరచడానికి తీసుకుంటున్న చర్యలను సమర్థించుకున్న సమయంలో పై వ్యాఖ్య చేశారు. గురువారం నార్వే ప్రధాని ఎర్నా సోల్‌బెర్గ్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని దేశాలతో కలిసి పనిచేయాలని భావిస్తున్నట్లు చెప్పారు.

ముల్లర్ ఇంటర్వ్యూ చేయడానికి అవకాశం ఇవ్వను

ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందన్న ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ఎఫ్‌బీఐ మాజీ డైరెక్టర్ రాబర్ట్ ముల్లర్ తనను 'ఇంటర్వ్యూ' చేయడానికి అవకాశం ఇవ్వబోనని ట్రంప్ తెలిపారు. ఈ విషయమై ట్రంప్‌ను విచారించాలని, ఆయనకు ప్రశ్నావళి పంపాలని ముల్లర్ భావిస్తున్నట్టు తెలిసింది.

పారిస్ ఒప్పందం పరిధిలోకి తిరిగి రావొచ్చు

వాతావరణ పరిరక్షణపై కుదిరిన పారిస్ ఒప్పందం అమెరికా ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండడంతో దాని పరిధి నుంచి బయటకు వచ్చినట్టు ట్రంప్ తెలిపారు. మెరుగైన ఒప్పందం కుదిరితే అంగీకరించే అవకాశం ఉందని అన్నారు.

సిక్కుల ఊచకోత కేసులపై కొత్త 'సిట్'

- త్రిసభ్య బృందాన్ని నియమించిన సుప్రీం

దిల్లీ: నాటి సిక్కుల ఊచకోతకు సంబంధించి మూసివేసిన 186 కేసుల పర్యవేక్షణకు కొత్తగా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్)ని సుప్రీంకోర్టు గురువారం ఏర్పాటుచేసింది. దిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎన్.ధింగ్రా నేతృత్వంలోని ఈ త్రిసభ్య బృందంలో ఐపీఎస్ అధికారి అభిషేక్ దులార్, విశ్రాంత ఐజీ రాజ్‌దీప్ సింగ్‌లు సభ్యులు. విచారణ లేకుండానే నాటి సిట్ ఈ కేసులను మూసివేసినట్లు - గతంలో ఏర్పాటైన పర్యవేక్షక సంఘం సుప్రీంకోర్టుకు నివేదించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏర్పాటైన కొత్త సిట్‌ను 2నెలల్లోగా ఆయా కేసుల స్థాయినివేదిక సమర్పించాల్సిందిగా - ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్ర నేతృత్వంలోని జస్టిస్ ఏ.ఎం.ఖన్విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 19కి వాయిదా వేసింది. కొత్త సిట్‌కు నేతృత్వం వహిస్తున్న జస్టిస్ ధింగ్రాకు విశేష అనుభవం ఉంది. పార్లమెంటుపై దాడి సహా పలు కీలక కేసులను గతంలో విచారించారు. సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాపై ఆరోపణలున్న హరియాణా భూకుంభకోణంపై దర్యాప్తు జరిపిన సంఘానికి నేతృత్వం వహించారు. విచారణ కోర్టు న్యాయమూర్తిగా ఆయన 1984 సిక్కుల ఊచకోత కేసులను కూడా విచారించారు.

పల్లెల ప్రగతిని అవినీతి మింగేసింది

- గ్రామీణులకు రహదారులను దూరం చేసింది
- పీఎంజీఎస్‌వై పనులపై విదేశీ పరిశోధకుల అధ్యయనం

వాషింగ్టన్: మనదేశంలో అవినీతి భూతం విస్తరించిన తీరును తాజాగా మరో అధ్యయనం కళ్లకు కట్టింది. మారుమూల పల్లెలను బాహ్య ప్రపంచానికి అనుసంధానిస్తూ.. గ్రామస్థులకు మెరుగైన విద్య, ఆరోగ్య సేవలు అందేలా ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన రహదారులను రాజకీయనేతల బంధుప్రీతి, అధికారుల అవినీతి మింగేసిన రీతిని తేటతెల్లం చేసింది. దేశవ్యాప్తంగా దాదాపు 3 లక్షల గ్రామాలకు మెరుగైన రోడ్డు వసతులను కల్పించే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం 2000లో 'ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై)' పేరుతో బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అమెరికాలోని ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం, ఫ్రాన్స్‌లోని పారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లకు చెందిన పరిశోధకులు ఈ పథకాన్ని వినూత్న సాంకేతికతను వినియోగించి విశ్లేషించారు. భారత్‌లో అడుగడుగునా వేళ్లూనుకొని ఉన్న అవినీతి పీఎంజీఎస్‌వైని తీవ్రంగా దెబ్బతీసిందని గుర్తించారు.

అధ్యయనంలోని ముఖ్యాంశాలివీ..

- పీఎంజీఎస్‌వై పథకంలో చోటుచేసుకున్న అవినీతి ప్రభావం 8.57 లక్షలమంది గ్రామస్థులపై ప్రత్యక్షంగా కనిపించింది. వారి గ్రామాలకు దక్కాల్సిన రోడ్లు కార్యరూపం దాల్చలేదు.
- చాలామంది రాజకీయ నాయకులు తమ పలుకుబడితో అధికారులను ప్రభావితం చేశారు. సన్నిహితులకే కాంట్రాక్టులు ఇప్పించారు. వారు పనులు పూర్తి చేయకుండా డబ్బులు కాజేశారు. దాదాపు 500 రోడ్ల నిర్మాణాలను పూర్తిచేయకుండానే.. వాటిని నిర్మించినట్లు చూపించి నిధులు బొక్కేశారు.
- రాజకీయాల్లో ఉన్న గుత్తేదారులకు అప్పగించిన పనులు చాలావరకు పూర్తికాలేదు.
- హోరాహోరీ ఎన్నికల్లో గెలిచి ఊపిరి పీల్చుకున్న ఎమ్మెల్యేలున్న ప్రాంతాల్లో 75 శాతం కాంట్రాక్టులు.. ఎమ్మెల్యేల సమీప బంధువులకే దక్కాయి.
- ఆయా జిల్లాల్లో పీఎంజీఎస్‌వైని పర్యవేక్షించే అధికారి, స్థానిక నేత మధ్య బంధుత్వం ఉన్నప్పుడు కాంట్రాక్టులు నేతల సన్నిహితుల చేతుల్లోకి ఎక్కువగా వెళ్లాయి.
- అధికారులు పదోన్నతి పొందేందుకు దగ్గరగా ఉండి.. వారిపై నిఘా పెరిగినప్పుడు అవినీతి బాగా తగ్గింది.



సుష్మాస్వరాజ్‌తో కరచాలనం చేస్తున్న మాల్దీవుల విదేశాంగ మంత్రి మొహమ్మద్ అసీం

సుష్మా స్వరాజ్‌తో మాల్దీవుల విదేశాంగ మంత్రి భేటీ

దిల్లీ: మాల్దీవుల విదేశాంగ మంత్రి మహమ్మద్ అసీంతో భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ గురువారమిక్కడ చర్చలు జరిపారు. చైనాతో మాల్దీవుల స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) సహా భిన్న అంశాల కారణంగా... భారత్-మాల్దీవుల ద్వైపాక్షిక బంధాలు ఒడిదొడులకు లోనవుతున్న నేపథ్యంలో తాజా భేటీ ప్రాముఖ్యం సంతరించుకొంది. మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ తరఫున ప్రత్యేక రాయబారిగా వచ్చిన అసీంతో సుష్మ చర్చలు జరిపారని విదేశాంగ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ తెలిపారు. ' 'భారత్‌కే తొలి ప్రాధాన్యం''అనే మాల్దీవుల విదేశాంగ విధానం, ''పొరుగు దేశాలకే తొలి ప్రాధాన్యం''అనే భారత్ విధానాల దృష్ట్యా... ద్వైపాక్షిక బంధాలను పటిష్ఠం చేయడానికి ఇద్దరు నేతలు కృషిచేశారని పేర్కొన్నారు. భారత్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలూ తీసుకోబోమని అసీం హామీ ఇచ్చారు. మాల్దీవుల్లో పర్యటించాలని అధ్యక్షుని తరఫున ప్రధాని మోదీని ఆహ్వానించారు.



కుమార్తెను ఒళ్లో కూర్చోబెట్టుకొని వార్తలు చదివుతున్న కిరణ్‌నాజ్

చిన్నారి హత్యపై పాక్ యాంకర్ వినూత్న నిరసన

కుమార్తెను పక్కన కూర్చోబెట్టుకొని వార్తలు చదివిన కిరణ్ నాజ్

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో 8 ఏళ్ల బాలిక జైనాబ్‌పై పాశవికంగా అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటనపై ఆ దేశ యాంకర్ కిరణ్ నాజ్ వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. బుధవారం రాత్రి సమా టీవీ ఛానల్‌లో ఆమె.. తన కుమార్తెను పక్కన కూర్చోబెట్టుకొని వార్తలు చదివారు. "నేను ఇప్పుడు కిరణ్ నాజ్‌ను కాను. ఒక తల్లిని. అందుకే నా కుమార్తెను పక్కన కూర్చోబెట్టుకున్నా" అని ఆమె పేర్కొన్నారు. జైనాబ్ ఉదంతంపై తన ఆక్రోశాన్ని ఆమె వెళ్లగక్కారు. ఆ దురాగతానికి పాల్పడ్డ వారిని పట్టుకోవడంలో విఫలం కావడంపై ఒక తల్లిగా కలత చెందుతున్నట్లు చెప్పారు. "నేడు జైనాబ్ గురించి తప్ప నాకు మాట్లాడటానికి ఏమీ లేదు" అని వేదనాభరిత స్వరంతో చెప్పారు.

ఈ నెల 4న జైనాబ్ అపహరణకు గురైంది. ఐదు రోజుల తర్వాత కసుర్ పట్టణంలో ఓ చెత్తకుప్పలో ఆ చిన్నారి మృతదేహం దొరికింది. సౌదీ అరేబియాలో ఉన్న ఆ బాలిక తల్లిదండ్రులు బుధవారం పాకిస్థాన్‌కు తిరిగొచ్చారు. హంతకుడిని అరెస్టు చేసే వరకూ తమ చిన్నారి మృతదేహాన్ని ఖననం చేయబోమని స్పష్టంచేశారు. ఈ ఘటన కసుర్‌లో అల్లర్లకు దారితీసింది. ఇందులో ఇద్దరు ఆందోళనకారులు చనిపోయారు.

బెడిసికొట్టిన సపర్యల వ్యూహం

- జైలు నుంచి విడుదలైన లాలూ సహాయకులు


పట్నా: కారాగార శిక్ష అనుభవిస్తున్న లాలూప్రసాద్ యాదవ్‌కు సపర్యలు చేసేందుకుగాను కేసులో ఉద్దేశపూర్వకంగా ఇరుక్కొని జైల్లోకి ప్రవేశించిన ఇద్దరు సహాయకుల వ్యూహం బెడిసికొట్టింది. వారిపై తప్పుడు కేసు నమోదైనట్లు గుర్తించిన కోర్టు.. బెయిలు మంజూరు చేసింది. దీంతో వారిద్దరూ జైలు నుంచి విడుదలయ్యారు. దాణా కుంభకోణం 2వ కేసులో దోషిగా తేలడంతో లాలూ గత డిసెంబరు 23న జైలుపాలైన సంగతి తెలిసిందే. ఆయనకు కోర్టు మూడున్నరేళ్ల కారాగారవాసం విధించింది. అయితే, లాలూ జైలుకు రావడానికి కొన్నిగంటల ముందే ఓ దొంగతనం కేసులో లొంగిపోయి.. లక్ష్మణ్ మహతో, మదన్ యాదవ్ అనే ఇద్దరు వ్యక్తులు రాంచీలోని బిర్సాముండా జైల్లో ప్రవేశించారు. గతంలోనూ లాలూ జైలుపాలైనప్పుడు వారు ఇలాగే కారాగారంలోకి ప్రవేశించి.. ఆయనకు సపర్యలు చేశారు. తాజాగా లక్ష్మణ్, మదన్‌లపై దొంగతనం కేసులో దర్యాప్తు జరిపిన పోలీసులు అది తప్పుడు కేసు అని నిర్ధారించారు. రాంచీలోని కోర్టు మదన్, లక్ష్మణ్‌లకు బెయిలు మంజూరు చేసి విడుదల చేసింది. దీంతో తమ నేతకు సపర్యలు చేయాలన్న వారిద్దరి వ్యూహం దెబ్బతింది. సహాయకుల విషయంపై కోర్టు బుధవారం ప్రశ్నించడంతో లాలూ స్పందిస్తూ.. అవన్నీ మీడియా కట్టుకథనాలని పేర్కొన్నారు.

దహీ చురా నేను ఇప్పిస్తాలే..


జైల్లో తనను కలిసేందుకు వారానికి ముగ్గురి కంటే ఎక్కువమందిని అధికారులు అనుమతించడం లేదని కోర్టుకు లాలూ ఫిర్యాదు చేశారు. మకర సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో తనపట్ల కాస్త మెతకగా వ్యవహరించాలని కోరారు. 'దహీ చురా' అంటే తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. దీంతో న్యాయమూర్తి శివపాల్ సింగ్ స్పందిస్తూ.. 'జైల్లో మీకు దహీ చురా అందేలా నేను ఏర్పాట్లుచేస్తా' అని వ్యాఖ్యానించారు.

ప్రవాసాంధ్రుడు రఘునందన్‌కు ఫిబ్రవరి 23న మరణశిక్ష

వాషింగ్టన్: శాన్వి అనే పది నెలల పాపను, ఆమె అమ్మమ్మను హతమార్చిన ఘటనలో ప్రవాసాంధ్రుడు యండమూరి రఘునందన్(32)కు ఫిబ్రవరి 23న మరణ శిక్షను అమలుపరచనున్నారు. భారతీయ అమెరికన్‌కు ఉరిశిక్ష విధించడం ఇదే ప్రథమం. అపహరించి, బెదిరించి, భారీ సంపద రాబట్టుకోవడానికే రఘునందన్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు దర్యాప్తు అధికారులు తేల్చారు. ప్రాణాంతక ఇంజక్షన్‌తో శిక్షను అమలు చేయనున్నప్పటికీ... మరణశిక్షలపై పెన్సిల్వేనియా గవర్నర్ టామ్‌వూల్ఫ్ విధించిన ఆంక్షల కారణంగా నిందితునికి కొంత ఊరట లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత 20 ఏళ్లలో ఒక్క మరణ శిక్షనూ పెన్సిల్వేనియాలో అమలు చేయలేదు. మరణశిక్షలపై అధ్యయనం చేసిన సలహా సంఘం ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిందితుడు కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ చదివి హెచ్-1బి వీసాపై అమెరికాకు వచ్చాడు. శిక్షను ప్రకటించగానే దానిపై అప్పీలుకూ వెళ్లినా, అక్కడ ఊరట లభించలేదు.



రఘునందన్



శాన్వి (పాతచిత్రం)

శాన్వి హత్య కేసు నేపథ్యం ఇదీ...

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలం కుడుములకుంట గ్రామానికి చెందిన వెన్నా ప్రసాదరెడ్డి, లత దంపతులు అమెరికాలోని పెన్సిల్వేనియాలో నివాసం ఉంటున్నారు. వీరి కుమార్తె వెన్నా శాన్వి. ఈ చిన్నారి సంరక్షణ బాధ్యతలు చూసుకునేందుకు ఆమె నాయనమ్మ వెన్నా సత్యవతి అమెరికా వెళ్లారు. అక్కడ ప్రసాదరెడ్డి, లత దంపతులకు పరిచయం ఉన్న వ్యక్తి చిన్నారి శాన్విని డబ్బు కోసం అపహరించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో శాన్వి, సత్యవతిలను అతను 2012లో దారుణంగా హతమార్చాడు. ఈ ఉదంతం అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. బాధిత కుటుంబానికి పరిచయమున్న వైజాగ్‌కు చెందిన యండమూరి రఘునందన్ అనే వ్యక్తే ఈ హత్యలకు పాల్పడినట్లు అక్కడి పోలీసులు నిర్ధరించారు. అతన్ని అప్పట్లోనే అరెస్టు చేశారు. తొలుత తనకేమీ ప్రమేయం లేదన్నట్లు, ఇతరులతో కలిసి వారిని వెతుకుతున్నట్లు నటించినా, డబ్బుకోసం డిమాండ్ చేస్తూ రాసిన లేఖతో నిజమేమిటో బయటపడింది. కేసు విచారించిన న్యాయస్థానం అతనికి మరణ శిక్ష ఖరారు చేసింది. పెన్సిల్వేనియాలో ఉన్న శాన్వీ తల్లిదండ్రులు ప్రసాదరెడ్డి, లతలకు బంధువులు, స్థానికులు ఫోన్ చేసి విషయాన్ని తెలుసుకున్నారు. నరహంతకుడికి ఇన్నాళ్లకు సరైన శిక్షపడిందని అన్నారు.

శీతాకాలంలో బరువెందుకు పెరుగుతామంటే...



టొరాంటో: శీతాకాలం రాగానే బద్ధకంగా అనిపించడమే కాకుండా శరీరం బరువెక్కుతున్నట్లు ఎందుకు అనిపిస్తుంది. అనిపించడమే కాదు... నిజంగానే కొంతమంది ఈ కాలంలో బరువు పెరుగుతుంటారు. దీనికి కారణమేమిటో కెనడాలో జరిగిన ఓ అధ్యయనం వెల్లడించింది. శరీరానికి ఎండ తగలాల్సిన అవసరాన్ని ఇది మరోసారి చాటుతోంది. మన చర్మం కిందనే ఉండే కొవ్వు కణాలు సూర్యరశ్మి తగలగానే కుంచించుకుపోతాయి. మన కన్ను సూర్యకాంతిని చూడగానే అందులోని నీలిరంగు తరంగ దైర్ఘ్యం శరీరం ద్వారా కొవ్వు కణాలను చేరుకుంటుంది. ఆ వెంటనే అవి తమ పరిమాణాన్ని తగ్గించుకుంటాయి. సూక్ష్మ బిందువులుగా కొవ్వు కాస్తా కణాన్ని విడిపోతుంది. మరో విధంగా చెప్పాలంటే మన కణాలు ఎక్కువ కొవ్వును నిల్వ చేసుకోవని కెనడాలోని అల్బెర్టా విశ్వవిద్యాలయం ఆచార్యుడు పీటర్‌లైట్ చెప్పారు. ఉత్తరాదిలో ఏడాదిలో ఎనిమిది నెలలు పెద్దగా సూర్యరశ్మి తగలకపోవడం వల్ల కొవ్వు ఎక్కువగా నిల్వ అయి, కొందరు శీతాకాలంలో బరువు పెరుగుతుంటారని వివరించారు. ఇది తమ ప్రాథమిక పరిశీలన మాత్రమేననీ, బరువు తగ్గాలంటే సూర్యరశ్మి తగలాలని చెప్పడం తమ ఉద్దేశం కాదనీ స్పష్టంచేశారు. భవిష్యత్తులో స్థూలకాయులకు కాంతి ఆధార చికిత్స అందించడానికి ఈ వినూత్న ఆవిష్కరణ దారి తీయవచ్చని చెప్పారు. టైప్-1 మధుమేహ రోజుల్లో కొవ్వుకణాలు ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసుకునేలా మార్చడానికి సంబంధించిన పరిశోధనల్లో ఈ విషయాలు గమనించారు.

పేగు ఆరోగ్యాన్ని పరిశీలించే వేగు!

* సరికొత్త కాప్స్యూల్‌ను రూపొందించిన శాస్త్రవేత్తలు

* మానవులపై పరీక్షలూ పూర్తి




మెల్‌బోర్న్: జీర్ణకోశ వ్యవస్థను నిశితంగా పరిశీలించేందుకు ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు ఒక అద్భుత 'కాప్స్యూల్'ను అభివృద్ధి చేశారు. నోటిద్వారా మింగేసే వీలున్న ఈ సాధనంతో మానవులపై పరీక్షలనూ విజయవంతంగా పూర్తిచేశారు. ఇది జీర్ణాశయం, పెద్ద పేగు వ్యాధులను గుర్తించే ప్రక్రియలో విప్లవాత్మక మార్పులను తెస్తుందని చెబుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఐదుగురులో ఒకరు తమ జీవితకాలంలో ఏదో ఒక జీర్ణాశయ రుగ్మతతలో బాధపడుతుంటారు. అలాంటివారందరికీ ఈ కొత్త సాధనం ఒక వరం. కొత్త రోగనిరోధక వ్యవస్థ సహా శరీరంలో ఇంతకుముందెన్నడూ చూడని వ్యవస్థలను ఈ కాప్స్యూల్ వెలుగులోకి తెచ్చిందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. శరీరంలోకి పరికరాలను పంపే కలొనోస్కోపీ వంటి రోగ నిర్ధారణ విధానాల ఆవశ్యకతనూ ఇది తగ్గిస్తుందని వివరించారు.

ఈ సాధనం.. పేగుల్లో విడుదలయ్యే హైడ్రోజన్, కార్బన్ డైఆక్సైడ్, ఆక్సిజన్ వంటి వాయువులను గుర్తించి, వాటి పరిమాణాన్ని కొలుస్తుంది. ఆ వివరాలు మొబైల్ ఫోన్‌కు పంపుతుంది. "సాధారణం కన్నా ఎక్కువ సమయం పాటు తనలో ఉండే హానికర పదార్థాలను విచ్ఛిన్నం చేయడానికి ఆక్సీకరణ రసాయనాలను జీర్ణాశయం విడుదల చేస్తుందని గుర్తించాం. ఇది సరికొత్త గ్యాస్ట్రిక్ రక్షణ వ్యవస్థ. ఇది ఇంతకు ముందెన్నడూ వెలుగు చూడలేదు" అని పరిశోధనలో పాలుపంచుకున్న కౌరోష్ కలాంతర్ జాడే పేర్కొన్నారు. పీచు పదార్థం ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు పెద్దపేగులో అధిక మోతాదులో ఆక్సిజన్ చేరుతున్నట్లు తేలింది. పెద్దపేగులో ఆక్సిజన్ ఉండనే ఉండదన్న సిద్ధాంతాన్ని ఇది విభేదిస్తోంది. ఆహారం పులిసిపోవడాన్ని ఈ కాప్స్యూల్ కచ్చితత్వంతో చూపింది. జీర్ణాశయ సూక్ష్మజీవుల తీరుతెన్నుల పర్యవేక్షణకూ ఈ సాధనం అక్కరకొస్తుంది. పేగు ఆరోగ్య నిర్ధారణలో ఇది కీలకం. లోగడ మల పరీక్ష, లేదా శస్త్రచికిత్స ద్వారా నమూనాలను సేకరించి ఈ పరిశీలన జరపాల్సి వచ్చేది.

రోగ నిరోధక కణాలపై 'ఒత్తిడి'!



వాషింగ్టన్: ఒత్తిడి మనిషిని ఏవిధంగా రోగాల పాల్జేస్తుందో విశ్లేషించే క్రమంలో అమెరికా శాస్త్రవేత్తలు పురోగతిని సాధించారు. ఈమేరకు తమ అధ్యయన ఫలితాలు, విశేషాలను వెల్లడించారు. సీఆర్ఎఫ్1 (కోర్టికోట్రోపిన్-రిలీజింగ్ ఫేక్టర్)గా పిలిచే ఒత్తిడి గ్రాహకాలు, మాస్టర్‌సెల్స్ అనే కొన్ని రోగ నిరోధక కణాలను ప్రభావితం చేస్తున్నట్లు గుర్తించారు. వాటికి నిర్దిష్ట సంకేతాలను పంపించి అవి శరీరాన్ని కాపాడకుండా చేసేలా నియంత్రిస్తున్నట్లు కనుగొన్నారు. ఈమేరకు మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ(ఎంఎస్‌యూ) పరిశోధకులు - 2రకాల (సీఆర్ఎఫ్1 ఉన్నవి, లేనివి) ఎలుకలపై పరిశోధనలు జరిపారు. రోగ నిరోధక వ్యవస్థ అతిగా స్పందించేచోట ఎలర్జిక్, మానసిక స్పందనలను పోల్చిచూశారు. సీఆర్ఎఫ్1 ఉన్న ఎలుకల్లో సాధారణ వాటి కంటే.. ఎలర్జీకి కారణమయ్యే హిస్టమైన్ల స్థాయి ఎక్కువగా ఉండటంతో పాటు.. వ్యాధులు కూడా అధికంగా ఉన్నట్లు ఎంఎస్‌యూకు చెందిన ఆడమ్ మోయెసెర్ తెలిపారు. కొన్నిరకాల వ్యాధులకు సీఆర్ఎఫ్1 కారణమవుతున్నట్లు తేలిందని వెల్లడించారు. ఈ పరిశోధనల ఫలితాలతో ఆస్థమా, ఇరిటెబుల్ బౌల్ సిండ్రోమ్‌కు సంబంధించి గ్యాస్ట్రో ఇంటెస్టినల్ లక్షణాలకు చికిత్సలను కనుగొనడానికి మార్గం దొరికిందని వివరించారు. ఒత్తిడి సంబంధమైన వ్యాధుల నుంచి కాపాడి జీవన ప్రమాణాలను పెంచడం.. మేస్ట్‌సెల్స్ విశ్లేషణ ద్వారా కొన్నిరకాల వ్యాధులకు చికిత్సలు కనుగొనడం కీలకమని మోయెసెర్ వివరించారు.

అవయవ లోపాలనూ సరిచేసే రోబో



బోస్టన్: అవయవాల ఎదుగుదల సమస్యలకు చెక్‌పెట్టే సూక్ష్మ రోబోలను శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. ఎలాంటి అసౌకర్యం కలిగించకుండానే ఇవి కణజాల వృద్ధిని ప్రోత్సహించడం విశేషం. పుట్టుకతోనే కొంతమందిలో అన్నవాహికలో కొన్ని భాగాలు సరిగాఉండవు. ఈ లోపాన్ని సవరించేందుకు ప్రత్యేక శస్త్రచికిత్సలు నిర్వహిస్తుంటారు. దీని కోసం దాదాపు నాలుగు వారాలు ఆసుపత్రిలోనే గడపాల్సివుంటుంది. దీంతో ఎముక విరుపు, రక్తం గడ్డకట్టడం లాంటి సమస్యలూ చుట్టుముట్టే ముప్పుంది. ఈ రుగ్మతపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తూ తాజా వైద్య రోబోలను అమెరికాలోని బోస్టన్ చిల్డ్రన్స్ హాస్పిటల్ నిపుణులు అభివృద్ధిచేశారు. దీనిలో రెండు ఉంగరాల్లాంటి నిర్మాణాలున్నాయి. వీటిపై సుతిమెత్తని చర్మంలాంటి పదార్థం ఏర్పాటుచేశారు. ఈ ఉంగరాలను శస్త్రచికిత్స సాయంతో అన్నవాహికకు రెండువైపులా అమర్చాలి. అనంతరం శరీరం బయటనుంచి వీటిని నియంత్రించే వీలుంది. ఇవి వికర్షణ బలాన్ని కలుగజేస్తూ మనకు కావాల్సిన రీతిలో కణజాలం ఏర్పడేందుకు తోడ్పడతాయి. ఓ పందిలో పది రోజుల్లోనే అన్నవాహికలోని ఓ భాగాన్ని 75 శాతం వరకూ దీని సాయంతో పొడిగించగలిగినట్లు వైద్యులు తెలిపారు. మిగతా అవయవాల ఎదుగుదల సమస్యలనూ సవరించేలా దీన్ని మార్చుకునే వీలుందని పేర్కొన్నారు.

గుండెను బాగుచేసే పట్టీ



వాషింగ్టన్: గుండె పోటు అనంతర గాయాలను బాగుచేసే పట్టీలను శాస్త్రవేత్తలు తయారుచేశారు. దెబ్బతిన్న పంది గుండెను ఇవి చక్కగా బాగుచేయడం విశేషం. హృద్రోగాల సమయంలో గుండె కణజాలం దెబ్బతింటుంది. దీన్ని పూర్వస్థితికి తీసుకురావడమే లక్ష్యంగా అమెరికాలోని అలబామా వర్సిటీ నిపుణులు తాజా పరిశోధన చేపట్టారు. తొలుత వారు మానవ చర్మంలోని మూలకణాలను సేకరించారు. వీటిసాయంతో కార్డియోమయోసైట్స్, ఎండోథెలియల్ సెల్స్‌తోపాటు రక్త నాళాల్లో కనిపించే మృదువైన కణాలను అభివృద్ధిచేశారు. ఈ మూడు రకాల కణాలను ఉపయోగించి 1.570.79 అంగుళాల పరిమాణంలో పట్టీలను తయారుచేశారు. అనంతరం వీటిని దెబ్బతిన్న పంది గుండెకు అమర్చారు. దీంతో నాలుగు వారాల్లోనే మృతకణాల పరిమాణం గణనీయంగా తగ్గినట్లు వెలుగులోకి వచ్చింది. ఫలితంగా గుండె విఫలమయ్యే ముప్పు తగ్గినట్లు తేలింది.

రూగోస్ జాడ.. పంటలకు పీడ

- కొబ్బరికి పెను విపత్తులా ఫ్లోరిడా దోమ
- ఆశిస్తే తోటలు తుడిచిపెట్టుకుపోవడమే
- ఉద్యాన పంటలకూ పొంచి ఉన్న ప్రమాదం
- ఇప్పటికే కడియంలో గుర్తింపు



తమిళనాడు పట్టుకోట్టై ప్రాంతంలో తెల్లదోమ కారణంగా నిలువునా ఎండిపోయిన కొబ్బరితోట

ఈనాడు-అమరావతి: ఎలా వచ్చిందో తెలియదుగాని.. అమెరికాలోని ఫ్లోరిడా నుంచి రూగోస్ తెల్లదోమ దేశంలో ప్రవేశించింది. కొబ్బరిచెట్లను ఆశించి విపరీత నష్టం కలగజేస్తోంది. అదీ ఎంతలా అంటే.. కేరళలో ఇప్పటికే 20శాతం వరకు చెట్లు దీనిబారిన పడి ఎండిపోయాయి. క్రమంగా దక్షిణాది రాష్ట్రాలన్నిటికీ విస్తరిస్తోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోనూ కడియంలో ఉనికి బయటపడింది. మొదట్లోనే దీన్ని కట్టడి చేయకుంటే వేలాది హెక్టార్లలో కొబ్బరి చెట్లు నిలువునా ఎండిపోతాయి. ఉద్ధృతి పెరిగితే కూరగాయలు, పండ్లతోటలు, మెట్టపంటలకు ఆశించే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

విదేశీ మహమ్మారి..

రెండేళ్ల కిందట కేరళలో రూగోస్ వలయాకార తెల్లదోమను గుర్తించారు. ఇది ఆశించిన కొబ్బరిచెట్ల ఆకులు నల్లబారి చెట్లు ఎండిపోయాయి. కర్ణాటక, తమిళనాడుల్లోనూ ఇదే తరహా నష్టం జరిగింది. బెంగళూరులోని జాతీయ వ్యవసాయ సంబంధిత కీటక పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల్లో రూగోస్ తెల్లదోమ వల్లేనని తేలింది. మెక్సికో, గౌటెమాలా, ఫ్లోరిడా ప్రాంతాల్లో 2009లో పూలమొక్కలపై ఆశించిన రూగోస్ జన్యు లక్షణాలతో దీన్ని సరిపోల్చారు. ఫ్లోరిడా నుంచి పాలక్కాడ్ అక్కడినుంచి మాలపూరం, త్రిశూర్, ఇడుక్కి, కోజికోడ్, కర్నూరు, ఎర్నాకుళం, కొల్లాం, తిరువనంతపురం, పొల్లాచి, పట్టుకొట్టై, ఉడుపి, కడియం ప్రాంతాలకు చేరింది.



రూగోస్ తెల్లదోమ కారణంగా కొబ్బరి కాయలపై ఏర్పడిన తెల్లని రంగుతో తేనె మంచు జిగురు



పత్రహరితాన్ని పీల్చేయడంతో నల్లగా మారిన ఆకులు

ఉష్ణోగ్రతలు పెరిగితే ఎక్కువ ప్రభావం

- రసంపీల్చే తరగతికి చెందిన ఈ రెక్కల పురుగు 2. 5మి.మీ పొడవు ఉంటుంది.. రెక్కలపై గోధుమ రంగు పట్టీలుంటాయి.
- ఆకులపై తెల్లని నూలుపోగులాంటి పదార్థాన్ని నిర్మించి జిగురును విసర్జిస్తాయి.
- ఈ జిగురు కోసం నల్లరంగు శిలీంద్రం వచ్చి దానితోపాటే ఆకుల్లోని పత్రహరితాన్ని పీలుస్తుంది. చివరకు చెట్టు మొత్తం రోజుల వ్యవధిలోనే ఎండిపోతుంది. ఇలా కేరళలో కొన్నిచోట్ల 60 నుంచి 70 శాతం తోటల్ని ఇది దెబ్బతీసింది.
- సాధారణ ఉష్ణోగ్రత కంటే రెండు డిగ్రీలు పెరిగితే ఈ పురుగు విజృంభిస్తుంది. తడి వాతావరణాన్ని తట్టుకోలేదు.

ఆందోళనకరం

కొబ్బరిసాగులో కేరళ, కర్ణాటక, తమిళనాడు తర్వాతి స్థానం ఆంధ్రప్రదేశ్‌దే. ఏటా 14,277లక్షల కొబ్బరికాయల ఉత్పత్తి జరుగుతోంది. హెక్టారుకు 13,759 కాయల దిగుబడితో ఉత్పాదకతలో ప్రథమస్థానంలో నిలిచింది. 25 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తోంది. అత్యధికంగా తూర్పుగోదావరిలో 50,490 హెక్టార్లు, పశ్చిమగోదావరిలో 21,818 హెక్టార్లలో తోటలు సాగవుతున్నాయి. తొలిదశలోనే అప్రమత్తం అయితేనే తోటలు నిలుస్తాయి.

కూరలు, పండ్లతోటలకు పొంచి ఉన్న ప్రమాదం

ప్రపంచవ్యాప్తంగా పరిశీలిస్తే రూగోస్ తెల్లదోమ 43 కుటుంబాలకు చెందిన 113 రకాల మొక్కలను ఆశిస్తున్నట్లు గుర్తించారు. కరివేప, ఇతర ఆకుకూరలూ ఈ జాబితాలో ఉన్నాయి. కొబ్బరితోనే ఆగకుండా జామ, అరటి, సీతాఫలం, పనస, హెలికోనా, మామిడి తదితర పండ్లతోటలకూ ప్రమాదం పొంచి ఉంది.

సహజ శత్రువులతోనే నియంత్రణ

కందిరీగ జాతికి చెందిన ఎన్‌కార్సియ గోడెలోపి అనే పరాన్నజీవి ఈ తెల్లదోమను నియంత్రిస్తోంది. టెంక రెక్కల పురుగులు, సాలె పురుగులు కూడా దోమ ఉద్ధృతి పెరగకుండా సహజశత్రువుల్లా పని చేస్తాయి. అందుకే కేరళలో తగ్గుముఖం పట్టింది.

- తీవ్రత ఎక్కువగా ఉంటే 0.5శాతం వేపనూనె పిచికారి చేయాలి.
- పురుగుమందులు వాడితే టెంకరెక్క పురుగు, సాలెపురుగులు చనిపోయి తెల్లదోమ అధికమవుతుంది.
- రూగోస్‌దోమ విస్తరించకుండా విమానాశ్రయాలు, నౌకాశ్రయాల్లో దిగ్బంధన విధానం అమలు చేయాలి.
- దోమ తాకిడి ఉన్న ప్రాంతాల నుంచి కొబ్బరిమొక్కలు, పూలు, అలంకార మొక్కలను తరలించకుండా జాగ్రత్త తీసుకోవాలి.

పురుగుమందులు వద్దు

టెంకపురుగు, సాలెపురుగుల ద్వారా రూగోస్ అరికట్టవచ్చు. దీనిపై జనవరి 6న ఉద్యానశాఖ అధికారులకు శిక్షణ ఇచ్చాం. అన్ని భాషలతోపాటు తెలుగులో పుస్తకం, పోస్టర్లు వేసి అప్రమత్తం చేస్తున్నాం.

– డాక్టరు పి.చౌడప్ప, డైరెక్టర్, కేంద్రీయ వన్యతోట పంటల పరిశోధనా సంస్థ, కాసర్‌గోడ్, కేరళ

యుద్ధప్రాతిపదికన స్పందించాలి

ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. ఎత్తైన చెట్లకు వేపనూనె పిచికారి అంటే రైతులకు కష్టం. తీవ్రత ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వమే డ్రోన్‌ల ద్వారా పిచికారి చేయించాలి. రసాయన మందులు పిచికారి చేయకుండా ప్రచారం చేపట్టాలి.

– అడ్డాల గోపాలకృష్ణ, నాగేంద్రప్రసాద్, సతీష్, కృషీవల కొబ్బరి ఉత్పత్తిదారుల సంస్థ, అంబాజీపేట

ఎన్‌ఎస్‌జీలో భారత్ సభ్యత్వం కోసం కృషిచేస్తున్నాం

అమెరికా రాయబారి కెన్నెత్ జస్టర్ వెల్లడి

దిల్లీ: అణు సరఫరాదారుల బృందం(ఎన్‌ఎస్‌జీ)లో భారత్‌కు సభ్యత్వం కల్పించేందుకుగాను అంతర్జాతీయ భాగస్వామ్య పక్షాలతో కలిసి తాము కృషిచేస్తున్నామని మనదేశంలో అమెరికా రాయబారి కెన్నెత్‌జస్టర్ తెలిపారు. వ్యూహాత్మకంగా కీలకమైన ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ప్రధాన శక్తిగా భారత్‌ను తాము పరిగణిస్తున్నట్లు తెలిపారు. భారత్‌లో రాయబారిగా బాధ్యతల స్వీకరణ అనంతరం జస్టర్ తొలిసారిగా గురువారం 'విధాన ప్రసంగం' చేశారు. తమ దేశం నుంచి భారత్‌కు కీలకమైన సాంకేతికతల బదిలీలో ప్రస్తుతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. ఎన్‌ఎస్‌జీలో సభ్యత్వం లభిస్తే ఈ సమస్యలు పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు. రసాయనిక, జీవ ఆయుధాలకు సంబంధించిన 'ఆస్ట్రేలియా బృందం'లోనూ భారత్ త్వరలోనే చేరుతుందని జస్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా వ్యాపారానికి భారత్‌లో ఎక్కువ అవకాశాలున్నట్లు పేర్కొన్నారు. వలసదారుల దేశంగా అమెరికా కొనసాగుతుందని తెలిపారు. హెచ్-1బీ సహా ఇతర వీసా విధానాలపై ప్రస్తుతం కొనసాగుతున్న సమీక్షను కేవలం 'మెరుగుపర్చే ప్రక్రియ'గా అభివర్ణించారు. జస్టర్ తనప్రసంగంలో పాక్ గురించి ప్రస్తావించలేదు. ఎన్‌ఎస్‌జీలో మనదేశానికి సభ్యత్వం దక్కకుండా చైనా అడ్డుపడుతున్న సంగతి గమనార్హం.

నేటి నుంచి ఐన్‌స్టీన్ ప్రేమలేఖల ప్రదర్శన

జెరూసలెం: ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ స్వయంగా రాసిన సిద్ధాంత పత్రాలు, ప్రేమలేఖలు ఆసియాలో ప్రదర్శనకు రాబోతున్నాయి. ఐన్‌స్టీన్ 1921లో దక్కించుకున్న నోబెల్ బహుమతి, ఆయన స్వయంగా రాసిన ప్రేమలేఖలు, సాపేక్ష సిద్ధాంత పత్రాలు తదితర వస్తువులను తైపీలోని జాతీయ చియాంగ్ కై-షేక్ స్మారక హాలులో శుక్రవారం నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 8 వరకు సందర్శకుల వీక్షణకుఅంతందుబాటులో ఉంటాయి.

వీసాతో మోసపోతే పాస్‌పోర్టుకు ఎసరు

- ఇలా రెండుసార్లు జరిగితే అయిదేళ్లు పాస్‌పోర్టు రద్దు
- ఈ తరహాలో అరబ్ దేశాలకు వెళ్లేవారికి అడ్డుకట్ట
- కఠినంగా వ్యవహరించేందుకు కేంద్రం నిర్ణయం
- ఏప్రిల్ నుంచి అమలులోకి

ఈనాడు, హైదరాబాద్: 'కరీంనగర్‌కు చెందిన రాజయ్య పర్యాటక వీసాపై 2015లో ఇరాక్ వెళ్లారు. అక్కడ ఉద్యోగం దొరకలేదు. వీసా గడువు ముగిసింది. అదేసమయంలో ఇరాక్‌లో అంతర్యుద్ధం ప్రారంభమైంది. అక్కడ దొంగచాటుగా జీవిస్తున్న ఆయన ప్రాణభయంతో కుటుంబీకులకు విషయం తెలిపారు. వారు వెంటనే తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం రాజయ్యను స్వదేశానికి తీసుకువచ్చింది. ఏడాది తర్వాత మళ్లీ అతను పర్యాటక వీసాతో ఖతర్ వెళ్లారు. అప్పుడూ ఇదే తంతు. ఖతర్‌లో సంక్షోభ సమయంలో మళ్లీ తన ప్రాణాలకు ముప్పుందని కుటుంబీకులకు చెప్పగా వారు మరోసారి రాష్ట్ర ప్రభుత్వాన్ని శరణుజొచ్చారు.' ఇలా తెలుగు రాష్ట్రాల్లో మోసపోయే వారు భారీగా ఉన్నారు.

పదేపదే ఇలా..

కేంద్ర ప్రభుత్వం విదేశీ ఉద్యోగాల పేరిట జరిగే మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఎవరైనా విదేశాల్లో పర్యాటక, సందర్శన తదితర వీసాలపై రెండేసి సార్లు మోసపోయినట్లు రుజువైతే అయిదేళ్లపాటు వారి పాస్‌పోర్టులను రద్దు చేయనుంది. దేశవ్యాప్తంగా ఏటా లక్షల మంది గల్ఫ్ దేశాలకు ఉద్యోగాలు, ఉపాధి కోసం వెళ్తున్నారు. మంచి కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పించి, భారీఎత్తున వేతనాలిచ్చేలా చూస్తామని చెప్పి పలువురు ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారు. బోగస్ కంపెనీల పేరిట వీసాలను సృష్టిస్తున్నారు. వీటితో పాటు పర్యాటక, సందర్శన, వైద్యచికిత్స వీసాల పేరిట వారిని విదేశాలకు తీసుకెళ్తున్నారు. తీరా అక్కడికి వెళ్లాక ఉద్యోగాలు లభించడం లేదు. ఏజెంట్ల జాడ ఉండదు. అక్కడి నిబంధనలకు వ్యతిరేకం కావడంతో వారంతా దాక్కొని బతకాల్సి వస్తోంది. తెలుగురాష్ట్రాలతో పాటు కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. తెలంగాణవ్యాప్తంగా ఏటా వేయి మంది, ఏపీలో వేయి మందికి పైగా.. దేశవ్యాప్తంగా పదివేల మంది ఇలా మోసపోతున్న ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. చాలామంది ఒకటి కంటే ఎక్కువసార్లు మోసపోతున్నట్లు రాయబార కార్యాలయాల అధికారులు గుర్తించి కేంద్ర విదేశాంగశాఖ దృష్టికి తెచ్చారు. ఒకసారి మోసపోయినా అప్రమత్తం కాకుండా మరోసారి అదేపనికి పాల్పడటాన్ని కేంద్రమంత్రి తీవ్రంగా పరిగణించారు. దీనిని నివారించేందుకు తాజాగా కొత్త నిర్ణయం తీసుకున్నారు. పేరొందిన సంస్థలు, అధీకృత కంపెనీలు గాకుండా బోగస్ సంస్థల్లో, నకిలీ కంపెనీల్లో ఉద్యోగాల పేరిట వీసాలను తీసుకొని విదేశాలకు వెళ్లి వరుసగా రెండుసార్లు మోసపోతే వారి పాస్‌పోర్టులను అయిదేళ్లపాటు రద్దు చేయాలని ఆమె నిర్ణయించారు. దీనికి ప్రధాని నరేంద్ర మోదీ ఆమోదం తెలిపారు. వచ్చే ఏప్రిల్ నుంచి ఇది అమల్లోకి వస్తుంది. ఈ ప్రతిపాదనకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయి.

ప్రత్యేక కోర్టు జడ్జి మరణంపై నేడు సుప్రీం విచారణ

దిల్లీ: సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి బి.హెచ్. లోయా మరణంపై స్వయంప్రతిపత్తిగల సంస్థతో దర్యాప్తు జరపాలంటూ దాఖలైన రెండు వేరువేరు విజ్ఞప్తులపై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది. ఎదురుకాల్పుల్లో సోహ్రాబుద్దీన్ మరణించిన సంఘటనపై విచారణ జరుపుతున్న లోయా ఆకస్మికంగా మరణించడం అనుమానాస్పదంగా ఉందంటూ మహారాష్ట్రకు చెందిన పాత్రికేయుడు బి.ఆర్.లోనే ఓ వ్యాజ్యం దాఖలు చేశారు. కాంగ్రెస్ నాయకుడు తెహసీన్ పూనావాలా మరొక వినతిని సమర్పించారు. ఈ కేసులో భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో పాటు పలువురు పోలీసు అధికారులు నిందితులుగా ఉన్నారు. 2014 డిసెంబరు ఒకటో తేదీన తన సహచరుని కుమార్తె వివాహం నిమిత్తం నాగ్‌పూర్ వెళ్లిన లోయా అక్కడ గుండెపోటుతో మరణించారు.


వాట్సాప్‌లో ప్రధాని చిత్రం మార్ఫింగ్..

బిహార్‌లో పోలీస్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

ఖగారియా: తప్పుగా మార్చిన (మార్ఫింగ్ చేసిన) ప్రధాని మోదీ చిత్రాన్ని వాట్సాప్‌లో పెట్టి.. అభ్యంతరకరమైన వ్యాఖ్యను రాసిన ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను బిహార్‌లో అధికారులు సస్పెండ్ చేశారు. ఈమేరకు మహమ్మద్ ఇస్లామ్ అనే ఇన్‌స్పెక్టర్‌కు డీఐజీ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఖగారియా ఎస్పీ మీనుకుమారి తెలిపారు.

బినామీల ముసుగులో బియ్యం దందా!

- ప్రభుత్వ బియ్యం మళ్లీ ప్రభుత్వానికే
- సూత్రధారి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు
- కొత్త మార్గాల అన్వేషణలో అక్రమార్కులు



ఈనాడు – హైదరాబాద్

బినామీల ముసుగులో బియ్యం దందాకు మళ్లీ తెరతీశారు. ప్రభుత్వం కిలో ఒక రూపాయికి ఇచ్చే బియ్యాన్ని సేకరించి కిలో రూ.32 చొప్పున తిరిగి ప్రభుత్వానికే విక్రయిస్తూ అక్రమార్కులు పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ముఠా వ్యవహారం వెలుగులోకి రావటంతో దందా మళ్లీ ఆరంభమైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో బియ్యం పునర్వినియోగం వ్యవహారం గతంలో యథేచ్ఛగా సాగగా.. తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ సీవీ ఆనంద్ విస్తృత స్థాయిలో నిఘా పెట్టటంతో పునర్వినియోగానికి అడ్డుకట్టపడింది. అయితే.. పాత మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో మళ్లీ బియ్యం పునర్వినియోగం అవుతున్నట్లు పౌరసరఫరాలశాఖ నిఘా వర్గాలు తాజాగా గుర్తించాయి. అధికారుల ఆకస్మిక తనిఖీల్లో సుమారు రూ.15 లక్షల విలువ చేసే రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తీగలాగితే డొంక కదిలినట్లుగా అక్రమ వ్యవహారం వెలుగులోకి వస్తోంది.

బినామీ వ్యవహారంతో..

ఈ అక్రమ వ్యవహారం కల్వకుర్తి కేంద్రంగా పెద్ద ఎత్తున సాగుతోంది. రాష్ట్రంలో ఈ-పాస్ విధానాన్ని అమలు చేస్తుండటంతో రేషన్ బియ్యానికి బహిరంగ మార్కెట్లో డిమాండు తగ్గింది. దీంతో రేషన్ బియ్యాన్ని సేకరించి గతంలో మాదిరిగా పునర్వినియోగ విధానానికి శ్రీకారం చుట్టారు. నాగర్‌కర్నూలుకు చెందిన ప్రముఖ మిల్లు యజమానే ఇందుకు సూత్రధారిగా ఉంటున్నట్లు తెలుస్తోంది. అతనిపై 2016లో క్రిమినల్ కేసు కూడా నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. సదరు మిల్లు యజమానికి ఆయా జిల్లాల్లో అన్ని స్థాయుల అధికారులతో సన్నిహిత సంబంధాలుండటంతో అక్రమ దందా ఇప్పటి వరకు సాఫీగా సాగుతూ వస్తోంది. ప్రస్తుతం తనకున్న రైసుమిల్లుల్లో కాకుండా వేరే ప్రాంతాల్లో మిల్లులను అద్దెకు తీసుకుని దందా సాగిస్తున్నట్లు సమాచారం. బినామీల పేరిట మిల్లులను తీసుకుని దందాను కొనసాగిస్తున్నట్లు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. నల్గొండ, రంగారెడ్డి, వికారాబాద్, గద్వాల, జడ్చర్ల తదితర ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి కల్వకుర్తికి తరలించి, అక్కడి నుంచి ఆ బియ్యాన్ని ప్రభుత్వానికి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. బియ్యం నిల్వలన్నింటినీ ఒక్కసారిగా విక్రయిస్తే అనుమానం వస్తుందని రోజుకో లారీ చొప్పున ప్రభుత్వ గిడ్డంగులకు తరలిస్తున్నారు. మరికొంత రేషన్ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి ప్రభుత్వానికి సరఫరా చేస్తున్నట్లు సమాచారం. తెలంగాణలో నిఘా విస్తృతంగా ఉన్నప్పుడు ఈ ముఠా అవే బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు ఎగుమతి చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

ఆకస్మిక తనిఖీలు ముమ్మరం

అక్రమాన్ని గుర్తించాం. మిల్లులు, గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం. నిఘాను మరింత విస్తృతం చేస్తాం. ఇటీవలి కాలంలో పునర్వినియోగానికి అడ్డుకట్ట పడింది. నిఘాలో భాగంగా నాగర్‌కర్నూల్‌లో ఈ అక్రమ దందా బయటపడింది. బినామీ పేర్లతో మిల్లులను లీజుకు తీసుకుని అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించాం. అక్రమార్కుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. అవసరమైతే పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తాం.

– సీవీ ఆనంద్, కమిషనర్, పౌరసరఫరాల శాఖ

గణితంలో ఘటికురాలు ఈ 'బొమ్మాళి'

అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో ప్రథమ స్థానం

మట్టిలో మాణిక్యంలా మెరిసిన సిక్కోలు బాలిక



పూజిత

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఆసక్తి, ప్రతిభ, ప్రోత్సహించే గురువులు.. ఇవే మెట్లుగా అంతర్జాతీయ స్థాయిలో మెరిసింది సిక్కోలు బాలిక. తల్లిదండ్రులు కూలీలు.. చదివేది కస్తూర్బా బాలికా విద్యాలయంలో.. అయినా కష్టించే తత్వంతో ఏ స్థాయిలోనైనా విజయం సాధించవచ్చని నిరూపించింది ఈ విద్యార్థిని. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బొమ్మాళి పూజిత అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. తల్లిదండ్రులు రమణమ్మ, సింహాచలం వ్యవసాయ కూలీలుగా జీవనం పొందుతూ బాలికను చదివిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 8, 9, 10 తరగతుల విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు వివిధ సబ్జెక్టుల వారీగా ఏటా 'ఇంటర్నేషనల్ ఒలింపియాడ్' పరీక్షలను నిర్వహిస్తారు. గణితంపై ఆసక్తి ఉన్న పూజిత ఈ పరీక్షకు మూడు నెలల ముందు నుంచి ప్రత్యేకంగా కృషి చేసింది. గత డిసెంబరు 14న జరిగిన పరీక్షలో గణితంలో 60కి 60 మార్కులు సాధించి అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఫలితాలు బుధవారం వెల్లడయ్యాయి. ప్రతిభ చాటిన పూజితను గురువారం జిల్లా కలెక్టర్ ధనుంజయరెడ్డి, ప్రభుత్వ విప్ కూన రవికుమార్, విద్యాధికారులు సత్కరించారు. తన ఆసక్తిని గమనించి ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహిస్తున్నారని, భవిష్యత్తులో ఇంజినీరింగ్ చదివి ఉత్తమ ఇంజినీరుగా ఎదగాలనేది తన లక్ష్యమని పూజిత 'న్యూస్‌టుడే'కు తెలిపింది.

వచ్చే నెల 2 నుంచి జీఈఎస్-2018

కానూరు, న్యూస్‌టుడే: గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్-2108 వచ్చే నెల 2 నుంచి 4 వరకు ఐఐటీ ఖరగ్‌పూర్‌లో నిర్వహిస్తున్నామని జీఈఎస్ ఇంటర్న్ ప్రతినిధి హేమంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఫ్లిఫ్‌కార్ట్, ఇంటెల్, అమెజాన్ వంటి సంస్థల్లో చేరడానికి అవసరమైన అంశాలు నేర్పించడం జరుగుతుందన్నారు. కనెక్ట్ డిడాట్స్ పేరుతో దేశంలోని పలు విద్యాసంస్థల్లో ఉన్న ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్స్ మెరగుపర్చే విధానంపై చర్చించనున్నారు. ఇందులో పాల్గొనేవారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీఈఎస్.ఈసీఈఎల్ఎల్-ఐఐటీకేజీపీ.ఓఆర్‌జీ/రిజిస్టర్ లో పేరు నమోదు చేసుకోవాలన్నారు.

మార్పులు చేయడం మూర్ఖత్వం



భారత తుది జట్టుపై డొనాల్డ్

సెంచూరియన్: దక్షిణాఫ్రికాలో మంచి రికార్డున్న అజింక్య రహానెను కాదని తొలి టెస్టులో భారత్ రోహిత్ శర్మను ఆడించడంపై విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. కానీ ఎవరేమన్నా భారత్ ఇప్పుడు తుది జట్టులో మార్పులు చేయరాదని, అలా చేస్తే అది మూర్ఖత్వమవుతుందని దక్షిణాఫ్రికా మాజీ పేసర్ అలన్ డొనాల్డ్ అన్నాడు. "తుది జట్టులో భారత్ ఇప్పుడు మార్పులు చేయడం మూర్ఖత్వమే అవుతుంది. ఎవరిని ఎంపిక చేయాలన్నది సెలక్టర్ల నిర్ణయం. ఐతే రహానె మరోసారి డ్రింక్స్ అందించడానికే పరిమితమైతే దక్షిణాఫ్రికా ఆటగాళ్లు 'వావ్' అని అనకుండా ఉండలేరు. రహానెను పక్కన పెట్టడం కఠిన నిర్ణయం" అని చెప్పాడు.

ఛాంపియన్



అంపైర్లతో మాట్లాడుతున్న హైదరాబాద్ ఆటగాళ్లు

నిఖత్‌కు కాంస్యం

- సెమీస్‌లో రితు చేతిలో ఓటమి
- జాతీయ మహిళల బాక్సింగ్

రోహ్‌తక్: జాతీయ మహిళల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారిణి నిఖత్ జరీన్ కాంస్యం సాధించింది. గురువారం జరిగిన 48-51



కేజీల ఫ్లై వెయిట్ సెమీస్‌లో రితు 4-1తో నిఖత్‌ను ఓడించింది. 54-57 కేజీల ఫెదర్ వెయిట్ సెమీస్‌లో సోనియా (ఆంధ్రప్రదేశ్) 2-3తో శశి చోప్రా (హరియాణా) చేతిలో పోరాడి ఓడింది.

ఫెదరర్ వేట బెడెన్‌తో షురూ



- నాదల్ తొలి ప్రత్యర్థి బుర్గోస్
- ఆస్ట్రేలియన్ ఓపెన్ డ్రా

మెల్‌బోర్న్: కెరీర్‌లో 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ ఆస్ట్రేలియా ఓపెన్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవుతున్నాడు. సోమవారం ఆరంభమవుతున్న ఈ ఏడాది మొట్ట మొదటి గ్రాండ్‌స్లామ్‌లో.. 51వ ర్యాంకు ఆటగాడు అల్జాజ్ బెడెన్ (స్లొవేనియా)తో మ్యాచ్‌తో అతడు టైటిల్ వేటను ఆరంభించనున్నాడు. గురువారం తీసిన టోర్నీ పురుషుల సింగిల్స్ డ్రా ప్రకారం డిఫెండింగ్ ఛాంపియన్ ఫెదరర్‌కు క్వార్టర్‌ఫైనల్లో డేవిడ్ గొఫిన్ (బెల్జియం) ఎదురయ్యే అవకాశముంది. అంతకుముందు నాలుగో రౌండ్లో అతడికి భారీ సర్వ్‌లు చేసే రోనిచ్ (కెనడా) ఎదురుకావొచ్చు. మరోవైపు ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ రఫెల్ నాదల్ (స్పెయిన్) తొలి రౌండ్లో 83వ ర్యాంకు ఆటగాడు విక్టర్ బుర్గోస్ (డొమినికన్ రిపబ్లిక్)ను ఢీకొంటాడు. క్వార్టర్‌ఫైనల్లో అతడికి మారిన్ సిలిక్ (క్రొయేషియా) ఎదురయ్యే అవకాశముంది. ఆరు సార్లు ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా)కు కాస్త కఠిన డ్రానే ఎదురైంది. గాయం కారణంగా ఆరు నెలలపాటు ఆటకు దూరమైన అతడు ఈ టోర్నీలో 14వ సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. తొలి రౌండ్లో అమెరికా యువ ఆటగాడు డొనాల్డ్ యంగ్‌ను ఎదుర్కొంటాడు. రెండో రౌండ్లో గేల్ మోన్ఫిల్స్ (ఫ్రాన్స్) ఎదురుకావొచ్చు.



మారిన్

ఎదురులేని హంటర్స్

ఈనాడు, హైదరాబాద్: పీబీఎల్-3 చివరి లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య హైదరాబాద్ హంటర్స్ చేతిలో బెంగళూరు బ్లాస్టర్స్ ఘోర పరాజయం చవిచూసింది. గురువారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన పోరులో హంటర్స్ 6- (-1)తో బ్లాస్టర్స్‌ను చిత్తుచేసింది. తొలి మ్యాచ్‌లో బెర్నాడెత్- సాత్విక్ సాయిరాజు 15-6, 14-15, 15-9తో సిక్కిరెడ్డి- మనుపై విజయం సాధించారు. పురుషుల సింగిల్స్‌లో సాయిప్రణీత్ 10-15, 15-7, 15-14తో చాంగ్ ఫెంగ్‌పై నెగ్గాడు. మహిళల సింగిల్స్‌లో హంటర్స్ సారథి కరోలినా మారిన్ 15-9, 15-7తో గిల్మోర్‌పై గెలిచి జట్టుకు 3-0తో ఆధిక్యం అందించింది. హంటర్స్ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకున్న రెండో పురుషుల సింగిల్స్‌లో లీ హ్యున్ 15-11, 11-15, 15-11తో శుభంకర్ దేవ్‌పై నెగ్గడంతో హంటర్స్ ఆధిక్యంతో 5-0కు పెరిగింది. బ్లాస్టర్స్ ట్రంప్ మ్యాచ్ పురుషుల డబుల్స్‌లో మార్కిస్ కిడొ- యియాన్ సియాంగ్ 15-10, 11-15, 15-7తో మథియస్- కిమ్ రాంగ్ గెలిచారు.. లీగ్ దశ అనంతరం పాయింట్ల పట్టికలో హంటర్స్ (20), అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్ (17), దిల్లీ డాషర్స్ (15), బ్లాస్టర్స్ (14) తొలి 4 స్థానాల్లో నిలిచి సెమీస్ బెర్తు దక్కించుకున్నాయి. శుక్రవారం తొలి సెమీస్‌లో హైదరాబాద్ హంటర్స్.. దిల్లీ డాషర్స్‌తో, శనివారం రెండో సెమీస్‌లో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్.. బెంగళూరు బ్లాస్టర్స్‌తో తలపడనున్నాయి.



కుర్రాళ్లకు మద్దతివ్వండి

అభిమానులను కోరిన ద్రవిడ్

తురెన్ (న్యూజిలాండ్): అండర్-19 ప్రపంచకప్ శనివారం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో భారత కుర్రాళ్ల జట్టుకు మద్దతు ఇవ్వాలని అభిమానులను రాహుల్ ద్రవిడ్ కోరాడు. "అండర్-19 జట్టు ఆటగాళ్లు వారి సత్తాను మీకు చూపించేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. మీరు మమ్మల్ని చూస్తారని మాకు తెలుసు. కుర్రాళ్లను ఎప్పుడూ ప్రోత్సహిస్తునే ఉంటారనీ తెలుసు" అని చెబుతున్న వీడియోను ద్రవిడ్ ట్విటర్లో పోస్టు చేశారు. గురువారం ద్రవిడ్ 45వ జన్మదినం. ఈ సందర్భంగా అండర్-19 జట్టుతో కలిసి పుట్టినరోజు జరుపుకున్నారు. కెప్టెన్ పృథ్వీషా, ఇతర ఆటగాళ్లు ద్రవిడ్ ముఖానికి కేకు పూసిన ఫోటోను ట్విటర్లో పోస్టు చేశారు. మూడు సార్లు అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత్ నిరుడు ఫైనల్లో పరాజయం చెందింది. ఈ సారి ఎలాగైనా కప్ గెలవాలనే కృతనిశ్చయంతో భారత్ ఉంది. గ్రూప్ బిలో భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, జింబాబ్వే, పపువా న్యూ గినియా జట్లు ఉన్నాయి. ఆదివారం ఆస్ట్రేలియాతో మ్యాచ్‌తో భారత్ తన వేట ప్రారంభించనుంది. ద్రవిడ్ ప్రస్తుతం భారత అండర్-19 జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.

ప్రతి యువ క్రికెటర్ కల... భారత జట్టులో చోటు! సత్తా ఉంటే సరిపోదు. సమయం వచ్చినప్పుడు.. వేదిక దొరికినప్పుడు.. చెలరేగిపోవాలి. సెలక్టర్లను తమవైపు తిప్పుకోవాలి.. అందరి దృష్టిలో పడిపోవాలి! అలాంటి ఓ బంగారు అవకాశం మన కుర్రాళ్లకు వచ్చేసింది. అదే న్యూజిలాండ్ వేదికగా ఈనెల 13న ప్రారంభం కానున్న అండర్-19 ప్రపంచకప్. ఈ టోర్నీలో మెరిసే యువరాజ్, కోహ్లి లాంటి వాళ్లు స్టార్లుగా ఎదిగారు. ఇప్పుడు ఇదే టోర్నీ కొంతమంది యువ కెరటాల జోరుకు వేదిక కాబోతోంది. మరి ప్రస్తుత భారత జట్టులో ఉన్న అలాంటి మెరుపు ఆటగాళ్లెవరో చూద్దామా..

ఆకాశమే హద్దురా..



రేపటి నుంచే అండర్-19 ప్రపంచకప్

పృథ్వీ షా

3 ఈ టోర్నీలో అత్యధికంగా భారత్ (2000, 2008, 2012), ఆస్ట్రేలియా (1988, 2002, 2010) మూడేసిసార్లు విజేతలుగా నిలిచాయి.

9 వరుసగా ఆస్ట్రేలియా సాధించిన విజయాలు (2002-2004)

21 వరుసగా ఒక జట్టు ఓడిన అత్యధిక మ్యాచ్‌లు. ఈ రికార్డు పపువా న్యూ గినియా (1998-2008) పేరిట ఉంది.

27 ఈ టోర్నీలో మొత్తం మీద అత్యధికంగా హెన్రిక్స్ (ఆస్ట్రేలియా) తీసిన వికెట్లు

480 ఈ టోర్నీలో ఒక జట్టు సాధించిన అత్యధిక స్కోరు. ఈ ఘనత ఆసీస్‌దే.


505 ఒక టోర్నీలో అత్యధికంగా ధావన్(2004) చేసిన పరుగులివి



మెరుపు ఓపెనర్

అండర్-19 ప్రపంచకప్ ఆడుతున్న భారత జట్టులో మరో కీలక ఆటగాడు శుభ్‌మన్ గిల్. ఈ హరియాణా కుర్రాడు టీమ్‌ఇండియా వైస్ కెప్టెన్ కూడా. అండర్-19 జట్టుతో పాటు అండర్-23, భారత్-ఎకు కూడా ప్రాతినిధ్యం వహించిన శుభ్‌మన్.. సెంచరీలతో అదరగొట్టాడు. దేశవాళీ పోటీల్లో పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ బెంగాల్‌తో మ్యాచ్‌లో అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ఈ ఏడాది ఆగస్టులో ఇంగ్లాండ్‌లో జరిగిన వన్డే సిరీస్‌లో శుభ్‌మన్ 93 సగటుతో 278 పరుగులు చేసి సత్తా చాటాడు. అదే ప్రత్యర్థితో భారత్‌లో జరిగిన సిరీస్‌లోనూ నాలుగు ఇన్నింగ్స్‌ల్లోనే 351 పరుగులు చేశాడు.

పేస్ కెరటం



ప్రస్తుత జట్టులో బౌలింగ్ విభాగంలో కీలకం కమలేష్ నాగరకోటి. ఈ అటాకింగ్ పేసర్.. ఆరంభంలోనే వికెట్లు తీస్తూ భారత్‌కు శుభారంభాలను ఇస్తున్నాడు. కివీస్ పిచ్‌లపై ఈ పొడగరి రాజస్థానీ బౌలర్ కీలకం కానున్నాడు. గతేడాది విజయ్ హజారే ట్రోఫీలో డిఫెండింగ్ ఛాంపియన్స్ గుజరాత్‌పై హ్యాట్రిక్ చేసి కమలేష్ వెలుగులోకి వచ్చాడు. అండర్-23, ఆసియాకప్‌లో మూడు మ్యాచ్‌ల్లో నాలుగు వికెట్లు తీసిన ఈ పేసర్.. ఉత్తమ వర్ధమాన ఆటగాడి అవార్డు అందుకున్నాడు. పేస్, బౌన్స్ ఉండే న్యూజిలాండ్ పిచ్‌లపై ఈ కుడిచేతి వాటం పేసర్ చెలరేగడం ఖాయంగా కనిపిస్తోంది.

శివం..వేగం



శివం మావి.. ఇటీవల ఛాలెంజర్ ట్రోఫీలో అతణ్ని ఎదుర్కొన్న ప్రత్యర్థులను అడిగితే చెబుతారు ఎంత ప్రమాదకరమో. మెరుపు వేగం శివం సొంతం. ఛాలెంజర్ ట్రోఫీలో భారత్ బ్లూకు ఆడిన ఈ నోయిడా కుర్రాడు... అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నిలిచాడు. అండర్-19 ప్రపంచకప్‌లో పేసర్ కమలేష్‌కు అతను సరిజోడుగా భావిస్తున్నారు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లోనూ నాలుగు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు పడగొట్టి ఫామ్ నిరూపించుకున్న శివం.. న్యూజిలాండ్‌లోనూ విజృంభించాలనే పట్టుదలతో ఉన్నాడు. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్.. బంతుల్లో వైవిధ్యం, అన్నిటికి మించి మంచి వేగం.. శివం బౌలింగ్ ప్రత్యేకతలు.


ముంబయి సంచలనం

పృథ్వీ షా.. ఏడాదిగా దేశవాళీ పోటీల్లో మార్మోగిపోతున్న పేరిది. పరుగుల వరద సృష్టించాడీ ముంబయి కుర్రాడు. బరిలో దిగితే సెంచరీయే.. అన్నట్టు సాగుతోంది అతని ఆట. హారిస్ షీల్డ్ టోర్నీ మ్యాచ్‌లో ఒక ఇన్నింగ్స్‌లో 546 పరుగులు చేసి సంచలనం సృష్టించిన పృథ్వీ.. వేగంగా టీమ్‌ఇండియా దిశగా అడుగులు వేస్తున్నాడు. ముంబయి రంజీ జట్టులో కీలక సభ్యుడిగా ఎదిగిన పృథ్వీ.. ప్రస్తుత అండర్-19 క్రికెట్ ప్రపంచకప్ ఆడుతున్న భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆడిన తొలి రంజీ మ్యాచ్‌లోనే సెంచరీ సాధించిన ఈ యువ కెరటం.. స్వల్ప వ్యవధిలోనే ఐదు సెంచరీలను ఖాతాలో వేసుకున్నాడు. గతేడాది ఇంగ్లాండ్‌తో సిరీస్‌లోనూ అతను ఐదు ఇన్నింగ్స్‌ల్లో 160 పరుగులు సాధించాడు. అండర్-19 ప్రపంచకప్‌లో అటు కెప్టెన్‌గా ఇటు బ్యాట్స్‌మెన్‌గా జట్టుకు అండగా నిలవాల్సిన బాధ్యత పృథ్వీపై ఉంది.

భారత్.. మూడుసార్లు

అండర్-19 ప్రపంచకప్‌లో భారత్ మూడుసార్లు విజేతగా నిలిచింది. 2000లో జరిగిన టోర్నీలో శ్రీలంకను ఓడించి టైటిల్ గెలుచుకున్న భారత్. 2008లో దక్షిణాఫ్రికాను కంగుతినిపించి ట్రోఫీ సొంతం చేసుకుంది. చివరిగా 2012లో భారత్ ఈ టైటిల్ సాధించింది. అప్పటి ఫైనల్లో ఆస్ట్రేలియాకు వారి సొంతగడ్డపైనే షాకిచ్చింది యువ భారత్. గత టోర్నీ (2016)లో విజయానికి చేరువగా వచ్చి.. వెస్టిండీస్ చేతిలో ఓడిపోయింది. రన్నరప్‌గా నిలవడం భారత్‌కు అది రెండోసారి. అంతకుముందు 2006 టోర్నీ ఫైనల్లో పాక్ చేతిలో ఓడిపోయింది.

అనుభవజ్ఞుడు



ప్రస్తుత భారత జట్టులో అనుభవజ్ఞుడు హిమాంశు రాణా. 2016లోనే దేశవాళీలో అరంగేట్రం చేసిన హిమాంశు. ఇప్పటికి హరియాణా తరఫున 30 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. వీరేంద్ర సెహ్వాగ్ జోడీగా ఆడిన అనుభవం హిమాంశుకు ఉంది. గతేడాది ఇంగ్లాండ్‌పై అతను నాలుగు మ్యాచ్‌ల్లో 211 పరుగులు చేసి సత్తా చాటాడు. దీనిలో ఒక సెంచరీ, ఒక అర్ధ సెంచరీ ఉన్నాయి. హిమాంశు అనుభవం రాబోయే ప్రపంచకప్‌లో భారత్‌కు అదనపు బలం కానుంది.

– ఈనాడు క్రీడావిభాగం

విశాఖలో 'సూపర్' డ్రామా!



వినయ్

- అంపైర్లపై వినయ్ ఒత్తిడి!
- ఛేదనకు ముందు కర్ణాటకకు అదనంగా 2 పరుగులు
- పాత స్కోరుతో టై చేసిన హైదరాబాద్
- సూపర్ ఓవర్ నిర్వహించకుండానే ఫలితం

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే

సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 క్రికెట్ టోర్నీలో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. అంపైర్ల పొరపాటో.. ప్రత్యర్థి కెప్టెన్ ఒత్తిడో గానీ హైదరాబాద్, కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్ వివాదాస్పద రీతిలో ముగిసింది. వివరాల్లోకి వెళితే.. గురువారం ఉదయం ఏసీఏ- వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటక 20 ఓవర్లలో 5 వికెట్లకు 203 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ (77; 42 బంతుల్లో 10×4 1×6), కె.గౌతమ్ (57; 31 బంతుల్లో 4×4, 4×6) అర్ధ సెంచరీలు చేశారు. కర్ణాటక కెప్టెన్ వినయ్‌కుమార్ కారణంగా ఆలస్యంగా ఇన్నింగ్స్ మొదలుపెట్టిన హైదరాబాద్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 203 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (39; 23 బంతుల్లో 1×4, 4×6), అక్షత్‌రెడ్డి (70; 29 బంతుల్లో 3×4, 7×6), సందీప్ (34; 19 బంతుల్లో 2×4, 2×6) సత్తాచాటారు. స్టువర్ట్ బిన్నీ (3/29) వేసిన చివరి ఓవర్లో సందీప్, ఆకాశ్ భండారి, సిరాజ్ ఔటవడంతో హైదరాబాద్ 203 పరుగుల వద్ద ఆగిపోయింది. స్కోర్లు సమమవడంతో సూపర్ ఓవర్ కోసం హైదరాబాద్ ఆటగాళ్లు ఎదురుచూస్తుండగా.. మ్యాచ్ అయిపోయిందంటూ అంపైర్లు వెళ్లిపోవడం దుమారం రేపింది. సూపర్ ఓవర్ కోసం హైదరాబాద్ ఆటగాళ్లు వార్మప్ చేసుకుంటూ చాలాసేపు మైదానంలో ఉండటంతో ఆంధ్ర, కేరళ మధ్య మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. ఆ మ్యాచ్‌ను 13 ఓవర్లకు కుదించారు.

ఈ వ్యవహారంలో కర్ణాటక కెప్టెన్ వినయ్ కుమార్ వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తోంది. కర్ణాటక ఇన్నింగ్స్ రెండో ఓవర్లో హైదరాబాద్ ఫీల్డర్ మెహదీ హసన్ బౌండరీ దగ్గర బంతిని ఆపినప్పుడు అతని కాలు బౌండరీ తాడును తాకినట్లు రీప్లేలో తేలింది. ఆ సమయంలో అంపైర్లు రీప్లే కోరలేదు. దీంతో బ్యాట్స్‌మెన్ తీసిన 2 పరుగుల్ని పరిగణనలోకి తీసుకున్నారు. కర్ణాటక ఇన్నింగ్స్ ముగిసేసరికి స్కోరు బోర్డుపై 203/5 పరుగులు ఉన్నాయి. మైదానంలో స్కోరుబోర్డుపై టార్గెట్ 204 పరుగులు అనే ఉంది. దీంతో 204 లక్ష్యంతో హైదరాబాద్ ఓపెనర్లు తన్మయ్, అక్షత్ బరిలో దిగారు. తన్మయ్ స్టాన్స్ కూడా తీసుకున్నాడు. అంపైర్లు అభిజిత్ దేశ్‌ముఖ్, ఉలాస్ గాంధే మ్యాచ్ ఆరంభించేందుకు సిద్ధమయ్యారు. ఐతే తొలి ఓవర్ వేసేందుకు వినయ్ ససేమిరా అన్నాడు! 2 పరుగులు కలపాల్సిందేనని వినయ్ చాలాసేపు పట్టుబట్టాడు. అందుకు అంపైర్లు సైతం ఒప్పుకోలేదని తెలిసింది! 9 నిమిషాలు ఆటకు అంతరాయం కలగడం.. వినయ్‌తో పాటు మైదానం బయటి నుంచి ఒత్తిడి పెరగడంతో అంపైర్లు 2 పరుగులు కలిపేందుకు అంగీకరించినట్లు సమాచారం. దీనికి హైదరాబాద్ కెప్టెన్ అంబటి రాయుడు అంగీకరించలేదు. "ఇన్నింగ్స్‌లో ఆరంభంలో కొద్దిసేపు గందరగోళం నెలకొనడంతో మైదానంలోకి వెళ్లా. 204 పరుగుల లక్ష్యంతో ఆడుతున్నాం.. ఇప్పుడు మార్పులు చేయడం సరికాదని అంపైర్లకు చెప్పా. 'చివర్లో చూద్దాం.. ఇప్పుడైతే మ్యాచ్ ఆడండి' అని అంపైర్లు అన్నారు. మేం మాత్రం 204 పరుగుల లక్ష్యంతోనే ఆడుతున్నామని మరోసారి చెప్పొచ్చా. మ్యాచ్ ముగిశాక స్కోర్లు సమం కావడంతో సూపర్ ఓవర్ కోసం మేం మైదానంలో వార్మప్ చేస్తున్నాం. మ్యాచ్ ఇంకా ముగియలేదనే మైదానంలో ఉన్నాం. తర్వాతి మ్యాచ్‌ను అడ్డుకోవాలన్న ఉద్దేశం మాకు లేదు. రెండో ఓవర్లోనే అంపైర్లు 2 పరుగులు జతచేసి ఉంటే అభ్యంతరం ఉండేదే కాదు. ఒకసారి ఔటైన వ్యక్తిని మళ్లీ మైదానంలోకి రప్పించొచ్చా? అంపైర్ నోబాల్ ప్రకటించలేదని మ్యాచ్ ముగిశాక పరుగు కలుపుతారా?" అని రాయుడు అన్నాడు. ఈ విషయంపై బీసీసీఐ జనరల్ మేనేజర్ సబా కరీమ్‌కు హైదరాబాద్ టీమ్ మేనేజ్‌మెంట్ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మరోవైపు ఆంధ్ర, కేరళ మ్యాచ్‌కు అంతరాయం కలగడంపై బీసీసీఐ ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. మ్యాచ్ రిఫరీ నివేదిక వచ్చిన తర్వాత బీసీసీఐ క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశముంది.

నిరసన తెలపలేదు

"20 ఓవర్లు ముగిసేసరికి కర్ణాటక 203 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత కర్ణాటక స్కోరుకు 2 పరుగులు జతచేశారు. ఇన్నింగ్స్ తర్వాత ఇలా చేయడాన్ని అంగీకరించమని ఇద్దరు అంపైర్లకు మా కెప్టెన్ చెప్పాడు. 20 ఓవర్ల తర్వాత 203 పరుగులు చేసిన హైదరాబాద్ సూపర్ ఓవర్ కోసం మైదానంలో ఎదురు చూసింది. కానీ సూపర్ ఓవర్ నిర్వహించలేదు. అంతే తప్ప.. హైదరాబాద్ నిరసన తెలపలేదు"

– హెచ్‌సీఏ

వాళ్లకు గొప్ప రికార్డు ఉండొచ్చు కానీ..

సౌరభ్ గంగూలీ

దక్షిణాఫ్రికా, భారత్ మధ్య తొలి టెస్టు మ్యాచ్‌లో బంతి ఆధిపత్యం చెలాయించి టెస్టు క్రికెట్ మజాను అందించింది. తొలి టెస్టు ఓటమి నేపథ్యంలో భారత జట్టు కూర్పుపై చాలా చర్చ జరుగుతోంది. ఐదుగురు బౌలర్లతో బరిలోకి దిగి టీమ్‌ఇండియా సరైన నిర్ణయమే తీసుకుంది. టెస్టులు గెలవాలంటే భారీ స్కోరు చేయడం ఎంత ముఖ్యమో వికెట్లు తీయడం కూడా అంతే ముఖ్యం. తొలి టెస్టులో ఒక సందర్భంలో టీమ్‌ఇండియా గెలుస్తుందని అనుకున్నారు అంటే దానికి కారణం బౌలర్లు 20 వికెట్లు తీయడమే. తుది జట్టులో లేని ఆటగాళ్ల గురించి పెద్ద చర్చ జరుగుతోంది. ఓడిపోయినప్పుడు ఇలా జరగడం సహజం. ఇలాంటి విషయాలను విరాట్ కోహ్లి పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఉపఖండం బయట బ్యాట్స్‌మన్‌గా అజింక్య రహానె, రాహుల్‌కు గొప్ప రికార్డు ఉండొచ్చు కానీ ప్రతి మ్యాచ్‌కు జట్టులో మార్పులు చేయడం సరికాదు. ప్రస్తుతం జట్టులోని బ్యాట్స్‌మన్‌పై నమ్మకం ఉంచాలి. తర్వాత టెస్టులకు వారినే కొనసాగించాలి. ఈ ఏడాది విదేశాల్లో టీమ్‌ఇండియా చాలా మ్యాచ్‌లు ఆడనుంది. కాబట్టి జట్టులో విశ్వాసం ఉండడం అత్యంత అవసరం. దక్షిణాఫ్రికాలో ఇంకా రెండు టెస్టులు ఆడాలి. ఆ రెండింట్లో ఫలితం తేలుతుందని అనుకుంటున్నా.



బియ్యమైనా చక్కెరైనా,
పప్పైనా దాల్చినీ అయినా,
ఏదైనా!
FUTURE CONSUMER™
GOLDEN HARVEST
SUPREME ATTA
MADE FROM M.P. SHARBATI WHEAT
GOLDEN HARVEST
TOOR DAL
GOLDEN HARVEST
RED CHILLI POWDER
GOLDEN HARVEST
Dilkhush
BASMATI RICE
GOLDEN HARVEST
FRUITS 'N' NUTS
GOLDEN HARVEST™
కడుపు నింపే ప్రేమ
Available at:
BIG BAZAAR
Making India Beautiful
Heritage fresh
FOOD BAZAAR
HyperCITY
Something Fresh every day
FOOD HOME FASHION

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.